
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50



మూత తెరిచినా మునగం

మ్యాన్‌హోళ్లపై గ్రిల్స్, ఎల్ఈడీ లైట్లతో ప్రమాదాల నివారణ

- ప్రస్తుతం కాస్త వానకే నగరంలోని రోడ్లన్నీ జలమయం
- ఆ నీళ్లు వెళ్లి పోయేందుకు మ్యాన్‌హోల్స్ మూతలు తీస్తున్న కొందరు
- వాటిలో పడి ప్రాణాలు పోగొట్టు కుంటున్నవారు ఎందరో..

వానాకాలం మొదలైంది..
కాస్త గట్టి వర్షం పడటంతో రోడ్లపై నీళ్లు నిలిచాయి..
ఆ నీరు వేగంగా పోయేందుకు కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్ తెరిచారు..
ఆ నీళ్లలోంచే, ఆ మ్యాన్‌హోల్స్ దగ్గరి నుంచే జనం అటూఇటూ నడిచి వెళ్లారు.. కానీ ఎవరికీ ఏ ప్రమాదమూ జరగలేదు.



ఎందుకంటే..

అక్కడ మ్యాన్‌హోల్ ఉందని స్పష్టంగా కనిపిస్తోంది.
ఒకవేళ పట్టుజారినా అందులో పడిపోకుండా గ్రిల్స్ అడ్డంగా ఉన్నాయి.
కాసేపటికి నీరంతా వెళ్లిపోయింది. మ్యాన్‌హోల్‌పై పెట్టేసిన మూత ఎల్ఈడీలతో వెలుగుతోంది. ప్రభుత్వం చేపట్టిన రక్షణ చర్యలన్నీ పూర్తయితే.. నిపుణుల సూచనలన్నీ అమల్లోకి వస్తే.. జరిగేది ఇదే.

- మ్యాన్‌హోల్స్‌పై గ్రిల్స్, ప్రమాద సూచికలు పెడుతున్న అధికారులు
- వానాకాలం మొదలైపోయినా ఇంకా కొనసాగుతున్న పనులు
- జపాన్ తరహాలో మ్యాన్‌హోల్స్ మూతలపై ఎల్ఈడీ లైట్లు పెట్టాలంటున్న నిపుణులు
- రక్షణ చర్యలు త్వరగా పూర్తికాకుంటే ప్రమాదాలు తప్పవనే హెచ్చరికలు

కానీ మ్యాన్‌హోల్స్ వద్ద రక్షణ చర్యలు ఇంకా పూర్తవలేదు.. వానల తీవ్రత పెరుగుతున్నా పనుల వేగం పెరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. డీప్ మ్యాన్‌హోల్స్‌కు గ్రిల్స్ ఏర్పాటును వేగవంతం చేయాలని.. జపాన్‌లో అనుసరిస్తున్న తరహాలో మ్యాన్‌హోల్స్ మూతలపై ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి అమలైతే.. 'మ్యాన్‌హోల్‌లో పడి వ్యక్తి మృతి'వంటి ఘటనలు ఇకపై వినకుండా ఉంటామని అంటున్నారు.

సాక్షి, హైదరాబాద్

వానాకాలం ప్రారంభమైంది. కాస్త గట్టిగా చినుకులు పడినప్పుడల్లా.. డ్రైనేజీ, నాలాలు ఉప్పొంగడం.. రోడ్లపై, కాలనీల్లో నీళ్లు చేరడం మొదలైంది. జీహెచ్ఎంసీ, జల మండలి ఎన్ని చర్యలు తీసుకున్నా.. రోడ్ల మీది చెత్త డ్రైనేజీల్లో చేరి పూడుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారుతోంది. అలాంటి సమయాల్లో మ్యాన్‌హోల్స్ మూతలు తెరిచి, నీరు పోయేలా చేస్తుండటం ప్రమాదకరంగా మారుతోంది. కొన్నిసార్లు అయితే.. ఎక్కడ మ్యాన్‌హోల్స్ ఉన్నాయి? ఎక్కడ రోడ్డు ఉందనేది తెలియని పరిస్థితి ఉంటోంది. ఏదో పనిమీద బయటికి వెళ్లినవారు, ఉద్యోగులు, స్కూళ్లు, కాలేజీల విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇంటిబాట పట్టాల్సిన దుస్థితి. తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌లో పడి జనం మృత్యువాతపడిన ఘటనలూ ఎన్నో.

150కి పైగానే వాటర్ ల్యాగింగ్ పాయింట్స్

మహానగరం పరిధిలో వాన నీరు నిలిచిపోయే సుమారు 150కుపైగా పాయింట్లు ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో 50 వరకు ప్రమాదకర ప్రాంతాలు ఉన్నట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి. ప్రధానంగా ఎల్బీనగర్, చాదర్ ఘాట్, సింగరేణి కాలనీ, బాలాపూర్, మల్లేపల్లి, మైత్రీవనం, పంజగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, ఛే నంబర్, మెట్టుగూడ, వీఎస్టీ, ముషీరాబాద్, బాలానగర్, మూసాపేట, బోరబండ, మియాపూర్, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో నీరు నిలిచే ప్రాంతాలు ఎక్కువ. ఇలాంటి చోట్ల నిలిచిన నీళ్లు త్వరగా వెళ్లిపోయేందుకు మ్యాన్‌హోల్స్ మూతలు తీస్తుండటం.. ప్రమాదాలకు దారి తీస్తోంది. మరికొన్ని చోట్ల వాహనాల రాకపోకలతో మ్యాన్‌హోల్స్ ఓపెనింగ్స్ దెబ్బతిన్నాయి, మూతలు పగిలిపోయాయి. అలాంటి చోట వాననీరు నిలిచి.. పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. వాహనాలు కూడా వాటిలో పడి దెబ్బతింటున్నాయి.



జపాన్‌లో మ్యాన్‌హోల్స్‌కు ఎల్ఈడీ లైట్లు

జపాన్‌లోని టోక్యో సిటీలో మ్యాన్‌హోల్స్ మూతలపై ప్రత్యేకంగా కార్టూన్ డిజైన్లతో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. సౌర విద్యుత్ సాయంతో రీచార్జి అయ్యే ఈ లైట్లు.. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు వెలుగుతూ ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ ఉన్నాయని సులువుగా గుర్తించి, జాగ్రత్త పడేందుకు వీటితో చాన్స్ ఉంటుంది. అంతేగాకుండా రకరకాల డిజైన్లు, రంగులతో కార్టూన్ క్యారెక్టర్లు కనిపిస్తూ అందంగా కూడా ఉంటున్నాయి. ఇలా మన దగ్గర కూడా మ్యాన్‌హోల్స్‌పై ఎల్ఈడీలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కొందరు సూచిస్తున్నారు. రాత్రిపూట మ్యాన్‌హోల్స్ సులువుగా కనబడితే.. ప్రమాదాలు తప్పుతాయని అంటున్నారు.

జలమండలి రక్షణ చర్యలు

వరదల ముంపుతో ఢిల్లీ, ముంబై లాంటి పరిస్థితి హైదరాబాద్‌లో ఏర్పడకుండా జల మండలి ముందస్తు చర్యలు చేపట్టింది. సీవరేజీ ఓవర్ ఫ్లో, మ్యాన్‌హోల్స్ నిర్వహణపై సీరియస్‌గా దృష్టిపెట్టింది. నగరవ్యాప్తంగా వాటర్ ల్యాగింగ్ పాయింట్లు, లోతైన మ్యాన్‌హోల్స్‌ను గుర్తించింది. మ్యాన్‌హోల్స్‌కు సేఫ్టీ గ్రిల్స్ బిగించడంతోపాటు అత్యంత ప్రమాదకరమైనవని తెలిపేలా.. మ్యాన్‌హోల్స్‌కు ఎరుపు రంగు వేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తోంది. కొన్ని వాటర్ ల్యాగింగ్ పాయింట్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పరిస్థితిని పర్యవేక్షించేలా చర్యలు చేపట్టింది. నగరవ్యాప్తంగా 63వేలకుపైగా డీప్ మ్యాన్ హోల్స్ ఉండగా.. ఇప్పటివరకు 25 వేల వరకు మ్యాన్‌హోల్స్‌పై సేఫ్టీ గ్రిల్స్ బిగించినట్టు అధికారులు చెప్తున్నారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి, ఎరుపు రంగు పెయింట్ వేస్తున్నామని.. ఎప్పటికప్పుడు మ్యాన్‌హోల్స్ నుంచి పూడిక, వ్యర్థాలను తోడేసేందుకు ఎయిర్‌టెక్ యంత్రాలను అందుబాటులో ఉంచినట్టు వివరిస్తున్నారు. ఇప్పటికే వానాకాలం మొదలైన నేపథ్యంలో.. ఈ రక్షణ చర్యలను మరింత వేగవంతం చేయాల్సి ఉందని నగర ప్రజలు కోరుతున్నారు.

రంగంలోకి ఈఆర్టీ, ఎస్పీటీలు



వర్షాల నేపథ్యంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్ (ఎస్పీటీ)లను జలమండలి రంగంలోకి దింపింది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలతో పాటు వాహనాలను కేటాయించింది. వాననీరు నిలిచిన చోట వాహనాల్లో ఉండే జనరేటర్లు, మోటార్లతో నీటిని తోడేస్తారు. ఎయిర్‌టెక్ యంత్రాలతో మ్యాన్‌హోల్స్ నుంచి తీసిన

మిగతా IIవ పేజీలో ▶

మ్యాన్‌హోల్స్ తెరిస్తే క్రిమినల్ కేసులు

వాన పడుతున్న సమయంలో, నీళ్లు నిలిచినప్పుడు.. అధికారుల అనుమతి లేకుండా మ్యాన్‌హోల్స్ మూతలను తెరవకూడదని జలమండలి స్పష్టం చేసింది. ఇష్టమొచ్చినట్టు తెరిచిపెడితే క్రిమినల్ కేసులు పెట్టాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా.. జలమండలి నంబర్ 155313కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వవచ్చని సూచించింది.



మరో సానియా మన సహజ

టెన్నిస్‌లో రాకెట్‌లా దూసుకుపోతున్న హైదరాబాదీ

- చిన్నతనంలో సరూర్‌నగర్ స్టేడియంలో ఆటకు శ్రీకారం
- మధ్యతరగతి కుటుంబం..ఖరీదైన క్రీడ
- తండ్రి ప్రోత్సాహంతో కష్టనష్టాలకోర్చి ఆటలో నైపుణ్యం చూపిన సహజ
- పూర్తి స్కాలర్‌షిప్‌తో అమెరికా వర్సిటీలో చేరికతో కీలక మలుపు
- సొంత ఖర్చుల కోసం తోటి ఆటగాళ్ల రాకెట్లు అల్లిన క్రీడాకారిణి
- సానియా స్థాయికి ఎదగడమే లక్ష్యం..
- 'సాక్షి'తో సహజ

IIలో

చాంపియన్ సహజ 14లో

మరో సానియా మన సహజ

టెన్నిస్‌లో రాకెట్‌లా దూసుకుపోతున్న హైదరాబాదీ

క్రికెట్ అంటే ఆదరణ ఎక్కువ ఉండే భారత్ లాంటి దేశాల్లో మిగతా క్రీడల్లో రాణించే వారి సంఖ్య తక్కువ. అందులోనూ మహిళలు మరీ అరుదు. ఇక ఖరీదైన టెన్నిస్‌లో ఒక స్థాయిని చేరుకోవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అలాంటిది.. మధ్య తరగతి కుటుంబం కావడంతో ఒకప్పుడు రాకెట్ కొనుక్కోవడానికి కూడా ఇబ్బంది పడిన హైదరాబాదీ సహజ యామలపల్లి ఏకంగా అంతర్జాతీయ టెన్నిస్‌లో ప్రతిభ కనబరుస్తూ దూసుకు పోతుండటం అబ్బురపరుస్తోంది. సహజ తాజాగా అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ15 టోర్నీగెలుపొంది మరో టైటిల్ తన ఖాతాలో వేసుకుంది. ఇప్పటివరకు నాలుగు ఇంటర్నేషనల్ టైటిల్స్ కైవసం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో 305వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం ఆమె తెలంగాణలో నంబర్ వన్, జాతీయ స్థాయిలో నంబర్ 2 స్థానాల్లో కొనసాగుతోంది. ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టనష్టాలను అధిగమించిన సహజ ప్రస్తుతం టెన్నిస్ ప్రపంచంలో మన దేశపతాకాన్ని సగర్వంగా రెపరెపలాడిస్తోంది.

సాక్షి, హైదరాబాద్:

- చిన్నతనంలో సరూర్‌నగర్ స్టేడియంలో ఆటకు శ్రీకారం
- తర్వాత సికింద్రాబాద్‌లోని అకాడమీలో శిక్షణ
- మధ్యతరగతి కుటుంబం..ఖరీదైన క్రీడ
- తండ్రి ప్రోత్సాహంతో కష్టనష్టాలకోర్చి ఆటలో నైపుణ్యం
- నేషనల్ విమెన్స్ టాప్‌–20 జాబితాలో చోటు
- పూర్తి స్కాలర్‌షిప్‌తో అమెరికా వర్సిటీలో చేరికతో కీలక మలుపు
- సొంత ఖర్చుల కోసం తోటి ఆటగాళ్ల రాకెట్లు అల్లిన సహజ

ప్రస్తుతం తెలంగాణలో నంబర్ **1**

ఆలిండియా నంబర్ **2**

తాజాగా డబ్ల్యూ15 టోర్నీలో గెలుపుతో అంతర్జాతీయ స్థాయిలో **305**వ ర్యాంకు



సానియా మీర్జా స్థాయికి ఎదగడమే లక్ష్యం: సహజ

సరూర్‌నగర్ స్టేడియంలో షురూ

స్వస్థలం ఖమ్మం అయినా సహజ కుటుంబం నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌లో స్థిరపడింది. చిన్నప్పటి నుంచే సహజకు టెన్నిస్‌పై ఆసక్తి ఉండేది. తండ్రితో కలిసి రోజూ సమీపంలోని సరూర్‌నగర్ స్టేడియంకు వెళ్లి టెన్నిస్ ఆడుతుండేది. ఆమెలోని క్రీడా నైపుణ్యాన్ని గమనించిన తండ్రి భవాని కుమార్.. 9వ ఏటనే ఓ ప్రభుత్వ కోచింగ్ సెంటర్‌లో చేర్పించారు. ఒక్క నెల శిక్షణలోనే సహజ ఎంతో మెరుగైన ప్లేయర్‌లా ఆడటం చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. దీంతో ఆమెను మరింత ప్రోత్సహించాలని తల్లిదండ్రులు భవానికుమార్, సుప్రియ నిర్ణయించుకున్నారు.

పగలంతా ప్రాక్టీస్

టెన్త్ వరకు అంతా సజావుగా సాగిపోయింది. టెన్త్ అయ్యాక చదువు కొనసాగించాలా లేక ఆటపై ఫోకస్ పెట్టాలా అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. అయితే సహజ ఆట వైపే మొగ్గుచూపింది. కాకపోతే చదువు కూడా కొనసాగించాలని భావించి దిల్‌సుఖ్‌నగర్‌లోనే ఓ మహిళా జూనియర్ కాలేజీలో చేరింది. అదే సమయంలో సికింద్రాబాద్‌లోని సిన్నెట్ టెన్నిస్ అకాడమీలో శిక్షణ తీసుకోవడం ప్రారంభించింది. ఉదయం 5.30 గంటలకు బస్సులో వెళ్లి ప్రాక్టీస్ చేసేది. సాయంత్రం ఇంటికి వచ్చి పుస్తకాలతో కుస్తీ పట్టేది.

స్నేహితుల సాయంతో..

టోర్నమెంట్లు ఆడాలంటే డబ్బులు కావాలి. కానీ చాలా సందర్భాల్లో కనీసం టెన్నిస్ రాకెట్ కూడా కొనుక్కోలేని పరిస్థితి ఉండేది. భవాని ఉద్యోగం మానేయడానికి ముందు ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసేవారు. ఆయనకు వచ్చే అరకొర జీతంతో కుటుంబం గడవాలంటేనే చాలా కష్టమయ్యేది. అలాంటి పరిస్థితుల్లో టోర్నమెంట్ల కోసం స్నేహితులు, తోటి ఉద్యోగులు సాయం చేస్తుండేవారు. అలా కష్టాలు ఎదుర్కొంటూనే సహజ నేషనల్ విమెన్స్‌లో టాప్ 20 జాబితాలో చోటు సాధించింది.

ఇంటర్నేషనల్ ర్యాంకు సాధించడంతో హ్యూస్టన్ యూనివర్సిటీలో సీటు ఖాయమైంది. పూర్తి స్కాలర్‌షిప్‌తో ఉచితంగా కాలేజీలో అడ్మిషన్ ఇచ్చారు. అయితే వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంటర్వ్యూలో రెండుసార్లు రిజెక్ట్ అయింది. దీంతో తీవ్ర నిరాశకు గురైంది. అమెరికా వెళ్లే ఆశలన్నీ వదులుకుంది. అయితే కోచ్‌కు ఈ విషయం చెప్పడంతో ఆయన యూనివర్సిటీకి ఒక లేఖ రాశారు. వెంటనే స్పందించిన యూనివర్సిటీ సహజను తమ కాలేజీలో చేర్పించుకోవడం తప్పనిసరి అంటూ

సులువుగా ఏం కాలేదు..

కాన్సులేట్‌కు లేఖ రాసింది. దీంతో ఆమెకు వీసా క్లియర్ అయింది. అలా అమెరికా గడ్డపై అడుగు పెట్టింది. టెన్నిస్‌కు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో డిగ్రీ చేసేందుకు నిర్ణయించుకుంది. అక్కడ చదువుతో పాటు టెన్నిస్‌లో కూడా ఉచితంగా శిక్షణ ఇచ్చేవారు. ఇక సొంత ఖర్చుల కోసం స్నేహితులు, వర్సిటీ విద్యార్థుల రాకెట్స్ అల్లుతూ డబ్బులు సంపాదించేది. అలాగే ప్రైవేట్ ట్యూషన్స్ కూడా చెప్పేది.

కీలక మలుపు

అమెరికాలో డిగ్రీ చదవడంతో పాటు అదే సమయంలో టెన్నిస్‌లో కోచింగ్ తీసుకునేందుకు అవకాశం ఉందని తెలిసింది. కాకపోతే అమెరికా వర్సిటీలో చేరాలంటే యూనివర్సల్ టెన్నిస్ రేటింగ్ ఆధారంగా అడ్మిషన్ తీసుకుంటారు. కానీ సహజ అలాంటి టోర్నమెంట్స్ ఆడకపోవడంతో ఆ ర్యాంకు లేదు. దీంతో తన ఆటతీరుకు సంబంధించిన వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి పలు యూనివర్సిటీలకు పంపారు. వాటిని చూసిన టెక్సాస్‌లోని హ్యూస్టన్ యూనివర్సిటీ కోచ్ రాబర్ట్ హబ్బర్డ్ సహజ ఆటతీరును మెచ్చుకోవడమే కాకుండా అడ్మిషన్ కన్ఫర్మ్ చేశారు. ఇదే క్రమంలో ఇంటర్నేషనల్ ర్యాంకింగ్ కోసం చెన్నై ఐటీఎఫ్ జూనియర్ టోర్నమెంట్‌కు క్వాలిఫై అయింది. దీంతో ఆమెను 9వ ర్యాంకు వరించింది.

సింగిల్ సీజన్‌లో 10 మ్యాచ్‌ల్లో గెలుపు

2017లో యూనివర్సిటీలో చేరినప్పటి నుంచి సహజ తన ఆట తీరుతో ఎన్నో అద్భుతాలు సృష్టించింది. ఏడాదిలోనే వర్సిటీలో కెప్టెన్ అయింది. సౌత్‌ల్యాండ్ కాన్ఫరెన్స్ మ్యాచుల్లో సింగిల్ సీజన్‌లో పది మ్యాచ్‌లు గెలిచి సత్తా చాటింది. అక్కడి నుంచి ఇక వెనుదిరిగి చూసుకోలేదు. ప్రస్తుతం అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో 305వ స్థానంలో ఉన్న సహజ.. 250 ర్యాంకుకు చేరుకోగలిగితే గ్రాండ్‌స్లామ్‌లో ఆడే అవకాశం వస్తుంది. ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నామని సహజ, ఆమె తండ్రి భవాని చెబుతున్నారు.



తల్లిదండ్రులతో...

గ్రాండ్‌స్లామే గోల్

4వ సింగిల్స్ టైటిల్ గెలవడం చాలా సంతోషంగా ఉందని, ఇండియా బయట గెలిచిన తొలి టైటిల్ ఇదని సహజ తెలిపింది. ఇదే ఆట తీరుతో ముందుకు వెళ్లి, గ్రాండ్ స్లామ్‌లోకి అడుగు పెట్టాలనేదే తన గోల్ అని వివరించింది. టెన్నిస్ స్టార్ సానియా మీర్జా స్థాయి (అంతర్జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు)కి ఎదగడమే తన లక్ష్యమని సాక్షికి వివరించింది.

ఆల్ ది బెస్ట్ సహజ.

మూత తెరిచినా మునగం

▶ మొదటి పేజీ తరువాయి

వ్యర్థాల (సిల్ట్)ను ఎప్పటికప్పుడు తొలగిస్తారు. మరోవైపు మ్యాన్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేశారు. వారు రోజూ ఉదయాన్నే తమ పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు. వాటర్ ల్యాగింగ్ పాయింట్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తారు.

నాలాలపై నిర్లక్ష్యంతో..

మహానగర పరిధిలోని పలుచోట్ల నాలాలు ప్రమాదకరంగా మారాయి. నిబంధనల ప్రకారం.. రెండు మీటర్ల కన్నా తక్కువ వెడల్పున్న నాలాలను క్యాపింగ్ (శ్లాబ్ లేదా ఇతర పద్ధతుల్లో పూర్తిగా కప్పి ఉంచడం) చేయాలి. రెండు మీటర్ల కన్నా వెడల్పున్న నాలాలకు రిటైనింగ్ వాల్ కట్టాలి. లేదా ఫెన్సింగ్ వేయాలి. కానీ గ్రేటర్ సిటీ పరిధిలో సగానికిపైగా చిన్న నాలాలకు క్యాపింగ్ లేదు. పెద్ద ఓపెన్ నాలాలకు రిటైనింగ్ వాల్/ ఫెన్సింగ్ లేకుండా పోయాయి. గతంలో వేసిన క్యాపింగ్, ఫెన్సింగ్ భారీ వర్షాలతో దెబ్బతిన్నాయి. దీనితో వాన పడినప్పుడు నాలాల్లో పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గత ఐదేళ్లలో సుమారు 15 మందికిపైగా నాలాల్లో పడి చనిపోవడం గమనార్హం. వానాకాలం మొదలైన నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన క్యాపింగ్, ఫెన్సింగ్ వేయడం.. బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్తలు కోరుతున్నారు.



కె.అశోక్‌రెడ్డి, జల మండలి ఎండీ

మ్యాన్‌హోల్స్‌కు రక్షణ కవచాలు

వర్షాకాలంలో మ్యాన్‌హోల్స్‌తో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాం. మ్యాన్‌హోల్స్‌కు సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నాం. డీప్ మ్యాన్‌హోల్స్‌కు ఎరుపు రంగు వేసి అత్యంత ప్రమాదకరమైనవని తెలిసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాటర్ ల్యాగింగ్ పాయింట్లను గుర్తించి ఎప్పటికప్పుడు క్లియర్ చేసేలా చర్యలు చేపట్టాం. వర్షం పడే సమయంలో కింది స్థాయి సిబ్బంది నుంచి మేనేజర్ వరకు వారి పరిధిలోని ఫీల్డ్‌లో ఉండేలా ఆదేశాలు జారీ చేశాం.



డేవిడ్ సుధాకర్, సామాజిక వేత్త

డ్రైనేజీలు, నాలాలు క్లీన్‌గా ఉంచాలి

డ్రైనేజీలు, నాలాలు క్లీన్‌గా ఉంచాలి. వాటిలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలి. వాన నీరు సైతం సాఫీగా వెళ్లే విధంగా మార్గం ఉండాలి. వాటిలో పూడిక పేరుకుపోవడంతో వర్షం పడినప్పుడు నీరు వెళ్లక రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మురుగు నీటి వ్యవస్థను పర్యవేక్షించే యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. నిరంతరం పూడికతీత పనులు కొనసాగించాలి. వర్షాకాలంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

సిటీలో సీవరేజీ నెట్‌వర్క్, మ్యాన్ హోల్‌ల లెక్క ఇదీ..

జీహెచ్‌ఎంసీ పరిధిలో సీవరేజీ నెట్‌వర్క్:	5,767 కి.మీ
శివారు మున్సిపాలిటీల పరిధిలో :	4,200 కి.మీ
మొత్తం మ్యాన్‌హోల్స్:	6,34,919
డీప్ మ్యాన్‌హోల్స్:	63,221
వీటిలో జీహెచ్‌ఎంసీ పరిధిలో..:	26,798
శివారు మున్సిపాలిటీల పరిధిలో..:	36,423



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 101

మంగళవారం 2-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ భారీ విజయం

దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో 10 వికెట్లతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ బృందం - 14లో



సరికొత్త శిఖరాలపై సూచీలు

ఐటీ, బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్ - 15లో



మూడేళ్లలో న్యాయం..

నూతన నేర చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలోపు కోర్టుల్లో న్యాయం అందేలా చేస్తామని అమిత్ షా అన్నారు.

- వివరాలు 6లో



నీట్ రీటెస్ట్ ఫలితాల వెల్లడి

జూన్‌లో నీట్-యూజీ పరీక్షల్లో గ్రేస్‌మార్కులు సాధించిన అభ్యర్థులకు మళ్లీ చేపట్టిన పరీక్ష ఫలితాలను ఎన్టీఏ ప్రకటించింది.

- వివరాలు 6లో



ఎమ్మెల్సీ కవితకు నిరాశ..

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ దరఖాస్తులను సోమవారం ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది.

- వివరాలు 2లో



మేధా పాట్కర్‌కు 5 నెలల జైలు

నర్మదా బచావో ఆందోళన చేపట్టిన ఉద్యమ కారిణి మేధా పాట్కర్‌కు ఢిల్లీ కోర్టు 5 నెలల సాధారణ కారాగార శిక్ష విధించింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

కలిసి మాట్లాడుకుందాం..



రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై కలిసి చర్చించుకుందామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు.

- వివరాలు 12లో

కరెంటు బిల్లుల చెల్లింపులకు మళ్లీ పాత పద్ధతే..



థర్డ్‌పార్టీ ఏజెన్సీ ద్వారా విద్యుత్ బిల్లులు స్వీకరించకూడదంటూ ఆర్బీఐ డిస్కమ్‌కు లేఖ రాసింది. ఇకపై డిస్కమ్ వెబ్‌సైట్/మొబైల్ యాప్/ఈఆర్‌ఓ కేంద్రాల ద్వారా మాత్రమే చెల్లింపులను అనుమతించాలని చెప్పింది.

- వివరాలు 16లో

కూలిన బతుకులు



వర్షానికి తడిసిపోయిన పాత ఇంటి పైకప్పు కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందిన విషాదకర ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని వనపట్లలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.

- వివరాలు 5లో

చార్మినార్ పీఎస్‌లో తొలి కేసు



నూతన నేర చట్టాలు రాష్ట్రంలో అమల్లోకి వచ్చాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చార్మినార్ పీఎస్‌లో బీఎన్ఎస్ కింద మొట్టమొదటి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు డీజీపీ రవిగుప్తా అధికారికంగా వెల్లడించారు. డిజిటల్ సంతకంతో ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు.

- వివరాలు 2లో



మూడు వారాల్లోనే 7వేల కోట్లు అంటే అప్పులు చేయడంలో 'అభివృద్ధి' వేగం!!

4న కేబినెట్ విస్తరణ?

అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందంటున్న గాంధీభవన్ వర్గాలు

అందుబాటులో ఉండాల్సిందిగా గవర్నర్‌ను కోరిన సీఎం రేవంత్!

- ఈ దఫా నాలుగు బెర్తులు భర్తీ చేసే అవకాశం
- రాజగోపాల్, సుదర్శన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పేర్లు దాదాపు ఖరారు
- ప్రేంసాగర్‌రావు, వివేక్‌లో ఒకరికి చాన్స్
- నేడు లేదా రేపు ఢిల్లీకి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్!
- తుది జాబితాపై అధిష్టానంతో చర్చలు



రాజ్‌భవన్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది.జూలై మొదటి వారంలో కేబినెట్ విస్తరణ ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో చెప్పిన నేపథ్యంలో.. ఈ నెల 4న మరికొంత మందిని మంత్రివర్గంలో చేర్చుకునే అవకాశముందని సమాచారం. ఈ మేరకు పార్టీ అధిష్టానం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. సీఎం సోమవారం రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ కావడాన్ని కూడా ప్రస్తావిస్తున్నాయి. కేబినెట్ విస్తరణ గురించి గవర్నర్‌కు రేవంత్ చెప్పారని, 4న అందుబాటులో ఉండాల్సిందిగా కోరారని తెలుస్తోంది. రాధాకృష్ణన్ జార్ఖండ్ గవర్నర్‌గా, పుదుచ్చేరి ఇన్‌చార్జి లెఫ్టినెంట్ గవర్నర్‌గా సైతం వ్యవహరిస్తుండడంతో ఈ విజ్ఞప్తి చేసినట్టు సమాచారం.

హైకమాండ్ పిలుపు: మంత్రివర్గ కూర్పు గురించి రాజకీయ వర్గాల్లో అనేక ఊహాగానాలు కొనసాగుతుండగా, కాంగ్రెస్ మిగతా 2వ పేజీలో ▶

నాలుగో వారంలో బడ్జెట్ భేటీ!

- కేంద్ర బడ్జెట్ తదుపరి రెండురోజుల్లో రాష్ట్ర బడ్జెట్
- ఈ మేరకు అసెంబ్లీ నోటిఫికేషన్
- గవర్నర్‌తో సీఎం రేవంత్ సుదీర్ఘ భేటీ
- ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ పేర్లను ఆమోదించాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో దాదాపుగా రెండు గంటల పాటు భేటీ అయ్యారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. కాగా సీఎం పలు అంశాలను గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణతోపాటు ముఖ్యంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై చర్చించినట్టు తెలిసింది. ఈ నెల 22న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన పక్షంలో 23, 24 తేదీల్లో..ఒకవేళ 23న కేంద్రం బడ్జెట్ పెట్టినట్టైతే 24 లేదా 25 తేదీల్లో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టవచ్చని. మిగతా 2వ పేజీలో ▶





సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, ప్రధాని మోదీ


సభలో 'హిందూ' కాక

హిందువులమంటూ హింసాద్వేషాల వ్యాప్తి

లోక్‌సభలో రాహుల్ వ్యాఖ్యల దుమారం

- హిందూ సమాజంపైనే తీవ్ర వ్యాఖ్యలివి: ప్రధాని నరేంద్ర మోదీ
- వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే: కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- హిందువులంటే మోదీ, బీజేపీ, ఆరెస్సెస్సేనా: రాహుల్ గాంధీ
- మోదీ ఆత్మతో పరమాత్మ నేరుగా సంప్రదిస్తాడట..
- తనను దేవుడే పంపాడని ఆయనే స్వయంగా చెప్పుకున్నారని ఎద్దేవా
- నీట్ సంపన్నుల పరీక్షగా మారిందంటూ ధ్వజం..
- చర్చకు నిరాకరించిన స్పీకర్, సభ నుంచి విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలు సోమవారం ఊహించినట్టుగానే నీట్ దుమారానికి వేదికగా మారాయి. అది కేవలం సంపన్నుల పరీక్షగా మారిపోయిందని, ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్తుకు సమాధి కడుతోందని విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ఆయన గంటా 40 నిమిషాల పాటు మాట్లాడారు. అయితే విపక్ష నేత హోదాలో రాహుల్ చేసిన తొలి ప్రసంగమే సభలో తీవ్ర దుమారం రేపింది. లక్షలాది మంది విద్యార్థుల భవిత ప్రమాదంలో పడ్డా మోదీ సర్కారుకు చీమ కుట్టినట్టు కూడా లేదంటూ ఆయన దుయ్యబట్టారు. ఆ క్రమంలో చేసిన 'హిందూ'వ్యాఖ్యలు తీవ్ర కలకలానికి దారి తీశాయి. ''తాము హిందువులమని చెప్పకునే వాళ్లు నిరంతరం హింసా ద్వేషాలను, అవాస్తవాలను వ్యాప్తి చేయడంలో మునిగి తేలుతున్నారు''అంటూ రాహుల్ తీవ్ర విమర్శలు చేయడంతో సభలో గగ్గోలు రేగింది. అధికార బీజేపీ సభ్యులంతా వాటిని తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా కలగజేసుకుని రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఆక్షేపించారు. ''విపక్ష నేత మొత్తం హిందూ సమాజాన్నే హింసాత్మకమైనదిగా మిగతా 6వ పేజీలో ▶




లీకేజీలు, ప్రమాదాలు, ఉగ్ర దాడులు...

ఇదే ప్రధాని మోదీ 'పిక్చర్'!

- రాజ్యసభలో దుయ్యబట్టిన మల్లికార్జున ఖర్గే..
- ఆరెస్సెస్‌పై తీవ్ర వ్యాఖ్యలు
- రికార్డుల నుంచి తొలగింపు.. అది గొప్ప సంస్థ: చైర్మన్

6లో

25 వేల మంది ఎస్జీటీల బదిలీ



ఉత్తర్వులు విడుదల చేసిన విద్యాశాఖ

- మొత్తం 40 వేల మంది ఉపాధ్యాయుల బదిలీ
- విజయవంతంగా ముగిసిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ
- 21 వేల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందంటున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖ చేపట్టిన టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 25 వేల మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు (ఎస్జీటీలు) బదిలీ ఉత్తర్వులు అందాయి. వీరితో పాటు స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎంలు.. అంతా కలిపి ఇప్పటివరకూ 40 వేల మందికి స్థానచలనం కలిగింది. కొత్తగా కేటాయించిన స్థానాల్లో వీలైనంత త్వరగా చేరాలని, విద్యార్థుల బోధనకు ఇబ్బంది లేకుండా చూడాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం టీచర్లకు సూచించింది. కాగా చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరించేందుకు అధికారులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. వారంలో సమస్యలన్నీ పరిష్కరించాలని నిర్ణయించారు.

ఎట్టకేలకు కొలిక్కి..


టీచర్ల బదిలీలు, పదోన్నతుల వ్యవహారం కోర్టు వివాదాలు, ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరాలతో కొన్నేళ్లుగా జటిలంగా మారింది. జిల్లాల పునర్విభజన తర్వాత 317 జీవో అమలు సందర్భంగానూ ఈ వ్యవహారం అనేక సమస్యలకు దారి తీసింది. సీనియారిటీ ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల జూనియర్లు దూర ప్రాంతాలకు వెళ్లారని, భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో పనిచేయాల్సి వస్తోందనే ఆందోళన వ్యక్తమైంది. కాగా ప్రస్తుతం ఇవన్నీ కొలిక్కి వచ్చినట్టేనని అధికారులు చెబుతుండగా, మరోవైపు బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ వర్గాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.

సమస్యలేంటి?

స్కూల్ అసిస్టెంట్లు వివిధ సబ్జెక్టులకు బోధించే అర్హత ఉండటంతో అన్నింటికీ ఆప్షన్లు ఇచ్చారు. కానీ ఒక్కదాంట్లోనే ప్రమోట్ చేయాలి. ఉదాహరణకు సైన్స్, మేథ్స్ రెండు ప్రమోషన్లు వచ్చిన వ్యక్తి ఏదో ఒక దాంట్లోనే చేరతారు. దీంతో ఒక పోస్టు ఖాళీ అవుతుంది. 18,942 మందికి ప్రమోషన్లు ఇస్తే ప్రస్తుతం 17 వేల మంది మిగతా 5వ పేజీలో ▶

'విద్యుత్' విచారణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఏకపక్షంగా విచారణ జరుపుతోందనేందుకు ఆధారాల్లేవు
- నివేదిక ఏకపక్షంగా ఇస్తారేమోనని ఊహించి చెప్పడం సరికాదు
- కమిషన్ ఏర్పాటు చట్టపరంగానే జరిగింది
- మాజీ సీఎం కేసీఆర్ పిటిషన్‌ను కొట్టివేసిన సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ రంగానికి సంబంధించి గత ప్రభుత్వ నిర్ణయాలపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌కు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కమిషన్ ఏకపక్షంగా విచారణ జరుపుతోందనేందుకు ఆధారాలు చూపడంలో పిటిషనర్ విఫలమయ్యారని పేర్కొంది. కమిషన్ ఏర్పాటు చట్టపరంగానే జరిగిందని స్పష్టం మిగతా 3వ పేజీలో ▶

దమ్ముంటే ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు

- ఫిరాయింపుదారులపై సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్
- వారిని మళ్లీ గెలిపించుకుంటేనే సీఎంకు దమ్మున్నట్లని వ్యాఖ్య
- పార్టీ మారితే సభ్యత్వం రద్దు అవుతుందని రాహుల్ చెప్పలేదా?



జగిత్యాల: 'సీఎం రేవంత్‌రెడ్డి.. నీకు దమ్ముంటే నువ్వు తీసుకున్న ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు. వారిని మళ్లీ గెలిపించుకుంటేనే దమ్మున్నోడివి'అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. జగిత్యాలలోని పద్మనాయక కల్యాణ మండపంలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సిగ్గులేకుండా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. 2014లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రస్తుత సీఎం ప్రయత్నించి రూ. 50 లక్షలతో రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని, ఆ పరిస్థితుల్లోనే రాజ్యాంగబద్ధంగా మిగతా 3వ పేజీలో ▶

ప్రజారోగ్య సంచాలకుల విభాగం రద్దు!

వైద్య విధాన పరిషత్‌లో కలపాలని ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం

- ఒకే గొడుగు కిందకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులు
- కొత్తగా డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ సర్వీసెస్ ఏర్పాటుకు యోచన
- జిల్లాస్థాయిలో వేర్వేరుగా ఉన్న వైద్య వ్యవస్థలకు ఇక ఒకరే బాస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అత్యంత కీలకమైన ప్రజారోగ్య సంచాలకుల (డీపీహెచ్) విభాగాన్ని రద్దు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఆ విభాగాన్ని వైద్య విధాన పరిషత్‌లో కలిపి కొత్తగా డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కేర్ సర్వీసెస్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. డీపీహెచ్ రద్దయితే డైరెక్టర్ పోస్టు కూడా రద్దవుతుంది. కొత్తగా ఏర్పాటు చేసే డైరెక్టరేట్‌కు ఒక కమిషనర్‌ను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల ప్రస్తుతం డీహెచ్‌గా ఉన్న డాక్టర్ రవీందర్‌నాయక్ పోస్టు పోతుందని అంటున్నారు.

పీహెచ్‌సీలు మొదలు జిల్లా ఆసుపత్రుల దాకా ఒకే విభాగం పర్యవేక్షణలోకి...

ప్రస్తుతం వైద్య, ఆరోగ్యశాఖలో ప్రజారోగ్య సంచాలకుల విభాగం, వైద్య విధాన పరిషత్, వైద్యవిద్య సంచాలకుల (డీఎంఈ) విభాగం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం ఉన్నాయి. డీపీహెచ్ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ)లు ఉన్నాయి. అంటే ప్రాథమిక ఆరోగ్య వైద్య సేవలన్నీ ఆ విభాగం పరిధిలోనే జరుగుతాయి. అలాగే వైద్య విధాన పరిషత్ పరిధిలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు ఉండగా మెడికల్ కాలేజీలు డీఎంఈ పరిధిలో ఉన్నాయి. ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగం పరిధిలో సబ్ సెంటర్లు, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు, ఎన్‌హెచ్ఎం కింద చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలు అమలవుతున్నాయి. ఇప్పుడు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కేర్ సర్వీసెస్‌ను ఏర్పాటు చేస్తే పీహెచ్‌సీ నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు దాని పరిధిలోకి వస్తాయి. ఇలా అవన్నీ ఒకే గొడుగు కిందకు వస్తాయి. మిగిలిన విభాగాలు యథావిధిగా కార్యకలాపాలు సాగిస్తాయని వైద్య శాఖ వర్గాలు తెలిపాయి. ఇక వైద్య విధాన పరిషత్‌లోని ఉద్యోగులందరికీ ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వడం ద్వారా వారికి అన్ని వసతులను మిగతా 2వ పేజీలో ▶

జూన్‌లో వర్షాలు బాగు

- 14 జిల్లాల్లో సాధారణం, 11 జిల్లాల్లో అధికం, 6 జిల్లాల్లో అత్యధికం
- మంచిర్యాల జిల్లాలో ఇప్పటికీ లోటు వర్షపాతమే
- రాష్ట్రవ్యాప్తంగా 84 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్ తొలి నెల ఎక్కువగా సాధారణ వర్షపాతంతోనే సరిపెట్టింది. రాష్ట్రంలో కురిసిన సగటు వర్షపాతం గణాంకాలు కాస్త ఆశాజనకంగా ఉన్నప్పటికీ జిల్లాలవారీగా పరిశీలిస్తే వర్షపాతం సాధారణ స్థితిలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. నైరుతి సీజన్‌లో జూన్ సాధారణ వర్షపాతం 12.94 సెంటీమీటర్లుకాగా ఈసారి 16 సెంటీమీటర్ల మేర సగటు వర్షపాతం కురిసింది. ఈ లెక్కన రాష్ట్రంలో సగటున కురవాల్సిన సాధారణ వర్షపాతం కంటే 23% అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

కొన్నిచోట్ల అత్యధికంతో పెరిగిన సగటు..

జూన్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30 మధ్య కాలాన్ని నైరుతి రుతుపవనాల సీజన్‌గా పరిగణిస్తారు. సీజన్ మొదటి నెలలో తొలకరి వర్షాలు మొదలు భారీ నుంచి మిగతా 5వ పేజీలో ▶

దేశంలో జూన్‌లో లోటు వర్షపాతం..

జూలైలో సాధారణానికి మించి వానలు: ఐఎండీ చీఫ్ మహాపాత్ర

6లో

క్లుప్తంగా...



సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన యంగోన్ కార్పొరేషన్ సీఈఓ, చైర్మన్ కిహాక్ సంగ్

అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ సత్తా చాటాలి

సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం యువత క్రీడాకారులుగా ఎదిగే దిశగా కార్యాచరణ రూపొందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 'ఎయిర్ గన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్' ఆధ్వర్యంలో గోవాలో జరిగిన 10వ నేషనల్ రైఫిల్ అండ్ పిస్టల్ షూటింగ్ ఛాంపియన్ షిప్–2024 పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన భూక్య మోనాలిసా, భూక్య సోనాలిసా సోమవారం తెలంగాణ సచివాలయంలో మంత్రి కొండా సురేఖతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రైఫిల్ అండ్ పిస్టల్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వీరిని సీఎం అభినందించారు. పట్టుదలతో ముందుకు సాగి అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ సత్తాను చాటాలని వారిని ప్రోత్సహించారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయసహకారాలను అందిస్తుందని సీఎం వారికి భరోసానిచ్చారు.

పవర్ గ్రిడ్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జిగా అఖిలేశ్ పాఠక్



సాక్షి, హైదరాబాద్: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ దక్షిణాది ప్రాంత ఇన్‌చార్జిగా సంస్థ సీజీఎం అఖిలేశ్ పాఠక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్వహణను ఆయన పర్యవేక్షించనున్నారు.

ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

- రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా ప్రతినిధుల ఫిరాయింపుల అంశంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఒకవైపు ఫిరాయింపులతో రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోస్తోందని కేంద్రంలోని బీజేపీని విమర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. మరోవైపు ప్రతిపక్షంలోని ప్రాంతీయ రాజకీయ పార్టీలను బలహీనపరిచే ప్రయత్నాలను ముమ్మరంగా చేస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో బీఆర్ఎస్ తరఫున సురేశ్‌రెడ్డి మాట్లాడారు. గతంలో మణిపూర్, మహారాష్ట్రల్లో ఫిరాయింపులు జరగగా... తాజాగా తెలంగాణలో ఫిరాయింపులు జరుగుతున్నాయని విమర్శించారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే... రెండు మూడు నెలల్లోనే వేరే పార్టీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో బరిలో దిగి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని పరోక్షంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం దక్కలేదన్నారు. చివరకు ఈ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. అంతేగాక ఫిరాయింపుల అంశంపై ఇప్పటికే అనేక కమిటీల నివేదికలు వచ్చినా లాభం లేకుండా పోయిందని సురేశ్‌రెడ్డి తెలిపారు.

నేర చట్టాలు సరికొత్తగా..

దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు



రాష్ట్రంలో చార్మినార్‌లో కొత్త చట్టాల కింద తొలి ఎఫ్ఐఆర్ నమోదు

పోలీసు దర్యాప్తు, కోర్టు విచారణలకు గడువు

దేశంలో ఎక్కడున్నా ఈ–ఎఫ్ఐఆర్ నమోదు

సాక్షి, హైదరాబాద్: బ్రిటిష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఏఈ) స్థానంలో దేశవ్యాప్తంగా సోమవారం నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి వచ్చాయి. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ)లోని వివిధ సెక్షన్ల కిందే దేశంలో కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో తొలి ఎఫ్ఐఆర్ చార్మినార్‌లో నమోదైంది. నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తిపై కొత్త చట్టాల్లోని సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారు.

కొత్త రకాల నేరాలకు చోటు..

వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద చర్యల గురించి ఈ కొత్త చట్టాల్లో స్పష్టంగా నిర్వచించారు. రాజద్రోహం అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు భంగం కలిగించే చర్యలను శిక్షార్హం చేశారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులకు కొత్త అధ్యాయాన్ని చేర్చారు. పెళ్లి పేరుతో మహిళలను లోబరుచుకొని మోసగించడం, చిన్నారులపై సామూహిక అత్యాచారాలు, మూక దాడుల వంటి నేరాలకు ఐపీసీలో ప్రత్యేక సెక్షన్లు లేవు. ఆ లోటును భారతీయ న్యాయ సంహితలో భర్తీ చేశారు. సత్వర న్యాయం కోసం ప్రతి అంశంలో గడువు నిర్దేశిస్తూ బీఎన్ఎస్ఎస్‌లో 45 సెక్షన్లు చేర్చారు. అరెస్టు, తనిఖీ, సీజ్, దర్యాప్తులో పోలీసుల జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి 20కిపైగా కొత్త సెక్షన్లు ప్రవేశపెట్టారు.

కొత్త నేర చట్టాల్లోని కొన్ని ముఖ్యమైన సెక్షన్ల గురించి కుప్లంగా..

ఈ–ఎఫ్ఐఆర్

సెక్షన్ 173 (1) బీఎన్ఎస్ఎస్ ప్రకారం.. నేరం జరిగిన చోటు నుంచే కాకుండా దేశంలో ఎక్కడ ఉన్నా ఆన్‌లైన్‌లో ఈ–ఎఫ్ఐఆర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అది ప్రజల హక్కు. అనంతరం పోలీసుల నుంచి జాప్యం లేకుండా సెక్షన్ 173 (2) ప్రకారం ఎఫ్ఐఆర్ కాపీని పొందవచ్చు. సెక్షన్ 193 (3) (2) ప్రకారం 90 రోజుల్లోగా కేసు దర్యాప్తు పురోగతిని బాధితులకు విధిగా తెలియజేయాలి.

మరణశిక్షే..

తప్పుడు హామీతో మహిళను లోబరుచుకొని లైంగిక అవసరాలు తీర్చుకుంటే సెక్షన్ 69 కింద కఠిన నేరంగా పరిగణిస్తారు. బాలికపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడితే సెక్షన్ 70 (2) ప్రకారం మరణశిక్ష విధించే అవకాశం ఉంది.

సెక్షన్ 176 (1) ప్రకారం బాధితుల ఆడియో, వీడియో రికార్డింగ్‌కు అనుమతి తీసుకోవాలి. బాధిత మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నా సెక్షన్ 184 (1) ప్రకారం ఆమె అనుమతి తప్పనిసరి. సెక్షన్ 184 (6) కింద వారంలోగా వైద్య పరీక్షల నివేదికను సంబంధిత వైద్యుడు దర్యాప్తు అధికారి ద్వారా కోర్టుకు అందజేయాలి.

డిజిటల్ రికార్డులు...

ఎలక్ట్రానిక్, డిజిటల్ రికార్డులను కూడా ప్రాథమిక సాక్ష్యంగా పరిగణిస్తారు. సెక్షన్ 2 (1) (డీ) ప్రకారం డాక్యుమెంట్ నిర్వచనాన్ని పొడిగించి అందులో వీటిని భాగం చేశారు. సెక్షన్ 61 కింద ఇతర డాక్యుమెంట్లతో సమానంగా డిజిటల్ డాక్యుమెంట్లను పరిగణిస్తారు. సెక్షన్ 62, 63 ప్రకారం కోర్టులో ఎలక్ట్రానిక్ రికార్డులకు ఆమోదం ఉంటుంది.

ఈ–బయాన్..

సెక్షన్ 530 కింద కోర్టుల్లో బాధితుల నుంచి ఎలక్ట్రానిక్ స్టేట్‌మెంట్ తీసుకొనేందుకు అనుమతి. ఆన్‌లైన్ ద్వారా సాక్షులు, నిందితుల హాజరు.(బీఎస్ఏలోని సెక్షన్ 2 కూడా ఇదే అంశాన్ని చెబుతోంది)

గడువు నిర్దేశం..

- సెక్షన్ 251: తొలి విచారణ చేపట్టిన 60 రోజుల్లోగా అభియోగాలను నమోదు చేయాలి.
- సెక్షన్ 346: క్రిమినల్ కేసుల విచారణలో రెండు వాయిదాలకు మించి వేయడానికి వీలులేదు.
- సెక్షన్ 258: క్రిమినల్ కోర్టుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా తీర్పు వెల్లడించాలి.

పర్యవేక్షణ..

సెక్షన్ 20: కేసుల విచారణ వేగవంతం, అప్పీల్ దాఖలుపై అభిప్రాయాలను జిల్లా డైరెక్టరేట్ ప్రాసిక్యూషన్, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పర్యవేక్షిస్తుంటాయి.

అండర్ ట్రయల్స్ విడుదల...

సెక్షన్ 479: నిందితులు చేసిన నేరంలో మూడింట ఒక వంతు జైలులో ఉంటే వారి విడుదలకు అనుమతి. అయితే వారికి అదే తొలి నేరమై ఉండాలి.

తనిఖీల వీడియో రికార్డు..

సెక్షన్ 105: పోలీసులు తనిఖీలు, సీజ్‌లు చేసేటప్పుడు వీడియో రికార్డింగ్ తప్పనిసరి.

సెక్షన్ 35 (7): కేసులో మూడేళ్ల కంటే తక్కువ శిక్ష పడే అవకాశం ఉండి.. అనారోగ్యంతో బాధపడుతున్నా లేదా 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారి అరెస్టుకు డిప్యూటీ ఎస్పీ ర్యాంక్ అధికారి అనుమతి తీసుకోవాలి.

సెక్షన్ 76: ఏడేళ్ల లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే నేరాలకు ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి.

ఉగ్రవాదానికి నిర్వచనం..

బీఎన్ఎస్ సెక్షన్ 113: దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమాధికారం, భద్రత, ఆర్థిక భద్రతకు ముప్పువాటిల్లే చర్యలు చేపడితే ఉగ్రవాదంగా పరిగణిస్తారు.

ఆన్‌లైన్‌లోనూ సమన్లు..

నిందితులు లేదా ప్రతివాదులకు ఎస్ఎంఎస్, వాట్సాప్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా కూడా సమన్లు జారీ చేయొచ్చు. దీంతో తమకు సమన్లు అందలేదని వారు తప్పించుకొనే వీలుండదు.

చైన్ స్నాచింగ్..

గతంలో చైన్ స్నాచింగ్ లాంటి వాటికి ప్రత్యేక శిక్షలు లేవు. భారతీయ న్యాయ సంహితలో స్నాచింగ్‌ను కూడా నేరంగా పేర్కొన్నారు. స్నాచింగ్‌కు పాల్పడిన వారిని నేరస్తులుగా గుర్తిస్తారు.

దేశద్రోహం..

భారతీయ శిక్షాస్మృతిలోని రాజద్రోహాన్ని ఇప్పుడు దేశద్రోహంగా మార్పు చేశారు. కులం, మతంతో పాటు మరే ఇతర కారణంతోనైనా సామూహిక దాడులు, హత్యకు పాల్పడితే యావజ్జీవ శిక్ష పడనుంది.

నిరసనలకు శరాఘాతమా?

- కొత్త నేర చట్టాల్లోని పలు సెక్షన్లపై ఉద్యమకారుల అనుమానాలు
- దీనివల్ల ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతమని ఆందోళన

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాల్లోని పలు సెక్షన్లు పోలీసుల అధికారాలను మరింత బలోపేతం చేసేలా ఉన్నాయని పోలీసులు చెబుతుండగా కొన్ని సెక్షన్లు నిరసనలు తెలియజేసే వారికి ప్రతికూలంగా మారొచ్చని పలువురు ఉద్యమకారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు ఈ సెక్షన్లు విఘాతం కలిగిస్తాయని ఆందోళన చెందుతున్నారు. అలాంటి సెక్షన్లపై మరింత చర్చ అవసరమని అభిప్రాయపడుతున్నారు.

బీఎన్ఎస్ 226: ఈ సెక్షన్ ప్రకారం ఎవరైనా ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం ద్వారా అవతలి వ్యక్తితో పనిచేయించుకోవాలనుకున్న సందర్భంలో పోలీసులు కేసు నమోదు చేసే అవకాశముంది. నేర స్వభావం కలిగిన వ్యక్తులతో ఫరవాలేదు గానీ, భూసేకరణ సమయంలో, భూపోరాటాల్లో, విద్యార్థుల ఉద్యమాల్లో, నిరుద్యోగుల పోరాటాల్లో ప్రతిఘటన ఉంటుంది. ఆందోళనకారులు ఆత్మార్పణం చేసుకునేందుకు యత్నిస్తారు. ఈ సెక్షన్ వల్ల ఉద్యమాలు, నిరసనల సమయంలో అమాయకులపై కేసులు నమోదయ్యే ప్రమాదముందని సామాజిక ఉద్యమకారులు వాపోతున్నారు. అదే సమయంలో పేరు, ఊరు చెప్పకపోయినా, ఎఫ్ఐఆర్ లేకుండా ఫిర్యాదును క్లోజ్ చేసే అధికారం పోలీసులకు ఇవ్వడంపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

బీఎన్ఎస్ఎస్ 172: అనుమతుల్లేకుండా ఆందోళనలు చేపడితే పోలీసులు కేసు నమోదు చేయొచ్చు. ఇది నిరసన హక్కుకు విఘాతం కలిగిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

బీఎన్ఎస్ఎస్ 39: అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తి పేరు, వివరాలు చెప్పకపోయినా పోలీసులకు అరెస్టు చేసే అధికారం. దీన్ని అడ్డుపెట్టుకొని అమాయకులను పోలీసులు అరెస్టు చేసే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఫిర్యాదు క్లోజ్: 3 నుంచి 7 ఏళ్లలోపు శిక్షపడే నేరారోపణల్లో డీఎస్పీ అనుమతితో 14 రోజులపాటు విచారణ జరిపి తీవ్రత లేదనిస్తే ఆ ఫిర్యాదును ఎఫ్ఐఆర్ కట్టకుండానే క్లోజ్ చేసే అధికారం విచారణాధికారికి లభించింది. దీనివల్ల డబ్బు, పలుకుబడిగల వారు కేసులను అనుకూలంగా మలచుకునే ప్రమాదముందన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

చర్చ లేకుండా అమలేంటి?



ప్రతిపక్షాలతో చర్చ లేకుండా, ప్రజలకు సమాచారం లేకుండా కొత్త నేర చట్టాలను ఎందుకు అమలు చేయాల్సి వచ్చింది. ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగేలా, స్త్రీ స్వేచ్ఛకు భంగం వాటిల్లేలా, పితృస్వామ్య వ్యవస్థను ప్రోత్సహించేలా ప్రాచీన భారతం వైపు నడిపించేలా కొత్త చట్టాలు ఉన్నాయి.

– ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, శాతవాహన వర్సిటీ

నిర్బంధాన్ని పెంచేలా..



నిరసనకు పోలీసులే అనుమతి ఇవ్వచ్చు.. వారే అరెస్టు చేయవచ్చు. ఈ చట్టాలన్నీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవిధంగా ఉన్నాయి. కొత్త చట్టాలు నిర్బంధాన్ని పెంచే విధంగా ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థకు కొత్త చట్టాలు అనుకూలంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యవాదుల గొంతునొక్కేలా ఈ చట్టాలు ఉన్నాయి.

– మార్వాడి సుదర్శన్, దళిత లిబరేషన్ ఫ్రంట్

కొత్త చట్టాల అమలుకు ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ ఏర్పాటు

- సీఐడీ ఆధ్వర్యంలోని ఈ సెంటర్‌లో దర్యాప్తు, న్యాయ, ఫోరెన్సిక్ నిపుణులు
- నూతన చట్టాలపై పోస్టర్ విడుదలలో డీజీపీ రవి గుప్తా వెల్లడి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీజీపీ రవిగుప్తా. చిత్రంలో శిఖా గోయల్, మహేశ్ భగవత్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: మూడు నూతన నేర చట్టాలపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు అధికారులకు మార్గనిర్దేశం చేసేందుకు సీఐడీ విభాగంలో ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు డీజీపీ రవి గుప్తా తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి అమల్లోకి వచ్చిన ఈ సపోర్ట్ సెంటర్ 24 గంటలపాటు అందుబాటులో ఉంటూ అధికారుల సందేహాలు నివృత్తి చేస్తుందని చెప్పారు. దర్యాప్తులో నిపుణులు, న్యాయ నిపుణులు, ఫోరెన్సిక్‌లో నిపుణులు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని, వారు సిబ్బందికి తగిన సూచనలిస్తారని వెల్లడించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినయం.. ఈ మూడు నూతన చట్టాలపై తెలుగు, ఇంగ్లిష్‌లో రూపొందించిన పోస్టర్లను డీజీపీ రవి గుప్తా, అడిషనల్ డీజీలు శిఖాగోయల్, అభిలాషబిస్త్, మహేశ్ భగవత్, వీవీ శ్రీనివాసరావు, ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ వైజయంతిలతో కలిసి సోమవారం డీజీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అలాగే నూతన చట్టాల అమలుపై రూపొందించిన ఎస్ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్)పై రూపొందించిన బుక్‌లెట్‌ను కూడా ఆవిష్కరించారు. ఇందులో నూతన చట్టాల అమలుకు సంబంధించిన అన్ని కీలకాంశాలు రూపొందించారు. మొత్తం 43 ఎస్ఓపీలు, 31 ప్రొఫార్మాలను ఈ బుక్‌లెట్‌లో రూపొందించినట్లు డీజీపీ తెలిపారు. సీఐడీ, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ అధికారుల సమన్వయంతో ఈ మొత్తం రూపొందించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐడీ అడిషనల్ డీజీ శిఖాగోయల్, ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ వైజయంతి, నిజామాబాద్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనవర్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రితిరాజ్‌లను డీజీపీ అభినందించారు. కొత్త చట్టాల అమలుకు తగ్గట్టుగా సీసీటీఎన్ఎస్‌లోనూ మార్పులు చేశామన్నారు. నూతన చట్టాలపై అధికారులకు శిక్షణ ఇవ్వడంలో కీలకంగా పనిచేసిన అభిలాషబిస్త్, సాంకేతిక అంశాల్లో సహకారం అందించిన వీవీ శ్రీనివాసరావును డీజీపీ అభినందించారు. కార్యక్రమంలో మహేశ్ భగవత్, మల్టీజోన్ల ఐజీ సుధీర్‌బాబు, పీఅండ్ఎల్ ఐజీ రమేశ్, డీఐజీ కో–ఆర్డినేషన్ గజరావుభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాల అమలుపై ఎవరేమన్నారంటే..

ప్రజల్లో అవగాహన పెంచుతాం

నూతన నేర చట్టాలతో ప్రజలకు సంపూర్ణ న్యాయం దక్కుతుందని పూర్తి విశ్వాసం ఉంది. ఈ చట్టాల్లోని కీలకాంశాలపై తెలుగు, ఆంగ్లంలో రూపొందించిన పోస్టర్లను ప్రతి పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉంచుతాం. ప్రజల్లో వాటిపై అవగాహన పెంచుతాం. నూతన చట్టాలపై రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం.

– రవిగుప్తా, డీజీపీ

సకాలంలో న్యాయం

నేర దర్యాప్తుతోపాటు కోర్టు ట్రయల్‌ను ఎంత కాలంలో పూర్తి చేయాలన్నది కొత్త చట్టాల్లో టైం ఫ్రేమ్ పెట్టారు. దీనివల్ల క్రిమినల్ జస్టిస్ సిస్టం వేగవంతం అవుతుంది. బాధితులకు ఇది ఎంతో మేలు చేస్తుంది. కొత్త చట్టాల అమలుకు సంబంధించి మరే రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణ పోలీస్ తరఫున 43 స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, 31 ప్రొఫార్మాలు రూపొందించాం. సీఐడీలో ఒక ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం.

– శిఖాగోయల్, సీఐడీ అడిషనల్ డీజీ

బాధితులే కేంద్రంగా



బీఎన్ఎస్ ద్వారా బాధితులే కేంద్రంగా న్యాయ విధానం అమలవుతుంది. కేసు నమోదు, దర్యాప్తు, విచారణలకు కాల నిర్దేశం చేశారు. కొత్త చట్టాల నుంచి పూర్తి ఫలితాలు పొందాలంటే పోలీసు విభాగం, న్యాయ వ్యవస్థ టెక్నాలజీ పరంగా అప్‌గ్రేడ్ కావాల్సి ఉంది. ఇదే ఈ వ్యవస్థల ముందున్న తొలి సవాల్.

– ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, డీన్, స్కూల్ ఆఫ్ లా, మహేంద్ర యూనివర్సిటీ

సొత్తు సంబంధ నేరాల్లో సత్వర న్యాయం



ప్రాపర్టీ అఫెన్సులుగా పిలిచే సొత్తు సంబంధిత నేరాలకు ఐపీసీలో కనీస శిక్షను నిర్వచించలేదు. గరిష్టంగా ఐదేళ్లు అని మాత్రమే అందులో ఉంది. బీఎన్ఎస్‌లో 23 రకాలైన ప్రాపర్టీ అఫెన్సులకు కనీస శిక్షను నిర్వచించారు. ఈ నేరం ద్వారా నేరగాడు సంపాదించిన సొమ్ము అప్పటికప్పుడే సీజ్ చేయడానికి, దాన్ని బాధితులకు హేతుబద్ధంగా పంచడానికి బీఎన్ఎస్ అవకాశం కల్పిస్తోంది.

– ఈతముక్కల దామోదర్, రిటైర్డ్ ఐజీ, బీఎన్ఎస్‌పై వివిధ రాష్ట్రాల పోలీసులకు శిక్షకులు

చార్మినార్ పీఎస్‌లో తొలి కేసు

- కొత్త చట్టం కింద సోమవారం తెల్లవారుజామున 1.00 గంటలకు ఎఫ్ఐఆర్
- పోలీస్ సిబ్బందిని అభినందించిన డీజీపీ రవిగుప్తా

సాక్షి, హైదరాబాద్: నూతన నేర చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినయం (బీఎస్ఏ)లు రాష్ట్రంలో అమల్లోకి వచ్చాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చార్మినార్ పీఎస్‌లో బీఎన్ఎస్ కింద మొట్టమొదటి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు డీజీపీ రవిగుప్తా అధికారికంగా వెల్లడించారు. డిజిటల్ సంతకంతో ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు. నూతన నేర చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీస్ సిబ్బందిని డీజీపీ రవిగుప్తా అభినందించారు.

చార్మినార్ ఠాణా... ఎఫ్ఐఆర్ నెం.144/2024

దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న ప్రముఖ కట్టడం పాతబస్తీలోని చార్మినార్. ఈ ఠాణా ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తన సిబ్బందితో ఆదివారం రాత్రి 11 గంటల నుంచి గుల్జార్ హౌస్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటల వరకు ఇవి జరిగాయి. తెల్లవారుజామున 12.15 గంటల ప్రాంతంలో బోరబండ ప్రాంతానికి చెందిన సోహైల్ అన్సారీ, ఘాన్సీ బజార్‌కు చెందిన ఎస్‌కే.అన్వర్ తమ ద్విచక్ర వాహనాలను ప్రమాదకరంగా నడుపుతూ ఈ బృందానికి చిక్కారు. వీరి వాహనాలకు నంబర్ ప్లేట్స్ సైతం సక్రమంగా లేనట్టు పోలీసులు గుర్తించారు. దీంతో ఇద్దరినీ వాహనాలతో సహా చార్మినార్ ఠాణాకు తరలించిన పోలీసులు తెల్లవారుజామున 1.00 గంటకు బీఎన్ఎస్‌లోని 281తో పాటు మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 80 (ఎ), 177 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజారోగ్య సంచాలకుల విభాగం రద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం కల్పించనుంది.

వైద్య వ్యవస్థలకు జిల్లా బాస్ ఎవరు?

ఈ నాలుగు విభాగాలకు కలిపి జిల్లా స్థాయిలో ఒక బాస్ లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఉదాహరణకు మెడికల్ కాలేజీల్లో ఏదైనా సమస్య తలెత్తితే ప్రిన్సిపాల్ చూస్తారు. మరి అన్ని మెడికల్ కాలేజీల్లో సమస్య తలెత్తితే జిల్లా స్థాయిలో దాన్ని పరిష్కరించే నాథుడే లేడు. రాష్ట్ర స్థాయిలో ఉండే డీఎంఈనే సమస్యను పరిష్కరించాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి మిగిలిన విభాగాల్లోనూ నెలకొంది. పేరుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారే (డీఎంహెచ్‌వో) అయినా కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకే పరిమితమయ్యారు. ఇతర విభాగాల ఉద్యోగుల సమస్యలు వినే పరిస్థితి లేదు. ఇలా జిల్లాస్థాయి వైద్య విభాగాలను పర్యవేక్షించే వ్యవస్థ లేదు. అన్ని వైద్య విభాగాలకు కలిపి ఒక అధిపతి లేరు. ఈ పరిస్థితిని కూడా మార్చాలని వైద్య, ఆరోగ్యశాఖ భావిస్తోంది. రాష్ట్రస్థాయిలో ఆ శాఖ కార్యదర్శి బాస్‌గా ఉన్నా కింది స్థాయిలో మాత్రం ప్రత్యేక వ్యవస్థ లేదన్న చర్చ జరుగుతోంది.

నాలుగో వారంలో బడ్జెట్ భేటీ!

▶ మొదటి పేజీ తరువాయి

ఇందుకు అనుగుణంగా అసెంబ్లీ నోటిఫికేషన్ జారీ అవుతుందని సమాచారం.

231 మంది జీవిత ఖైదీల విడుదలకు ఆమోదం

వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 231 మంది జీవిత ఖైదీల విడుదలకు ప్రభుత్వం చేసిన సిఫారసులను ఆమోదిస్తూ గవర్నర్ సంతకాలు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు ఖైదీల విడుదలకు మార్గదర్శకాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇలావుండగా గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల పేర్లను సిఫారసు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం గతంలో రెండు సార్లు గవర్నర్ ఆమోదానికి పంపించింది. పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనలను ఆమోదించాలని సీఎం కోరినట్లు తెలిసింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు డి.రాజేశ్వర్‌రావు, ఫారూక్ హుస్సేన్‌ల పదవీకాలం 2023 ఏప్రిల్ 27తో ముగిసిపోగా, అప్పటినుంచి ఈ రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణలను ప్రతిపాదించగా, వీరికి తగిన అర్హతలు లేవంటూ నాటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరాం, ఆమీర్ అలీఖాన్‌ల పేర్లను ప్రతిపాదించగా ఆమె వెంటనే ఆమోదించారు. దీనిని సవాలు చేస్తూ దాసోజు, సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు వారి నియామకాన్ని రద్దు చేసింది. అయితే రాష్ట్ర మంత్రివర్గం మళ్లీ కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల పేర్లనే ప్రతిపాదించింది.

పెండింగ్ బిల్లులు ఆమోదించండి ధరణి స్థానంలో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తున్నామని గవర్నర్‌కు ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిసింది. ఆర్డినెన్స్ రూపంలో ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తామని, ఆమోదించి సహకరించాలని కోరినట్టు సమాచారం. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీన్ని ఆమోదిస్తామని వివరించారు. మరోవైపు మున్సిపాలిటీల చట్ట సవరణకు సంబంధించిన రెండు బిల్లులు, పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లు, ప్రైవేటు వర్సిటీల బిల్లులు దీర్ఘకాలంగా రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, వీటినీ ఆమోదించాలని రేవంత్ కోరినట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై శాఖల వారీగా నివేదికలను సైతం త్వరలో విడుదల చేస్తామని చెప్పినట్లు సమాచారం.

4న కేబినెట్ విస్తరణ?

▶ మొదటి పేజీ తరువాయి

హైకమాండ్ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలకు మరోమారు పిలుపు వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు ఢిల్లీ వెళ్లనున్నారు. అధిష్టానం ఇచ్చిన సమయాన్ని బట్టి మంగళ లేదా బుధవారం వారు హస్తిన చేరుకుంటారని తెలుస్తోంది. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన తుది జాబితాకు ఆమోదముద్ర వేస్తారని, తుది దఫా చర్చల్లో భాగంగా ఇప్పటివరకు స్పష్టత రాని ఒకట్రెండు బెర్తుల విషయంలో నిర్ణయం తీసుకుంటారని సమాచారం. ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, వాకిటి శ్రీహరిల పేర్లు దాదాపు ఖరారయ్యాయని, ప్రేంసాగర్‌రావు, వివేక్‌లలో ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై చర్చలు జరుగుతున్నాయ ని చెబుతున్నారు. ఈ దఫా నాలుగు బెర్తులు భర్తీ చేస్తారని, ముస్లిం మైనార్టీల కోసం ఒక బెర్తు, ఎస్టీల కోసం మరో బెర్తును ఖాళీగా ఉంచవచ్చని తెలుస్తోంది. ఢిల్లీలో చర్చల అనంతరం ఈ విషయంలో మరింత స్పష్టత రానుంది.

ఢిల్లీ హైకోర్టులో ఎమ్మెల్సీ కవితకు నిరాశ

సీబీఐ, ఈడీ కేసుల్లో బెయిల్ నిరాకరణ



సాక్షి, న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నిరాశ ఎదురైంది. అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో కవిత బెయిల్ దరఖాస్తులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. సీబీఐ, ఈడీ కేసుల్లో ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ స్వర్ణకాంతశర్మ సోమవారం తీర్పు వెలువరించారు. కవిత దాఖలు చేసిన రెండు పిటిషన్లను కొట్టివేస్తున్నట్టు జస్టిస్ శర్మ తన తీర్పులో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థల సేకరించిన ఆధారాలు, అప్రూవర్ల స్టేట్‌మెంట్లు ఆధారంగా బెయిల్ ఇవ్వరాదన్న వాదన, పీఎంఎల్ఏ సెక్షన్ 45, ఈ దశలో పిటిషనర్‌కు బెయిల్ ఇవ్వొచ్చా అనే అంశాలు పరిగణనలోకి తీసుకొని తీర్పు ఇచ్చినట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం బెయిల్ దరఖాస్తుల్లో దర్యాప్తు సంస్థలు సేకరించిన ఆధారాలు పరిశీలిస్తే ఇండోస్పిరిట్స్ ఏర్పాటు, కిక్‌బ్యాక్‌ల చెల్లింపు, ఇతరత్రా కార్యకలాపాల్లో కవిత భాగస్వాములైనట్టు కోర్టు విశ్వసిస్తోందన్నారు. ఎమ్మెల్సీ కవిత సమాజసేవ అభినందనీయమే కానీ దర్యాప్తు సమయంలో సేకరించిన ఆధారాలు, సాక్ష్యాలపై దాని ప్రభావం ఉండదని పేర్కొన్నారు. పీఎంఎల్ఏ సెక్షన్ 45కు సంబంధించిన నిబంధనలోని ప్రయోజనాలు లబ్ధి పొందడానికి పిటిషనర్ అర్హురాలు కాదని కోర్టు అభిప్రాయపడుతోందని తెలిపారు. కేసు మెరిట్స్‌లోకి వెళ్లలేదని పిటిషనర్ దాఖలు చేసిన రెండు దరఖాస్తులు కొట్టివేస్తున్నట్టు పేర్కొన్నారు.

త్వరలో జాబ్ కేలండర్!



- విపక్షాల రాజకీయానికి కౌంటర్ ఇవ్వాలని భావిస్తున్న కాంగ్రెస్ సర్కార్
- విద్యార్థుల ఆందోళనలు, బీఆర్ఎస్, బీజేపీల మద్దతు నేపథ్యం
- మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు కార్యాచరణకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- నిరుద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని పార్టీ నేతలకు సీఎం రేవంత్ ఆదేశం
- బీఆర్ఎస్, బీజేపీలపై కాంగ్రెస్ నేతల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల సమస్యలపై ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయానికి కౌంటర్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గ్రూప్స్ ఉద్యోగ పోస్టులను పెంచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్ దీక్షకు దిగడం, బీఆర్ఎస్..బీజేపీలు దీక్షకు సంఘీభావం ప్రకటించడం, ఉస్మానియా వర్సిటీలో విద్యార్థులు ఆందోళన చేస్తుండడం, ఇతర అంశాల నేపథ్యంలో కార్యాచరణకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు జాబ్ కేలండర్ విడుదల చేయాలని భావిస్తోంది. నాలుగైదు రోజుల్లోనే ఈ కేలండర్‌ను విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యలపై అధ్యయనం చేసి ఎప్పటికప్పుడు అన్ని విషయాలను తన దృష్టికి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలను ఆదేశించారు. గాంధీ ఆసుపత్రిలో విద్యార్థి నేత మోతీలాల్ దీక్షపై ఆరా తీసిన ఆయన.. నిరుద్యోగుల విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించినట్టు సమాచారం. ఇక నిరుద్యోగుల సమస్యలు, జాబ్ కేలండర్ విడుదల అంశాలపై పార్టీ విద్యార్థి, యువజన నేతలతో సోమవారమే భేటీ కావాలని ఆయన నిర్ణయించినా సాధ్యపడలేదు. త్వరలోనే ఈ సమావేశం ఉంటుందని తెలుస్తోంది.

మొసలి కన్నీరు.. కపట ప్రేమ

సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ యువ నేతలు బీఆర్ఎస్, బీజేపీలపై ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధులు రియాజ్, చనగాని దయాకర్, బాలలక్ష్మి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసిందని గుర్తు చేశారు. అలాగే నిరుద్యోగులకు అనుకూలంగా అనేక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులు ఉద్యోగాలు అడిగితే హమాలీ పనులు చేసుకోవాలని ఆ పార్టీ నేతలు అనలేదా అని ప్రశ్నించారు. పదేళ్ల నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్న బీఆర్ఎస్ ఇప్పుడు నిరుద్యోగులపై మొసలికన్నీరు కారుస్తోందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ గురించి మాట్లాడని బీజేపీ నేతలు రాష్ట్రంలోని నిరుద్యోగులపై కపట ప్రేమ చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. కుట్ర రాజకీయాలు చేయడానికి బీఆర్ఎస్, బీజేపీ నేతలు గాంధీ ఆసుపత్రికి వస్తున్నారని, నిరుద్యోగులు వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. తాము ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని, మెగా డీఎస్సీ వేశామని, ముఖ్యమంత్రితో చర్చించి త్వరలోనే జాబ్ కేలండర్ విడుదల చేస్తామని అన్నారు.

బీఆర్ఎస్ భవనాన్ని కూల్చివేయండి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశం



సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి తదితరులు

నల్లగొండ: నల్లగొండలోని హైదరాబాద్ మెయిన్‌రోడ్డులో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ భవనాన్ని తొలగించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సోమవారం నల్లగొండ బీట్ మార్కెట్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా ఇంద్ర భవనంలా కడుతుంటే ఏం చేశారని కమిషనర్‌ను ప్రశ్నించారు. పేదవాడు సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటే సవాలక్ష రూల్స్ పెడతారు..మరి ఇలాంటి వారికి అవి ఎందుకు వర్తించడం లేదని ప్రశ్నించారు. రూల్స్ ప్రకారం ముందుకుపోవాలని అక్కడే ఉన్న కలెక్టర్ నారాయణరెడ్డిని మంత్రి ఆదేశించారు. నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని, ఒకవేళ వారు భవనం కట్టుకోవాలంటే నిబంధనల ప్రకారం దరఖాస్తు పెట్టుకుంటే బైపాస్ ప్రాంతంలో ఇవ్వాలని సూచించారు. తాను భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఔటర్‌లో భవన నిర్మాణానికి ఆదేశాలు ఇవ్వాలని అప్పటి కలెక్టర్‌కు చెప్పినట్టు గుర్తు చేశారు. తనకు ఎవరి మీదా కక్ష లేదని నిబంధనలు పాటించాలంటూ మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతున్నానని, పేదల పిల్లలను తన పిల్లలుగా భావించి చదివిస్తానని చెప్పారు. నల్లగొండను ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్టు తెలిపారు.

బైపాస్ విషయంలో రాజకీయాలు వద్దు

నల్లగొండలో నిర్మించే బైపాస్ విషయంలో రాజకీయాలు వద్దని మంత్రి సూచించారు. ఏ ఒక్కరికి కూడా నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధికి సహకరించాలని కోరారు. మార్కెట్ ధర కంటే రూ.100 ఎక్కువగానే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నల్లగొండ పట్టణంలో తాను 20 సంవత్సరాల క్రితం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే నల్లగొండకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొచ్చానని గుర్తు చేశారు.

సీఎంతో మాట్లాడాకే దీక్ష విరమిస్తా

స్పష్టం చేసిన మోతీలాల్ నాయక్
గాంధీ ఆస్పత్రిలో ఉద్రిక్తత... భారీగా మోహరించిన పోలీసులు



గాంధీ ఆస్పత్రి వద్ద పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డిలను అరెస్టు చేస్తున్న పోలీసులు

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గాంధీ ఆస్పత్రిలో గత ఎనిమిది రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌తో పలువురు కాంగ్రెస్ నాయకులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వచ్చి నిరుద్యోగ సంఘ నాయకులతో మాట్లాడిన తర్వాతే దీక్ష విరమిస్తానని మోతీలాల్ నాయక్ చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో వేలాది మంది నిరుద్యోగులు మోతీలాల్‌కు మద్దతుగా గాంధీ ఆస్పత్రికి వస్తున్నారనే సమాచారంతో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసు బలగాలు ఆస్పత్రి ప్రాంగణాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సుమారు వందమంది నిరుద్యోగ యువత పోలీసుల కళ్లుగప్పి అలుమ్నీ భవనం వద్ద గేట్లు దూకి ఆస్పత్రి ప్రాంగణంలోకి దూసుకువచ్చారు. అప్రమత్తమైన పోలీసులు అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకుని బొల్లారం ఠాణాకు తరలించారు.

వెనుక మార్గం నుంచి బల్మూరి...

ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో హైడ్రామా నెలకొంది. నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌తో చర్చలు జరిపేందుకు రాత్రి 9 గంటలకు ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ తెలంగాణ అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆస్పత్రికి వస్తున్నట్లు సమాచారం అందడంతో నిరుద్యోగులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. రాత్రి 11.45 గంటలకు గాంధీకి వచ్చిన బల్మూరి వెంకట్, రియాజ్, మానవతారాయ్ తదితరులను అడ్డుకునేందుకు నిరుద్యోగులు యత్నించగా, పోలీసుల సహాయంతో రెండవ అంతస్తులోని ఐఎంసీ వార్డుకు చేరుకుని మోతీలాల్‌తో మాట్లాడారు. సీఎం స్వయంగా వచ్చి హామీ ఇస్తే, సంఘ నాయకులతో చర్చించి దీక్ష విరమిస్తానని చెప్పడంతో చర్చలు విఫలమయ్యాయి. అప్పటికే బల్మూరి వెంకట్ వచ్చిన కారును నిరుద్యోగ యువత చుట్టుముట్టి, అడ్డంగా పడుకుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు బల్మూరి తదితరులను వెనుక మార్గం నుంచి బయటకు తీసుకువచ్చి మరో వాహనంలో అక్కడి నుంచి పంపించారు. కాగా, మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా గాంధీ ఆస్పత్రికి వచ్చిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

...రాజీనామా చేయించు

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేలా బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యవహరించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరితే రాళ్లతో కొట్టి చంపాలని స్వయంగా రేవంత్‌రెడ్డే వ్యాఖ్యానించారని, ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలో ఆయనే చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారి సభ్యత్వం ఆటోమేటిక్‌గా రద్దయ్యేలా రాజ్యాంగ సవరణ చేస్తామంటూ స్వయంగా రాహుల్‌గాంధీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణను అన్నివిధాలా అభివృద్ధి చేసింది కేసీఆరేనని.. చరిత్ర చెరిపేస్తే చెరిగిపోదని స్పష్టం చేశారు. 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలను చేర్చుకొనే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దని, మళ్లీ పార్టీకి మంచిరోజులు వస్తాయని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్పర్సన్ దావ వసంత, నాయకులు బాజిరెడ్డి గోవర్ధన్, నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి: కేటీఆర్


సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే జారీ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగులపట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ హక్కుల కోసం దీక్ష చేస్తున్న మోతీలాల్ అనే యువకుడికి సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన నిరుద్యోగ యువకులపై లాఠీచార్జి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. అలాగే తమ పార్టీ నేతలను అడ్డుకోవడంపై మండిపడ్డారు. ప్రజాపాలనలో పరామర్శించే, నిరసన తెలిపే హక్కు కూడా లేదా? అని ఆయన ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న నిరుద్యోగులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల డిమాండ్లను పట్టించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

మేడిగడ్డ రిపేర్ల మాటున చిల్లర రాజకీయం: 'ఎక్స్'లో కేటీఆర్ ట్వీట్

తెలంగాణకే తలమానికమైన కాళేశ్వరం ప్రాజెక్టును తప్పుబట్టిన వాళ్లు ఇక ముక్కు నేలకు రాయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు డిమాండ్ చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నేతలు అభూత కల్పనలు ప్రచారం చేశారని, రిపేర్ల మాటున చిల్లర రాజకీయం చేశారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోమవారం 'ఎక్స్'వేదికగా మేడిగడ్డ అంశంపై స్పందించారు. 'మేడిగడ్డ మేడిపండులా మారింది అన్నారు.. అసలు రిపేర్ చేయడం అసాధ్యం అన్నారు. మరమ్మతులు చేసినా పనికి రాదన్నారు. వర్షాకాలంలో వరదకు కొట్టుకుపోతది అన్నారు. అన్నారం బ్యారేజీ కూడా కూలిపోతది అన్నారు'అని వ్యాఖ్యానిస్తూ నేడు మాత్రం మేడిగడ్డ మరమ్మతులు పూర్తి అంటున్నారని వ్యాఖ్యానించారు. దీంతో ఇంతకాలం కాంగ్రెస్ చేసిందంతా విషప్రచారం అని తేలిపోయిందని అన్నారు. కేసీఆర్ జల సంకల్పాన్ని హేళన చేసిన వారు ఇకనైనా క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

హైకోర్టు తీర్పు కేసీఆర్‌కు చెంపపెట్టు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఆది శ్రీనివాస్



యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలన్న పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు మాజీ సీఎం కేసీఆర్‌కు చెంపపెట్టు అని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. చట్టం ముందు అందరూ సమానమేనన్న విషయాన్ని కేసీఆర్ మర్చిపోయి రాజ్యాంగబద్ధంగా ఏర్పాటు చేసిన కమిషన్‌ను రద్దు చేయించాలనే సాహసం ఆయన చేశారని విమర్శించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఇప్పటికైనా నరసింహారెడ్డి కమిషన్ ముందు హాజరై విద్యుత్ కొనుగోళ్ల విషయంలో ఏం జరిగిందో వాస్తవాలను కేసీఆర్ చెప్పాలని, ఆయన చేసింది తప్పని తేలితే శిక్ష అనుభవించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పదేళ్ల అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయని, విచారణ నుంచి తప్పించుకునే కేసీఆర్ ప్రయత్నం బెడిసికొట్టినందున త్వరలోనే బాధ్యులపై చర్యలు తప్పవని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు. యెన్నం మాట్లాడుతూ జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ముందు హాజరయ్యేందుకు కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ నిర్ణయాల కారణంగా రాష్ట్రం రూ.10 వేల కోట్లు నష్టపోయిందని, విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో జరిగిన అవినీతిలో కేసీఆర్ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌కు రాజకీయ పార్టీ నడిపే అర్హత లేదని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని కోరుతూ ఎన్నికల సంఘం వద్దకు వెళ్తామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

'విద్యుత్' విచారణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి సంబంధించిన వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయంటూ.. వాటిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం గత మార్చిలో కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్–1952 కింద జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ నేపథ్యంలోనే కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే అసలు పిటిషన్‌ను విచారణకు స్వీకరించాలా.. వద్దా.. అన్న అంశంపై జరిగిన వాదనలు శుక్రవారం పూర్తి కావడంతో తీర్పు రిజర్వు చేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది.

పిటిషనర్‌ను కూడా వివరాలు కోరింది

'ప్రెస్‌మీట్‌లో ఏకపక్షంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణ తప్పు. అందుకు ఎలాంటి ఆధారాలు లేవు. విచారణ జరుగుతున్న తీరును మాత్రమే జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి విలేకరులకు వెల్లడించారు. నివేదిక ఏకపక్షంగా ఇస్తారేమోనని ఊహించడం సరికాదు. కమిషన్ విచారణ పక్షపాతంగా సాగుతోందనడానికి సరైన సాక్ష్యాలను చూపడంలో పిటిషనర్ విఫలమయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన వ్యక్తిపై ఆరోపణలు చేయడం సమంజసం కాదు. ఆరోపణలకు సరైన సాక్ష్యాలను చూపాలి. విద్యుత్ కొనుగోళ్లు, విద్యుత్ కేంద్రాల ఏర్పాటు గురించిన సమాచారం తెలుసుకోవడంలో భాగంగా పిటిషనర్ నుంచి కూడా కమిషన్ వివరాలు కోరింది. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్–1952ని ఉల్లంఘిస్తూ మార్చి 14న రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్న వాదన కూడా ఆమోదయోగ్యం కాదు. విద్యుత్ కొనుగోలు, విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై విచారణ జరిపేందుకు కమిషన్‌కు అర్హత ఉంది. ఎస్ఈఆర్సీ నిర్ణయాలతో విభేదించిన వాళ్లు ఎలక్ట్రిసిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకునే న్యాయపరమైన వెసులుబాటు ఉన్నా.. దానికి విస్తృత పరిధి లేదు. కొనుగోళ్లు భారామా? కాదా? లాంటి అంశాల జోలికి అది వెళ్లదు. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత పిటిషన్‌లో ఎలాంటి మెరిట్స్ లేవని భావిస్తున్నాం..' అని హైకోర్టు ధర్మాసనం తన తీర్పులో తెలిపింది. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలను తీర్పు కాపీలో పొందుపరిచింది.

కమిషన్ ఏర్పాటులో దాపరికం లేదు

'జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ నియామకమైన నాటి నుంచి ఇప్పటివరకు 15 మందికి పైగా సాక్షులను విచారించింది. ఇదే క్రమంలో కేసీఆర్‌ను కూడా కమిషన్ వివరాలు కోరింది. ఇది ప్రభుత్వం ఏర్పాటు చేసిన బహిరంగ కమిషన్. ఇందులో దాపరికం అంటూ ఏదీ లేదు. ప్రజలకు వివరాలు తెలిస్తే వచ్చే నష్టం కూడా లేదు. జస్టిస్ నరసింహారెడ్డి పక్షపాత ధోరణితో మాట్లాడారనడం అసంబద్ధం. 8బీ నోటీసులు ఇచ్చే అధికారం కమిషన్‌కు ఉంది..'అని ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదించారు.

విచారణ పూర్తి కాకుండానే మీడియాతో మాట్లాడారు

'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ), ఈఆర్సీతో పాటు కేంద్రం నుంచి అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పీపీఏలపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఒప్పందం చేసుకున్నాయి. అయితే కమిషన్ ఏర్పాటు నోటిఫికేషన్‌లో విచారణ ఎలా సాగాలో మార్గదర్శకాలు జారీ చేయడం చట్ట వ్యతిరేకం. చట్ట ప్రకారం కమిషన్ ఏర్పాటు చెల్లదు. విచారణ పూర్తి కాకుండానే జస్టిస్ నరసింహారెడ్డి మీడియా భేటీ నిర్వహించారు. గత ప్రభుత్వ నిర్ణయాలను తప్పు బడుతూ ఏకపక్షంగా వ్యాఖ్యలు చేశారు. యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్ ఏర్పాటుకు వినియోగించే సాంకేతికతతో ప్రభుత్వానికి రూ.250 కోట్లు నష్టం వస్తుందని ముందే తేల్చేశారు. కేసీఆర్ వ్యక్తిగత పరువుకు భంగం వాటిల్లేలా మీడియా భేటీలో వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయన ఇవ్వబోయే నివేదిక ఎలా ఉండనుందో తెలిసిపోతోంది. ఈ కారణాలతోనే ఆయనను ప్రతివాదిగా చేర్చాల్సి వచ్చింది..'అని కేసీఆర్ తరఫు న్యాయవాది ఆదిత్య సోంధీ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

చేసింది మేము.. చెప్పుకునేది మీరా?: మన్నె క్రిశాంక్




సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను సీఎం రేవంత్‌రెడ్డి తన ఘనతగా చెప్పుకుంటున్నారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. లోక్‌సభలో రాహుల్‌గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎన్నికవడాన్ని కూడా రేవంత్ తన ఘనతగా చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో క్రిశాంక్ సోమవారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు ఫాక్స్‌కాన్ సంస్థ పెట్టుబడులు రావడం, సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి కావడాన్ని రేవంత్ తన క్రెడిట్‌గా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని కంటోన్మెంట్ బోర్డులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాల్లో విలీనం చేసినా.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీనం చేయకపోవడాన్ని రేవంత్ తమ ఘనతగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చిన రేవంత్.. ప్రస్తుతం వాటిని కనీసం ప్రస్తావించడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని క్రిశాంక్ ప్రశ్నించారు.

కాంగ్రెస్ ఖాతాలోకి నల్లగొండ డీసీసీబీ పీఠం

చైర్మన్‌గా కుంభం ఏకగ్రీవ ఎన్నిక

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పీఠం కాంగ్రెస్ ఖాతాలో చేరింది. ఇదివరకే నల్లగొండ మున్సిపాలిటీతోపాటు పలు మున్సిపాలిటీల చైర్మన్ పదవులను అవిశ్వాసం ద్వారా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా, తాజాగా నల్లగొండ డీసీసీబీని దక్కించుకుంది. డీసీసీబీ చైర్మన్‌గా మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు 14 మంది అవిశ్వాసం పెట్టి నెగ్గించుకున్నారు. ఇక సోమవారం బ్యాంకులో నిర్వహించిన చైర్మన్ ఎన్నికకు బ్యాంకులోని 19 మంది డైరెక్టర్లలో 15 మంది హాజరుకావడంతో కోరం సంపూర్ణంగా ఉందని జిల్లా సహకార అధికారి (డీసీఓ) కిరణ్‌కుమార్ ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ షెడ్యూల్ ఉండగా.. శ్రీనివాస్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలుచేశారు. దీంతో 11 గంటల తర్వాత కుంభం శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీఓ ప్రకటించారు. అనంతరం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. తర్వాత చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్ చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. స్వయంగా శ్రీనివాస్‌రెడ్డిని చైర్మన్ సీట్లో కూర్చోబెట్టి అభినందించారు. అనంతరం పలువురు నేతలు శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు.

గురుకుల ఉద్యోగాల్లో గందరగోళం: వాసుదేవరెడ్డి



సాక్షి, హైదరాబాద్: గురుకుల ఉపాధ్యాయుల ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయని, స్పెషల్ కేటగిరీ ఉద్యోగాల్లో గందరగోళం నెలకొందని బీఆర్ఎస్ నేత, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 9,210 గురుకుల ఉపాధ్యాయుల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి రాత పరీక్ష కూడా నిర్వహించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫలితాలు ఇచ్చి నియామక పత్రాలతో హడావుడి చేశారని మండిపడ్డారు. వికలాంగుల కోటా కింద కొంత మందికి మాత్రమే నియామకపత్రాలు సీఎం చేతుల మీదుగా అందజేశారని తెలిపారు. ఆ కొంత మంది తమకు కేటాయించిన జిల్లాలో జాయిన్ అయ్యేందుకు వెళ్లగా ఉద్యోగ నియామకం రద్దు చేసినట్లు అధికారులు చెప్తున్నారన్నారు. స్పెషల్ కేటగిరీ కింద ఉద్యోగాలు పొందిన వారి సర్టిఫికెట్లు పరిశీలించిన తర్వాతే అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలని సూచించారు.

నా సభ్యత్వం గురించి బీజేపీకి ఎందుకు?

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



సాక్షి, హైదరాబాద్: తన శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఏ హోదాలో అడుగుతున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. అలాంటి డిమాండ్ చేస్తే కేసీఆర్, బీఆర్ఎస్ చేయాలని, బీజేపీకి ఎందుకని నిలదీశారు. సోమవారం సెక్రటేరియట్ మీడియా పాయింట్‌లో దానం విలేకరులతో మాట్లాడారు. తన శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ స్పీకర్‌కు మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పంపినట్లు తన దృష్టికి వచ్చిందని, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని చెప్పేందుకు ఇంతకంటే నిదర్శనమేంటని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంలో కూడా ఇది రుజువైందని, రెండు పార్టీలు సహకరించుకుని బీఆర్ఎస్ ఓట్లన్నీ బీజేపీకి డైవర్ట్ చేశారని దానం ఆరోపించారు.

రూ.30 కోట్లు ఇస్తామన్నారు

ఎమ్మెల్సీ బరి నుంచి తప్పుకోవాలని ప్రలోభపెట్టారు: ఎమ్మెల్సీ నవీన్



ఆమనగల్లు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి తప్పుకోవడానికి కాంగ్రెస్ నేతలు తనకు ఆశ చూపారని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందుకోసం తనకు రూ.30 కోట్లు, కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని చెప్పినట్లుగా వెల్లడించారు. అయినప్పటికీ తాను బరిలో ఉన్నానని, తనపై నమ్మకంతో గెలిపించిన పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులకు జీవితాంతం రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో లేకపోయినా తనను గెలిపించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని, ప్రజా సమస్యలపై శాసన మండలిలో పోరాడతానని చెప్పారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూములు అమ్మేస్తారు

- రూ.30 వేల కోట్ల విలువైన భూములు అమ్మేందుకు రంగం సిద్ధం
- కాంగ్రెస్‌పై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రూ.30వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూముల అమ్మకానికి రంగం సిద్ధం చేశారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం రెండు భయంకరమైన ఆర్డినెన్స్‌లు తీసుకురాబోతుందని చెప్పారు. అందులో ఒకటి టీజీఐఐసీ ద్వారా అభివృద్ధి పేరిట ప్రభుత్వ భూములు తీసుకోవడం..దీనిపై తనకు సమాచారం ఉందని తెలిపారు. భావితరాల అవసరాల కోసం ఉన్న భూములు, ఆస్తులు అమ్ముకుంటే రానున్న రోజుల్లో పార్కులకు స్థలం కూడా దొరకదన్నారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాలులో బీజేపీ ఎమ్మెల్యే రామారావుపాటిల్‌తో కలిసి మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కోకాపేటలో రూ.4వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల వేలంపై గగ్గోలు పెట్టారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలు జేబులు నింపుకొనేందుకు కొత్త చట్టాలు తెస్తున్నారని ఆరోపించారు. తాను పౌరసరఫరాల అధికారులపై చేసిన ఆరోపణలకు ఆ శాఖమంత్రి ఉత్తమ్ స్పందించలేదన్నారు. ఈ మంత్రికే చెందిన మరోశాఖ అయిన ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో జరిగే అవినీతిపై అన్ని ఆధారాలు బయట పెడతానని చెప్పారు. త్వరలోనే కాళేశ్వరంపై మీడియాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో సీఎం తాకట్టు పెట్టారని, పాలనను గాలికి వదిలేసి ఢిల్లీ గల్లీలో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీ నుంచి రాగానే ఓ ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభానికి సీఎం వెళ్లారన్నారు. గాంధీ ఆస్పత్రి దగ్గర దీక్ష చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నేతలకు మద్దతుగా ఆస్పత్రికి వెళ్లిన బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో మహేశ్వర్‌రెడ్డి వారిని పరామర్శించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై 90 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై 90 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు వలసలు పోతే, వారి ఇళ్ల ముందు చావుడప్పు కొట్టాలని గతంలో రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్న సీఎం రేవంత్ ఇంటి ముందు ఏ డప్పు కొట్టాలని ప్రశ్నించారు. దానం నాగేందర్‌పై స్పీకర్‌కు అనర్హత పిటిషన్ అందచేద్దామంటే ఆయన అందుబాటులో లేకుండా తప్పించుకుంటున్నారన్నారు. సోమవారం అసెంబ్లీలో వినతిపత్రం సమర్పించేందుకు స్పీకర్ కార్యాలయానికి ఎమ్మెల్యే రామారావు పాటిల్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, పార్టీ లీగల్‌సెల్‌నేత ఆంథోనిరెడ్డి వెళ్లగా... స్పీకర్ అందుబాటులో లేరని మహేశ్వర్‌రెడ్డి మీడియాకు చెప్పారు.



ఒక్క క్షణమైనా శాంతి, నెమ్మదితనం లేకుండా కీర్తి, ధనం కోసం జీవితమంతా బాధాకరంగా ప్రయత్నించడం మూర్ఖత్వం.

– యోషిదా కెంకో

సాక్షి

మంగళవారం, 2 జూలై 2024

భారీ విజయం... భావి ప్రయాణం...

శనివారం రాత్రి పొద్దుపోయాక... అద్భుతమే జరిగింది. గతంలో అనేకసార్లు ఊరించి ఉసూరుమనిపించినట్టే ఈసారీ ఫలితం అటూ ఇటూగా ఉంటుందేమోనని భయపడుతున్న క్రీడాభిమానుల సందేహాలు తుదిఘట్టంలో పటాపంచలయ్యాయి. పదిహేడేళ్ళ సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. భారత క్రికెట్ జట్టు విజయపతాకం ఎగరేసింది. పొట్టి క్రికెట్ విధానంలో తొలి ప్రపంచ కప్‌ను 2007లో గెలిచిన భారత జట్టు... మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత తొమ్మిదో ప్రపంచ కప్‌ను అందుకుంది. మరెక్కడా లేనంత భారీగా, హంగులూ ఆర్భాటాలతో ఆకర్షణీయంగా, అత్యంత సంపన్నంగా టీ20 లీగ్‌ను జరిపే భారత్ మరోసారి ఆ ఫార్మట్‌లో జగజ్జేతగా నిలిచింది. జూన్ 29న వెస్టిండీస్‌లోని బార్బడోస్‌లో ఆఖరు దాకా ఉత్కంఠగా సాగిన ఐసీసీ టీ20 వరల్డ్ కప్ – 2024 ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై 7 పరుగుల తేడాతో భారత జట్టు సాధించిన విజయం చిరకాలం గుర్తుండిపోతుంది. అమెరికా, వెస్టిండీస్‌లు సంయుక్తంగా ఆతిథ్యమివ్వగా, న్యూయార్క్‌లో కొత్తగా వెలసిన స్టేడియమ్ మొదలు వివిధ కరేబియన్ దీవుల్లో సాగిన ఈ వరల్డ్ కప్ కొత్త ఉత్తేజం తెచ్చింది. చివరకు కప్ గెలుపుతో కోచ్‌గా ద్రావిడ్‌కూ, టీ20ల నుంచి రోహిత్ శర్మ, కోహ్లీ, రవీంద్ర జడేజాలకూ తీయటి వీడ్కోలు దక్కింది.

గతంలో ఎన్నో విజయాలు సాధించినా... ఫార్మట్ ఏదైనప్పటికీ ప్రపంచ కప్ విజేతగా నిలవడమనేది ఎప్పుడూ ప్రత్యేకమే. 1983లో తొలిసారిగా కపిల్‌దేవ్ సారథ్యంలోని భారత జట్టు వన్డేలలో వరల్డ్ కప్ సాధించినప్పటి నుంచి సామాన్య ప్రజానీకంలో సైతం క్రికెట్ పట్ల, ప్రపంచ కప్ పట్ల పెరిగిన ఆకర్షణ అంతా ఇంతా కాదు. ఆ తర్వాత 20 ఓవర్ల పొట్టి క్రికెట్ వచ్చాక, 2007లో మహేంద్ర సింగ్ ధోనీ సేన తొలి టీ20 వరల్డ్ కప్ మనం దక్కించుకోవడంతో ఇక ఆకాశమే హద్దయింది. 2011లో మరోసారి వన్డేల్లో వరల్డ్ కప్ కైవసం చేసుకున్నాం. లెక్కలు తీస్తే... మనం టీ20 వరల్డ్ కప్ గెలిచి 17 ఏళ్ళయితే, అసలు ఏదో ఒక ఫార్మట్‌లో ప్రపంచ కప్ గెలిచి 13 ఏళ్ళవుతోంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిర్వహించే ఏదో ఒక టోర్నీలో విజేతగా నిలిచి, స్వదేశానికి ట్రోఫీ పట్టుకొచ్చి కూడా కనీసం 11 ఏళ్ళవుతోంది. 2013లో ఇంగ్లండ్‌లో 'ఛాంపియన్స్ ట్రోఫీ' తర్వాత ఐసీసీ పోటీల్లో మనకు మళ్ళీ ట్రోఫీలు దక్కలేదు. ఇన్నాళ్ళకు ఆ కొరత తీరింది.

కొన్నేళ్ళుగా విజయావకాశాలు పుష్కలంగా ఉన్న ఫేవరెట్‌గా భారత క్రికెట్ జట్టు రకరకాల టోర్నీలలో బరిలోకి దిగుతోంది. కానీ, ప్రతిసారీ ఏదో ఒక దశలో విఫలమవుతోంది. కోచ్ ద్రావిడ్, కెప్టెన్ రోహిత్‌ల జోడీ సంగతికే వస్తే, 'వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్స్'లో జట్టును ఫైనల్ దాకా తీసుకెళ్ళినా ఫలితం దక్కలేదు. చివరకు ఏడు నెలల క్రితం గత నవంబర్‌లో జరిగిన 2023 వన్డే వరల్డ్ కప్‌లోనూ మంచి ఫామ్‌లో ఉన్న భారత జట్టు ఆఖరి ఘట్టంలో అహ్మదాబాద్‌లో తడబడింది. ఆ రెండుసార్లూ ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ఈ తాజా టీ20 వరల్డ్ కప్‌లో సైతం మొదటి నుంచి ఓటమి ఎరుగకుండా దూసుకువచ్చిన మన జట్టు శనివారం నాటి ఫైనల్‌లో ఒక దశలో ఓటమి అంచుల దాకా వెళ్ళిపోయింది. ప్రత్యర్థి సౌతాఫ్రికా జట్టు 30 బంతుల్లో 30 పరుగులే చేయాలి. పైగా 6 వికెట్లున్నాయి. ఆ పరిస్థితుల్లో బుమ్రా కట్టుదిట్టమైన బౌలింగ్, ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా తెలివైన ఆటతీరు, బౌండరీ దాటుతున్న బంతిని అద్భుతంగా ఒడిసి పట్టుకొని ప్రత్యర్థి బ్యాట్స్‌మన్‌ను అవుట్ చేసిన సూర్యకుమార్ యాదవ్ ఫీల్డింగ్ మ్యాచ్ దిశను మార్చేశాయి.

ఎట్టకేలకు సమష్టి స్ఫూర్తితో ఓటమి కోరల నుంచి కూడా విజయాన్ని అందుకొనే కళలో భారత్ ఆరితేరింది. జట్టు అవసరాలకు తగ్గట్టు భిన్నమైన ఆట శైలిని ఆటగాళ్ళు అవలంబించడం నేర్చుకున్నారు. పోయిన పాత ఫామ్‌ను మళ్ళీ అత్యావసరమైన ఫైనల్‌లో అందుకొని, అవతల వికెట్లు పడిపోతున్నా తడబడకుండా పిచ్ వద్ద పాతుకుపోయి, కోహ్లీ 76 పరుగులు చేసిన తీరు అందుకు మచ్చుతునక. రోహిత్ శర్మ సారథ్యం, అక్సర్ పటేల్ లాంటి ఆల్‌రౌండర్ల ప్రదర్శన, కీలకమైన ఫైనల్‌లో ప్రమాదకరంగా మారిన క్లాసెన్, డేవిడ్ మిల్లర్ లాంటి బ్యాట్స్‌మన్లను ఔట్ చేసిన యువ సీమర్ అర్షదీప్ సింగ్ పరిణతి... ఇలా అన్నీ కలిస్తేనే ఈ ప్రపంచ విజేత పట్టం. దేశంలోనే అత్యంత ప్రీతిపాత్రమైన ఆట... అందులోనూ వరల్డ్‌కప్ విజయం... అర్ధరాత్రి దాటినా సరే దేశమంతటా జనం వీధుల్లోకి వచ్చి మరీ ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకొన్నది అందుకే! మన దేశంలోనే కాదు... దేశదేశాల్లో పెరుగుతున్న భారత క్రికెట్ క్రీడాభిమానులకూ ఇది పండుగ వాతావరణం తెచ్చింది.

ఒక్కమాటలో, మన దేశం ఇప్పుడు క్రికెట్ సూపర్‌పవర్. ఒకప్పుడు 1970లు – 80లలో బలమైన బ్యాటింగ్, బౌలింగ్ సేనతో వీరవిహారం చేసిన వెస్టిండీస్ జట్టుతో ఇప్పుడు భారత్ ఆటగాళ్ళను విశ్లేషకులు పోలుస్తున్నారంటే ఆశ్చర్యం లేదు. మరి ఇక్కడ నుంచి మన క్రికెట్ ప్రయాణం ఎలా ముందుకు సాగనుందన్నది ఇక కీలకం. కోచ్ ద్రావిడ్ మొదలు కీలక ఆటగాళ్ళ దాకా పలువురి రిటైర్మెంట్‌తో ఒక శకం ముగిసింది. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్ళపై గతంలో పెట్టుబడి పెడితేనే ఇప్పుడీ ఫలితాలు వచ్చాయని మర్చిపోరాదు. భవిష్యత్తే లక్ష్యంగా జట్టుకు కొత్త రక్తాన్ని ఎక్కించాలి. కొత్తగా కోచ్ బాధ్యతలు చేపట్టనున్న గౌతమ్ గంభీర్ ఖాళీ అవుతున్న కీలక స్థానాల భర్తీపై దృష్టి పెట్టాలి. మ్యాచ్‌లు ఆడకున్నా ఈ వరల్డ్‌కప్ జట్టులో భాగమైన యశస్వీ జైస్వాల్ సహా పలువురు ప్రతిభావంతుల్ని ఏరి, ఇకపై మరింత సానబెట్టాలి. కొద్ది నెలల్లోనే 2025లో పాకిస్తాన్‌లో జరిగే ఛాంపియన్స్‌ట్రోఫీ నాటికి సర్వసన్నద్ధం కావాలి. ఆ పునర్నిర్మాణానికి తాజా విజయం ఓ బలమైన పునాది.

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు : జ్యేష్ఠ మాసం ; **తిథి:** బ.ఏకాదశి ఉ.8.57 వరకు, తదుపరి ద్వాదశి ; **నక్షత్రం:** భరణి ఉ.6.18 వరకు, తదుపరి కృత్తిక తె.4.58 వరకు (తెల్లవారితే బుధవారం) ; **వర్జ్యం:** సా.5.49 నుండి 7.20 వరకు ; **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 9.01 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.40 వరకు ; **అమృత ఘడియలు:** రా.3.02 నుండి 4.33 వరకు ;

సూర్యోదయం : 5.33
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వ్యక్తిగత స్వేచ్ఛే... సుప్రీమ్!

విశ్లేషణ



ఉత్కర్ష్ ఆనంద్

భారత సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పులు వ్యక్తిగత స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని తేల్చి చెప్పాయి. పీఎమ్ఎల్‌ఏ, ఉపా వంటి చట్టాల అమలులో వ్యక్తమవుతున్న ఆందోళనల వెలుగులో ప్రాథమిక హక్కుల రక్షణ, సరైన చట్ట ప్రక్రియ ఆవశ్యకతను ఇవి నొక్కిచెప్పాయి. అరెస్టు చేయడానికి గల కారణాలను తెలియపర్చడం కీలకమైన రాజ్యాంగ భద్రత అని న్యాయస్థానం స్పష్టం చేసింది. 'న్యూస్ క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టును రద్దు చేస్తూనే, విధానపరమైన న్యాయ ప్రాముఖ్యాన్నీ, ఉపా కింద అరెస్టు చేయడానికి గల కారణాలను తెలియజేసే హక్కునూ ఎత్తిపట్టింది. ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నప్పుడు రాజ్యాంగ హక్కులకు మినహాయింపు ఉండదని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

భారత సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పులు... మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎమ్ఎల్‌ఏ), చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యూఏపీఏ– ఉపా) వంటి కఠినమైన చట్టాల అమలు సందర్భంగా వ్యక్తిగత స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని గట్టిగా నొక్కి వక్కాణించాయి. ఆర్థిక నేరాలను, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి రూపొందించిన ఈ చట్టాలు ఎలా వ్యవహరిస్తున్నాయి అనే విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు గణనీయమైన మార్పు తీసుకొచ్చాయి. చట్టాన్ని అమలు చేయడం, వ్యక్తిగత స్వేచ్ఛల మధ్య ప్రమాణాలను సమతుల్యం చేయడంలో సుప్రీంకోర్టు నిబద్ధతను తెలియజేసేలా, మే నెలలో వారంలోపు వ్యవధిలో ఈ తీర్పులు వెలువడ్డాయి. న్యాయబద్ధత, నిర్బంధంలోకి తీసుకునే అధికారాలను ఉపయోగించడంపై వ్యక్తమవుతున్న తీవ్రమైన ఆందోళనల వెలుగులో ప్రాథమిక హక్కుల రక్షణ, సరైన చట్ట ప్రక్రియ ఆవశ్యకతను ఇవి నొక్కిచెప్పాయి.

పీఎమ్ఎల్‌ఏ కింద దాఖలు చేసిన చార్జిషీట్‌పై ప్రత్యేక న్యాయస్థానం విచారణ చేపట్టిన తర్వాత మే 16న వెలువరించిన కీలకమైన తీర్పులో, వ్యక్తులను అరెస్టు చేసే విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి ఉన్న అధికారాన్ని అత్యున్నత న్యాయస్థానం కుదించింది. న్యాయస్థానం విచారణ చేపట్టిన తర్వాత, ఫిర్యాదులో పేర్కొన్న నిందితులను ఈడీ అరెస్టు చేయలేదని న్యాయమూర్తులు ఏఎస్ ఓకా, ఉజ్జల్ భుయాన్ ప్రకటించారు. విచారణ సమయంలో అరెస్టు చేయని నిందితులకు వారెంటుకు బదులుగా ప్రత్యేక కోర్టులు సమన్లు జారీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశం ఏకపక్ష నిర్బంధాలను నిరోధిస్తుంది. కోర్టుకు హాజరయ్యే వారిని మనీ లాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం కఠినమైన బెయిల్ ప్రక్రియలోకి నెట్టకుండా హామీనిస్తుంది. నిందితుడి బెయిల్ దరఖాస్తును వ్యతిరేకించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అవకాశం ఇవ్వాలని సెక్షన్ 45 నిర్దేశిస్తుంది. అంతేకాకుండా, నిందితుడు నిర్దోషి అనీ, బెయిల్‌పై ఉన్నప్పుడు ఎలాంటి నేరం చేసే అవకాశం లేదనీ విశ్వసించడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయని ట్రయల్ కోర్టుకు నమ్మకం కలిగించడం అవసరం. ఈ పరిస్థితులు సాధారణంగా మనీ లాండరింగ్ కేసులో నిందితుడు బెయిల్ పొందడాన్ని సవాలుగా మారుస్తాయి. సమన్లు పంపిన తర్వాత హాజరయ్యే నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరినట్లయితే, అది సంబంధిత ట్రయల్ కోర్టుకు దరఖాస్తు చేసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. నేరాన్ని గుర్తించిన తర్వాత ఈడీ చేసే అరెస్ట్ అధికారాలను పరిమితం చేయడం ద్వారా, కోర్టు సమన్లను పాటించిన నిందితుడిని కస్టడీలోకి తీసుకుని, అయోమయం కలిగించే, కఠినమైన పీఎంఎల్‌ఏ బెయిల్ ప్రక్రియలో జరిగే దుర్వినియోగాలను పరిష్కరించడం ఈ తీర్పు లక్ష్యం.

అదేవిధంగా, ఈడీ అరెస్టులు చేసే ముందు నేరాలను అంచనా వేయవలసిన అవసరాన్ని మే 17న సుప్రీంకోర్టు చేసిన న్యాయపరమైన ఉత్తర్వు నొక్కి చెప్పింది. పీఎమ్ఎల్‌ఏ కింద నమోదయ్యే నేరాలు 'పరాన్నజీవి' స్వభావంతో కూడి ఉన్నాయనీ, ముందస్తు నేరాల ఉనికి అవసరమనీ ఆ తీర్పు నొక్కి చెప్పింది. ముందస్తు నేరం లేకుండా, పీఎంఎల్‌ఏ ఆరోపణలు స్వతంత్రంగా నిలబడలేవని న్యాయమూర్తులు సూర్యకాంత్, కేవీ విశ్వనాథన్ నొక్కి చెప్పారు. ముందస్తు నేరంలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది నిందితుల పేర్లు లేకపోయినా, ఒక కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలను విచారించే ముందుగా ఈడీ ఆ కేసులో అంతర్లీనంగా ఉండే ముందస్తు నేరాలను క్షుణ్ణంగా నిర్ధారించాలని పేర్కొంది. ఆర్థిక నేర పరిశోధనల్లో బలమైన చట్టపరమైన ఆధారం అవసరమని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది.



ఈ దృక్పథం ఆర్థిక నేర పరిశోధనలలో బలమైన చట్టపరమైన పునాది అవసరాన్ని బలపరిచింది, పవన దిబ్బూర్ కేసులో సుప్రీం కోర్టు 2023 నవంబర్‌లో ఇచ్చిన తీర్పు హేతుబద్ధతను ఇది ముందుకు తీసుకువెళ్లింది. 2023లో కోర్టు నిర్ణయం ప్రకారం, భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 120బి కింద శిక్షార్హమైన నేరపూరిత కుట్ర, మనీ లాండరింగ్ దర్యాప్తును ప్రారంభించినంత మాత్రమే అది నేరం కాకూడదు. ఆ కుట్ర పీఎమ్ఎల్‌ఏ కింద తప్పనిసరిగా షెడ్యూల్ చేసిన నేరంగా నమోదు చేసిన నేరానికి సంబంధించినదై ఉండాలి.

మే 15న సుప్రీంకోర్టు తీసుకున్న మరో ముఖ్యమైన నిర్ణయం 'న్యూస్ క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టును రద్దు చేస్తూనే, విధానపరమైన న్యాయ ప్రాముఖ్యతను, ఉపా కింద అరెస్టు చేయడానికి గల కారణాలను తెలియజేసే హక్కును ఎత్తిపట్టింది. ఢిల్లీ పోలీసుల విధానపరమైన లోపాలను న్యాయమూర్తులు బీఆర్ గవయీ, సందీప్ మెహతా విమర్శించారు. ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్టుకు గల కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాలని చెబుతున్న రాజ్యాంగ ఆదేశాన్ని నొక్కిచెప్పారు.

భారతదేశ స్థిరత్వం, సమగ్రతకు భంగం కలిగించే ఉద్దేశ్యంతో చైనా సంస్థల ద్వారా విదేశీ నిధులను స్వీకరించిన ఆరోపణలపై 2023 అక్టోబర్‌లో పుర్కాయస్థను అరెస్టు చేసిన తరువాత ఉపా కింద పోలీసు కస్టడీకి పంపిన తీరుపై సుప్రీంకోర్టు తీర్పు తీవ్రంగా విమర్శించింది. ఆయన అరెస్టు, రిమాండ్‌ను 'రహస్యంగా' నిర్వహించారని కోర్టు పేర్కొంది. 'ఇది చట్టబద్ధమైన ప్రక్రియను తప్పించుకునే కఠోరమైన ప్రయత్నం తప్ప మరొకటి కాదు; నిందితుడిని అరెస్టు చేసిన కారణాలను తెలియజేయకుండా పోలీసు కస్టడీకి పరిమితం చేశారు. న్యాయవాదుల సేవలను పొందే అవకాశాన్ని నిందితుడికి హరించారు. బెయిల్ కోరడం అనేది నిందితుడి ఎంపిక' అని కోర్టు పేర్కొంది. ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నప్పుడు రాజ్యాంగ హక్కులకు మినహాయింపు ఉండదని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, మనీ లాండరింగ్ చట్టం, ఉపా చట్టం రెండింటిలోనూ అరెస్టుకు గల కారణాలను నిందితులకు రాతపూర్వకంగా తెలియజేయాలని కోరడమైనదనీ, ఈ అవసరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1)లో వేళ్లూనుకుని ఉందనీ కోర్టు పేర్కొంది. ఇది తమను ఎందుకు అదుపులోకి తీసుకున్నారనే అంశంపై ప్రజల హక్కును పరిరక్షిస్తుంది. పంకజ్ బన్సాల్ కేసులో 2023 అక్టోబరు 3 నాటి తీర్పులో ఉపా కేసులకు వర్తించదంటూ ఢిల్లీ పోలీసుల వాదనకు ప్రతిస్పందనగా న్యాయస్థానం ఈవిధంగా ప్రకటించింది. దీని ప్రకారం నిందితులను అరెస్టు చేసేటప్పుడు ఈడీ పత్రబద్ధమైన ఆధారాలను అందించాలి. అరెస్టు చేయడానికి గల కారణాలను తెలియపర్చడం అనేది కీలకమైన రాజ్యాంగ భద్రత అనీ, పారదర్శకతను, న్యాయాన్ని నిర్ధారించడానికి ఏకరీతిగా దీనిని వర్తింపజేయాలని న్యాయస్థానం నొక్కి చెప్పింది. చట్టాలను అమలు చేసే సంస్థలకు విస్తృతమైన అధికారాలను కల్పించే విధానాలలోని పారదర్శకత, న్యాయమైన ఆవశ్యకతను ఈ తీర్పు పునరుద్ఘాటించింది.

వ్యక్తిగత స్వేచ్ఛను రక్షించడానికి, చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు తగిన ప్రక్రియకు, న్యాయానికి కట్టుబడి ఉండేలా చేయడంలో సుప్రీంకోర్టు నిబద్ధతను ఈ తీర్పులు సమష్టిగా సూచిస్తాయి. ఈ నిర్ణయాలు చట్ట నియమాన్ని పటిష్ఠం చేస్తాయి. ఈడీ వంటి ఏజెన్సీలు వ్యక్తిగత స్వేచ్ఛలను గౌరవిస్తూ చట్టపరమైన సరిహద్దుల్లో పని చేసేలా చూస్తాయి. ఈ విధానం ప్రజల హక్కులను పరిరక్షిస్తుంది. ఉగ్రవాదం, ఆర్థిక నేరాలను ఎదుర్కోవడంలో కీలకమైన విధులను అందించే చట్టాల అమలు సంస్థల విశ్వసనీయతను, జవాబుదారీతనాన్ని ఏకకాలంలో ఇది పెంచుతుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



నీటికి కరువా?

భారత నగరాల్లో ఎందుకు వాననీటి సంరక్షణ జరగడం లేదు? నీటి కరవు రావడానికి కారణమే లేదు. మన పూర్వీకులు దీన్ని బావులు, మెట్ల బావులు, కాలువలు, సొరంగాల రూపంలో చేశారు. ఇప్పుడు భూమిలోకి నీరు ఇంకిపోలేనంతగా కాంక్రీట్‌మయం అయింది. ఓ వైపు వానాకాలంలో వరదలు ముంచెత్తుతుంటే, మరోవైపు భూగర్భ జలాలకు కొరత ఉంటోంది. సమాజం, ప్రభుత్వంలోని అన్ని స్థాయుల్లో మూర్ఖత్వం అనేది అంటువ్యాధిలా వ్యాపించివుంది.

– రిచా చడ్డా, నటి



అన్నీ అవసరమా?

ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ప్రతిదాని గురించీ గట్టి అభిప్రాయాలు ఉంచుకోవడం మానుకోండి. తెలివైనవాళ్లు చాలా విషయాలను పట్టనట్టు ఉండి, కొన్నింటిమీదే దృష్టి పెడతారు.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్



అదా నిరసన?

ఫ్రాన్స్ తొలి రౌండ్ ఎన్నికలకు ముందు ఫార్ – రైట్‌కు వ్యతిరేకంగా ఫెమినిస్టులు కొందరు ఐఫిల్ టవర్ దగ్గర 'టాప్ లెస్' నిరసన జరిపారని వార్త. ఒక విషయాన్ని నొక్కి చెప్పడానికి బట్టలు తీసేయడం అనేది, రాడికల్ ఫెమినిజం స్త్రీలను నవ్వులాటగా ఎలా మార్చుతున్నదో చెప్పడానికి సరైన ఉదాహరణ.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్



ఒబామా ఎటు?

ఒక అసాధారణమైన మంచి సోర్సు నుంచి: జో బైడెన్‌కు మద్దతిస్తున్నట్టుగా ఒబామా చేసిన ట్వీట్ హృదయపూర్వకమైనది కాదు. ప్రైవేటుగా బైడెన్ గెలవలేరని ఒబామా చెబుతున్నారు. ఒబామాలు, బైడెన్ల సంబంధాలు ఎప్పుడూ బాగాలేవు. ముఖ్యంగా జిల్ బైడెన్ (అమెరికా తొలి మహిళ) వల్ల అవి ఇటీవల మరింతగా క్షీణించాయి.

– టకర్ కార్ల్‌సన్, జర్నలిస్ట్



తుది బహుమతి

మా నాన్న ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించిన తర్వాత, ఆయనకు నిజంగా కొన్ని కష్టాలు తప్పాయి. వేదన నుంచి, ప్రపంచ ఆందోళనల నుంచి కొందరికి మరణమే సాంత్వన. మరణం అనేది ప్రతి ఒక్కరికీ అందాల్సిన బహుమానం.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత



విమోచన

1517 నుంచి 1917 వరకు ఒట్టొమాన్లు ఇజ్రాయెల్ నేలను ఆక్రమించి వలస రాజ్యంగా మార్చుకున్నారు. వాళ్ల నుంచి దాన్ని బ్రిటిష్‌వాళ్లు తీసుకున్నారు. 1948లో యూదులు తమ పూర్వీకుల నేలను వలసవాదం నుంచి తప్పించి విమోచన కల్పించారు.

– ఉజయ్ బులూత్, టర్కీ జర్నలిస్ట్




వినాల్సిందే!

మంచి వార్త ఏమిటంటే, ఎట్టకేలకు పదేళ్ల తర్వాత ప్రతిపక్షాల గొంతును విస్మరించలేని పార్లమెంట్ మనకు ఏర్పడింది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

నైపుణ్యాభివృద్ధి ఫలించేందుకు సవాళ్లెన్నో...

అభిప్రాయం



డా. టి. సంపత్ కుమార్

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ఒక విప్లవాత్మకమైన యోజనను ప్రకటించింది. రాష్ట్రంలోని ఐటీఐల (పారిశ్రామిక శిక్షణ సంస్థలు)ను క్రమేణా అధునాతన సాంకేతిక కేంద్రాలు (అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్స్ – ఏటీసీలు)గా రూపాంతరం చేస్తూ మార్కెట్ అవసరాలకి మానవ వనరులని తయారుచేస్తామని వెల్లడించింది. ఈ రంగంలో పనిచేసేవారికి ఇదొక తియ్యని వార్త. నిరుద్యోగులకు మంచి ఉద్యోగాలు దొరుకుతాయి. పారిశ్రామిక రంగానికి ఉన్నత స్థాయి ప్రమాణాలతో మానవ వనరులు అందుబాటులోకి వస్తాయన్న ఆశ ముఖ్యమంత్రి ప్రసంగం విన్నవారికి కలుగుతోంది. అంతా అనుకున్నట్టు జరిగితే వచ్చే సంవత్సరాల్లో బంగారు తెలంగాణ ఆవిష్కృతమౌతుంది!

సాంకేతిక రంగంలో నైపుణ్యాభివృద్ధి అనేది కొత్త అంశమేమీ కాదు. మన దేశంలో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లూ దశాబ్దాల నుండి పనిచేశాయి, చేస్తూనే ఉన్నాయి. తెలంగాణలో ప్రస్తుతం 65 ప్రభుత్వ ఐటీఐలు, 255 ప్రైవేట్ ఐటీఐలు శిక్షణనిస్తున్నాయి. ప్రకటించిన యోజన ప్రకారంగా 65 ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలు మార్చుతూ వచ్చే పదేళ్ళలో వివిధ విషయాల్లో సాంకేతిక నైపుణ్యతను సాధించిన నాలుగు లక్షల నిపుణలను తయారు చేయాలన్నది లక్ష్యం. ఈ లక్ష్యాల్ని నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం 'టాటా టెక్నాలజీస్ లిమిటెడ్' సంస్థతో పదేళ్ల ఒప్పందం చేసుకొంది. వీరు స్వల్ప, దీర్ఘ కాలిక శిక్షణా కార్యక్రమాలతో ప్రతి ఏటా 30 వేలకు పైగా యువతను నిపుణులుగా తయారుచేసి పారిశ్రామిక రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి పొందేలా చేస్తారు. అలాగే విదేశాలకు వెళ్లి బతకడానికి సంసిద్ధుల్ని చేస్తారు.

శిక్షణను కేవలం పుస్తక, అనుభవ సిలబస్సులకే పరిమితం చేయకుండా దాని చుట్టూతా ఆవరించి ఉన్న జీవకళలను కూడా జోడించాలి. ఈ క్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతీయ అవసరాలను తప్పక దృష్టిలో పెట్టుకోవాలి. జిల్లాలవారీగా ఈ అవసరాలను క్షుణ్ణంగా తెలుసుకొని ఆ యా ప్రాంతాల్లో ఉన్న ఏటీసీలు కోర్సుల్ని రూపొందించాలి. ఉదాహరణకు తెలంగాణలోని కొన్ని జిల్లాల నుండి గల్ఫ్ దేశాలకు పెద్ద సంఖ్యలో వలస వెళతారు. ముఖ్యమంత్రి చెప్పినట్టుగా గల్ఫ్ దేశాల అవసరాలకు అనుకూలంగా నైపుణ్యాభివృద్ధి జోడైతే వలసదారులకు మంచి ఉద్యోగాలు దొరుకుతాయి. గల్ఫ్ దేశాలకు వెళ్ళేవారే కాకుండా, తిరిగివచ్చిన వారికి సైతం స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలు తక్షణమే అందుబాటులో ఉండాలి. వీరు మాతృదేశానికి వచ్చి స్థిరపడిపోవాలనుకొంటారు. గల్ఫ్ దేశాల్లో చేసిన పని, అనుభవం తిరిగివచ్చినవారి ఊళ్లలో పనికిరాకపోతే వారిలో నిరుత్సాహం మొదలై మళ్ళీ వలసపోవాలనే ఆలోచనలతో సతమతమౌతారు.



జెండర్ వివక్ష ఎక్కువ ఉన్న మన సమాజంలో సమతుల్యం తేవడానికి అమ్మాయిలు సంప్రదాయేతర కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలి. జనవరి 2001లో భుజ్ (గుజరాత్) లో భయంకర భూకంపం వచ్చాక పునరావాసానికి వేల సంఖ్యలో ఇళ్లను కట్టడానికి తీవ్రమైన మేస్త్రీల కొరత ఏర్పడింది. అహమ్మదాబాద్‌కు చెందిన సెల్ఫ్ ఎంప్లాయిడ్ విమెన్స్ అసోసియేషన్ వారు గ్రామీణ మహిళలకు నిర్మాణరంగంలో శిక్షణనిచ్చి పునరావాస కార్యక్రమాలను వేగంగా అమలుపరచడంలో చేయూతనిచ్చారు. నిర్మాణ రంగంలో ఎప్పుడూ మానవవనరుల కొరత ఉంటుంది. మహిళలు కేవలం అల్పస్థాయి పనులకే పరిమితమౌతున్నారు. ఇప్పుడు ఐటీఐల ప్రక్షాళన మొదలవుతుంది కాబట్టి పెద్దయెత్తున ప్రయత్నాలు చేపట్టి మహిళలకు సాంకేతిక రంగంలో సముచిత స్థానం కల్పించాలి.

1980వ దశాబ్దంలో భారత ప్రభుత్వం 'కౌన్సిల్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రూరల్ టెక్నాలజీస్'(సీఏఆర్‌టీ– కార్ట్) అనే సంస్థని ఢిల్లీలో స్థాపించింది. రెండున్నర సంవత్సరాల తరువాత ఈ సంస్థను 25 ఏళ్లుగా పనిచేస్తున్న మరో సంస్థ, 'పీపుల్స్ ఆక్షన్ ఫర్ డెవలప్మెంట్ ఇండియా' (పీఏడీఐ)తో విలీనం చేసింది. రెండు పేర్లలో ఉన్న మూలసూత్రాలను కలుపుకొని 'కౌన్సిల్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ పీపుల్స్ ఆక్షన్ అండ్ రూరల్ టెక్నాలజీస్'– కపార్ట్ పేరుతో దేశమంతా ఎన్జీవోలకి ఆర్థిక సహాయన్నందిస్తూ చాలా సంవత్సరాలు పనిచేసింది (వ్యాస రచయిత ఈ సంస్థలో ఆరు సంవత్సరాలు పనిచేశారు). ఈ రెండు సంస్థలూ గ్రామీణాభివృద్ధి విభాగం (వ్యవసాయ మంత్రిత్వ శాఖ) కింద పనిచేసేవి. అప్పుడు కపార్ట్ ఒక వినూత్న ప్రయోగాన్ని– 'రీజినల్ రిసోర్స్ సెంటర్స్ ఫర్ రూరల్ టెక్నాలజీస్' (ఆర్ఆర్‌సీఆర్‌టీ) ఆరంభించింది. కపార్ట్ స్వచ్ఛందసేవా సంస్థలకు ఆర్థిక సహాయంచేసే సంస్థ కాబట్టి ఉన్నత శ్రేణి ఎన్జీవోలకు ఇది గొప్ప అవకాశంగా అందుబాటులోకి వచ్చింది. ఎన్నో పేరున్న సంస్థలు ఏళ్లనుండి గ్రామీణాభివృద్ధికి అంకితమై యువతకి ఉపాధి కోసం శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్ని జరుపుకున్నాయి. ఈ యోజన ద్వారా పలు సంస్థలకి పెద్ద మొత్తాల్లో 3–5 సంవత్సరాల ప్రాజెక్టులను ఇచ్చారు. లబ్ధి పొందిన ఈ సంస్థలు తమ తమ ప్రాంతీయ అవసరాలను తెలుసుకొని మంచి శిక్షణా కార్యక్రమాలను రూపొందించి గ్రామ యువతకు శిక్షణ ఇచ్చాయి. మరింత బలపర్చడానికి గాను ఈ యోజన ఎంతో తోడ్పడి యువత భవిష్యత్తు నిర్మాణంలో గణనీయమైన పాత్ర వహించాయి. అయితే కాలక్రమేణా కపార్ట్ మూతపడింది. తెలంగాణ ప్రభుత్వం పైవిషయాలనూ దృష్టిలో పెట్టుకొని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సాగించాలి.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకుడు,
ఢిల్లీలోని కెనడియన్ హై కమిషన్ మాజీ సీనియర్ సలహాదారు

అంతరార్థం



ఎవరైనా ఏదైనా ఒక పని చేస్తే దాన్ని చూసిన మనం అతడు అలా చేయటం మంచిదనో లేదా చెడ్డదనో వెంటనే తీర్పుచెబుతూ ఉంటాం. అలా చేయటం తగదని శ్రీ రామకృష్ణ పరమహంస రామాయణ, మహాభారతాల నుంచి కొన్ని ఉదాహరణలు చూపారు. రామరావణ యుద్ధంలో రావణ కుంభకర్ణాది యుద్ధ వీరులంతా చనిపోయారు. రావణుని తల్లి కైకశి ప్రాణభయంతో పారిపోసాగింది. లక్ష్మణుడు అలా పారిపోతున్న ఆ వృద్ధ స్త్రీని గమనించి శ్రీరామ చంద్రునితో, 'అన్నయ్యా! ఏమిటీ వింత? అనేక మంది పుత్రులను, బంధువులను కోల్పోయి పుత్ర శోకాన్ని అనుభవిస్తూ ఇప్పుడు స్వీయ ప్రాణ రక్షణార్థం ఈ వృద్ధురాలు ఇలా ఎందుకు పారిపోతోంది?' అని అడిగాడు. అందుకు రాముడు 'ఆమెనే అడిగి కారణం కనుక్కొందాం' అన్నాడు. 'శ్రీరాముడు అభయమిచ్చాడని తెలిపి ఆమెను గౌరవంగా నా కడకు తోడ్కొని రండి అని కొందరిని ఆమె కడకు పంపాడు. వారు అలాగే చేశారు. 'నీవు ప్రాణ భీతితో అలా పారిపోతున్నావా? నిజం చెప్పు' అన్నాడు శ్రీరామ చంద్రుడు ఆమెతో. అప్పుడామె, 'ఓ రామా! నేను జీవించి ఉన్నందునే నీ ఈ లీలలను తిలకించ గల్గుతున్నాను. ఈ భూమ్మీద నీవు ఇంకా జరుపబోయే లీలలను కూడా చూడగోరి ఇంకా కొంత కాలం జీవించాలని అభిలషిస్తున్నాను' అని చెప్పింది. దీంతో సత్యమేమిటో అందరికీ తెలిసి వచ్చింది.

మహాభారత ఉదాహరణ చూద్దాం. భీష్ముడు అంపశయ్యపై ఉన్నాడు. శ్రీకృష్ణుడు, పంచ పాండవులు ఆయన చుట్టూ నిలబడి ఉన్నారు. మహావీరుడైన భీష్మాచార్యుల వారి కళ్ళ నుండి అశ్రువులు స్రవించటం వారు గమనించారు. అర్జునుడు శ్రీకృష్ణునితో, 'సఖా! ఎంత విచిత్రంగా ఉంది. కురు పితామహులైన భీష్ములు మరణ సమయంలో మాయలో పడి దుఃఖిస్తున్నా రేమిటి?' అన్నాడు. కృష్ణుడే భీష్ముడిని దాన్నిగూర్చి అడిగాడు. అప్పుడు భీష్ముడు, 'ఓ కృష్ణా! మరణ భయంతో నేను దుఃఖించటం లేదని నీకు బాగా తెలుసు, స్వయంగా భగవంతుడే పాండవులకు సారథిగా ఉన్నప్పటికీ వారి కష్టాలకు అంతులేకుండా ఉందే! ఇలాంటి ఆలోచన వచ్చినప్పుడు భగవంతుడి లీలలను కించిత్తూ తెలుసుకోలేకుండా ఉన్నానే అని తలచుకొని దుఃఖిస్తున్నాను' అన్నాడు (శ్రీ రామకృష్ణ కథామృతం–01).

కాబట్టి దేన్ని చూసినా, విన్నా త్వరపడి విమర్శించ కూడదు. నిజం నిలకడ మీద తేలుతుంది.

– రాచమడుగు శ్రీనివాసులు

క్లుప్తంగా...

పద్మశ్రీ రామచంద్రయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

- పినపాక ఎమ్మెల్యే ద్వారా అందించిన మంత్రి పొంగులేటి



రామచంద్రయ్య కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య ఇటీవల మృతిచెందగా, ఆయన దశదిన కర్మల కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పంపించిన రూ.2 లక్షలు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం రామచంద్రయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రావాల్సిన 462 చదరపు గజాల ఇంటి స్థలం గురించి కలెక్టర్‌తో మాట్లాడామని, ఈ మేరకు రామచంద్రయ్య కుటుంబానికి పంచనామా చేసిన ప్రొసీడింగ్ కాపీలు కూడా అందాయని చెప్పారు. నాటి ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి కూడా వీలైనంత త్వరగా అందిస్తామన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క తదితరులు ఇచ్చిన మాట ప్రకారం రామచంద్రయ్య కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పెన్ గుచ్చుకుని చిన్నారికి తీవ్రగాయం



భద్రాచలం అర్బన్: మంచంపై కూర్చుని ఆడుకుంటున్న ఓ చిన్నారి కిందపడిపోవడంతో.. చేతిలో క్యాప్ తీసి ఉన్న పెన్ను తలలో గుచ్చుకుంది. భద్రాచలంలో సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలివి. భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నాలుగేళ్ల చిన్నారి రియాంచిన ఇంట్లో మంచంపై కూర్చుని ఆడుకుంటూనే రాసుకుంటోంది. ఈ క్రమంలో మంచంపై నుంచి కింద పడిపోవడంతో.. ఆమె చేతిలోని పెన్ను చెవి పైభాగంలో గుచ్చుకుంది. దీంతో తీవ్ర రక్తస్రావమైన చిన్నారిని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ప్రారంభించకముందే.. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ న్యూరోసర్జన్ అందుబాటులో లేకపోవడంతో వెంటనే ఖమ్మం తరలించారు.

విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి



కొండం వీరబాబు

ఖమ్మం రూరల్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన కొండం వీరబాబు (30) పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వీరబాబుకు గోళ్లపాడు రెవెన్యూ పరిధిలో రెండెకరాల పొలం ఉండగా నారుమడికి నీరు పెట్టేందుకు ఉదయమే వెళ్లాడు. మోటార్ ఆన్‌చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వీరబాబు మధ్యాహ్నం వరకు భోజనానికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. రింగ్ అవుతున్నా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా మోటార్ పక్కనే విగతజీవిగా పడి ఉన్నాడు. పండితాపురం గ్రామానికి చెందిన రాధతో మూడేళ్ల కిందటే వీరబాబుకు వివాహం జరగ్గా.. వారికి 16 నెలల కుమారుడు ఉన్నాడు. పెద్దదిక్కును కోల్పోవడంతో భార్య, కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు అందరినీ కలచి వేసింది. ఖమ్మం రూరల్ ఎస్సై రామారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జూన్‌లో వర్షాలు బాగు

▶ మొదటి పేజీ తరువాయి

అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే గత నెలలో పలు జిల్లాల్లో సాధారణ వర్షపాతమే నమోదైంది. కానీ కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు కురవడంతో రాష్ట్ర సగటు వర్షపాతం పైకి ఎగబాకింది.

84 మండలాల్లో లోటు వర్షపాతం...

రాష్ట్రవ్యాప్తంగా జూన్‌లో వర్షాలు సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ ఆరు జిల్లాల్లో మాత్రం అత్యధిక వర్షపాతం నమోదైంది. 11 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదవగా 14 జిల్లాల్లో మాత్రం సాధారణ వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లాలో లోటు వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మండలాలవారీగా వర్షపాతం గణాంకాలు పరిశీలిస్తే 159 మండలాల్లో అత్యధికం, 171 మండలాల్లో అధికం, 198 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 84 మండలాల్లో మాత్రం లోటు వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. జూన్ తొలివారం రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురవగా... రెండో వారం నాటికి వర్షాలు తగ్గుముఖం పట్టాయి. మూడో వారంలో రాష్ట్రవ్యాప్తంగా లోటు వర్షపాతమే నమోదవగా చివరి వారంలో మళ్లీ వర్షాలు ఆశాజనకంగా నమోదయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో సాధారణం కంటే రెట్టింపు వర్షాలు నమోదవగా రెండో స్థానంలో నల్లగొండ జిల్లా నిలిచింది.

195 టీఎంసీల ఎత్తిపోత సాధ్యమేనా?

- కాళేశ్వరం బ్యారేజీలు, ఆఫ్‌లైన్ రిజర్వాయర్ల నిర్వహణపరంగా సాధ్యమేనా?
- తుమ్మిడిహట్టి వద్ద వేర్వేరు ఎత్తుల్లో బ్యారేజీ నిర్మిస్తే ఉండే ముంపు స్థాయిలేంటి?
- బ్యారేజీల స్థల ఎంపిక కోసం ఎలాంటి సర్వేలు, ఇన్వెస్టిగేషన్లు చేశారు?
- ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నీటి లభ్యత అధ్యయనాలు, అనుమతులు సమర్పించండి
- నీటిపారుదల శాఖ నుంచి సమాచారం కోరిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్

సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహట్టి వద్ద వేర్వేరు ఎత్తుల్లో బ్యారేజీ నిర్మిస్తే ఏర్పడే ముంపును తెలిపే ఇండెక్స్ మ్యాపులు, టోపోషీట్లను అందించాలని నీటిపారుదల శాఖ రామగుండం చీఫ్ ఇంజనీర్‌ను జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఆదేశించింది. 'అవసరమైన 195 టీఎంసీల జలాలను ఎత్తిపోయడం బ్యారేజీలు, ఆఫ్‌లైన్ రిజర్వాయర్ల నిర్వహణపరంగా సాధ్యమేనా? దీనిపై ముందే ఏవైనా అధ్యయనాలు చేశారా?' అని ప్రశ్నించింది. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో లోపాలపై విచారణ చేస్తున్న జస్టిస్ చంద్రఘోష్ కమిషన్.. అదనపు సమాచారం కోరుతూ నీటిపారుదల శాఖలోని ప్లానింగ్, డిజైనింగ్, ఎగ్జిక్యూషన్ విభాగాలకు ఇటీవల లేఖ రాసింది.

ప్రాణహితకు నీటి లభ్యత ఎంత?

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించాలని



హైడ్రాలజీ విభాగం సీఈను కమిషన్ ఆదేశించింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర పర్యావరణ శాఖ, ప్లానింగ్ కమిషన్, సీఎస్ఎంఆర్ఎస్, సీజీడబ్ల్యూబీ వంటి విభాగాల నుంచి ప్రాజెక్టుకు వచ్చిన అనుమతులు, ఈ విషయంలో సాగిన ఫైళ్ల రాకపోకల వివరాలను సమర్పించాలని కోరింది. ప్రాజెక్టుకు నీటి లభ్యతపై అధ్యయనాలు, సీడబ్ల్యూసీతో జరిపిన సంప్రదింపుల సమాచారాన్ని అందించాలని సూచించింది.

దేశంలో ఎక్కడా వాడని సెకెంట్ పైల్స్ ఎందుకు వాడారు?

బ్యారేజీల స్థల ఎంపిక కోసం నిర్వహించిన సర్వేలు, ఇన్వెస్టిగేషన్లపై నీటిపారుదల శాఖలో అంతర్గత ఫైళ్ల రాకపోకల వివరాలను అందించాలని కమిషన్ కోరింది. బ్యారేజీల నిర్మాణానికి ముందు డ్రాయింగ్స్ కోసం సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీఓ) చీఫ్ ఇంజనీర్‌కు క్షేత్రస్థాయి అధికారులు పంపిన సైట్ సర్వే నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. మేడిగడ్డ బ్యారేజీ ర్యాఫ్ట్ (పునాది)– సెకెంట్ పైల్స్ మధ్య గ్యాప్ ఉండాలని.. రెండింటికి జాయింట్ వేయాలని చేసిన ప్రతిపాదనల వెనుక కారణాలను తెలపాలని సూచించింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ర్యాఫ్ట్‌కు దిగువనే సెకెంట్ పైల్స్ నిర్మించగా, మేడిగడ్డ విషయంలో వ్యత్యాసానికి కారణం ఏమిటని ప్రశ్నించింది. దేశంలో జలాశయాల నిర్మాణంలో సెకెంట్ పైల్స్‌ను వాడే ఆనవాయితీ లేదని.. అందువల్ల వీటి వినియోగంపై సాంకేతిక చర్చలు జరిగాయా? అని అడిగింది.

బ్యారేజీల స్థల ఎంపిక ఎలా జరిగింది?

బ్యారేజీల నిర్మాణానికి పరిపాలన అనుమతుల కోసం పంపిన ప్రతిపాదనలపై జరిగిన సంప్రదింపుల వివరాలను కమిషన్ కోరింది. వ్యాప్కోస్ 2016 జనవరి 17న సమర్పించిన మూడు బ్యారేజీల డీపీఆర్‌లను సమర్పించాలని ఆదేశించింది. బ్యారేజీల స్థల ఎంపికకు నిర్వహించిన సర్వే, ఇన్వెస్టిగేషన్ల విషయంలో రామగుండం, కరీంనగర్, గజ్వేల్ ఈఎన్సీలు– సీఈ సీడీఓతో మధ్య జరిగిన ఫైళ్ల రాకపోకలను వివరాలను కోరింది. ఇక మూడు బ్యారేజీల పునాదుల నిర్మాణ సమయంలో రోజువారీగా జరిగిన పనిని రికార్డు చేసిన మెజర్‌మెంట్ బుక్‌లు, తుది డీపీఆర్‌లు, నిర్మాణ సంస్థలతో జరిగిన ఒప్పందాలను అందించాలని రామగుండం సీఈను కమిషన్ కోరింది.

బ్యారేజీల వైఫల్యాలపై నివేదిక ఇవ్వండి

మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో బుంగలు పడటంపై సమగ్ర నివేదిక సమర్పించాలని క్వాలిటీ కంట్రోల్ విభాగం సీఈను కమిషన్ కోరింది. బ్యారేజీల ప్లానింగ్, ఇన్వెస్టిగేషన్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, ఓఅండ్ఎం దశల్లో జరిగిన లోపాలు, సాధ్యమైన పరిష్కారాలు ఈ నివేదికలో ఉండాలని ఆదేశించింది. మూడు బ్యారేజీల్లో డ్యామేజీలను క్షేత్రస్థాయి ఇంజనీర్లు నివేదించిన తర్వాత నీటిపారుదల శాఖ ఈఎన్సీ (ఓ అండ్ ఎం, స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్) చేసిన సిఫారసులను తెలపాలని కోరింది.

రిటైర్డ్ ఉద్యోగులకూ 'చేయూత'

- ఇటీవల సెర్ప్ తనిఖీల్లో వెలుగులోకి..
- రాష్ట్రవ్యాప్తంగా పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 427 మంది

సాక్షిప్రతినిధి, ఖమ్మం: చేయూత పింఛన్లు పక్కదారి పట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా కొన్నేళ్లుగా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ఈ పింఛన్లు అందుతున్నట్టు ఇటీవల సెర్ప్ అధికారుల తనిఖీల్లో తేలింది. దీనిపై విచారణ చేయాలని సెర్ప్ ఉన్నతాధికారుల నుంచి అన్ని జిల్లాల డీఆర్‌డీఓలకు ఆదేశాలు అందాయి. ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 427 మంది రిటైర్డ్ ఉద్యోగులు రూ.2.50 కోట్లు ఆసరా పింఛన్ తీసుకున్నట్టు తేలింది. పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల్లో విచారణ చేస్తే ఎంతమేర రిటైర్డ్ ఉద్యోగులు ఆసరా సొమ్ము స్వాహా చేశారో తేలనుంది.

వీరికే 'చేయూత'..

చేయూత పథకం ఎవరికి వర్తిస్తుందో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికులు, స్టోన్ కట్టర్లు, చేనేత, వికలాంగులు, డయాలసిస్, ఫైలేరియా, ఎయిడ్స్ రోగులకు ఈ పథకం వర్తిస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి తెల్లరేషన్‌కార్డు ఉన్నవారు చేయూత పెన్షన్ పొందేందుకు అర్హులు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని 'ఆసరా' పేరుతో అమలు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం పేరును 'చేయూత'గా మార్చింది.

ఉమ్మడి ఖమ్మంలోనే రూ.2.50 కోట్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు 427 మంది నెలవారీగా చేయూత పింఛన్ పొందుతున్నారు. నిబంధనల ప్రకారం వీరికి చేయూత పింఛన్ వర్తించదు. ఒక్క ఖమ్మం జిల్లాలో 227 మంది పదవీ విరమణ పొందిన ఉద్యోగులు లబ్ధి పొందుతుండగా.. దీని ద్వారా ప్రభుత్వ సొమ్ము రూ.1.50 కోట్లు వృథా అవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 200 మంది పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఈ పింఛన్ తీసుకుంటున్నట్లు లెక్కల్లో తేలింది. ఈ జిల్లాలో కూడా సుమారు రూ.కోటి వరకు వీరికి అందుతోంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే రూ. కోట్ల మేర ప్రజాధనం వృథా అవుతోంది.

తనిఖీల్లో వెలుగుచూస్తున్న అనర్హులు

రాష్ట్రవ్యాప్తంగా అనర్హులు చేయూత పింఛన్ పొందుతున్నట్టు సెర్ప్ తనిఖీల్లో తేలింది. దీంతో దీనిపై మరింత లోతైన విచారణకు ఉపక్రమించింది. జిల్లాల వారీగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పొందుతున్న చేయూత పింఛన్ వివరాలు డీఆర్‌డీఓలకు పంపించింది. దీనిపై మరోసారి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వీరుకాక పింఛన్ పొందుతున్న అనర్హుల లెక్కలు కూడా తేల్చాలని డీఆర్‌డీఓలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల స్థాయిలో విచారణ పూర్తయితే మొత్తం ఎంతమంది అనర్హులు ఈ పింఛన్ పొందుతున్నారో తేలనుంది.

25 వేల మంది ఎస్‌జీటీల బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి

విధుల్లో చేరారు. దీంతో మిగతా దాదాపు 2 వేల మందికి పదోన్నతులు కల్పించాల్సి ఉంది. ఈ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. వివిధ మండలాల్లో ఒకే ఊరు పేరుతో ఉన్న స్కూళ్ళు ఉండటంతో ఆన్‌లైన్‌లో సమస్యలు వచ్చాయి. వీటిని సరి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద వారం రోజుల్లో సమస్యల పరిష్కార ప్రక్రియ పూర్తవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఖాళీలపై దృష్టి: అన్ని స్థాయిల్లోనూ ప్రమోషన్లు, బదిలీలు ముగియడంతో పాఠశాల విద్యాశాఖలో వాస్తవ ఖాళీలపై అధికారులు దృష్టి పెట్టారు. స్కూళ్ళలో విద్యార్థుల సంఖ్య, అవసరమైన టీచర్ల లెక్కతో హేతుబద్ధీకరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అవసరమైన మేరకు కొన్ని బదిలీలు చేసే ఆలోచనలో ఉంది. విద్యార్థులు లేని స్కూళ్ళలో ఎక్కువగా ఉన్న టీచర్లను.. విద్యార్థులు ఎక్కువ ఉన్న స్కూళ్ళకు బదిలీ చేసే అవకాశం ఉంది. అయితే ఇందు కోసం క్షేత్రస్థాయిలో టీచర్ పోస్టుల ఖాళీలు గుర్తించాల్సి ఉంటుంది. మల్టీజోన్-1, జోన్-2 పరిధిలో దాదాపు 11 వేల మంది ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇచ్చారు. దీంతో ఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. అదే విధంగా 2 వేల మంది స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించారు. హెచ్ఎంల పదోన్నతులతో కూడా కలుపుకుంటే మొత్తం 18,942 మందికి ప్రమోషన్లు దక్కాయి. ఈ ఏడాది చివరి నాటికి రిటైర్ అయ్యే టీచర్లను కలుపుకుంటే దాదాపు 21 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది.

భూమి కోసం...

- ఒక రైతు బలవన్మరణం.. ముగ్గురు రైతుల ఆత్మహత్యా యత్నం
- ఖమ్మం, జనగామ, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల్లో ఘటన

చింతకాని/జనగామ /లింగాల/గద్వాల రూరల్: వ్యవసాయ భూమి విషయంలో తనకు అన్యాయం జరిగిందనే ఆవేదనతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, మరో ముగ్గురు రైతులు ఆత్మహత్యకు యత్నించారు. నాలుగు జిల్లాల పరిధిలో సోమవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.

సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగులమందు తాగి...

ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన బోజెడ్ల ప్రభాకర్ (45) కుటుంబానికి 7.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గ్రామంలోని చెరువు శిఖం పక్కనే ఉన్న తన భూమిలో ప్రభాకర్ గత వేసవిలో రూ.8 లక్షలు వెచ్చించి మట్టి తోలించాడు. అయితే చెరువు శిఖంలో మట్టి పోశారంటూ గ్రామానికి చెందిన మత్స్య సొసైటీ సభ్యులు నాలుగు రోజుల క్రితం రెండు జేసీబీలు, రెండు బుల్డోజర్లతో ప్రభాకర్ పొలంలోని మట్టిని తొలగించారు. దీనిపై తహసీల్దార్, ఎస్సై, ఇరిగేషన్ అధికారులకు ప్రభాకర్ ఫిర్యాదు చేయగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు భూమిని పరిశీలించి మట్టి తొలగించొద్దని సొసైటీ సభ్యులకు చెప్పారు. అయినా వారు దౌర్జన్యంగా మట్టి తొలగించగా, గ్రీవెన్స్‌లో కలెక్టర్, సీపీని కలిసి తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసేందుకు తన తండ్రితో కలిసి ప్రభాకర్ సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌కు వెళ్లాడు. అక్కడ కలెక్టర్ కలవకపోవడంతో మనస్తాపానికి గురైన ప్రభాకర్.. భోజనం చేసి వస్తానంటూ తండ్రితో చెప్పి ఖమ్మంలోని గొల్లగూడెం – కొత్తగూడెం మార్గంలో గల చెరుకూరి గార్డెన్ వద్దకు పురుగుల మందు డబ్బాతో చేరుకున్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని సెల్ఫీ వీడియో ద్వారా వివరిస్తూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లగా అప్పటికే మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి



బోజెడ్ల ప్రభాకర్

చెందాడు. గ్రామంలోని కొందరు కాంగ్రెస్, టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే తన పొలాన్ని నాశనం చేశారని వివరిస్తూ తాను ఆత్మహత్య చేసుకునే ముందు తీసిన వీడియోను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు పంపించాలని, తన కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ప్రభాకర్ కోరాడు.

గోలీలు మింగి...కిరోసిన్ డబ్బాతో...

- జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రానికి చెందిన అక్కాచెల్లెళ్లు దేవులపల్లి జ్యోతి, స్వప్నల పేరిట తాత లక్ష్మయ్య 1.04 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయించి గార్డియన్‌గా ఉన్నాడు. ఆ విషయం అక్కాచెల్లెళ్లకు తెలియదు.2014లో లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. జ్యోతి, స్వప్నలకు పెళ్లిళ్లు కూడా అయ్యాయి. ట్రంకు పెట్టె సర్దుతుండగా, భూమి విషయం తెలిసింది. వెంటనే జ్యోతి గ్రామానికి చెందిన సదరు వ్యక్తిని భూమి విషయం అడగ్గా, మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. న్యాయం కోసం జ్యోతి గతంలో నర్మెట పీఎస్‌కు వెళ్లి ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు నచ్చచెప్పి ఇంటికి పంపించారు. ఆ తర్వాత జ్యోతి కోర్టును ఆశ్రయించింది. కేసు నడుస్తోంది. భూమి వస్తుందో రాదో అన్న ఆవేదనతో జ్యోతి కొన్ని మందుగోలీలు మింగి సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చింది. ప్రజావాణి ప్రారంభమయ్యే క్రమంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు చెప్పారు.

ఇతరుల పేరిట పట్టా చేశారని...

- నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన మహిళారైతు గాలేటి జయమ్మకు గ్రామ శివారులో 1.37 ఎకరాల భూమి వారసత్వంగా దక్కాల్సి ఉంది. ఆ భూమిని పదేళ్ల కిందట అధికారులు ఇతరుల పేరిట పట్టా చేశారు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో ఆందోళనకు గురైన జయమ్మ సోమవారం పెట్రోల్‌తో లింగాల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఒంటిపై పోసుకునేందుకు ప్రయత్నించింది. గమనించిన చుట్టుపక్కల వారు అడ్డుకున్నారు.

నేతలు భూమి కబ్జా చేశారని...

- జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన రైతు పరుశరాముడికి అదే గ్రామ శివారులో ఐదు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని గ్రామనేతలు కబ్జా చేశారు. దీనిపై పరుశరాముడు పలుమార్లు రెవెన్యూ అధికారులతో పాటు కలెక్టరేట్‌లో కూడా ఫిర్యాదు చేశాడు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం గద్వాల కలెక్టరేట్‌లో కలెక్టర్ బీఎం.సంతోష్ ఆధ్వర్యంలో ఫిర్యాదుల దినోత్సవం కొనసాగుతుండగానే పరుశరాముడు తన వెంట తీసుకొచ్చిన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం రైతు పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

కూలిన బతుకులు

- మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలోని నలుగురు మృతి
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని వనపట్లలో ఘటన
- భార్య, ఇద్దరు కూతుళ్లు, 10 నెలల కొడుకును కోల్పోయిన ఆటో డ్రైవర్
- తీవ్రంగా గాయపడ్డ అతన్ని ఆస్పత్రికి తరలించిన స్థానికులు

సాక్షి, నాగర్‌కర్నూల్: వర్షానికి తడిసిపోయిన పాత ఇంటి పైకప్పు కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందిన విషాదకర ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని వనపట్లలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వనపట్లకు చెందిన గొడుగు భాస్కర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య పద్మ (26), కూతుళ్లు తేజస్విని (7), వసంత (5), కుమారుడు రుత్విక్ (10 నెలలు) ఉన్నారు. కుటుంబంతో కలిసి భాస్కర్ 30 ఏళ్లనాటి పాత ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి తడిసిన మట్టి మిద్దె కూలి ఇంట్లో నిద్రిస్తున్న వారిపై పడింది. దీంతో శిథిలాల కింద చిక్కుకొని పద్మ, తేజస్విని, వసంత, రుత్విక్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను ఇరుగుపొరుగు వారు వెంటనే జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు.

దోమల బెడదతో పాత ఇంట్లోకి..

భాస్కర్ కుటుంబంతోపాటు ఆయన తల్లిదండ్రులు చిట్టెమ్మ, బాలస్వామి సైతం అదే ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం రాత్రి ముసురు ఉండటంతో పాత ఇంటికి ఆనుకొని ఉన్న రేకుల షెడ్డులోనే అందరూ నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో ఆరుబయట దోమల బెడద ఎక్కువ కావడంతో భాస్కర్ భార్య, పిల్లలతో పాత ఇంట్లోకి వచ్చి నిద్రపోయారు. ఆ తర్వాత గంట సేపటికే వర్షానికి తడిసిన మట్టి మిద్దె భార్య, పిల్లలను కబళించింది. రేకుల షెడ్డులోనే నిద్రిస్తున్న చిట్టెమ్మ, బాలస్వామికి ప్రమాదం తప్పింది.

మృతుల కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి జూపల్లి

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించిన ఘటనపై మంత్రి జూపల్లి కృష్ణారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జనరల్





నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో వర్షానికి కూలిన ఇల్లు. (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన తల్లి, పిల్లలు (ఫైల్)

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భాస్కర్‌ను కలెక్టర్ బదావత్ సంతోష్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ. 4 లక్షల పరిహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు తదితరులు మృతుల కుటుంబాన్ని పరామర్శించారు.

పట్టాదార్ పాస్ పుస్తకాల్లో రైతు, తండ్రి పేరు.. అడవి

- ఎన్నోసార్లు నవీన్‌మిత్తల్‌కు మా మొర చెప్పుకున్నాం.. వినతిపత్రాలు ఇచ్చాం
- అయినా పట్టించుకోవడం లేదు.. భూమి మీద హక్కులు లేకుండా చేస్తున్నారు.
- సచివాలయం ఎదుట ధర్నా చేసిన నారాయణపురం రైతులు



తెలంగాణ సచివాలయం ముందు ధరణి సమస్యలపై నవీన్ మిత్తల్ తీరుపై నిరసన తెలుపుతున్న రైతులు

సాక్షి, హైదరాబాద్ : ఎవరి పట్టాదార్ పాస్ పుస్తకం చూసినా, దానిలో పట్టాదారు పేరు, తండ్రి పేరు ఉంటుంది. కానీ జనగామ జిల్లా నారాయణపురం గ్రామంలో కొంతమంది రైతులకు మాత్రం రైతు పేరు, తండ్రి పేరు అడవి అనే ఉంది. దీనిని సవరించాలని కోరుతూ నారాయణపురం రైతులు సోమవారం సచివాలయ ముట్టడికి యత్నించారు. తక్షణమే స్పందించిన పోలీసులు వారిని మీడి యా పాయింట్ వద్దకు తరలించారు. వారి సమస్యలను తెలుసుకొని సీసీఎల్ఏకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు మీడియాతో మాట్లాడుతూ తమ భూమిని తమ పేరు మీద ఉండేలా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై అనేకసార్లు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు వినతిపత్రాలు ఇచ్చామని, విజ్ఞప్తులు చేశామని, సమస్య పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేసినా ఇప్పటి వరకు ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 950 ఎకరాల్లో రైతులు ఇబ్బందిపడుతున్నారని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు రాకపోవడం, బీమా లేక అనేక రకాలుగా నష్టపోతున్నామని తెలిపారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా అనేక రకాలుగా నిరసనలు, ధర్నాలు చేసి, వినతిపత్రాలు ఇచ్చామని, అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా రైతులకు న్యాయం చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

కారుతో ఢీకొట్టి మహిళ దారుణహత్య



మంజుల



చంద్రమౌళి

ఉప్పల్: కారుతో ఢీకొట్టి మహిళను ఓ వ్యక్తి దారుణంగా హతమార్చాడు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి అర్వపల్లి ప్రాంతానికి చెందిన పెండేరి చంద్రమౌళి (47) ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో ఏజెంట్‌గా పనిచేస్తూ రామంతాపూర్ వివేక్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే ప్రాంతంలో నివాసముండే కొమ్మవారి మంజుల (37) చంద్రమౌళి పనిచేసే రియల్ ఎస్టేట్ సంస్థలోనే ఏజెంటుగా పనిచేస్తున్నారు. మంజుల భర్త నాలుగు నెలల క్రితం మృతిచెందారు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా మంజుల–చంద్రమౌళి మధ్య వివాహేతర సంబంధం ఉంది. గత కొంతకాలంగా మంజుల మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండటంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే చంద్రమౌళి మాట్లాడుకుందామంటూ మంజులను ఆదివారం రాత్రి ఉప్పల్ బగాయత్ లేఔట్‌లోకి తీసుకొచ్చాడు. ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరిగింది. ఇంతలోనే మంజుల కారు దిగి వెళ్తుండగా చంద్రమౌళి వెనుక నుంచి అతి వేగంగా కారుతో ఆమెను ఢీకొట్టాడు. అంతటితో ఆగక పలుమార్లు ఆమెపై నుంచి కారును తీసుకెళ్లడంతో మంజుల అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం చంద్రమౌళి నేరుగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్

సభలో హిందూ కాక

రాహుల్ వ్యాఖ్యలపై దుమారం • దుయ్యబట్టిన మోదీ

▶ మొదటి పేజీ తరువాయి
అభివర్ణించారు. ఇది చాలా తీవ్రమైన అంశం''అంటూ దుయ్యబట్టారు. వాటిని రాహుల్ తోసిపుచ్చారు. తన వ్యాఖ్యలు కేవలం బీజేపీని ఉద్దేశించినవి మాత్రమేనని స్పష్టం చేశారు. ''హిందూ సమాజమంటే కేవలం బీజేపీ, ఆరెస్సెస్, మోదీ మాత్రమే కాదు''అంటూ చురకలు వేశారు. నిర్భీతి, అహింస గురించి మాట్లాడుతూ శివుడు, గురు నానక్, జీసస్ ఫొటోలు సభలో ప్రదర్శించారు. సభలో మత చిహ్నాల ప్రదర్శనకు నిబంధనలు అంగీకరించబోవని స్పీకర్ ఓం బిర్లా వారిస్తున్నా పట్టించుకోలేదు. ''అన్ని మతాలూ, అందరు మహానుభావులూ చెప్పింది అహింస, నిర్భీతి గురించే. కానీ తాము హిందువులమని చెప్పుకునే వాళ్లు మాత్రం కేవలం హింస, ద్వేషం, అసత్యాల గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. ఏ లెక్కన చూసుకున్నా మీరసలు హిందువులే కాదు''అంటూ బీజేపీ నేతలను దుయ్యబట్టారు. ''మైనారిటీలు దేశానికి గర్వకారణం. అన్ని రంగాల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దేశభక్తులు. వారిపైనా బీజేపీ దారుణంగా దాడులకు దిగుతోంది. ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులపై హింసాద్వేషాలను వ్యాప్తి చేస్తోంది''అని ఆక్షేపించారు. రాహుల్ ప్రసంగాన్ని ఆయన తల్లి సోనియాగాంధీ, సోదరి ప్రియాంకా గాంధీ వద్రా లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీ నుంచి వీక్షించారు.

హిందువులంతా హింసావాదులా?

రాహుల్ వ్యాఖ్యలపై నిరసనలతో బీజేపీ సభ్యులు హోరెత్తించారు. రాహుల్ తక్షణం సభకు క్షమాపణ చెప్పి తీరాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. ''దేశంలో కోట్లాది హిందువులున్నారు. వారంతా హింసకు పాల్పడేవాళ్లేనన్నది రాహుల్ ఉద్దేశమా? 1975లో ఎమర్జెన్సీ విధింపు, 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్ల వంటి అకృత్యాలన్నీ కాంగ్రెస్ పుణ్యమే. దేశమంతటా ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసిందే కాంగ్రెస్. అలాంటి పార్టీకి చెందిన రాహుల్‌కు అహింస గురించి మాట్లాడే అర్హతే లేదు''అంటూ మండిపడ్డారు. రాహుల్ చేసిన ప్రతి ఆరోపణకూ రుజువులు సమర్పించాల్సిందిగా ఆదేశించాలని స్పీకర్‌ను కోరారు. అయినా రాహుల్ వెనక్కు తగ్గలేదు. ''క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం, జైనం, సిక్కు వంటి మతాలన్నీ ధైర్యం, నిర్భీతి వంటి వాటి గురించే చెప్పాయి. కానీ బీజేపీ ప్రజాస్వామిక విలువలపై ఏనాడూ నమ్మకం లేదు. మోదీ ఆదేశాల మేరకు నాపై లెక్కలేనన్ని దాడులు జరిగాయి. 20కి పైగా కేసులు పెట్టారు. నా ఇంటిని లాగేసుకున్నారు. నాపై ఈడీని ప్రయోగించి 55 గంటల పాటు విచారణ జరిపారు. అయినా వెరవకుండా రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో ముందుండి నిలిచా. రాజ్యాంగంపై, భారత దేశ మూల భావనలపై బీజేపీ పాల్పడుతున్న వ్యవస్థీకృత దాడులకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు అడ్డుకట్ట వేశారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీ వాళ్లు కూడా నాతో పాటు రాజ్యాంగానికి జై కొట్టాల్సి వస్తోంది''అంటూ ఎద్దేవా చేశారు.

'నీట్'పై విపక్షాల వాకౌట్

సోమవారం లోక్‌సభ సమావేశం కాగానే నీట్–యూజీ పేపర్ లీకేజీ అంశాన్ని రాహుల్ ప్రస్తావించి తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ''నీట్ వంటి ప్రొఫెషనల్ పరీక్షను కేవలం సంపన్న విద్యార్థులకు అనువైనపక్కా కమర్షియల్ పరీక్షగా మార్చేశారు. గత ఏడేళ్లలో 70కి పైగా పేపర్లు లీకయ్యాయి. ఇంత ముఖ్యమైన అంశంపై ప్రభుత్వం చర్చకు కూడా అంగీకరించడం లేదు. ఇది చాలా తీవ్రమైన అంశం. కనుక సభలో ఒక రోజంతా ప్రత్యేకంగా చర్చ చేపడదాం''అని ప్రతిపాదించారు. అందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభ్యంతరం తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఇతర అంశాలపై చర్చ కోరడం లోక్‌సభ సభ్యునిగా నా దశాబ్దాల అనుభవంలో ఎప్పుడూ చూడలేదు''అన్నారు. అనంతరం నీట్‌పై చర్చకు స్పీకర్ తిరస్కరించారు. అందుకోసం ప్రత్యేక నోటీసివ్వాలని విపక్షాలకు సూచించారు. స్పీకర్ నిర్ణయాన్ని నిరసిస్తూ విపక్షాలన్నీ వాకౌట్ చేశాయి. అంతకుముందు మణిపూర్ కల్లోలం, రైతు ఆత్మహత్యలు, జమ్మూ కశ్మీర్లో హింసాకాండ, జీఎస్టీ, నోట్ల రద్దు తదితరాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ తీరును రాహుల్ దుయ్యబట్టారు. మణిపూర్‌ను మోదీ సర్కారు అంతర్యుద్ధం దిశగా నెట్టేస్తోందని ఆరోపించారు. విపక్షాన్ని శత్రువులుగా చూడొద్దన్నారు.

విపక్షాల నిరసన

విపక్ష నేతలను వేధించేందుకు వారిపైకి మోదీ సర్కారు దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందని ఇండియా కూటమి సభ్యులు ఆరోపించారు. ఇందుకు నిరసనగా రాహుల్‌తో పాటు వారంతా పార్లమెంటు మకర ద్వారం వద్ద నిరసనకు దిగారు. 'విపక్షాల గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం మానుకోండి', 'బీజేపీలో చేరండి, అవినీతికి లైసెన్సు పొందండి'అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితరులపై ఈడీని ఉసిగొల్పడం మానుకోవాలంటూ డిమాండ్ చేశారు.

రాహుల్‌ది బాధ్యతారాహిత్యం: బీజేపీ

లోక్‌సభలో రాహుల్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించారంటూ బీజేపీ విమర్శించింది. విపక్ష నేత వంటి బాధ్యతాయుత స్థానంలో ఉంటూ నీట్, హిందూ సమాజం, అగ్నివీర్ పథకం... ఇలా అన్ని అంశాలపైనా హుందాతనం లేని వ్యాఖ్యలు చేశారని కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిరెణ్ రిజిజు ఆరోపించారు. రాహుల్ ఇప్పటిదాకా బాధ్యతల్లేని అధికారాన్ని మాత్రమే ఆస్వాదించారంటూ బీజేపీ సభ్యుడు అనురాగ్ ఠాకూర్ దుయ్యబట్టారు. సభకు నిత్యం దుమ్మా కొట్టడాన్ని అలవాటుగా మార్చుకున్నారన్న వ్యక్తి ఇప్పుడు నీతులు చెబుతున్నారంటూ ఎద్దేవా చేశారు.

'మైక్ కట్' విమర్శలు... ధన్‌ఖడ్, బిర్లా సీరియస్

విపక్షాలకు మైక్ కట్ చేస్తున్నామన్న విమర్శలపై రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్, స్పీకర్ ఓం బిర్లా తీవ్రంగా స్పందించారు. గత వారం సభలో రాహుల్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేశానన్న విపక్షాల ఆరోపణలను బిర్లా తీవ్రంగా ఖండించారు. ''ఇది స్పీకర్ స్థానం గౌరవానికి సంబంధించిన అంశం. మైకుల నియంత్రణ స్పీకర్ చేతిలో ఉండదు. ఈ విషయం విపక్షాలకూ తెలుసు. అయినా ఉద్దేశపూర్వకంగా సభ బయట తప్పుడు ఆరోపణలు చేశారు''అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. అనంతరం రాజ్యసభలోనూ ఇదే అంశం చర్చకొచ్చింది. విపక్ష నేత ఖర్గే మాట్లాడుతుండగా అంతరాయం కలగడంతో మైక్ కట్ చేశారని విపక్ష సభ్యుడు ప్రమోద్ తివారీ అన్నారు. దానిపై ధన్‌ఖడ్ సీరియస్ అయ్యారు. ''మీ వ్యాఖ్యలతో సభను కించపరుస్తున్నారు. మిస్టర్ ఖర్గే! మైక్‌లను మెకానికల్‌గా నియంత్రిస్తారు తప్ప అది సభాపతి చేతిలో ఉండదు. అది మీకూ తెలుసు''అంటూ మండిపడ్డారు.

ప్రధాని నవ్వరెందుకో...!

ప్రధాని మోదీ గురించి రాహుల్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ''మోదీజీ! మీరెందుకు ఎప్పుడూ సీరియస్‌గా ఉంటారు? విపక్షాలతో ఎప్పుడూ సరదాగా మాట్లాడరు. సభలో మేం ఎదురైనప్పుడు మీలో చిరునవ్వు కూడా కన్పించదు''అన్నారు. మోదీ స్పందిస్తూ, ''విపక్ష నేతను సీరియస్‌గా తీసుకోవాలని మన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం నాకు నేర్పాయి''అనడంతో ఎన్డీఏ సభ్యులంతా నవ్వుల్లో మునిగిపోయారు.

మోదీకి తలవంచి అభివాదమా?

రాహుల్ అభ్యంతరం, స్పీకర్ వివరణ

నిండు సభలో ప్రధాని మోదీకి స్పీకర్ ఓం బిర్లా తలవంచి అభివాదం చేయడం సరికాదన్న రాహుల్ వ్యాఖ్యలు వారి మధ్య సంవాదానికి దారి తీశాయి. ''మీరు స్పీకర్‌గా ఎన్నికయ్యాక నేను అభినందించినప్పుడు నిటారుగా నిలబడి నాతో కరచాలనం చేశారు. కానీ మోదీతో కరచాలనం చేసినప్పుడు ఆయనకు వంగి నమస్కరించారు''అంటూ రాహుల్ ఆక్షేపించారు. దీన్ని అధికార పక్ష సభ్యులంతా తీవ్రంగా తప్పుబట్టారు. రాహుల్ సభాపతి స్థానంపైనే తీవ్ర అభియోగాలు మోపుతున్నారంటూ అమిత్ షా ఆక్షేపించారు. స్పీకర్ స్పందిస్తూ, ''ప్రధాని సభా నాయకుడు. పైగా నా కంటే పెద్దవారు. పెద్దలను గౌరవిస్తా. అవసరమైతే పాదాభివందనం చేస్తా. సమవయస్కులతో సమాన స్థాయిలో ప్రవర్తిస్తా. అది నా సంస్కృతి''అని బదులిచ్చారు. అయినా రాహుల్ ఊరుకోలేదు. ''మీ తీరును గౌరవిస్తా. కానీ లోక్‌సభలో స్పీకరే అందరికంటే పెద్దవారు. సభలో అంతా మీకే అభివాదం చేయాలి''అన్నారు.

మోదీపై రాహుల్ మాటల తూటాలు

- మనమంతా మామూలుగా పుట్టి మట్టిలో కలిసే జీవమాత్రులం. మోదీ అలా కాదు. ఆయన ఆత్మతో పరమాత్మ నేరుగా సంప్రదిస్తాడు. తనను దేవుడే పంపాడని మోదీయే స్వయంగా చెప్పుకున్నారు! దేవునితో తనకు నేరుగా కనెక్షన్ ఉందని ప్రకటించుకున్నారు. పెద్ద నోట్లు రద్దు చేయాలంటూ ఓ నాటి రాత్రి వేళ బహుశా మోదీకి దైవ సందేశం అందినట్టుంది. వెంటనే ఆ మేరకు ప్రకటన చేసేశారు!
- అంతా మర్చిపోయిన మహాత్మా గాంధీని ఓ సినిమా తిరిగి గుర్తు చేసిందని మోదీ సెలవిచ్చారు. దాదాపుగా మృతప్రాయుడైన గాంధీకి ఒక సినిమా పునర్జీవం పోసిందట! ఇంతటి అవగాహనా రాహిత్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి!
- సైనికులను అవసరానికి వాడి, ఆ తర్వాత పారేసే కార్మికులుగా మార్చేసిన అగ్నిపథ్ కూడా మోదీ మెదడులో పురుడుపోసుకున్న పథకమే. మేం అధికారంలోకి వస్తే అగ్నిపథ్ పథకాన్ని తక్షణం రద్దు చేస్తాం.

నేడు ధన్యవాద తీర్మానంపై బదులివ్వనున్న మోదీ!

రాష్ట్రపతి ప్రంసగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పార్లమెంటులో జరిగిన చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం బదులిస్తారని సమాచారం. తీర్మానంపై లోక్‌సభలో మంగళవారం సాయంత్రానికి చర్చ ముగిసే అవకాశముంది. తర్వాత మోదీ బదులిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.


రాహుల్ ప్రసంగాన్ని శ్రద్ధగా వింటున్న ప్రధాని మోదీ

మేధా పాట్కర్‌కు 5 నెలల జైలు

- రూ.10 లక్షల జరిమానా
- వీకే సక్సేనా వేసిన పరువునష్టం కేసులో ఢిల్లీ కోర్టు తీర్పు



న్యూఢిల్లీ: సామాజిక వేత్త, నర్మదా బచావో ఉద్యమకారిణి మేధా పాట్కర్‌కు ఢిల్లీ కోర్టు సోమవారం ఐదు నెలల సాధారణ కారాగార శిక్ష విధించింది. గుజరాత్‌లోని ఒక ఎన్జీవోకు సారథి, ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా 23 ఏళ్ల క్రితం పాట్కర్‌పై వేసిన కేసులో ఆమెను దోషిగా తేలుస్తూ గత నెల ఏడో తేదీన ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. అయితే శిక్ష ఖరారును రిజర్వ్‌చేసి సోమవారం తీర్పును వెలువరించారు. పరువునష్టం కింద సక్సేనాకు రూ.10 లక్షల జరిమానా చెల్లించాలని పాట్కర్‌ను కోర్టు ఆదేశించింది. తీర్పును పాట్కర్ పై కోర్టులో సవాల్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ నెలరోజులపాటు శిక్ష అమలును నిలిపివేస్తూ న్యాయమూర్తి రాఘవ్ శర్మ ఉత్తర్వులిచ్చారు. అయితే శిక్ష ప్రస్తుతానికి నిలుపుదల చేసిన నేపథ్యంలో తనకు బెయిల్ ఇవ్వాలని పాట్కర్ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఆనాడు సక్సేనాను పిరికిపంద అంటూ పాట్కర్ దూషించిన అంశం కోర్టులో రుజువుకావడంతో ఆమెను దోషిగా తేల్చారు. హవాలా లావాదేవీల్లో సక్సేనా హస్తముందంటూ పాట్కర్ చేసిన ఆరోపణల్లో నిజంలేదని, పాట్కర్ కారణంగా ఆయన పరువుకు నష్టం కలిగిందని కోర్టు అభిప్రాయపడిన విషయం విదితమే. 2000 సంవత్సరంలో అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేసే 'కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్' అనే స్వచ్ఛంద సంస్థకు వీకే సక్సేనా అధ్యక్షునిగా ఉండేవారు. తనకు, నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమానికి వ్యతిరేకంగా సక్సేనా ప్రకటనలు ఇచ్చారని ఆయనపై పాట్కర్ తొలిసారిగా ఫిర్యాదుచేశారు.

ఆస్ట్రేలియా స్టూడెంట్ వీసా ఫీజు రెట్టింపు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టూడెంట్ వీసా ఫీజును రెట్టింపునకు మించి పెంచింది. ప్రస్తుతం 710 డాలర్లు (రూ.59,255)గా ఉన్న ఫీజును 1,600 డాలర్లు (రూ.1.33 లక్షల)కు పెంచింది. పెంచిన ఫీజులు అమలవుతాయని జూలై ఒకటో తేదీ నుంచి తెలిపింది. దీని ప్రభావం ఆస్ట్రేలియాలో చదువుకోవాలనుకునే లక్షలాది మంది భారతీయ విద్యార్థులపై పడనుంది. ఆస్ట్రేలియాలో విదేశీ విద్యార్థుల్లో భారతీయులది రెండో స్థానం. 2023 ఆగస్ట్ నాటికి 1.2 లక్షల మంది భారతీయ విద్యార్థులున్నట్లు కాన్‌బెర్రాలోని భారత హైకమిషన్ తెలిపింది. ఇకపై విదేశీ విద్యార్థులు బ్రిటన్ వంటి దేశాలను ఎంచుకోవచ్చంటున్నారు. కునే బ్రిటన్‌లో స్టూడెంట్ వీసా ఫీజు 900 డాలర్లు(రూ.75 వేలు)గా ఉంది.

అధికార నిర్ణయాలకు మాత్రమే... మాజీ అధ్యక్షులకు రక్షణ

ట్రంప్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

వాషింగ్టన్: మాజీ అధ్యక్షులకు న్యాయ విచారణ నుంచి కొంతమేరకు రక్షణ ఉంటుందని తొలిసారిగా అమెరికా సుప్రీంకోర్టు సోమవారం తీర్పునిచ్చింది. 'రాజ్యాంగబద్ధమైన అధికార పరిధిలో తీసుకునే నిర్ణయాలకు మాజీ అధ్యక్షులకు క్రిమినల్ విచారణ నుంచి సంపూర్ణ రక్షణ ఉంటుంది. ఇది అధికారిక నిర్ణయాలకు మాత్రమే వర్తిస్తుంది. అనధికారిక చర్యలకు ఎలాంటి రక్షణ పొందలేరు' అని చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ 6–3 మెజారిటీ తీర్పులో పేర్కొన్నారు. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో ఓటమిని అంగీకరించకుండా ఫలితాలను తారుమారు చేయడానికి కుట్ర పన్నారనే అభియోగాలపై డొనాల్డ్ ట్రంప్ క్రిమినల్ కేసును ఎదుర్కొంటున్నారు. సుప్రీంకోర్టు సోమవారం ఈ కేసును తిరిగి ట్రయల్ కోర్టుకు అప్పగించింది. ఫలితంగా అధ్యక్ష ఎన్నిక జరిగే నవంబర్ 5 లోగా ట్రంప్ విచారణను ఎదుర్కొనే అవకాశాలు లేనట్టే. 'మాజీ అధ్యక్షులకు క్రిమినల్ విచారణ నుంచి మినహాయింపు అధ్యక్ష వ్యవస్థనే పునర్వ్యవస్థీకరిస్తుంది. చట్టానికి ఎవరూ అతీతులు కాదనే రాజ్యాంగ సూత్రాలను, భూమికను, ప్రభుత్వ వ్యవస్థను అవహేళన చేయడమే' అని జస్టిస్ సోనియా సొటోమేయర్ అన్నారు.

ప్యానెల్ స్పీకర్‌గా ఎంపీ కృష్ణప్రసాద్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్.. సభాపతి స్థానంలో లేని సమయంలో సభా కార్యకలాపాలకు అధ్యక్షత వహించడానికి ఎనిమిది మందిని సభాపతి ఓం బిర్లా నియమించారు. ఆరు పార్టీలకు చెందిన తొమ్మిది మంది సభ్యుల్ని నియమిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్డీఏ కూటమికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్‌కు ప్యానెల్‌లో స్థానం కల్పించారు. అయోధ్య ఉన్న ఫైజాబాద్ నుంచి గెలుపొందిన అవధేశ్ ప్రసాద్‌కు కూడా అవకాశమిచ్చారు.

సివిల్స్ ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) జూన్ 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించిన సివిల్స్ (ప్రిలిమినరీ) ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మార్కులు, కటాఫ్ మార్కుల వివరాలను అభ్యర్థులకు పంపామని ఓ అధికారి తెలిపారు. ఎంపికై న వారు మెయిన్స్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిన తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్ష, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష ప్రక్రియలు పూర్తయి తుది ఫలితాలను ప్రకటించాక ప్రిలిమ్స్ జవాబుల కీని యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని చెప్పారు.

లీకేజీలు, ప్రమాదాలు, దాడులు... ఇదే మోదీ 'పిక్చర్'!

రాజ్యసభలో దుయ్యబట్టిన ఖర్గే • ఆరెస్సెస్‌పై తీవ్ర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ''పదేళ్ల తన పాలన కేవలం ట్రైలరేనని, అసలు సినిమా ముందుందని లోక్‌సభ ఎన్నికల ప్రచారం పొడవునా మోదీ పదేపదే చెప్పుకున్నారు. ఆయన సినిమా ఎలా ఉండనుందో ఈ నెల రోజుల పాలన చెప్పకనే చెప్పింది. పేపర్ లీకేజీలు, కశ్మీర్‌లో ఉగ్ర దాడులు, రైలు ప్రమాదాలు, దేశమంతటా టోల్ ట్యాక్సుల పెంపు, బ్రిడ్జిలు, విమానాశ్రయాల పై కప్పులు కూలడాలు, చివరికి మోదీ ఎంతో గొప్పగా చెప్పుకున్న అయోధ్య రామాలయంలో కూడా లీకేజీలు... ఇదే మోదీ చూపిస్తానని చెప్పిన సినిమా!'' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. గంటన్నర పాటు సాగిన ప్రసంగంలో మోదీ ప్రభుత్వాన్ని అంశాలవారీగా ఏకిపారేశారు. సామాన్యుల కష్టాలను పట్టించుకోకుండా మోదీ కేవలం 'మన్ కీ బాత్'కు పరిమితమయ్యారంటూ చురకలు వేశారు. గతంలో ఏ ప్రధాని చేయని విధంగా ఎన్నికల ప్రచారంలో విద్వేష వ్యాఖ్యలతో సమాజాన్ని విభజించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇటీవలి పేపర్ లీకేజీలతో 30 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం ప్రమాదంలో పడిందని ఖర్గే అన్నారు. మణిపూర్ హింసాకాండ వంటి దేశం ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదంటూ ఆక్షేపించారు. విద్యా వ్యవస్థ గురించి మాట్లాడే క్రమంలో ఆరెస్సెస్‌పై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు, ఆరోపణలు, విమర్శలు చేశారు. ''ఆరెస్సెస్ విధానం దేశానికి చాలా ప్రమాదకరం. వర్సిటీలతో పాటు అన్ని విద్యా సంస్థల్లో వీసీలు, ప్రొఫెసర్ల నియామకాలపై దాని ప్రభావం ఉంటోంది'' అంటూ ఆక్షేపించారు. ఆ వ్యాఖ్యలను రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తీవ్రంగా ఖండించారు. ''ఆరెస్సెస్ సభ్యుడు కావడమే నేరమన్నట్టుగా మీ మాటలున్నాయి. ఆ సంస్థలో ఎందరో మేధావులున్నారు. అది జాతి నిర్మాణానికి అవిశ్రాంతంగా పాటుపడుతోంది. అలాంటి సంస్థను నిందిస్తున్నారు మీరు'' అన్నారు. మోదీపై, ఆరెస్సెస్‌పై ఖర్గే వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు.

కూర్చుని మాట్లాడతా: ఖర్గే అలాగే కానీయండి: ధన్‌ఖడ్

విపక్ష సభ్యుల తీవ్ర విమర్శలు, అధికార పక్ష ప్రతి విమర్శలతో వేడెక్కిపోయిన రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే వ్యాఖ్యలు, చైర్మన్ స్పందన నవ్వులు పూయించాయి. గంటన్నర పాటు ప్రసంగించిన ఖర్గే, తనకు మోకాళ్ల నొప్పులున్నందున కూర్చుని మాట్లాడేందుకు అనుమతి కోరారు. 'మీకెలా సౌకర్యంగా ఉంటే అలా చేయండి. ఇబ్బందేమీ లేదు' అంటూ ధన్‌ఖడ్ బదులిచ్చారు. కానీ కూర్చుని చేసే ప్రసంగం నిలబడి చేసినంత ప్రభావవంతంగా ఉండదని ఖర్గే అనడంతో సభ్యులంతా గొల్లుమన్నారు. ఆ విషయంలో మీకు వీలైనంత సాయం చేస్తా లెమ్మని ధన్‌ఖడ్ బదులివ్వడంతో సోనియాతో సహా అంతా మరోసారి నవ్వుకున్నారు. మరో సందర్భంలో ''నేను దక్షిణాదికి చెందిన వాడిని. కనుక ద్వివేది, త్రివేది, చతుర్వేది పదాలు నన్ను చాలా అయోమయపరుస్తాయి'' అని ఖర్గే అనడంతో 'కావాలంటే వాటిపై ఓ అరగంట పాటు ప్రత్యేక చర్చ చేపడదాం' అని ధన్‌ఖడ్ బదులిచ్చారు. దాంతో సభంతా మరోసారి నవ్వులతో దద్దరిల్లిపోయింది.

జూన్‌లో లోటు వర్షపాతం

- జూలైలో సాధారణానికి మించి వానలు
- ఐఎండీ చీఫ్ మహాపాత్ర వెల్లడి



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జూన్‌లో సాధారణం కంటే తక్కువగానే వానలు కురిశాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. గత అయిదేళ్లతో పోలిస్తే ఈసారి అత్యధికంగా జూన్‌లో 11 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు సోమవారం వెల్లడించింది. జూన్‌లో సాధారణంగా 165.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా, ఈసారి 147.2 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసిందని వివరించింది. 2001 నుంచి ఇలా జరగడం ఇది ఏడోసారని విశ్లేషించింది. జూన్ 11 నుంచి 27 వరకు 16 రోజుల పాటు సాధారణం కంటే తక్కువగా వానలు కురియడంతో లోటు నమోదైందని ఐఎండీ తెలిపింది. జూన్‌లో దక్షిణ భారతంలో మాత్రమే మిగులు వర్షపాతం 14 శాతం మేర రికార్డయినట్లు పేర్కొంది. అయితే జూలైలో సాధారణం కంటే ఎక్కువగానే వానలు పడతాయని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు.

రషీద్ ప్రమాణ స్వీకారానికి ఎన్ఐఏ ఓకే



న్యూఢిల్లీ: జైల్లో ఉన్న కశ్మీరీ నాయకుడు, ఎంపీగా ఎన్నికైన షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజనీర్ రషీద్) ప్రమాణ స్వీకారం చేయడానికి మార్గం సుగమమైంది. జూలై 5న రషీద్ ఎంపీగా ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయి. ప్రమాణ స్వీకారం నిమిత్తం రషీద్‌కు ఒకరోజు బెయిల్ ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోమవారం ప్రత్యేక కోర్టుకు తెలిపింది. మీడియాతో మాట్లాడకూడదని, ప్రమాణ స్వీకార ప్రక్రియను ఒక రోజులో పూర్తి చేయాలని ఎన్ఐఏ షరతులు విధించింది. ఉగ్రవాదులకు ఆర్థిక సహాయం చేశారనే కేసులో కఠినమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద 2019 ఆగస్టులో అరెస్టయిన రషీద్ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ)పై నెగ్గారు.

ఫ్రాన్స్ ఎన్నికల తొలి రౌండ్‌లో విపక్ష కూటమి గెలుపు

పారిస్: ముందస్తు ఎన్నికలకు వెళ్లిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. దేశాధ్యక్ష ఎన్నికల తొలి రౌండ్‌లో మేక్రాన్‌కు చెందిన మితవాద సెంట్రిస్ట్ ఎన్‌సెంబల్ కూటమి మూడో స్థానంలో సరిపెట్టుకుంది. తొలి దశలో పోలైన 68 శాతం ఓట్లలో అతివాద నేషనల్ ర్యాలీ కూటమి ఏకంగా 33.14 శాతం ఓట్లను ఒడిసిపట్టింది. న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమికి 27.99 శాతం వచ్చాయి. మేక్రాన్ పార్టీ 20.04 శాతంతో సరిపెట్టుకుంది. జూలై 7న రెండో రౌండ్ పోలింగ్ ఉంటుంది. గత నెలలో ఈయూ ఎన్నికల్లో కూడా నేషనల్ ర్యాలీ పార్టీయే విజయం సాధించింది.

శ్రీలంక హక్కుల నేత సంపంతన్ కన్నుమూత



కొలంబో: శ్రీలంకకు చెందిన సీనియర్ తమిళ నేత ఆర్.సంపంతన్ (91) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొలంబోలోని ఆస్పత్రిలో ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు తమిళ నేషనల్ అలయెన్స్ (టీఎన్ఏ) పార్టీ ప్రకటించింది. మితవాద భావాలు కలిగిన ఆయన శ్రీలంకలో తమిళులకు శాంతి, న్యాయం, గౌరవప్రదమైన స్థానం కోసం జీవితాంతం శ్రమించారు. సింహళులు మెజారిటీగా ఉన్న శ్రీలంకలో సంపంతన్ సారథ్యంలోని టీఎన్ఏ తొలిసారి 2004లో తమిళులకు చెందిన రెండో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. 1948లో బ్రిటన్ నుంచి శ్రీలంక స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి అక్కడి తమిళులు స్వతంత్ర ప్రతిపత్తి డిమాండ్‌ను వినిపిస్తూనే ఉన్నారు. 1970ల వరకు శాంతియుతంగానే సాగిన వీరి పోరాటం అనంతర కాలంలో హింసాత్మక రూపం దాల్చింది. 1977లో ట్రింకోమలి నుంచి సంపంతన్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. తమిళుల స్వతంత్ర ప్రతిపత్తి డిమాండ్‌కు రాజకీయ పరమైన పరిష్కారానికి తీవ్రంగా ప్రయత్నించారు. 2015లో ప్రతిపక్ష నేతగా ఎన్నికై న తర్వాత ఆయన శ్రీలంక నూతన రాజ్యాంగం రూపకల్పనలో పాలుపంచుకున్నారు. ఆయన మృతికి ప్రధాని మోదీ తదితరులు సంతాపం ప్రకటించారు.

నాకు మొబైల్ లేదు: సిద్ధూ

బనశంకరి: కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తాను మొబైల్ ఫోన్ వాడనని చెప్పారు. సోమవారం మీడియా ప్రశ్నకు బదులిస్తూ, ''ఒకప్పుడు ఆర్నెల్లు మొబైల్ వాడాను. రాత్రి వేళ ఫోన్లు రావడం, నిద్రకు భంగం కలగడంతో పక్కన పెట్టా. ఏ విషయమైనా పీఏలు, గన్‌మెన్ వచ్చి చెబుతారు. సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో నా కుమారుడు చెబుతాడు'' అన్నారు. నాయకత్వ మార్పుపై హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తానని సిద్దరామయ్య అన్నారు. డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్‌కు సీఎంగా అవకాశమివ్వాలని ఇటీవల ఒక్కళిగ మతగురువు ఒకరు సిద్దరామయ్య సమక్షంలోనే కోరడం తెలిసిందే.

నీట్-యూజీ రీటెస్ట్ పరీక్ష ఫలితాలు వెల్లడి

అందరి సవరించిన ర్యాంకులు విడుదల



న్యూఢిల్లీ: సమయాభావం, సాంకేతిక సమస్యల కారణంగా జూన్‌లో నీట్–యూజీ పరీక్షలో గ్రేస్ మార్కులు సాధించిన అభ్యర్థులకు మళ్లీ చేపట్టిన పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సోమవారం ప్రకటించింది. దీంతో గ్రేస్ మార్కులు పొందిన వారితోసహా గతంలో పరీక్ష రాసిన వారందరి ర్యాంక్‌లు మారిపోయాయి. సవరించిన ర్యాంకులను సోమవారం విడుదలచేశారు. మే 5న ఆరు పరీక్షకేంద్రాల్లో రాసిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు కలిపిన అంశం తీవ్ర వివాదాస్పదమైన విషయం తెల్సిందే. గ్రేస్ మార్కులు పొందిన 1,563 అభ్యర్థుల కోసం జూన్ 23వ తేదీన మళ్లీ పరీక్షచేపట్టగా 48 శాతం మంది హాజరుకాలేదు. కేవలం 52 శాతం (813 మంది) అభ్యర్థులే హాజరయ్యారు. ఆనాడు గ్రేస్ మార్కులు ఇచ్చిన కారణంగా హరియాణాలోని ఒకే పరీక్షాకేంద్రంలో రాసిన ఆరుగురికి సరిగ్గా 720కిగాను 720 మార్కులు సాధించి ఫస్ట్ ర్యాంక్ సాధించారు. మరో 61 మంది కూడా ఫస్ట్‌ర్యాంక్ సాధించడంతో పరీక్ష నిర్వహణపై అనుమానాలు రేకెత్తడం తెల్సిందే. మరోవైపు నీట్–యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనాత్మకమైన విషయం విదితమే. మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగిన నీట్‌యూజీ పరీక్షను దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర వైద్యవిద్యా కోర్సుల ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నీట్‌యూజీని ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంటారు.

మూడేళ్లలో న్యాయం

నూతన చట్టాలతో నేరాలు తగ్గుతాయి: అమిత్ షా

న్యూఢిల్లీ: సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన నూతన నేర చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలోపు కోర్టులో న్యాయం అందేలా చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. బ్రిటిష్ వలస పాలనాకాలం నుంచి కొనసాగుతున్న భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో కొత్తగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్ఏ) చట్టాలను అమల్లోకి తెచ్చిన సందర్భంగా సోమవారం ఢిల్లీలో అమిత్‌షా పత్రికా సమావేశంలో మాట్లాడారు. '' కొత్త చట్టాల అమలుతో నేరాలు తగ్గుముఖం పడతాయి. నూతనచట్టాల కింద 90 శాతం వరకు నేరాలు నిరూపించబడి దోషులకు శిక్షలుపడతాయి. జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులపై పోలీసుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఎస్ఎంఎస్ తదితర విధానంలో సమన్ల జారీ, హేయమైన నేరాలకు సంబంధించి ఘటనాస్థలిని వీడియో తీయడం, బాధితురాలి ఇంటి వద్ద వాంగ్మూలం తీసుకోవడం వంటి ఎన్నో నిబంధనలను కొత్త చట్టాలు తీసుకొచ్చాయి'' అని షా చెప్పారు.



10 నిమిషాలకే కొత్త చట్టం కింద కేసు

''కొత్త చట్టాలు సోమవారం అర్ధరాత్రి అమల్లోకి వచ్చిన 10 నిమిషాలకే మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ సిటీలో కొత్త చట్టం కింద బైక్ దొంగతనం కేసు నమోదైంది. వలసపాలనాకాలంలో బ్రిటిష్ వాళ్లు నేరాలపై శిక్షకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. మేం కొత్త చట్టాల ద్వారా న్యాయానికి ప్రాధాన్యతనిస్తున్నాం. ఈ–ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్, డిజిటల్ సాక్ష్యాల ద్వారా నేరాలపై ఫిర్యాదును మరింత సులభతరం చేశాం. సుదీర్ఘకాలం వేచి ఉండాల్సిన పనిలేకుండా త్వరగా న్యాయం జరిగేలా న్యాయవ్యవస్థకూ కాలపరిమితిని విధించాం. చిన్నారులు, మహిళలపై నేరాలను సున్నితమైనవిగా పరిగణించాం. కొత్త చట్టం ప్రకారం ఈ కేసుల్లో ఏడు రోజుల్లోపు దర్యాప్తు నివేదిక ఇవ్వాల్సిందే. నేర కేసుల్లో దర్యాప్తు ముగిసిన 45 రోజుల్లోపు కేసు తీర్పు చెప్పాల్సిందే. తొలిసారిగా ఒక కేసు విచారణ మొదలైన రోజు నుంచి 60 రోజుల్లోపు అభియోగాలు దాఖలుచేయాలి.


511 సెక్షన్లను 358కి కుదించాం

ఒకేలా ఉన్న వేర్వేరు సెక్షన్లను కలిపేశాం. దీంతో 511 సెక్షన్లకు బదులు 358 సెక్షన్లు మిగిలాయి. ఉదాహరణకు 6వ సెక్షన్ నుంచి 52వ సెక్షన్‌లోని నిబంధనలను ఒకే సెక్షన్‌లోకి మార్చారు. న్యాయం, పారదర్శకత, నిష్పాక్షికత లక్ష్యంగా ఈ మూడు చట్టాలను తెచ్చాం'' అని షా వివరించారు.



ఆకుపచ్చ నగరి

గ్రేటర్‌ను అందమైన ఆకుపచ్చ నగరంగా మార్చేందుకు హెచ్‌ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఒకప్పుడు ఉద్యాన వనాల నగరంగా పేరొందిన హైదరాబాద్ వైభవాన్ని పునరుద్ధరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. -8లో



మూడింట రెండు 'డ్రైవింగ్' పైనే!

కొత్త చట్టం భారత న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) కింద గ్రేటర్‌లో నమోదైన తొలి కేసులు 'డ్రైవింగ్'తో ముడిపడిన రహదారి భద్రతకు సంబంధించినవే ఉన్నాయి. రాష్ట్రంలోనే తొలి కేసుగా చార్మినార్ పోలీసుస్టేషన్‌లో నమోదైంది. -8లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్ట ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో పశ్చిమ/దక్షిణ పశ్చిమ దిశగా వీచే అవకాశం ఉంది.

గాంధీలో ఉద్రిక్తత





నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరుతూ గాంధీ ఆస్పత్రిలో గత ఎనిమిది రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా పలువురు తరలి రావడంతో సోమవారం ఇక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు బందోబస్తు చేపట్టినప్పటికీ దాదాపు 100 మంది గాంధీ అలుమ్నీ భవనం వద్ద గేట్లు దూకి ఆస్పత్రి ప్రాంగణంలోకి దూసుకు వచ్చారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ప్రత్యేక వాహనంలో అక్కడి నుంచి తరలించారు.



- 6న బల్దియా సర్వసభ్య సమావేశం
- 4న స్టాండింగ్ కమిటీ సమావేశం

మారనున్న సభా దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో వివిధ పనుల మంజూరు తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకునే జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం, అన్ని అంశాలపై చర్చలు జరిపే సర్వసభ్య సమావేశం..రెండూ కూడా ఈ వారంలోనే జరగనున్నాయి. ప్రతివారం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ, మూడు నెలలకోమారు జరగాల్సిన సర్వసభ్య సమావేశాలు ఎన్నికల కోడ్ కారణంగా నిర్వహించలేదు. కోడ్ ముగిసిపోగానే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఉన్న రోనాల్డ్‌రాస్ రెండు వారాల సెలవుతో విదేశీ పర్యటనకు వెళ్లారు. స్టాండింగ్ కమిటీ సమావేశం ప్రతి వారం జరిగేదే కాగా, సర్వసభ్య సమావేశానికి కమిషనర్ నిర్ణయం అవసరం. దాంతో ఎన్నికల కోడ్ జూన్ మొదటి వారంలోనే ముగిసినా సమావేశ తేదీని నిర్ణయించలేదు. రోనాల్డ్‌రాస్ సెలవు నుంచి వచ్చిన రోజే ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా ఆయన జీహెచ్‌ఎంసీ నుంచి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆమ్రపాలి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రతివారం యథావిధిగా జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 4వ తేదీన జరగనుండగా, 6వ తేదీన సర్వసభ్య సమావేశం జరగనుంది.

మేయర్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ..

ఈసారి సర్వసభ్య సమావేశంలో పార్టీల బలాబలాలు మారనున్నాయి. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరిగినప్పుడు కేవలం రెండు కార్పొరేటర్ సీట్లు మాత్రం గెలిచిన కాంగ్రెస్ బలం ప్రస్తుతం ఇరవైకి చేరువగా ఉంది. అంతేకాదు..గత సర్వసభ్య సమావేశం వరకు బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరారు. గత సమావేశం వరకు బీఆర్‌ఎస్ మేయర్‌గా వ్యవహరించిన ఆమె జరగబోయే సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నేతగా వ్యవహరించనున్నారు. మేయర్ కాంగ్రెస్ పార్టీ అయినప్పటికీ, ఆ పార్టీ సభ్యులు మాత్రం బీఆర్‌ఎస్, ఎంఐఎంల కంటే తక్కువే ఉన్నారు. దీంతో సర్వసభ్య సమావేశంలో విచిత్ర సన్నివేశాలు ఆవిష్కృతమయ్యే అవకాశముంది. మొన్నటి వరకు నగరంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు.. జరగబోయే సమావేశంలో పనులు జరగడం లేదని, ప్రజలు సమస్యలతో అల్లాడుతున్నారని విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టనున్నారు. అలాగే గతంలో సమస్యలపై తీవ్ర ఆందోళనలు, నిరసనలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అందుకు భిన్నంగా వ్యవహరించనుంది. ఇక, బీజేపీ, ఎంఐఎంలు ఎప్పటిలాగే తమ వైఖరిని ప్రదర్శించనున్నాయి.

విపత్తుల నిర్వహణకు 'హైడ్రా'

- శివార్లలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల వరకు సేవలు
- విపత్తులప్పుడే కాకుండా నిరంతర సేవలు..నాలాలు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ
- హోర్డింగులు, తాగునీరు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీలు తదితర అంశాల్లోనూ సేవలు
- సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్ విభాగాల నుంచి స్పెషల్ టీమ్స్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగానికి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అందుకు అనుగుణంగా వ్యవస్థాగత మార్పులతో పాటు, బాధ్యతల పంపిణీ జరగాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో సోమవారం సాయంత్రం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఎండీఏ, మూసీ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ భౌగోళిక పరిధిని విస్తరించనున్న దృష్ట్యా విపత్తుల నిర్వహణ విభాగం పరిధిని కూడా ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు ఈ విభాగం సేవలు అందించేందుకు అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ఇకపై ఈ విభాగాన్ని 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా)' అని పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు. డీఐజీ స్థాయి అధికారి ఈ విభాగానికి డైరెక్టర్‌గా, ఎస్పీ స్థాయి అధికారులు అడిషనల్ డైరెక్టర్లుగా ఉండేలా చూడాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, వివిధ విభాగాల నుంచి ప్రత్యేక టీంలు ఈ విభాగంలో నియమించాలని సూచించారు. కేవలం వరదలు, ప్రమాదాలు సంభవించినప్పుడే కాకుండా ఇకపై విపత్తుల నిర్వహణ విభాగం సిటీ ప్రజలకు నిరంతరం సేవలందించేలా పునర్వ్యవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలన్నింటిలో 'హైడ్రా' క్రియాశీలంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ

జీహెచ్‌ఎంసీ పరిధిలో దాదాపు రెండువేల కిలోమీటర్ల మేర ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించటం, సిటీలోని నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవకుండా కాపాడే కీలక బాధ్యతలను ఈ విభాగమే చేపట్టాలని నిర్ణయించారు. దీంతో పాటు హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాలన్నింటిలోనూ ఈ విభాగం సేవలందిస్తుంది. అందుకు వీలుగా ఈ విభాగం పునర్వ్యవస్థీకరణ, సిబ్బంది, విధులు, నిధుల కేటాయింపు, బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ఎంఆర్‌డీపీ పనులు, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎంఆర్‌డీపీ) పనులను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ సిటీకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చేలా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు.

చారిత్రక నిర్మాణాల పునరుద్ధరణ

సిటీలోని చారిత్రక ప్రాధాన్యమున్న కట్టడాలు, శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సిటీ లైబ్రరీ, చార్మినార్ సమీపంలోని ఆయుర్వేద హాస్పిటల్, నిజామియా అబ్జర్వేటరీ, గుడిమల్కాపూర్ కోనేరు లాంటి వివిధ చారిత్రక ప్రదేశాలపై జీహెచ్‌ఎంసీ ప్రదర్శించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను చూసిన సీఎం వాటిని పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు ఉన్న వివిధ మార్గాలను అన్వేషించాలని సూచించారు. వీటిలో మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అనుసంధానం చేసేందుకు వీలైన వాటిని గుర్తించి, అందులోనే కలపాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ విపత్తు నిర్వహణ కమిషనర్ ఏవీ రంగనాథ్, హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

4న తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు 3, 4 ఫేజ్‌లకు విద్యుత్ సరఫరా చేసే 132 కేవీ పెద్దాపూర్, కంది సబ్ స్టేషన్లలో మరమ్మతు పనుల నేపథ్యంలో ఈ నెల 4న గురువారం ఉదయం 7 గంటల నుంచి మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఏడు గంటల వరకు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని జలమండలి ఒక ప్రకటనలో తెలిపింది. 24 గంటల పాటు షేక్‌పేట్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, బోరబండ, మూసాపేట్, నల్లగండ్ల, చందానగర్, హుడా కాలనీ, హఫీజ్‌పేట్, మణికొండ, నార్సింగి, మంచిరేవుల, తెల్లాపూర్ తదితర ప్రాంతాల్లో పూర్తిగా అంతరాయం, భోజగుట్ట రిజర్వాయర్, బంజారా, ఎర్రగడ్డ, కేపీహెచ్‌బీ, హైదర్‌నగర్ తదితర ప్రాంతాల్లో లో–ప్రెజర్‌తో నీటి సరఫరా జరగుతుందని పేర్కొంది. అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి సూచించింది.

మెట్రోకు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సర్టిఫికెట్



అవార్డు అందుకుంటున్న కేవీబీ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థకు మధ్య స్థాయి సంస్థల కేటగిరీలో 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సర్టిఫికెట్ లభించింది. అత్యుత్తమ పని సంస్కృతిని ప్రోత్సహించే సంస్థలకు గ్రేట్ ప్లేస్ టు ఇండియా సంస్థ ప్రతి సంవత్సరం ఈ ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ గుర్తింపును ప్రకటిస్తుంది. 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోకు ఈ సర్టిఫికేషన్ లభించడం విశేషం. పని చేసే చోట ఉద్యోగులకు సానుకూలమైన, సాధికారికమైన పరిస్థితులను కల్పించడంలో ఎల్‌అండ్‌టీ మెట్రోకు గల నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనంగా నిలుస్తుంది. విశ్వసనీయత, గౌరవం, నూతన ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించే పరిస్థితులను కల్పించడంలో ఉద్యోగుల సంక్షేమం, వృద్ధి విషయంలో కంపెనీకి గల అంకిత భావానికి సముచితమైన గుర్తింపు లభించిందని అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే తొలి ప్రయత్నంలోనే ట్రస్ట్ ఇండెక్స్‌కి సంబంధించి అత్యధికంగా 92 స్కోరు పొందిన అతి కొద్ది సంస్థల్లో ఒకటిగా ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో నిలిచింది. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ అండ్ సీఈవో కేవీబీరెడ్డి మాట్లాడుతూ, ఈ గుర్తింపు లభించడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఉద్యోగుల కఠోర పరిశ్రమ, అంకితభావానికి ఈ సర్టిఫికేషన్ నిదర్శనమని పేర్కొన్నారు. పని ప్రదేశంలో పరిస్థితులను నిరంతరం మెరుగుపర్చేందుకు, ఉద్యోగుల ఎదుగుదల కోసం అత్యుత్తమమైన అవకాశాలను కల్పించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఉద్యోగులే అత్యంత విలువైన సంపద అని ఎల్‌అండ్‌టి విశ్వసిస్తుందన్నారు. పరస్పర సహకారం, గుర్తింపు, వృత్తిగత అభివృద్ధికి దోహదపడే సంస్కృతిని పెంపొందిస్తున్నందుకు గాను ఎల్‌అండ్‌టీ సీహెచ్‌ఆర్‌వో బినో జోస్ మాథ్యూను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

తమిళనాడులో ఆర్టీఏ పౌరసేవలపై అధ్యయనం



సాక్షి, సిటీబ్యూరో: తమిళనాడు రవాణాశాఖ అందజేస్తున్న వివిధ రకాల పౌరసేవలను అధ్యయనం చేసేందుకు రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలోని అధికారుల బృందం చెన్నైకి వెళ్లింది. రవాణాశాఖ సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్న రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు తెలంగాణ రవాణా అధికారుల బృందాలు కర్ణాటక, ఏపీ, ఒడిశా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల పౌరసేవలపైన అధ్యయనం చేపట్టాయి. ఈ క్రమంలోనే సోమవారం డీటీసీ చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలో ఉప్పల్ ప్రాంతీయ రవాణా అధికారి వాణి, కామారెడ్డి మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ జింగ్లీ శ్రీనివాసులు చెన్నై రవాణా కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించారు. తమిళనాడు రవాణా శాఖ కమిషనర్ షణ్ముగ సుందరం, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడులో అమలవుతున్న 'ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్, వాహన్ పోర్టల్, కాలం చెల్లిన వాహనాల స్క్రాపింగ్ పాలసీ, పన్నుల విధానం, ఆదాయ మార్గాలు, చెక్ పోస్టుల పనితీరు, ఆన్‌లైన్ సర్వీసులు, తదితర అంశాలపైన ఆ రాష్ట్ర అధికారులతో చర్చించినట్లు చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ పౌరసేవల అమలు తీరుతెన్నులను కూడా పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు తమ పర్యటన కొనసాగనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం తెలంగాణ రవాణా కమిషనర్‌కు నివేదికను అందజేయనున్నారు.

అందుబాటులోకి 'థర్మోవిజన్' కెమెరాలు!

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సరఫరాలో తరచూ తలెత్తే సాంకేతిక లోపాలను ముందే గుర్తించి, మెరుగైన సరఫరా కోసం డిస్కం సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం'థర్మో విజన్' కెమెరాలను అందుబాటులోకి తెచ్చింది. కంటికి కన్పించని అతి సూక్ష్మమైన లోపాలను కూడా ఈ కెమెరాతో గుర్తించే అవకాశం ఉంది. రాబోయే ముప్పును ముందే పసిగట్టడం ద్వారా సరఫరాలో అంతరాయాలను నివారించొచ్చు. ప్రస్తుతం గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 35 కెమెరాలను సమకూర్చింది. తద్వారా జాయింట్లలో లోపాలు, సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లపై పడుతున్న ఒత్తిడి, ట్రాన్స్‌పార్మర్లలో ఆయిల్ లీకేజీలు, కేబుళ్లలో తలెత్తే సాంకేతిక లోపాలను ముందే గుర్తించి, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. నిజానికి భగ్గున మండే ఎండలకు తోడు అధికలోడు కారణంగా ఇన్సులేటర్ల మధ్య పగుళ్లు ఏర్పడుతుంటాయి. వర్షపు చినుకులు పడగానే టఫ్...మంటూ పేలిపోతుంటాయి. లైన్లు, జాయింట్ల మధ్య లూజు కనెక్షన్లు ఉంటాయి. విద్యుత్ ప్రసారం జరిగే క్రమంలో చర్..చర్..మనే శబ్దంతో ఎర్రటి మినుగురులు ఎగిసిపడుతుంటాయి. షార్ట్‌సర్క్యూట్ తలెత్తి..వైర్లు తెగిపడే వరకు ఈ సమస్య గుర్తించలేని దుస్థితి. ఈ కెమెరాతో ఈ లోపాలను ముందే గుర్తించే అవకాశం ఉంది. తాజాగా హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలోని ఓ సబ్‌స్టేషన్‌లో ఆపరేషన్స్ విభాగం ఇంఛార్జీ డైరెక్టర్ నరసింహులు, సీఈ నరసింహాస్వామి, బాలస్వామిలతో కూడిన ఇంజనీర్ల బృందం ఈ థర్మోవిజన్ పరికరాల పనితీరును పరిశీలించారు.

విలీనానికి ఓకే!

షరతులు వర్తిస్తాయి
- కంటోన్మెంట్ విలీనంపై రక్షణ శాఖ రోజుకో మెలిక
- పురపాలనకు సరే..భూముల బదలాయింపుపై కిరికిరి
- ఆర్మీ భద్రత దృష్ట్యా ఆస్తుల మార్పిడికి ససేమిరా..



సాక్షి, సిటీబ్యూరో: కంటోన్మెంట్ విలీనంపై కేంద్ర ప్రభుత్వం కొత్త మెలిక పెడుతోంది. హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ)లో కలిపేందుకు ఎలాంటి అభ్యంతరం లేదంటూనే..షరతులు వర్తిస్తాయని స్పష్టం చేస్తోంది. కంటోన్మెంట్‌లోని పౌర ప్రాంతాల (సివిలియన్)ను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధమంటూనే కొత్త కొర్రీలు పెడుతోంది. సివిలియన్ ఏరియాలో పురపాలన (మున్సిపల్) హక్కులు మాత్రమే బదలాయిస్తామని, యాజమాన్య హక్కులు ఇవ్వబోమని తేల్చి చెబుతోంది. రక్షణ ప్రాంత భద్రతను దృష్టిలో పెట్టుకొని భూములు, ఆస్తులపై హక్కులు కల్పించేందుకు ససేమిరా అంటోంది. భవన నిర్మాణ అనుమతుల్లో ఆంక్షలు యథావిధిగా మరింత కఠినంగా అమలు చేసే అవకాశం కూడా లేకపోలేదని కంటోన్మెంట్ మాజీ ఉన్నతాధికారి ×సాక్షి₹కి చెప్పారు. తమ స్థలాలు ఫ్రీ హోల్డ్ అవుతాయేమోనన్న ఆశతో విలీనానికి మద్దతు పలికిన ఓల్డ్ గ్రాంట్ బంగళాల కబ్జాదారులకూ రక్షణశాఖ వ్యవహారం ఆందోళన కలిగిస్తోంది. బీ–3, బీ–4 స్థలాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వబోమని ఇప్పటికే రక్షణ శాఖ తేల్చేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌సీఐ భూములకు బదులుగా కంటోన్మెంట్ సహా డెయిరీఫామ్, ఫైరింగ్ రేంజ్ భూములను బదలాయించాలని కోరుతోంది. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కేంద్రానికి లేఖ రాసిన సంగతి తెలిసిందే.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని స్థలాల వివరాలు

కేటగిరీ	విస్తీర్ణం (ఎకరాలలో)
ఏ–1 (ఆర్మీ వినియోగంలో ఉన్నది)	5,763
ఏ–2 (ఖాళీ ఆర్మీ స్థలం)	4
బీ–1 (కేంద్ర ప్రభుత్వ భూమి)	417
బీ–2 (రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు స్థలాలు)	2728
బీ–3 (లీజు స్థలాలు)	486
బీ–4 (ఖాళీ రక్షణ స్థలం)	90
సీ (కంటోన్మెంట్ బోర్డు స్థలం)	228
సివిల్ ఏరియా (బజార్ ల్యాండ్స్)	236

బదలాయింపు అంత ఈజీ కాదు..

కంటోన్మెంట్ పరిధిలోని సివిలియన్ ప్రాంతాలపై మున్సిపల్ అధికారాలను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించే అవకాశం ఉంది. ఆయా భూములపై యాజమాన్య హక్కులు యథావిధిగా రక్షణ శాఖ ఆధీనంలో ఉండనున్నాయి. ముఖ్యంగా బీ–3 కేటగిరీకి చెందిన ఓల్డ్ గ్రాంట్ బంగళాల విషయం పూర్వపు స్థితినే కొనసాగించనున్నారు. కంటోన్మెంట్ పరిభాషలో సివిల్ ఏరియాలుగా పరిగణించే 'బజార్'లలోనూ పేదలకు ఎలాంటి యాజమాన్య హక్కులు బదలాయించే అవకాశం కనిపించడం లేదు. ఆర్మీ అవసరాలకు అనుగుణంగా నగర పాలన సాగాలని, అంటే భవన నిర్మాణ అనుమతుల్లో ఆంక్షలు యథావిధిగా అమలు చేయాల్సి ఉంటుందని రక్షణశాఖ స్పష్టం చేస్తున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

బదలాయించేవి ఇవే !

- ఆర్మీ ఆధీనంలోని ఏ–1, ఏ–2, బీ–1, బీ–3, బీ–4 కేటగిరీలోని స్థలాలను ఆర్మీ తన ఆధీనంలోనే ఉంచుకోనుంది. బీ–2 కేటగిరీలోని ప్రైవేటు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌లు, వీధి దీపాలకు సంబంధించిన స్థలాలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ శాఖకు బదిలీ అవుతాయి.
- సీ కేటగిరీలోకి వచ్చే ప్రాంతాల్లో బోర్డు ఆధీనంలోని కార్యాలయాలు మాత్రమే బదలాయించనున్నారు. జింఖానా, పోలో మైదానం, డంపింగ్ యార్డుల స్థలాలను బదలాయించే అవకాశం లేదని తెలుస్తోంది.
- సివిల్ ఏరియాలుగా పరిగణించే బజార్ స్థలాలను సైతం మున్సిపల్ తరహా పాలనాధికారాలను మాత్రమే రాష్ట్రానికి అప్పగించనున్నారు. ఈ బజార్‌లలో నివసించే వారికి ఎలాంటి యాజమాన్య హక్కులు కల్పించరు.
- సీ కేటగిరీలోకి వచ్చే సుమారు 100 ఎకరాలతో పాటు 120 ఎకరాల అంతర్గత రోడ్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయింపు చేస్తామని కంటోన్మెంట్ అధికారులు ప్రతిపాదించినట్లు సమాచారం.

మీరే మాకు భూములివ్వాలి..

- కంటోన్మెంట్, రక్షణ శాఖ భూముల బదలాయింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌సీఐ ఏర్పాటు కోసం రక్షణశాఖకు కేటాయించిన 2,362 ఎకరాలు (రూ.12,312 కోట్ల విలువ) భూమికి బదులుగా అంతే సమానమైన రక్షణ స్థలాలను తమకు తిరిగి ఇవ్వాలని రాష్ట్ర సర్కారు కోరుతోంది.
- కేంద్రం ఆధీనంలోని రాష్ట్ర ప్రభుత్వ భూమి: రంగారెడ్డి జిల్లా రావిరాల గ్రామ పరిధిలోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ) ఆధీనంలో 2,362 ఎకరాలు.

బదులుగా రాష్ట్రం అడుగుతున్న భూములు..

- ఎలివేటెడ్ కారిడార్ కోసం కంటోన్మెంట్‌లోని భూములు: 178.22 ఎకరాలు
- శామీర్‌పేట పరిధిలోని డెయిరీ ఫామ్ స్థలం: 1,350 ఎకరాలు
- నిరుపయోగంగా ఉన్న షామీర్‌పేటలోని ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ (ఎస్‌ఎఫ్‌ఎఫ్ఆర్) స్థలం: 1,038 ఎకరాలు
- కంటోన్మెంట్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలోని ఇతర రక్షణ భూములు: సుమారు 300 ఎకరాలు



ఓయూ జాయింట్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జాయింట్ రిజిస్ట్రార్ (జేఆర్)గా ఎం.శ్రీనివాస్ పదోన్నతి పొందారు. సోమవారం పాలనా భవనం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌జీవోస్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయిస్ యూనియన్ల నాయకులు శ్రీనివాస్‌కు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సుదీర్ఘమైన పాలన అనుభవంతో జాయింట్ రిజిస్ట్రార్ పదోన్నతి పొందిన శ్రీనివాస్.. వర్సిటీ నియమ, నిబంధనలతో పాటు బడ్జెట్, ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు తదితర అంశాలు క్షుణ్ణంగా తెలిసిన ఆఫీసర్ అని ఎన్‌జీవోస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ ప్రశంసించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు నాగరాజురావు, శివశంకర్, విజయ్ కుమార్, అక్బర్ బేగ్, అశోక్ కుమార్, శంకరయ్య, భిక్షపతి, రాజేశ్వర్ రావు, రాజేశ్వర్ జలీల్, రాజేష్, మెహతాబ్, యూసఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

యువతిపై లైంగిక దాడి

అమీర్‌పేట: వరుడిని వెతుకుతున్న యువతిపై జీవన్ సాథీ యాప్ ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఉప్పల్ ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల యువతి జీవన్ సాథీ యాప్‌లో శోధిస్తుండగా ఎస్‌ఆర్‌నగర్ పరిధిలోని జయప్రకాష్‌నగర్‌లో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్న ముత్తుమ్మల రాజశేఖర్ పరిచయం అయ్యాడు. తాను ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పరిచయం పెంచుకున్నాడు. యువతికి చెందిన ఈమెయిల్ ఐడీనికి కూడా వినియోగించేవాడు. గత నెల 24న యువతికి ఫోన్ చేసి స్టూడియోకు రమ్మని చెప్పాడు. మరుసటి రోజు స్టూడియోకు వెళ్లిన యువతిని బెదిరించాడు. తాను చెప్పినట్లు వినకపోతే మెయిల్ ద్వారా లభ్యమైన ఫొటోలను అందరికీ పంపి పరువుతీస్తానని భయపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలు అక్కడి నుండి బయటపడి దగ్గరి బంధువైన మహిళకు తెలిపింది. అనంతరం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి ఎస్‌ఆర్‌నగర్‌కు బదిలీ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నేలకూలిన చెట్టు.. ఏడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం



నాంపల్లి: గగన్ విహార్ భవన సముదాయంలో ఓ చెట్టు నేలకూలింది. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. చెట్టు కూలిన సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నాంపల్లి గాంధీభవన్ ఎదుట ఉన్న గగన్ విహార్ భవనం కింది భాగంలో గృహకల్ప భవన సముదాయానికి ఆనుకుని పార్కింగ్ స్థలం ఉంది. ఇక్కడ ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తారు. ఈ స్థలంలోనే చెట్టు కూలిపోయి ద్విచక్రవాహనాల మీద పడింది. ఈ ఘటనలో ఏడు వాహనాలు ధ్వంసమయ్యాయి. గగన్ విహార్ భవనాన్ని హౌసింగ్ బోర్డు అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. చెట్టు కూలిన విషయాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలియజేయడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది వెంటనే తొలగించారు.

ఆకుపచ్చ నగరి



గ్రేటర్‌లో పచ్చదనం విస్తరణకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు

- 5 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయం
- 40 నర్సరీల్లో మొక్కల పంపిణీ
- ప్రతి ఆధార్‌పైన 6 మొక్కలు
- వజ్ర వనమహోత్సవంలో భాగంగా...

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అందమైన ఆకుపచ్చ నగరంగా రూపుదిద్దుకొనేందుకు హెచ్‌ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఒకప్పుడు ఉద్యాన వనాల నగరంగా పేరొందిన హైదరాబాద్ వైభవాన్ని పునరుద్ధరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. గత పదేళ్లలో సాధించిన పచ్చదనం విస్తరణను రానున్న రోజుల్లో మరింత పరుగులు పెట్టించేందుకు భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, ఔటర్‌రింగ్‌రోడ్డు తదితర అన్ని ప్రాంతాల్లో సుమారు 7200 చదరపు కిలోమీటర్ల పరిధిలో 5 కోట్ల మొక్కలను నాటే కార్యక్రమాన్ని తాజాగా ప్రారంభించారు. వజ్ర వనమహోత్సవంలో భాగంగా తెలంగాణ అంతటా 20 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అందులో భాగంగానే నగరంలో గ్రీన్ కవర్‌ను పెంచేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నారు. మరోవైపు వ్యక్తులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద, పర్యావరణ సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాలు, మున్సిపాలిటీలతో పాటు చెరువులు, రహదారులు, పార్కుల్లో మొక్కలు నాటనున్నారు. అలాగే నగర శివార్లలో మరిన్ని కొత్త పార్కులను ఏర్పాటు చేసేందుకు కూడా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన పార్కులలో మరిన్ని కొత్త మొక్కలను నాటడడంతో పాటు అవసరమైన చోట కొత్త పార్కులను కూడా అభివృద్ధి చేయనున్నారు.

పండ్ల మొక్కలకు ప్రాధాన్యత...

ఈసారి రకరకాల పండ్ల మొక్కలను నాటనున్నారు. ఇప్పటికే హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 40 నర్సరీల ద్వారా అన్ని ప్రాంతాలకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పలుచోట్ల హెచ్‌ఎండీఏ కొత్తగా ఏర్పాటు చేయనున్న ఇనుముల్ నర్వా, లేమూరు తదితర లే అవుట్‌లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంవత్సరం నాటనున్న పండ్ల మొక్కల్లో నేరేడు, వెలగ, ఉసిరి, ఖర్జూరం, మర్రి, రావి,



జువ్వి, తదితర రకాలు ఉన్నాయి. అలాగే రహదారులు, ఔటర్‌రింగ్‌రోడ్డు, బ్యూటిఫికేషన్‌లో భాగంగా 46 చెరువులు, పార్కులలో తబూబియా, లాగర్‌స్ట్రోమియా, బోగన్‌వీలియా, బాహినియా, స్పాతోడియా తదితర అందమైన పూల మొక్కలను నాటుతారు. అలాగే విలువైన చెట్లను కూడా పెద్ద ఎత్తున పెంచేందుకు హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చందనం, ఎర్రచందనం, టేకు, జిట్రేగి, ఏగిస, సోమి చెట్లను పెంచేందుకు ప్రోత్సహించనున్నారు. మొత్తం 165 రకాల మొక్కలను ఈ వజ్ర వన మహోత్సవంలో భాగంగా పంపిణీ చేయనున్నారు. హెచ్‌ఎండీఏ నర్సరీల్లో ప్రస్తుతం చాలావరకు 2.5 మీటర్ల నుంచి 3.5 మీటర్ల వరకు పెరిగిన మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

ఇండోర్ మొక్కల పంపిణీ....

గృహాలంకరణతో పాటు చక్కటి ఆక్సిజన్‌ను అందజేసే ఇండోర్ ప్లాంట్లను కూడా పంపిణీ చేయనున్నారు. ఆసక్తిగల నగరవాసులు వివిధ ప్రాంతాల్లో ఉన్న హెచ్‌ఎండీఏ నర్సరీల్లో వీటిని తీసుకోవచ్చు. మనీప్లాంట్, జురంతా, అకాలీఫా, బాంబేబార్డర్, చైనా బాక్స్, ప్లుమేరియా, ఎగ్లోరా, రియో తదితర మొక్కలను పంపిణీ చేస్తారు. ఒక ఆధార్ కార్డుకు 6 మొక్కల చొప్పున అందజేయనున్నట్లు అర్బన్‌ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ప్రైవేట్ సంస్థలకు నామమాత్రపు ధరల్లో కేవలం రూ.20కి ఒక మొక్క చొప్పున అందజేస్తారు. విలువైన మొక్కల కేటగిరీలోని టేకు, చందనం, ఎర్రచందనం, ఎగిస తదితర మొక్కలకు మాత్రం రూ.80 చొప్పున ధర ఉంటుంది.

ఏటేటా పెరుగుతున్న 'గ్రీన్ కవర్'...

గత పదేళ్లుగా హెచ్‌ఎండీఏ చేపట్టిన కార్యక్రమాల వల్ల పచ్చదనం గణనీయంగా విస్తరించింది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 2011లో నగర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనం కేవలం 5.2 శాతం ఉంది. 2021 నాటికి అది 12.9 శాతానికి పెరిగింది. అలాగే పదేళ్ల క్రితం 33.15 శాతం ఉన్న గ్రీన్ కవర్ 2021 నాటికి 81.81 శాతానికి పెరిగింది. పదేళ్లలో 48.66 శాతం అభివృద్ధిని సాధించినట్లు అధికారులు తెలిపారు. 634.18 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ప్రామాణికంగా తీసుకొని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఈ పదేళ్ల పచ్చదనం ప్రగతిని నిర్ధారించింది. ఈ మేరకు నగరానికి ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డులు లభించాయి. 2020, 2021 సంవత్సరాల్లో వరుసగా 'ట్రీ సిటీ' అవార్డులు లభించగా, 2022లో గ్రీన్‌సిటీ అవార్డును సొంతం చేసుకుంది. పచ్చదనం విస్తరణలో ఇదే ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.

మూడింట రెండు డ్రైవింగ్ పైనే!

- బీఎన్‌ఎస్ చట్టం కింద నమోదైన తొలి కేసులు
- రాష్ట్రంలోనే మొదటిది చార్మినార్ ఠాణాలో
- తెల్లవారుజామున ఒంటిగంటకు ఎఫ్‌ఐఆర్
- సైబరాబాద్‌కు సంబంధించి రాజేంద్రనగర్‌లో
- ఎక్స్‌ప్రెస్ వేపై కారు ప్రమాదానికి సంబంధించి
- రాచకొండలో మాత్రం తీవ్రమైన దాడి ఆరోపణలతో...

సాక్షి, సిటీబ్యూరో: ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో అమలులోకి వచ్చిన కొత్త చట్టం భారత న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) కింది హైదరాబాద్, సైబరాబాద్‌లో నమోదైన తొలి కేసులు 'డ్రైవింగ్'తో ముడిపడిన రహదారి భద్రతకు సంబంధించినవే కావడం గమనార్హం. నగరంతో పాటు రాష్ట్రంలోనే తొలి కేసుగా చార్మినార్ పోలీసుస్టేషన్‌లో నమోదైంది రికార్డుకు ఎక్కింది. ఇది ర్యాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్‌కు సంబంధించింది. అలాగే సైబరాబాద్‌కు సంబంధించి రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్‌లో తొలి కేసు నమోదైంది. ఇది ర్యాష్ డ్రైవింగ్ కారణంగా జరిగిన మరణంపై రిజిస్టరైంది. రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు సంబంధించి తొలి కేసు ఎల్బీ నగర్ పోలీసుస్టేషన్‌లో రిజిస్టరైంది. ఇది తీవ్రమైన దాడికి సంబంధించి సెక్షన్‌తో నమోదైంది. కేవలం హైదరాబాద్, సైబరాబాద్‌లోనే కాదు... దేశంలోనే నమోదైన తొలి నేరం కూడా 'రహదారి'కి సంబంధించిందే కావడం గమనార్హం. అక్కడి కమల మార్కెట్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ఓ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఆక్రమించి, వ్యాపారాలు నడుపుతున్న వారిపై దీన్ని రిజిస్టర్ చేశారు.

రాజేంద్రనగర్ ఠాణా... ఎఫ్‌ఐఆర్ నెం.637/2024

విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల కోసం నిర్మించిన పీవీ నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్ వే రాజధానిలో ఉన్న ఏకైక ఎక్స్‌ప్రెస్ వే. దీనిపై సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోకి వచ్చే పిల్లర్ నెం.296 వద్ద మితిమీరిన వేగంతో దూసుకువచ్చిన థార్ కారు డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ధాటికి అనేక మట్టీలు కొట్టి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గణేష్ అక్కడిక్కడే చనిపోయాడు. దీనిపై ఉదయం 9.30 గంటలకు ఫిర్యాదు అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు బీఎన్‌ఎస్‌లోని సెక్షన్ 106 (1) కింది కేసు నమోదు చేశారు.

ఎల్బీనగర్ ఠాణా... ఎఫ్‌ఐఆర్ నెం.731/2024

బాలాపూర్‌లోని నంది హిల్స్ ప్రాంతానికి చెందిన సీహెచ్.నారాయణరెడ్డిపై జరిగిన దాడికి సంబంధించి ఎల్బీనగర్ పోలీసులు బీఎన్‌ఎస్ చట్టం కింద తొలి కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఈయన ఎల్బీనగర్ అలేఖ్య టవర్స్ సమీపంలోని ఓ హోటల్‌లో కిరణ్ అనే వ్యక్తితో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో నారాయణరెడ్డి తనకు రావాల్సిన డబ్బు విషయమై కిరణ్‌ను ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్యా మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. నారాయణరెడ్డి చొక్కా పట్టుకున్న కిరణ్ అక్కడి స్పూన్‌తో ఎడమ కాలిపై పొడిచాడు. దీంతో నారాయణరెడ్డికి గాయం కావడంతో పాటు రక్తస్రావమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు సోమవారం మధ్యాహ్నం 2.15 గంటలకు కిరణ్‌పై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 118 కింద కేసు నమోదు చేశారు.

ఆదిభట్లలో...

భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) చట్టం కింద తొలి కేసు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఆదిభట్ల ఠాణాలో నమోదైంది. తన భర్త చనిపోవడానికి అత్త మామలు, కుటుంబ సభ్యులే కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కొంగరకలాన్‌లో ఉడుతల రమేష్ అనారోగ్యంతో చనిపోవడానికి కారణం అత్తమామ, కుటుంబ సభ్యులేనని ఉడుతల ప్రభావతి ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు బీఎన్ఎస్ఎస్‌లోని 194 సెక్షన్ కింద ఎఫ్‌ఐఆర్ నెం.373/2024తో దీన్ని నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి ఆత్మహత్య

రసూల్‌పురా: పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బొల్లారం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన మేరకు.. బొల్లారం రిసాల బజార్‌కు చెందిన చందేకర్ రవి కుమారుడు అఖిల్ (17) ఇటీవల జరిగిన పదవతరగతి పరీక్షలు రాసి ఫెయిల్ అయ్యాడు. తిరిగి సప్లిమెంటరీ పరీక్షలు రాయగా మరోసారి తప్పాడు. దీంతో హాకీంపేట లోని ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్స్ మెస్‌లో ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆఫీసర్స్ మెస్ నుంచి సమాచారం రావడంతో సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు పోలీసులకు సమాచార మిచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

స్నేహితుడిని కత్తితో పొడిచి పరార్

అత్తాపూర్: పాన్ షాపు వద్ద పాన్ కొనుగోలు విషయమై ఇద్దరు స్నేహితుల మధ్య వివాదం చోటు చేసుకొని హత్యాయత్నానికి దారి తీసింది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు.. సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ రఫీ (28), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ నబీ (40) ఇద్దరూ స్నేహితులు. సోమవారం పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే ప్రాంతంలోని పాన్ షాపు వద్దకు వచ్చి పాన్ కొనుగోలు విషయమై ఘర్షణ పడ్డారు. దీంతో ఆవేశం పట్టలేని మహ్మద్ రఫీ తన వద్ద ఉన్న కత్తితో మహ్మద్ నబీపై దాడి చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన నబీని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. కత్తితో పొడిచి పారిపోయిన వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాల నుంచి 60 మంది ఎన్‌సీసీకి ఎంపిక




శిక్షణలో భాగంగా ఫిజికల్ టెస్ట్‌ల్లో పాల్గొన్న విద్యార్థినులు

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడ ప్రభుత్వోన్నత పాఠశాలలో సోమవారం ఎన్‌సీసీ సెలక్షన్స్ చేపట్టారు. 2024–25 ఏడాదికి గాను 8వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి 60 మంది విద్యార్థులను (క్యాడెట్స్)ను ఎంపిక చేశారు. నాలుగో తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఆశీష్ త్రిపాఠి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ అధికారులు సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఎన్‌సీసీ అధికారి పి.ప్రభాకర్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు రెండేళ్ల పాటు ఆర్మీ ట్రెనింగ్ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్లతో పాటుగా విద్య, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ రిజర్వేషన్స్ ఉంటాయన్నారు. హెచ్‌ఎం పరమేశ్వరమ్మ మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 60 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందని, వీరంతా ట్రెనింగ్ పూర్తి చేసి దేశ సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు బూట్ల పంపిణీ



బాలికలకు బూట్లు అందజేస్తున్న నర్సింగరావు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ స్కూల్ బాలికలకు ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు కార్యకర్తలతో కలిసి సోమవారం బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం షూ పంపిణీ చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీవన్, నాయకులు నగేశ్‌సాగర్, అబ్దుల్ గని, ఆకుల రాజు, కాటూరి రమేశ్, బోయ సాయిలు, నాగార్జున, సంపంగి కిరణ్, బసవరాజు, రవినాయక్, చందు, ఆంధ్ర శ్రీను, వీరేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



వెంకటేశ్వరకాలనీ: ఇటీవల బాధ్యతలు చేపట్టిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నాయుడునగర్ నుంచి సింగాడబస్తీ, ఎస్‌వీనగర్ నుంచి రోడ్డునెంబర్–14లోని మాజీ కార్పొరేటర్ ఇంటి సమీపం వరకు, గ్రాండ్‌మా బేకరీ నుంచి సింగాడకుంట వరకు, హనుమాన్ టెంపుల్ నుంచి దేరరకొండ బస్తీ, రోడ్డునెంబర్–3 నుంచి పేజ్ కాలేజ్ గ్రీన్ వ్యాలీ వరకు వరద కాలువ పనులు చేపట్టాలని కమిషనర్‌ను కోరినట్లు ఆమె తెలిపారు.

వన మహోత్సవానికి సన్నద్ధం..!

- ఖైరతాబాద్‌లో **3,08,924** మొక్కలు నాటాలని లక్ష్యం
- ఖాళీ స్థలాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే చేపట్టేలా ప్రణాళికలు



మొక్కలు నాటనున్న ఖాళీ ప్రాంతం




విజయ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

బంజారాహిల్స్: పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో 2014–15లో తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఖాళీ ప్రాంతాలు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, రోడ్డుపక్కన స్థలాలను గుర్తించి వాడవాడలా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'వన మహోత్సవం' పేరుతో అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి లోగోను సైతం సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఖరారు చేశారు. 9 విడతలుగా మొక్కలు నాటగా ప్రస్తుతం 10 విడత వన మహోత్సవం చేపట్టేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే సర్కిల్–17, 18లో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్ తదితర డివిజన్ల పరిధిలో 3,08,924 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో 1,09,960 మొక్కలు, జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో 1,98,964 మొక్కలు నాటాలే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 10 నెలలుగా వన మహోత్సవంలో నాటేందుకు జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో ఉన్న విజయ నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. అలాగే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో మరో ఆరు చోట్ల మొక్కలను సిద్ధం చేశారు. మొక్కలు నాటేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా 52 ప్రాంతాలను ఎంపిక చేశారు. వివిధ రకాల మొక్కలను నాటేందుకు సిద్ధమైన అధికారులు ఏ ప్రాంతంలో ఎలాంటి మొక్కలు నాటాలో అక్కడి భౌగోళిక పరిస్థితుల అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించే తేదీలు నేడో, రేపో ఖరారు కానున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ జీవ వైవిధ్య విభాగం (యూబీడీ) అధికారులు అన్ని సిద్ధం చేసుకున్నారు. కొద్ది రోజులుగా గుర్తించిన ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు అనువుగా జేసీబీలతో భూమిని చదును చేయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేశామని యూబీడీ అధికారులు తెలిపారు.

ఖైరతాబాద్ జోన్‌లో 5 లక్షల మొక్కలు..

జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధి కిందికి వచ్చే సర్కిల్–12, 13, 14, 17, 18లలో 5 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏ సర్కిల్‌లో ఎన్ని మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని కూడా విధించారు. ఆ మేరకు మొక్కలు నర్సరీల్లో సిద్ధమవుతున్నాయి. వన మహోత్సవం కోసం ప్రభుత్వం తగిన మార్గదర్శకాలు రూపొందించి విడుదల చేయగా, ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్తిచేయాలని అధికారులు నిర్ణయించారు.

ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రిలో డాక్టర్స్ డే



వైద్యులను సన్మానిస్తున్న డాక్టర్ కుర్ర సూర్యనారాయణ

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రిలో సోమవారం డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ కుర్ర సూర్యనారాయణ సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్‌ఖాన్‌తో పాటు పలువురు డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ మెతుకు నరేందర్, డాక్టర్ సరళ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కొమ్ము ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ సిస్టం ఆఫ్ మెడిసిన్‌తో రోగికి రక్షణ



లోగో ఆవిష్కరిస్తున్న సంస్థ డైరెక్టర్ డా.వెంకట రామిరెడ్డి, డాక్టర్లు

హిమాయత్‌నగర్: ఇంటిగ్రేటెడ్ సిస్టం ఆఫ్ మెడిసిన్‌తో రోగికి ఎంతో రక్షణ కలుగుతుందని మెడి–9 హెల్త్ సైన్సెస్ క్లీనికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట రామిరెడ్డి అన్నారు. సోమవారం వరల్డ్ డాక్టర్స్ డే సందర్భంగా మెడి–9 ఇంటిగ్రేటెడ్ మెడికల్ సిస్టమ్స్ (ఐఎంఎస్) లోగోను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వైద్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ హోమియోపతి, ఆయుర్వేద, పేషెంట్ యొక్క సమగ్ర సంరక్షణకు మెడి–9 హెల్త్ సైన్సెస్ సంస్థ సేవలు అందిస్తుందన్నారు. ఈ వ్యవస్థ ఆయుష్ మంత్రిత్వ శాఖ, మానవ క్లీనికల్ ట్రయల్స్ నిర్వహించేందుకు ఐసీఎంఆర్ భాగస్వామిగా పనిచేస్తుందన్నారు. 30 ఏళ్లకు పైగా అనుభవం, నైపుణ్యం, పరిశీలనా గల వైద్యుల బృందం వ్యాధి కారకాలను తెలుసుకుని వాటి మూలాలకు చికిత్స అందిస్తారన్నారు. ఇందులో మెడిసిన్, ఎక్సర్ సైజ్, డైట్, ఇమ్యూనిటీ బూస్టర్స్ ద్వారా చికిత్సను అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు రమణ రాజు, వరలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో టోకరా

వ్యాపారి నుంచి రూ.8.9 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హిమాయత్‌నగర్: ఎక్స్‌టీబీ ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యాపారిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన మేరకు.. నగరానికి చెందిన 41 ఏళ్ల వ్యాపారవేత్తకు ఎక్స్‌టీబీ ట్రేడర్స్ డీలర్, ఎక్స్‌టీబీ ఫారెక్స్ ట్రేడింగ్ కంపెనీ నుండి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. కంపెనీ తమ ట్రేడింగ్ బిజినెస్ చేస్తుందని సైబర్ నేరగాళ్లు నమ్మించి అతని పేరుతో ట్రేడింగ్ ఖాతాను సృష్టించి, టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. దాని ద్వారా ఓ లింక్ పంపించి వారు సృష్టించిన నకిలీ ట్రేడింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. బాధితుడి వ్యక్తిగత వివరాలు సేకరించి, మొదట రూ. లక్ష పెట్టుబడి పెట్టించి నమ్మించడానికి లాభాలు వచ్చినట్లు చూపించారు. పెద్దమొత్తంలో డబ్బు డిపాజిట్ చేయాలని, విదేశీ కరెన్సీ కొనుగోలు చేయాలని చెప్పారు. ఈ విధంగా విడతల వారిగా బాధితుడి నుంచి మొత్తం రూ.8,90,000 పెట్టుబడి పెట్టించి మోసం చేశారు. దీంతో బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించాలి



డీఈఓ రోహిణికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ప్రభుత్వ రౌండ్ టేబుల్ పాఠశాలలో టీచర్ల కొరత తీవ్రంగా ఉందని, వెంటనే నియమించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి కార్యాయలంలో డీఈఓ రోహిణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 30 మంది టీచర్ పోస్టులకు గాను కేవలం ఆరు గురు మాత్రమే ఉన్నారని దీంతో బోధన కష్టతరంగా మారిందన్నారు. వెంటనే ఉపాధ్యాయులకు ఇక్కడికి బదిలీ చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన డీఈఓ త్వరలోనే టీచర్ల కొరత సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారని ఆయన తెలిపారు. అదేవిధంగా బీజేఆర్‌నగర్‌లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ స్కూల్‌ను పునః నిర్మించాలని డీఈఓకు విన్నవించినట్లు పేర్కొన్నారు.

మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి దుద్దిళ్ల గృహ ప్రవేశం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం గృహప్రవేశం చేశారు. తనకు కేటాయించిన ఏడో నెంబర్ క్వార్టర్‌లోకి ఆయన కుటుంబసభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించి ఆసీనులయ్యారు. ఆయనకు పలువురు అధికారులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

'స్వస్తిక్' ఫౌండేషన్ డే



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ స్వస్తిక్ మిర్చి ఫౌండేషన్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ సామాజిక సేవలో భాగంగా చదువులో ప్రతిభ చూపిన ఉద్యోగుల పిల్లలకు దాంజీ జీవరాజ్‌నంద పేరిట ఉపకార వేతనాలను ప్రకటించింది. ఇందుకు ఎంపికైన 11 మంది పిల్లలకు ఆదివారం బేగంబజార్‌లోని తన సంస్థలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అందజేసింది.

ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న చాడ వెంకట్ రెడ్డి, ప్రతినిధులు

హిమాయత్‌నగర్: తెలంగాణ పర్యాటక శాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి కోరారు. ఈ మేరకు టూరిజం శాఖ ఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.ప్రకాశ్‌రెడ్డిని హైదర్‌గూడలోని కార్యాలయంలో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. 25 ఏళ్లుగా పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేసి, వారి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఎండీ కూడా సానుకూలంగా స్పందించారని యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బు రాజమౌళి తెలిపారు. కలిసిన వారిలో యూనియన్ నాయకులు గోపి, జ్యోతి, రాజ లక్ష్మి, సుఖన్య, రచన, మధురా రెడ్డి, జలంధర్ రెడ్డి, ఉడుత రమేశ్, ఎక్బాల్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

లిబర్టీ: మున్సిపల్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లిబర్టీ వద్ద యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య సిబ్బందికి సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నెల 1వ తేదీన చెల్లించేలా సీఎం రేవంత్‌రెడ్డి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనలు బేఖాతరు..!

బంజారాహిల్స్: పట్టణంలో పలు పద్ధతులు, యంత్రాలను ఉపయోగించి మ్యాన్‌హోళ్లలోని సిల్ట్ వ్యర్థాలు తొలగిస్తున్నారు. అయితే ఇంకా కొన్నిచోట్ల మాత్రం మనుషులే దిగి వాటిని తొలగిస్తున్నారు. గతంలో పలు సంఘటనల్లో కార్మికులు దిగి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. దీంతో అప్పటి నుంచి మ్యాన్‌హోళ్లలో మనుషులు దిగి వ్యర్థాలు తొలగించవద్దని ఉన్నతాధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం సిబ్బంది పట్టించుకోవడం లేదు. కార్మికులు సేఫ్టీ జాకెట్స్‌తో పాటు షూస్, సాక్సులు, గ్లౌజ్ ఇచ్చినా కూడా వాటిని వినియోగించడం లేదు. సోమవారం పంజగుట్ట నాగార్జున సర్కిల్‌లో ఓ కార్మికుడు మ్యాన్‌హోళ్లలోకి ఎలాంటి రక్షణ కవచాలు లేకుండా దిగి వ్యర్థాలను తొలగిస్తూ కనిపించాడు.



మ్యాన్‌హోల్‌లోకి దిగి వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది

టీయూడబ్ల్యూజే సభ్యుడికి సన్మానం



అనిల్‌ను సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు, జర్నలిస్టులు

హిమాయత్‌నగర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఇటీవల ఎన్నికైన సీనియర్ ఫొటో జర్నలిస్టు అనిల్‌ను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పాత్రికేయ బృందం సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించింది. అనిల్ భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించింది. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు దేశపాక స్వామి, పుండరీ చారి, సీనియర్ జర్నలిస్టులు పాండురంగారావు, తేలుకంటి వేణుగోపాల్, గణేశ్, వెంకటేశ్, మంచె.సాగర్, దేవేంద్ర ప్రసాద్, రాంబాబు, సత్యం, ఉపేంద్ర, గిరిబాబు, దయాకర్, శ్రీనివాస్, వక్కాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఖాళీలను వెల్లడించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్ గౌడ్

పంజగుట్ట: ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్‌లో మొత్తం ఖాళీలు చూపించాలని లేకుంటే ఆందోళనలు చేపడతామని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ హెచ్చరించారు. ఎర్రమంజిల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి ప్రతీ జీపీలో పాఠశాల ఉండేలా చర్యలు తీసుకుంటామని, విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారని కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుల భర్తీలో వెబ్ కౌన్సిలింగ్‌లో మొత్తం ఖాళీలు చూపించలేదని దీనివల్ల పోస్టులు తగ్గే అవకాశం ఉందని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఉద్యోగులకు పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలని బీసీ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు దేశబోయిన రమ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకోటి రవి ముదిరాజ్, మహేంద్ర సాగర్, ఉమా పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

లిబర్టీ: తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పలు సంఘాలు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. లిబర్టీ ప్లాజాలోని జన సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం అధ్యక్షుడు కె.వెంకటనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తెలంగాణ అమర వీరుల సాధన సమితి నాయకుడు మురళీధర్ దేశ్‌పాండే 1969 వేదిక నాయకులు ఏ.యాదగిరి, ఎమ్మెస్ కృష్ణ 1969 ఉద్యమకారుల సమితి నాయకులు ఎమ్మెస్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. 1969 నుంచి 2024 వరకు సాగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. బాధిత ఇంటికి ఉద్యోగం ఇవ్వాలని, రూ. 10 వేల పెన్షన్ చెల్లించాలని, ఉచితంగా గృహ వసతి కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు పాల్గొన్నారు.

బీఎన్‌ఎస్‌ఎస్ కింద మొదటి కేసు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాల్లో భాగంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్) కింద మొదటి కేసు (క్రైమ్ నెంబర్ 655) నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని నందినగర్‌లో నివసించే ప్రదీప్‌కుమార్‌రెడ్డి (50) ఆదివారం సాయంత్రం తన ఇంట్లోని బాత్రూంలో ప్రమాదవశాత్తూ జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను స్టార్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 5 గంటలకు మృతి చెందాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు (బీఎన్‌ఎస్‌ఎస్) సెక్షన్ 194 (గతంలో సీఆర్‌పీసీ 174) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిలింనగర్‌లో ఆత్మహత్య..

ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా బీఎన్‌ఎస్‌ఎస్ కింద సోమవారం మొదటి కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. వినోభానగర్ ఫేజ్–2లో నివసించే చుక్కపల్లి నరేందర్‌రెడ్డి (48) సినీ పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ తట్టుకోలేక సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఫిలింనగర్ పోలీసులు బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 194 (క్రైమ్ నెంబర్ 559) కింద మొదటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధురానగర్ పీఎస్‌లో తొలి కేసు..

వెంగళరావునగర్ : ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) నుంచి కొత్త చట్టం భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)గా మారిన తరుణంలో మధురానగర్‌లో తొలి కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌కు చెందిన ఎస్.రవిరాజ్ వ్యాపారం చేస్తుంటాడు. సోమవారం తన కారులో సత్యం థియేటర్ వైపు నుంచి జూబ్లీహిల్స్ వెళ్తున్నాడు. మార్గమధ్యంలో మైత్రీవనం వద్దకు రాగానే వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం రవిరాజ్ కారును ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని రవిరాజ్‌కు గాయాలు కానప్పటికీ కారు ధ్వంసమైంది. దీంతో రవిరాజ్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అహ్మద్‌గూడకు తాగునీటి సౌకర్యం కల్పించండి



జలమండలి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నకాలనీవాసులు

పంజగుట్ట: అహ్మద్‌గూడ డబుల్‌బెడ్రూం లబ్ధిదారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ అహ్మద్‌గుడ 2బీహెచ్‌కే ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌సీఎఫ్ ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అహ్మద్‌గుడలో 4428 లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించి తొమ్మిది నెలలు గడుస్తున్నా తాగునీరు, కరెంట్, రోడ్లు, లిఫ్టు లేక తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీహెచ్‌ఎంసీకి నిధులు కేటాయించి పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం ఇండ్ల నిర్మాణం పూర్తయినా రెండేళ్లు వరకు కేటాయించకుండా ఎన్నికలకు ముందు అందించి అందులో కనీస వసతులు కల్పించలేదని మండిపడ్డారు. తాగు నీటి సమస్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజావాణిలో డిప్యూటీ మేయర్‌కు తమ కష్టాలు వివరించగా వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పరశురాం, రాము, రాజు, పులమ్మ తదితరులు పాల్గొన్నారు.

జన్యు సవరణలో కీలకమైన పురోగతి



ఎల్వీపీఈఐ బృందం సభ్యులు డాక్టర్ ఇందుమతి మారియప్పన్

బంజారాహిల్స్: జన్యు సవరణ రంగంలో భారత శాస్త్రవేత్తలు జన్యువ్యాధులకు కొత్త చికిత్సలను అందించే కీలకమైన పురోగతిని సాధించినట్లు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ(ఎల్వీపీఈఐ) పరిశోధకులు స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్–ఇనిస్టిట్యూట్ ఆఫ్ జీనోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ(సీఎస్ఐఆర్–ఐజీబీఐ), ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ పరిశోధకులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం కంటే మరింత ఆధునిక, ఖచ్చితమైన, సమర్థవంతమైన జన్యు సవరణ సాధనాన్ని అభివృద్ధి చేసినట్లు వివరించారు. బంజారాహిల్స్‌లోని ఎల్వీపీఈఐలో సోమవారం జరిగిన సమావేశంలో డాక్టర్ ఇందుమతి మారియప్పన్ మాట్లాడుతూ.. సీఎస్ఐఆర్–ఐజీఐబీలోని డాక్టర్ దేబోజ్యోతి చక్రవర్తి నేతృత్వంలోని బృందం 'సీఆర్ఐఎస్‌పీఆర్' జన్యు వ్యవస్థలో ఉపయోగించే 'కాస్9' ప్రోటీన్‌ను మెరుగుపర్చడంపై దృష్టిసారించినట్లు వివరించారు. వారు ఫ్రాన్సిసెల్లా నోవిసిడా అనే బ్యాక్టీరియా నుంచి ఒక కాస్9 ప్రోటీన్‌ను మెరుగుపరిచి, 'ఎస్ఫ్‌ఎన్‌కాస్9' అనే మరింత ఖచ్చితమైన, సమర్థవంతమైన వేరియంట్‌ను పొందినట్లు పేర్కొన్నారు. ఈ ఆధునిక సాధనం ద్వారా జన్యువ్యాధుల నిర్ధారణ, ఖచ్చితమైన చికిత్స అందించవచ్చన్నారు. చిన్న వయస్సులోనే తీవ్రమైన దృష్టి లోపానికి దారితీసే 'లెబెర్స్ కాంజినీటల్ అమారోసిస్ టైప్ 2' అనే అరుదైన, జన్యుపర కంటి వ్యాధి ఉన్న రోగి నుంచి తీసుకున్న కణాలను పరీక్షించినట్లు వివరించారు. ఈ వ్యాధి కంటిలో సాధారణ ప్రోటీన్ ఉత్పత్తికి అంతరాయం కలిగించే ఒకే ఒక జన్యు పరివర్తనం కారణంగా వస్తుందని చెప్పారు. ఎల్వీపీఈఐ బృందం రోగి చర్మ కణాలను తీసుకుని, అదే జన్యు పరివర్తనాన్ని కలిగి ఉన్న స్టెమ్‌సెల్స్‌గా వాటిని పునర్వ్యవస్థీకరించినట్లు వివరించారు. తరువాత ఈ స్టెమ్‌సెల్స్‌లో పరివర్తనాన్ని సరిజేసేందుకు ఎస్ఫ్‌ఎన్‌కాస్9 సాధనాన్ని ఉపయోగించినట్లు తెలిపారు. సరిజేసిన కణాల పరివర్తనం విజయవంతంగా జరిగినట్లు నిరూపిస్తూ, తిరిగి సాధారణ ప్రోటీన్ ఉత్పత్తి చేయగలిగాయన్నారు. ఈ పురోగతి జన్యు వ్యాధుల చికిత్సను మరింత సులభతరం చేయగలుగుతుందన్నారు.

కలెక్టరేట్ ప్రజావాణికి 140 దరఖాస్తులు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్ ప్రజావాణికి అర్జీల తాకిడి పెరిగింది. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 140 మంది హాజరై దరఖాస్తులు సమర్పించడంతో పాటు సమస్యలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి విన్నవించారు. మొత్తం 140 అర్జీల్లో గృహ నిర్మాణ శాఖ(79) ఆసరా పెన్షన్(16), విద్యాశాఖ(03), వికలాంగుల సంక్షేమ శాఖ(4), ఎస్సీ కార్పొరేషన్(11) ఇతర శాఖలకు సంబంధించినవి 30 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 69వ స్టేట్ బ్యాంక్ డే వేడుకలు

ఎస్జీవోలకు రూ.50 లక్షల వాహనాల వితరణ



సాక్షి, సిటీబ్యూరో: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో 69వ స్టేట్ బ్యాంక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు సీఎస్ఆర్ కార్యక్రమాలను, మొక్కలు నాటి హరిత వేడుకలను నిర్వహించారు. సోమవారం డాక్టర్స్ డే కావడంతో బ్యాంకుతో అనుబంధం ఉన్న డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ బ్యాంకు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1321 ఎస్బీఐ ఆఫీసులతో 2 కోట్లకు పైగా కస్టమర్లకు సేవలందిస్తోందని అన్నారు. డిజిటల్ బ్యాంకింగ్‌లో మెరుగైన సేవలు అందిస్తున్నామని ఉద్యోగులను అభినందించారు. అనంతరం ఎస్బీఐ హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో వివిధ ఎన్జీవోలకు రూ.50 లక్షల విలువైన 5 వాహనాలను వితరణ చేశారు.

డాక్టర్లు లేనిదే.. జీవితం లేదు



లక్డీకాపూల్: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ కేర్ హోమియోపతి సెంటర్‌లో సోమవారం డాక్టర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేర్ సీఎండీ డాక్టర్ ఏ.ఎం.రెడ్డి మాట్లాడుతూ సమాజంలో వైద్యులకు అధిక ప్రాముఖ్యత ఉందన్నారు. డాక్టర్ కేర్ హోమియోపతి సీఈఓ డాక్టర్ సృజన పేర్ల మాట్లాడుతూ.. డాక్టర్లు లేనిదే జీవితం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేర్ హోమియోపతి మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.నీరజ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 5కె రన్



రన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తదితరులు

ఖైరతాబాద్: మహిళా రామ్మా కదలిరా.., మన లక్ష్యం ఆరోగ్యం.. అనే నినాదంతో డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో 5కె రన్ నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థ అమ్మానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలు అన్నిరంగాల్లో ముందడుగు వేస్తున్నారని, మహిళల ఆరోగ్యం కోసం ఫౌండేషన్ చేస్తున్న కృషిని కొనియాడారు. డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్‌రెడ్డి, అమ్మాని ఫౌండేషన్ చైర్మన్ ఆమని, ఉపాధ్యక్షురాలు భారతి, కోశాధికారి యమున, సెక్రటరి అక్బర్, జాయింట్ సెక్రటరి వెంకట్‌రెడ్డి తదితరులతో పాటు మహిళలు, విద్యార్థినులు పాల్గొన్న రన్ పీపుల్స్ ప్లాజా నుంచి సంజీవయ్య పార్కు నుంచి తిరిగి పీపుల్స్ ప్లాజా వరకు నిర్వహించారు.

సీపీఆర్ ప్రచారం కోసం పోస్టల్ కవర్ ఆవిష్కరణ

ఉస్మానియాయూనివర్సిటీ: డాక్టర్స్ డే సందర్భంగా సీపీఆర్(కరోనరీ పలమనరీ రిసరీటేషన్) ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించారు. ఓయూ క్యాంపస్‌లోని పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేషనల్ సీపీఆర్ ఛాలెంజ్ క్యాంపెయిన్ శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్‌లో రూపొందించిన భారత తపాలశాఖ కవర్‌ను హైదరాబాద్ శాఖ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టల్ కవర్‌ను రూపొందించినట్లు తెలిపారు. సీపీఆర్ పక్రియ గురించి వర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులకు సిబ్బందికి అవగాహన కల్పిస్తూ కరపత్రాల పంపిణీ, శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్.జీవన్‌కుమార్ అధ్యోత, దక్షిణమూర్తి, పోస్టల్ అధికారులు సుబ్రహ్మణ్యం, ప్రతాప్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ కవర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీలత

ప్లేస్‌మెంట్..

100 శాతం




గచ్చిబౌలిలోని నిథమ్‌లో పరిపాలనా భవనం పరిసరాలు

ఉన్నత చదువులకు 'నిథమ్'లో విస్తృత అవకాశాలు

పర్యాటక, ఆతిథ్య రంగంలోని కోర్సులకు విపరీతమైన ఆదరణ ఉంటోంది. అందులో ఏటా 100 శాతం ప్లేస్‌మెంట్లు కూడా ఉంటుండటంతో మరింత ప్రాధాన్యం పెరిగింది. ఈ తరుణంలో ఇటీవల విడుదలైన ఇంటర్ పాసైన వారికి డిగ్రీస్థాయి కోర్సులు చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) స్పష్టం చేస్తున్నారు. నిథమ్‌లో ఇంటర్ విద్యార్థులకు రెండు కోర్సుల్లో చేరడానికి అవకాశం కల్పిస్తున్నారు. ఈ కోర్సులను పూర్తి చేస్తే డిగ్రీ పట్టానే కాకుండా ఉద్యోగం పొందేందుకు ప్లేస్‌మెంట్‌లలో నిథమ్ 100 శాతం ప్రగతి సాధిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరానికి నిథమ్‌లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.

- రాయదుర్గం

- పర్యాటక, ఆతిథ్య కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు మెండు
- గచ్చిబౌలిలోని 'నిథమ్'లో ప్రస్తుతం కొనసాగుతున్న అడ్మిషన్లు
- ఇంటర్ పాసైన విద్యార్థులకు బీబీఏ, బీఎస్సీలో అవకాశాలు



అత్యాధునిక సౌకర్యాల లైబ్రరీ

ఇంటర్ విద్యార్థులకు కోర్సులు ఇవే..

1. బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ కోర్సు. బీబీఏ డిగ్రీ (టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ) కోర్సు. నాలుగు ఏళ్ల కాల పరిమితి అందుబాటులో ఉంది. ఇంటర్‌లో 50 శాతం మార్కులతో పాసైన వారికి అవకాశం కల్పిస్తారు.
2. బీఎస్సీ డిగ్రీ కోర్సు, బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు అందుబాటులో ఉంది. దీనికి మూడేళ్ల కాలపరిమితి. ఇంటర్‌లో 40 శాతం మార్కులతో పాసైన వారికి అవకాశం కల్పిస్తారు.

'నిథమ్'లో అత్యాధునిక సౌకర్యాలు..

- గచ్చిబౌలిలోని టెలికామ్‌నగర్‌కాలనీలో 30 ఎకరాల విశాల స్థలంలో నిథమ్‌ను ఏర్పాటు చేశారు.
- ఇందులో అకాడమిక్ ఆపరేషన్స్‌ను అక్టోబర్ 2004లో ఆరంభించారు.
- మార్చి 16, 2006లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేతులమీదుగా క్యాంపస్‌ను ప్రారంభించారు.
- నిథమ్‌లో అత్యాధునిక లైబ్రరీ సౌకర్యాన్ని ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీతో ఏర్పాటు చేయగా, వేలాది పుస్తకాలు, వంద వరకు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్, మేగజైన్స్, న్యూస్ పేపర్లు ఉంటాయి.
- అత్యాధునిక హాస్పిటాలిటీ భవనం, ల్యాబ్‌లు, కిచెన్, గ్రీనరీతో కూడిన క్యాంపస్, శిల్పాల పార్కు, పచ్చని గడ్డితో కూడిన మినీ క్రికెట్ గ్రౌండ్, హాస్టల్ సౌకర్యం ఉంటుంది. సోలార్ విద్యుత్ సౌకర్యం, రకరకాల శిల్పాలతో కూడిన శిల్పాల పార్కు, ఆంఫీ థియేటర్, చిట్టడవి పెంపకం, దశాబ్దాల చరిత్ర కలిగిన చెరువు కూడా క్యాంపస్ పరిధిలోనే ఉండటం ప్రత్యేకతగా చెప్పవచ్చు.
- 100 శాతం ప్లేస్‌మెంట్లు సాధిస్తున్న ఏకైక పర్యాటక ఆతిథ్య జాతీయ సంస్థగా నిథమ్ గుర్తింపు
- ఇందులో కోర్సులు పూర్తి చేసినవారికి హోటళ్లు, రెస్టారెంట్లు, ట్రావెల్స్, ఎయిర్‌పోర్టులు, ఈవెంట్స్, ఫెసిలిటీస్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

ఎంబీఏ కోర్సుల్లో దరఖాస్తులను ఆహ్వానం..

నిథమ్‌లో ఎంబీఏ-టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ కోర్సు కూడా అందుబాటులో ఉంది. దీని కాలపరిమితి రెండేళ్లు. ఈ కోర్సు పూర్తి చేస్తే పర్యాటక, ఆతిథ్య రంగంలో మంచి భవిష్యత్తు. 100 శాతం ప్లేస్‌మెంట్లు కూడా ఉంటాయి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 95537 00035, వెబ్‌సైట్ www.nithm.ac.in ను సందర్శించాలి.

పర్యాటక, ఆతిథ్య కోర్సులతో మంచి భవిష్యత్తు



పర్యాటక, ఆతిథ్య రంగాలకు ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు మెండు. నిథమ్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారికి బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నాం. వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అంకితభావంతో పనిచేసే ఫ్యాకల్టీ, అత్యాధునిక సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యాటక శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిథమ్‌కు మంచి భవిష్యత్తు ఉండేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం.

– డాక్టర్ ఎం.కే.గణేష్, ఇన్‌చార్జీ ప్రిన్సిపల్, నిథమ్ గచ్చిబౌలి

100 శాతం ప్లేస్‌మెంట్లు కల్పిస్తున్నాం..



పర్యాటక, ఆతిథ్య రంగాల్లో నిథమ్ విద్యార్థులకు 100 శాతం ప్లేస్‌మెంట్లు కల్పిస్తున్నాం. విద్యార్థులు వారి కోర్సు పూర్తి చేసిన తర్వాత కూడా నిథమ్ ఇప్పటికీ మెరుగైన అవకాశాల కోసం విద్యార్థులకు సహాయం చేస్తుంది. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా కెరీర్ ఎంపికలకు అవకాశం కల్పిస్తాం. పర్యాటక, ఆతిథ్య రంగాల్లో నిథమ్ విద్యార్థులకు అవకాశాలు కలిగేలా చేస్తాం. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ సాగుతోంది. ఇంటర్‌పాసైన వారికి బీబీఏ, బీఎస్సీ రెండు కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

– మిషెల్లీ జే ఫ్రాన్సిస్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, నిథమ్ గచ్చిబౌలి

నిథమ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు..



నిథమ్‌లో పర్యాటక ఆతిథ్య కోర్సులు పూర్తి చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. టూరిజమ్, హాస్పిటాలిటీ రంగాల్లోని కోర్సులలో నైపుణ్యం మెరుగుపర్చేలా చేస్తున్నాం. సప్లిమెంటరీ ఇంటర్ పాసైన వారికి 50 శాతం మార్కులు సాధిస్తే బీబీఏ, బీఎస్సీ పర్యాటక, ఆతిథ్య కోర్సుల్లో చేరితే చదువుతో పాటు కమ్యూనికేషన్, ఉద్యోగ నైపుణ్యాలను మెరుగుపరుస్తాం. నిథమ్‌లో చదివిన వారు ప్రస్తుతం వివిధ హోదాల్లో ముఖ్యంగా ఎండీలు, సీఈఓలు, ఇతర మంచి ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు.

– ప్రొఫెసర్ ఆర్.విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్, అడ్మిషన్స్ కన్వీనర్ నిథమ్



నిథమ్‌లోని చెరువు

డిస్కంలో ఇంజినీర్ల బదిలీలకు రంగం సిద్ధం!

నలుగురు ఎస్ఈలకు స్థాన చలనం



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఇంజినీర్ల బదిలీలకు రంగం సిద్ధమైంది. మూడేళ్లకుపైగా ఒకే చోట ఉన్న ఇంజినీర్లకు స్థానచలనం కల్పించనున్నారు. తాజాగా నలుగురు ఎస్ఈలకు స్థానచలనం కల్పిస్తూ సీజీఎం ముషారఫ్ ఫారూఖీ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తొలి విడతలో ఎస్ఈలు, సీజీఎంలకు స్థాన చలనం కల్పించి, ఆ తర్వాత డీఈలు, ఏడీఈలు, ఏఈల బదిలీ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సిద్దిపేట ఎస్ఈగా పనిచేస్తున్న మోహన్‌రెడ్డిని హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బ్రహ్మంను హబ్సిగూడ సర్కిల్‌కు, హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో పనిచేస్తున్న రెహమాన్‌ను డీపీఈ వింగ్ ఎస్‌గా బదిలీ చేశారు. అదేవిధంగా ఇప్పటి వరకు ఇక్కడ డీపీఈ వింగ్ ఎస్ఈగా పనిచేస్తున్న పీవీ రమేష్‌ను మహబూబ్‌నగర్ ఎస్ఈగా బదిలీ చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో డిస్కం యాజమాన్యం ఇంజినీర్ల బదిలీలపై దృష్టిపెట్టింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్ల ఆరోపణలు ఉన్న ఇంజినీర్లను కీలకస్థానాల నుంచి తప్పించి, లూప్ లైన్‌లోకి పంపనున్నారు. కార్పొరేట్ ఆఫీసులో పనిచేస్తున్న కొంత మంది ఇంజినీర్లకు ఫోకల్ పోస్టుల్లోకి బదిలీ చేయనున్నారు. కీలక పోస్టులను చేజిక్కించుకునేందుకు పలువురు ఇంజినీర్లు ప్రభుత్వంలోని పెద్దల ద్వారా సిఫార్సు చేయిస్తున్నట్లు తెలిసింది. అయితే సీఎండీ ముషారఫ్ ఫారూఖీ మాత్రం పైరవీలకు కాకుండా పనితీరు ఆధారంగా పోస్టింగ్‌లు ఇచ్చేందుకు యత్నిస్తుండటం గమనార్హం.

ఆకట్టుకున్న బే విండో క్యూ ద కర్వ్..

సాక్షి, సిటీబ్యూరో: ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐడీ) ఆధ్వర్యంలో నగరంలోని హైటెక్స్‌లో ఏర్పాటైన ప్రదర్శనలో బే విండో బ్రాండ్ తమ ఫర్నిచర్ ఉత్పత్తుల్ని ప్రదర్శించింది. క్యూ ద కర్వ్ పేరిట ఈ ప్రదర్శనలో కొలువుదీరిన ఉత్పత్తులకు సందర్శకుల నుంచి మంచి స్పందన లభించిందని ఈ సందర్భంగా బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు.

సచివాలయం ఉద్యోగులపై కుల వివక్ష తగదు: సైదులు



సాక్షి, సిటీబ్యూరో: అంబేద్కర్ పేరుతో రూపుదిద్దుకున్న తెలంగాణ సచివాలయంలో ఉద్యోగుల మధ్య విభేదాలు తలెత్తడం, అది కులవివక్షకు దారితీయడం బాధాకరమని తెలంగాణ పాలిటెక్నిక్ ఎస్సీ, ఎస్టీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సైదులు ఖండించారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సచివాలయంలోని ఆర్థిక శాఖ విభాగంలో సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ స్థాయి అధికారుల మధ్య ఫైళ్ల విషయంలో విభేదాలు తలెత్తాయని, అవి కాస్తా రచ్చకెక్కి కుల వివక్షకు కారణమయ్యాయని ఆరోపించారు. ఈ కారణంగా సచివాలయంలోని ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు అవమానాలు ఎదుర్కొంటున్నారన్నారు. వారిని కించపరిచే విధంగా కామెంట్లు చేయడం, మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయడం చేస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. కాగా ఈ విభేదాల గురించి ఆర్థిక శాఖ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారని.. చివరకు సీఎం దృష్టికి కూడా విషయం వెళ్లిందని.. అయినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. సదరు ఉద్యోగులు వివక్షపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులు బాధితుల ఇంటికి వెళ్లి బెదిరించినట్లు, కేసు విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు తెర వేయాలని, లేకుంటే సచివాలయంలోని అన్ని శాఖల్లోని ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఏకమై ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు.

సేవల కోసం 'నిమ్స్'కు రూ.2.1 కోట్ల విరాళం



నిమ్స్‌కు విరాళం అందిస్తున్న సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)కు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ రూ.2.1 కోట్ల విరాళం అందించింది. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ నిమ్స్ సహకారంతో హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిమ్స్‌కు ఆయా సంస్థల ప్రతినిధులు విరాళం అందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, రోటరీ ఫౌండేషన్, రోటరీ క్లబ్ మద్దతుతో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని ప్రతినిధులు పేర్కొన్నారు. రోటేరియన్ ఉదయ్ పిలానీ, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రోటేరియన్ చిరంజీవ్ సలుజా మాట్లాడుతూ ముఖ్యంగా సురక్షితమైన నీరు, అక్షరాస్యత, విద్య, ఆరోగ్య, సంరక్షణ, ఆర్థిక సాధికారత, పర్యావరణ సుస్థిరత వంటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టి పనిచేస్తుందని వారు వివరించారు. నిమ్స్‌లో పీడియాట్రిక్ ఎపిలెప్సీ రోగుల కోసం ఇంటెన్సివ్ కేర్ యూనిట్ స్థాపన, నిమ్స్‌లో ఉద్యోగుల పిల్లల కోసం క్రెచ్‌ను పునరుద్ధరించడం, ప్రభుత్వ పాఠశాలలకు ఇంటరాక్టివ్ టీవీలు, లెర్నింగ్ కంటెంట్ అందించడం, సికింద్రాబాద్‌లో డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్మాణం, మిషన్ 100 మరుగుదొడ్ల నిర్మాణం వంటివి భవిష్యత్తులో ఏర్పాటు చేయాలని తలపెట్టినట్లు వివరించారు. అనంతరం రోటేరియన్ సలూజా అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం రోటరీ క్లబ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మధ్య ఒప్పందం కుదిరింది. అనంతరం అవగాహన ఒప్పందంపై మూడు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో రోటేరియన్లు శరత్ చౌదరి, గట్టు జ్ఞాన్‌ప్రకాశ్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్

టీకా సాయంతో అంటువ్యాధుల నివారణ

- ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సేవలు
- జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన డైరెక్టర్ బీరప్ప



నిమ్స్‌లో వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ బీరప్ప తదితరులు

లక్డీకాపూల్: సంక్లిష్టమైన సమస్యలను ఛాలెంజింగ్‌గా చికిత్స అందిస్తున్న నిమ్స్ తాజాగా వయోజన ప్రయోజనార్థం వ్యాక్సినేషన్ క్లినిక్‌ను ఏర్పాటు చేసింది. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఈ క్లినిక్‌ను నిమ్స్ సాధారణ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నవల్ చందర్‌తో కలిసి డైరెక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. ఈ క్లినిక్ ద్వారా అంటువ్యాధులను నివారించడంలో ఇమ్యునైజేషన్ ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. అంతేగాకుండా ప్రతి ఒక్కరికీ అవసరమైన టీకాలను అందించేందుకు వీలు కలుగుతుంది. రోగనిరోధక వ్యవస్థ మార్పులు, అనారోగ్యం బారిన పడిన వారికి ఉపశమనం కల్పించేందుకు ఈ టీకాలను వినియోగించుకోవచ్చు. దీర్ఘకాలికంగా రోగాలతో పోరాడుతున్న వారు వ్యాధులు నయం కాకపోవడంతో ఏటా 25 లక్షలకు పైగా మృత్యువాత పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) లెక్కలు చెబుతున్నాయి. ఈ క్లినిక్ సాయంతో వేగంగా అంటువ్యాధులను గుర్తించి టీకా సాయంతో పూర్తిగా నయం చేయడంతో పాటు ఆరోగ్య రక్షణ కోసం సూచనలు చేసేందుకు అవకాశం ఉంటుంది. వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్ సేవలు సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ లిజా రాజశేఖర్, ఎ.ఆర్. శాంతి వీరు, జనరల్ మెడిసిన్ సీనియర్ ప్రొఫెసర్ సత్యనారాయణ రాజు, డాక్టర్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్ మన ఆరోగ్యాన్ని కాపాడే క్రమంలో అంటువ్యాధుల వ్యాప్తిని నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. చాలామంది టీకాలు బాల్యంలో వేసుకున్నప్పటికీ వృద్ధాప్యంలో రోగనిరోధకతను కాపాడుకోవడం కూడా ముఖ్యమన్నారు. చిన్ననాటి టీకాలు అనేక వ్యాధుల బారినపడకుండా రక్షిస్తాయి. కానీ కాలక్రమేణా రోగనిరోధక శక్తి క్షీణిస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో బూస్టర్ షాట్‌లు కానీ అదనపు వ్యాక్సిన్ వేయించుకోవడం చాలా అవసరమన్నారు.

మహాగణపతి పనులకు శ్రీకారం

ఖైరతాబాద్‌లో షెడ్డు నిర్మాణానికి కర్రలు

- త్వరలోనే అడ్‌హక్ కమిటీ ప్రకటన



ఖైరతాబాద్: ప్రతి సంవత్సరం ఖైరతాబాద్ మహాగణపతి తయారీ పనులను మూడు నెలల ముందే ప్రారంభించేవారు. ఈ సంవత్సరం కర్రపూజ నుంచే వివాదాలు తలెత్తాయి. వినాయక ఉత్సవాలను తామే నిర్వహిస్తామని ఖైరతాబాద్ శ్రీగణేష్ ఉత్సవ సభ్యులు ప్రకటించడంతో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఎంతోకాలంగా తామే నిర్వహిస్తున్నాం.. ఇప్పుడు కూడా తామే నిర్వహిస్తామని చెప్పడంతో కర్రపూజ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచనల మేరకు నూతనంగా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ ఆధ్వర్యంలోనే ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పడంతో కర్రపూజ కార్యక్రమం పూర్తయ్యింది. ఉత్సవాలకు సమయం దగ్గర పడుతుండటంతో మహాగణపతి పనులు ప్రారంభించేందుకు సోమవారం షెడ్డు నిర్మాణానికి కర్రలను తీసుకువచ్చారు. వెల్డింగ్ పనులు నిర్వహించేందుకు వెల్డర్లు కూడా రావడంతో మహాగణపతి పనులకు శ్రీకారం చుట్టినట్లయ్యింది. ఉత్సవాలను అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామని, త్వరలోనే అడ్‌హక్ కమిటీని ప్రకటించనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు.

సాక్షి 11
హైదరాబాద్, మంగళవారం, 2 జూలై 2024
సిటీ ప్లస్



ఫొటో షూట్‌లకు వినూత్న వేదిక..

నగరంలో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, కంటెంట్ క్రియేటర్లు, క్రియేటివ్ బ్రాండ్ మేనేజర్లకు కావాల్సిన సకల సదుపాయాలతో సృజనాత్మక ఫ్యాషన్ స్టూడియోలు వెల్లివిరుస్తున్నాయి. ఇందులో భాగంగా ఫిల్మ్ నగర్ వేదికగా అధునాతన సాంకేతికతతో అరిసా బొట్టిగా క్రియేటివ్ స్టూడియో ప్రారంభమైంది. ఇందులో ప్రత్యేకమైన ఇన్ డోర్ సెట్స్.. ఫొటోలు–వీడియోలు అత్యద్భుతంగా వచ్చేందుకు కావాల్సిన ప్రాప్స్.. తదితర అధునాతన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు సాత్విక తెలిపారు. ఈ వేదికలో బ్రాండ్ విజువల్స్, ఫ్యాషన్ షూట్స్‌తో పాటు పెంపుడు జంతువులు, పిల్లల వినోదభరితమైన సెట్టింగ్‌లను ఏర్పాటు చేశామని శ్రీ లక్ష్మి పేర్కొన్నారు. ఈ సెట్టింగ్స్‌లో పలువురు మోడల్స్ ఫొటోలకు ఫోజులిస్తూ సందడి చేస్తున్నారు.



బియాండ్ సేవల విస్తరణ...

తమ సేవల్ని మరిన్ని నగరాలకు విస్తరిస్తామని ఇంటీరియర్ ఉత్పత్తులకు పేరొందిన నగరానికి చెందిన బియాండ్ కలర్ సంస్థ వ్యవస్థాపక సీఈఓ కుమార్ వర్మ తెలిపారు. గత మూడు రోజులుగా మాదాపూర్‌లోని హైటెక్స్ వేదికగా నిర్వహించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐడీ) షో కేస్ ప్రదర్శన ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఐఐడీ షో కేస్‌లో ప్రదర్శించిన తమ ఉత్పత్తులకు నగరవాసుల నుంచి అద్భుతమైన స్పందన లభించిందన్నారు.



డ్యాన్స్ చేస్తూ మ్యాథ్స్...

ఓ వైపు సంగీతాస్వాదన చేస్తూనే మరోవైపు పరీక్ష రాయడం అనేది సాధ్యమేనా అంటే? సాధ్యమే అంటోంది సిప్ అకాడమీ. శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్ త్రీ ఆవరణలో 'కాన్సన్‌ట్రేషన్ గ్రాండ్' పేరిట ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు గణితంలో ఏకాగ్రత పరీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఓ వైపు ఇష్టమైన పాటల్ని పెద్ద శబ్దంతో వింటూనే ఏకాగ్రత చెదరనీయకుండా విద్యార్థులు సమాధానాలు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో వస్తున్న పాటలకు హుషారుగా కాళ్లూ, చేతులూ ఆడిస్తూనే, మరోవైపు క్లిష్టమైన గణిత ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు పూర్తి చేసి ఆహూతుల అభినందనలు అందుకున్నారు.



అనాథ జీవాలకు అమ్మా.. నాన్న

ఆపదలోని మూగ ప్రాణులకు ఆపన్నహస్తం

అక్కున చేర్చుకుని ఆహారం పంపిణీ
వందల సంఖ్యలో జీవాలకు సేవ

సాటి మనిషికి సాయం చేయలేని మనుషులున్న నేటి రోజుల్లో మూగజీవాలను కూడా ప్రేమతో...అక్కున చేర్చుకుంటున్నారు.. ఆకలితో ఉన్న జీవాలకు ఆపన్నహస్తంగా ఆహారం పంపిణీ చేస్తున్నారు.. వారి ఇంటి దరిదాపుల్లో వివిధ జాతుల ఆవులు, దూడలు, కుక్కలు, పిల్లులు, కోతులు, కాకులు.. ఇలా ఒక్కటేమిటి..ఎన్నో మూగ జీవాలు చూపరులను అబ్బురపరుస్తాయి. అటుగా వెళ్లేవారికి ఆ మూగజీవాలు తారసపడుతుంటాయి. వీటిని అక్కున చేర్చుకున్న వారే కూకట్‌పల్లికి చెందిన మణికొండ దేవేందర్‌రావు, రమాదేవి దంపతులు. ఇదంతా వీరు గుర్తింపు కోసమో.. లేక వ్యాపారం కోసమో అనుకుంటే పొరపాటే.. వారికి తెలిసిందల్లా ఒక్కటే.. వాటికి నిస్వార్థంగా సేవ చేయడమే.. – తొట్ల పరమేష్





మానవ సేవే.. మాధవ సేవ.. ఇది అందరికీ తెలిసిన నానుడి. కానీ సర్వ ప్రాణి సేవయే మాధవ సేవ అన్నది వారి పంథా. ఔను..భువిపై తనకు మాత్రమే హక్కు అన్నట్లు జీవుడు విర్రవీగుతుంటాడు. కానీ ఇలపై మనిషి ఎలాగో అన్ని ప్రాణులకూ జీవించే హక్కు ఉందంటూ వారు నినదిస్తున్నారు. ఆపై సేవకు అంకితమయ్యారు. ఒకటి కాదు..రెండు కాదు..వందల సంఖ్యలో మూగ జీవాలను అక్కున చేర్చుకుని కన్న బిడ్డల మాదిరిగా సాకుతున్నారు. మనిషికి మనిషే బరువైన ప్రస్తుత సమాజంలో ప్రతి ప్రాణినీ తన బిడ్డగా భావిస్తూ నిస్వార్థ సేవకు నిర్వచనం.. కూకట్‌పల్లికి చెందిన మణికొండ దేవేందర్‌రావు, రమాదేవి దంపతులు. వీరితోపాటు వీరి ఇద్దరి బిడ్డలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైనా కూడా మూగ జీవాల సేవలో తరిస్తున్నారు.

పక్కాగా టైం పాటిస్తూ..

మూగ జీవాలకు ఆహారంతో పాటు ప్రేమా ప్యాయతలు కలగలిపి వడ్డిస్తారో ఏమో గానీ ఎక్కడున్నా సరే..రోజూ పక్కాగా టైం ప్రకారం వీరి వద్దకు వచ్చేస్తాయి. ఒక్క కాకులు, పావురాలే కాదు ఆవులు, కుక్కలు, పిల్లులు, కోతులు వాటికి నిర్దేశించిన సమయాల్లో వచ్చి వీరి రోజువారీ ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్తుంటాయి. ఇలా ఉదయం 6–7 గంటలకు ప్రారంభమయ్యే మూగ జీవాల రాక సాయంత్రం 7 గంటల వరకూ కొనసాగుతుంటుంది. ఉదయం 6–7 గంటల మధ్య కాకులు, 9 గంటలకు పావురాలు, 10 గంటలకు ఆవులు, మధ్యాహ్నం 3 గంటలకు కుక్కలు, సాయంత్రం పిల్లులు..ఇలా ఒక్కో సమయంలో ఒక్కో మూగ జీవాలు ఇక్కడకు వచ్చిపోతుండడం గమనార్హం.

ఆవుల గైనిక్..రమాదేవి

ఆవుల ప్రసవానికి వచ్చాయంటే జీహెచ్‌ఎంసీలో గుర్తుకొచ్చే వైద్యురాలు రమాదేవి. తమ వద్దకు వచ్చే ఆవులతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని గోశాలల్లో ఎక్కడైనా సరే ఆవులు ఈతకు వచ్చాయంటే ఆమెనే దగ్గరుండి ప్రసవం చేస్తారు. భుమి మీదకు వచ్చే ఆవు దూడపై మొదట తన చేతులు పడాల్సిందే.. ఒకరకంగా ఆమె ఆవులకు గైనిక్‌గా మారిపోయారు.

లేగ దూడలకు ప్రత్యేక బెడ్

మూగ జీవాల ఆరోగ్య సంరక్షణ విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటూ వాటికి సపర్యలు చేస్తుంటారు. వాటిని తనకుటుంబ సభ్యులు, పిల్లల మాదిరిగానే బెడ్ మీద పడుకోబెట్టి సేవలందిస్తారు. ఓసారి 20 రోజుల లేగదూడకు యాక్సిడెంట్ అయ్యి కాలు విరగటంతో విషయం తెలుసుకున్న రమాదేవి రహదారి వద్దకు వెళ్లి దానిని ఆటోలో తీసుకొచ్చి అక్కడ నుంచి పశువుల ఆస్పత్రికి తరలించారు. అక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవటంతో మూడు గంటల పాటు వేచి ఉండి డాక్టర్‌ను పిలిపించి చికిత్స చేయించిన అనంతరం రమాదేవి భర్త దేవేందర్‌రావు ఆ లేగ దూడను తన బెడ్‌పై పడుకోబెట్టి ఆహారంలో మాత్రలు, ఇంజక్షన్‌లు ఇచ్చి రెండు నెలల పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు.



జీవాలకూ సొంత పేర్లు...

వీరి ఇంటి దరిదాపుల్లో వెళ్లిన వారికి కొన్ని పేర్ల పిలుపులు వినిపిస్తుంటాయి.. కొత్తగా వినేవారికి ఎవరి కోసమో వెతుకుతున్నారని పొరపడతారు.. కానీ, వారు పిలిచేది మూగజీవాలని తెలిశాక ఆశ్చర్యపోక మానరు... 'ఏయ్ లక్ష్మీ ఇటు రావే.. ఓయ్ శివా అటు వెళ్లరా..!' ఎలాగైతే మనం సాటి మనుషులతో మాట్లాడతామో! అలాగే వారు మూగ జీవాలతో మాట్లాడుతుంటారు. వాటికి పేర్లు పెట్టడమే కాదు..ఆ పేరుతో పిలిస్తే అవి కూడా ఠక్కున అలెర్ట్ అయ్యి వారు చెప్పింది చేసేస్తాయి. మమకారం చూపించాలే గానీ మూగ జీవాలు అంతకంటే ఎక్కువ వాత్సల్యాన్ని చూపిస్తాయని ఆ దంపతులు నిరూపిస్తున్నారు. పేరు పెట్టి వారు రమ్మంటే వచ్చేస్తాయి.. వెళ్లు అంటే వెళ్లిపోతాయి..తిను అంటే తినేస్తాయి.. ఇక చాలు అంటే ఆపేస్తాయ్..అంతగా మూగ జీవాలతో వారికి బాండింగ్ ఏర్పడింది.

మరణించిన వాటికి అంత్యక్రియలు

దెబ్బతగిలిన లేగదూడ కొద్ది రోజుల తరువాత మూర్ఛ వ్యాధితో చనిపోయింది. దాంతో మనస్తాపానికి గురైన వారు లేగదూడను బహిర్భూమిలో వదిలివేయకుండా మనుషులకు చేసిన విధంగానే లేగ దూడకు అంత్యక్రియలు నిర్వహించి కొద్ది రోజుల పాటు ఆ దంపతులు దిగులుతో రెండు మూడు రోజులు ఆహార పానీయాలు కూడా ముట్టలేదు. ఈ విధంగా మూగ జీవాలతో వారి అనుబంధం కొనసాగింది. కుక్కలకు కూడా ఏ చిన్న దెబ్బ తాకినా వాటికి చికిత్స చేయించి మందులు ఇవ్వటం వారికి అలవాటుగా మారింది.

కాంక్రీట్ జంగిల్లోనూ కావ్..కావ్..జాడ

పితృ దేవతలకు ప్రతీకగా కాకులను విశ్వసిస్తారు. అలాంటి కాకులను కాంక్రీట్ జంగిల్‌లో భూతద్దం పెట్టి మరీ వెతికినా కనిపిస్తాయో లేదో తెలియదు. కనుమరుగు అయిపోతున్నాయి అనుకుంటున్న కాకులు సైతం రోజూ ఠంచనుగా ఒకే సమయంలో వీరి ముంగిట వాలిపోతుంటాయి. వారు అందించే ఆహారాన్ని ఆరగించి వెళ్లిపోతుండడం ఇక్కడ నిత్యకృత్యమే.



ఐదేళ్ల క్రితం ప్రారంభమై...

ఐదేళ్ల క్రితం మాట.. రెండు మూడు ఆవులతో ప్రారంభమై రోజులు గడిచే కొద్దీ ఆవుల సంఖ్య పెరిగింది. వీటికి తోడుగా కుక్కలు, పిల్లులు, కోతులు, కాకులు, పావురాలు.. ఇలా 70 వరకూ ఆవులు, 40 వరకు కుక్కలు, 15 వరకు పిల్లులు, 15 వరకు కాకులు, మరెన్నో పావురాలు వచ్చిపోతున్నాయి. అయితే ఇటీవల కోతులు కూడా వచ్చేవి. కానీ కుక్కల భయంతో అవి రావడం మానేశాయి.

నెలకు లక్షన్నర ఖర్చు..

మూగ జీవాలకు ఆహారం కోసం నెలకు లక్షన్నర వరకూ ఖర్చు చేస్తున్నారు. ఆవుల కోసం ప్రతిరోజూ రకరకాల కూరగాయలు, ఫలాలు, కుక్కల కోసం ఇంట్లో నాన్‌వెజ్ తినకపోయినప్పటికీ ప్రత్యేకంగా నాన్‌వెజ్ తెప్పించి పెడతారు. నెలకు నాలుగు క్వింటాళ్ల రైస్ మూగ జీవాల కోసం కొనుగోలు చేస్తుంటారు.





ఈ-సైకిల్.. పనితీరు ఇలా..

ఈ- సైకిల్ తొక్కుతున్నపుడు ముందుకు వెళ్లే కొలది బ్యాటరీ ఛార్జింగ్ అవుతుంది. సైకిలిస్ట్‌కు అవసరం అనుకున్నపుడు బ్యాటరీ ఛార్జింగ్ వినియోగించి సైకిల్‌ను నడిపించొచ్చు. రోడ్డు అప్ ఉన్న ప్రాంతాల్లో ఈ ఛార్జింగ్ ఉపయోగపడుతుంది. సుమారుగా రూ.20 వేల నుంచి రూ.30 వేల రేంజ్‌లో ఈ-సైకిళ్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి.

పర్యావరణానికి, ఆరోగ్యానికీ మేలు
ఇంధన ధరలకు ప్రత్యామ్నాయం
ఆదర్శంగా నిలుస్తామంటున్న టెకీలు

ఈ-సైకిల్ యమ క్రేజ్



నగరవాసులకు పెరుగుతున్న ఆసక్తి

సైకిల్ తొక్కడమంటే ఎవరికి ఇష్టముండదు? చిన్న పిల్లలు మొదలుకొని, పెద్దవారి వారకూ ఒకప్పుడు ఇదంటే యమ క్రేజ్.. అయితే రాను రాను పెట్రోల్ వాహనాల రాకతో సైకిల్ కాస్తా కనుమరుగైంది. అయితే ప్రస్తుతం మళ్లీ సైకిళ్లకు క్రేజ్ పెరుగుతోంది. దీనికి తోడు తయారీదారులు సైకిల్‌కి కొత్త హంగులద్ది.. ఈ సైకిల్స్‌గా మారుస్తున్నారు.. దీంతో ఓ వైపు పర్యావరణానికీ, మరో వైపు ఆరోగ్యానికీ మేలు చేకూర్చే ఈ-సైకిల్స్‌కి క్రేజ్ పేరుగుతోంది... ప్రస్తుతం భాగ్యనగరంలో ఇదో ట్రెండ్‌గా మారుతోంది.. అసలు ఈ-సైకిల్స్ కథేంటి? క్రేజ్ పెరగడానికి కారణమేంటి? తెలుసుకుందాం.. - సాక్షి సిటీ బ్యూరో

విశ్వనగరంగా గుర్తింపు తెచ్చుకున్న హైదరాబాద్‌లో టెకీలు, ఉన్నత ఉద్యోగుల్లో కొన్ని వర్గాల వారు విద్యుత్తు ఆధారిత సైకిళ్లను నడిపించడానికి ఆసక్తి చూపిస్తున్నారని ఇటీవల ఓ అధ్యయనంలో తేలింది. బిట్స్ పిలానీ హైదరాబాద్, లా ట్రోబ్ విశ్వవిద్యాలయం ఆస్ట్రేలియా సంయుక్త ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు ప్రశాంత్ సాహు, బందన్న జుందార్, పరిశోధకుడు జుబివుల్లా ఈ సర్వే నిర్వహించారు.

సర్వే చెబుతుంది ఇదే...

మొత్తం 482 మంది ఈ-సైకిల్ నడిపిస్తున్న వారిని సంప్రదించగా.. ఒకొక్కరు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రధానంగా మోటారు సైకిల్, కారు వినియోగించాలంటే ఇంధన ధరలు, వాయు, ధ్వని కాలుష్యం భారీగా పెరగడం, ట్రాఫిక్ సమస్యలు, సాధారణ సమయంలో సైక్లింగ్‌కు అవకాశం లేకపోవడం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి కారణాలతో ఈ-సైకిళ్ల వైపు మొగ్గుచూపుతున్నారని తేలింది. నిత్యావసర ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ-బైక్‌ల వినియోగానికి ఇష్టపడుతున్నారట.

60 శాతం ఈ-సైకిల్‌వైపు మొగ్గు..

ఇదిలా ఉంటే నగర రహదారులపై ప్రయాణికులు ఈ-సైకిల్‌పై ప్రయాణించడం ఒక రోల్ మోడల్‌గా ఉండాలని ఎక్కువ మంది చూస్తున్నారు. చిన్నపాటి దూరం వెళ్లడానికే మోటారు సైకిల్, కారు వినియోగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో... ఈ-సైకిల్ వైపు మొగ్గ చూపడానికి గల కారణాలపై సర్వే చేశారు. కాగా దాదాపు 60% మంది ప్రయాణికులు ఈ-సైకిల్‌ను నడపడానికి సిద్ధంగా ఉన్నారని అధ్యయన ఫలితాల్లో పేర్కొన్నారు.

సర్వే చేసిన ప్రాంతాలు...

హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, మెట్రో స్టేషన్ ప్రాంతాల్లో ఈ సర్వే నిర్వహించినట్లు అధ్యయన పత్రాల్లో పేర్కొన్నారు. కాగా 482 మందిలో 48 శాతం పురుషులు ఉండగా, 52 శాతం మంది మహిళా ప్రయాణికులు దీనికి మొగ్గు చూపడం విశేషం. మహిళలు మెట్రో నుంచి ఇంటికి, ఆఫీస్‌కు వెళ్లి రావడానికి ఈ-సైకిల్స్‌ను వినియోగిస్తున్నారు. హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్, బేగంపేట్, వివిధ ప్రాంతాల్లోని మెట్రో స్టేషన్‌కు వచ్చే వారిలో మొదటి, చివరి మైలు కోసం 'ఫీడర్' వాహనాలుగా ఈ-బైక్‌లను ఇష్టపడతారని అధ్యయనంలో తేలింది.

సైకిల్ ట్రాక్స్ అవసరం...

సుమారుగా 10కిలో మీటర్ల వరకు ప్రయాణించే వారి ఆలోచనలో మార్పు వస్తుంది. సైకిలింగ్‌పై చాలామందికి ఆసక్తి ఉన్నప్పటికీ ఉద్యోగం, ఇంటి వద్ద వివిధ రకాల పనుల్లో బిజీగా గడిపేస్తున్నారు. ఇటువంటి వారు ఈ-సైక్లింగ్‌లో ఎక్కువ మంది పాల్గొంటున్నారు. నగరంలో భారీ సంఖ్యలో మోటారు సైకిళ్లు ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఈ-సైకిళ్లు, ఈ-బైకుల సంఖ్య కూడా భారీగానే పెరిగింది. దీంతో ఓఆర్ఆర్‌ను ఆనుకుని సోలార్ సైక్లింగ్ మార్గాన్ని జీహెచ్‌ఎంసీ నిర్మించింది. కేబీఆర్ పార్కు చుట్టూ సైక్లింగ్ ట్రాక్ కూడా ఏర్పాటైంది. అయినా వాటిపై వాహనాలను పార్కింగ్ చేయడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. అనుకున్న లక్ష్యానికి ఆటంకంగా ఏర్పడుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని సైకిల్ ట్రాక్‌ల పర్యవేక్షణపై అధికారులు శ్రద్ధ వహించాలని పలువురు కోరుకుంటున్నారు.



రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఖరారు

- టీడీపీ నుంచి సి.రామచంద్రయ్య
- జనసేన నుంచి పిడుగు హరిప్రసాద్

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్డీయే కూటమి అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. రెండు స్థానాల్లో టీడీపీ, జనసేన ఒక్కొక్కటి పంచుకోవాలని నిర్ణయించారు. టీడీపీ తరఫున సి. రామచంద్రయ్య, జనసేన తరఫున పిడుగు హరిప్రసాద్ కూటమి అభ్యర్థులుగా మంగళవారం నామినేషన్లు దాఖలు చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు. కూటమి సంఖ్యా బలం 164 కావడంతో వీరిద్దరి ఎన్నిక లాంఛనమే. ఎమ్మెల్సీలు అయిన సి. రామచంద్రయ్య, మహ్మద్ ఇక్బాల్ పార్టీ ఫిరాయించడంతో వారిపై అనర్హత వేటు పడింది. దీంతో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వారి స్థానంలో సి. రామచంద్రయ్యకు టీడీపీ మళ్లీ అవకాశం కల్పించగా జనసేన హరిప్రసాద్‌ను ఎంపిక చేసింది.

మళ్లీ పాత బాబును చూస్తారు

చెప్పినట్లు నడుచుకోకపోతే 1995 నాటి సీఎం కనిపిస్తాడు జాగ్రత్త

- రాత్రికి రాత్రే ప్రజల ఆశలు తీరిపోవు
- అధికారులు కూడా కొత్త పాలనకు అలవాటు పడాలి
- పెనమాక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు

వలంటీర్లతో పనిలేకుండా పింఛన్ల పంపిణీ

- వ్యవస్థలతో పని చేయిస్తే ఎలా ఉంటుందో చూపించాం
- వలంటీర్లు రూ.100 తీసుకునేవారు
- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పవన్ కల్యాణ్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పింఛన్లపై పెత్తనం

ఏపీలో మరోసారి జన్మభూమి కమిటీలదే రాజ్యం

పెన్షన్ మొత్తంలో పలుచోట్ల రూ.500 చొప్పున వసూలు

- ఐదేళ్లు వివక్ష లేకుండా అందించిన పెన్షన్లకు రాజకీయ రంగులు
- పేరుకు మాత్రమే సచివాలయాల ఉద్యోగుల ద్వారా పంపిణీ
- కూటమి నేతల కనుసన్నల్లోనే అంతా..
- ఆధిపత్యం చాటుకునేందుకు టీడీపీ – జనసేన ఆరాటం
- కార్లలో, చెట్ల కింద, రచ్చబండ, ప్రైవేట్ స్థలాలకు రప్పించడంతో లబ్ధిదారులు పడిగాపులు


అనకాపల్లి జిల్లా నక్కపల్లి సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: ఐదేళ్లు ఎలాంటి వివక్షకు తావులేకుండా టంచన్‌గా, పారదర్శకంగా అందించిన పింఛన్లపై జన్మభూమి కమిటీల రాజ్యం మళ్లీ మొదలైంది. టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా సోమవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తిగా రాజకీయ నేతల కనుసన్నల్లో సాగింది. ఇంటివద్ద అందించాల్సిన పెన్షన్లను కొన్నిచోట్ల చెట్ల కింద, రచ్చబండ వద్ద, ప్రైవేట్ స్థలాల్లో ఇస్తామని తిప్పడంతో పడిగాపులు కాసి అవస్థలు ఎదుర్కొన్నారు. పేరుకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించినా పంపిణీ మొత్తం ప్రతి చోటా అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే జరిగింది. పింఛన్ల పంపిణీలో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల స్థానిక టీడీపీ నాయకులు చేతివాటం చూపినట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లా మాచర్ల సహా పలు చోట్ల కమీషన్ల కింద రూ.500 మినహాయించుకుని ఫించన్ ఇస్తున్నట్లు కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. 2014–19 మధ్య కూడా టీడీపీకి చెందిన జన్మభూమి కమిటీ సభ్యులు లంచాల వసూళ్లకు తెగబడి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అదే వాతావరణం కనిపించినట్లు వాపోతున్నారు. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో 94 మంది లబ్ధిదారులకు మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఫిర్యాదుతో ఈ నెల ఫించన్లు నిలిచిపోయాయి. ఇన్నాళ్లూ ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే ఇంటివద్దే నిశ్చింతగా కోవిడ్ కష్టకాలంలోనూ ఎలాంటి ఇబ్బంది లేకుండా అందిన ఫించన్లు ఈసారి కొన్నిచోట్ల ఉదయం 8 గంటలు దాటుతున్నా చేతికి అందకపోవడంతో పలుచోట్ల లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. వైఎస్సార్‌సీపీ హయాంలో పింఛన్ల మంజూరు మొదలు పంపిణీ దాకా రాజకీయాలకు అతీతంగా, ఎవరి సిఫారసులు అవసరం లేకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లను అందచేసిన విషయం తెలిసిందే. దీనికి పూర్తి భిన్నంగా తాజాగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. గ్రామాల్లోనూ, వార్డులోనూ సచివాలయాల ఉద్యోగుల వెంట స్థానిక టీడీపీ, జనసేన నాయకులు మోహరించారు. ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందచేస్తూ పోటాపోటీగా నేతలు ఫోటోలు దిగారు. విజయనగరం తదితర చోట్ల తమ ఆధిపత్యం నిరూపించుకునేందుకు జనసేన – టీడీపీ నేతలు పరస్పరం దాడులకు దిగిన ఉదంతాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కూటమి నేతలు కొన్ని చోట్ల తమ ప్రత్యర్థి పార్టీకి ఓటు వేశారనే అక్కసుతో పలువురు పింఛన్లను తొలగించినట్లు వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో పెదంచలలో వైఎస్సార్ సీపీకి ఓటు వేసినందుకు తమ పింఛన్లు నిలిపివేశారంటూ కొందరు లబ్ధిదారులు సచివాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. కాగా నంద్యాలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న 29వ వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ సుధారాణి (32) సోమవారం రాత్రి తన ఇంట్లో బాత్‌రూమ్‌లో అనుమానాస్పద రీతిలో మరణించారు. వారం క్రితం స్థానిక సచివాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసాతో పాటు సచివాలయ ఉద్యోగులను బెదిరించినట్లు సమాచారం. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సుధారాణి సోమవారం టీడీపీ నేతలతో కలసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్న అనంతరం అనుమానాస్పద రీతిలో మరణించారు.

తొలిరోజు 95 శాతం..

మొత్తం 64.75 లక్షల మంది లబ్ధిదారులకుగానూ తొలి రోజు సోమవారం రాత్రి ఏడు గంటల సమయానికి 61 లక్షల మంది (దాదాపు 95 శాతం)కి పైగా పింఛన్ల పంపిణీ పూర్తైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వలంటీర్లతో సంబంధం లేకుండా పూర్తిగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పంపిణీ కొనసాగించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల వలంటీర్లు వారి వెంట వెళ్లి పంపిణీలో పాల్గొన్నారు. ఉదయం కొద్దిసేపు సాంకేతికపరమైన అవాంతరాలు తలెత్తడంతో వాటిని సరిదిద్ది ప్రక్రియ కొనసాగించారు.

జనసేన మహిళా కార్యకర్తపై టీడీపీ నేతల దాడి

పింఛన్ల పంపిణీ సందర్భంగా విజయనగరం జిల్లాలో కూటమి నేతల్లో ఆధిపత్య పోరు బహిర్గతమైంది. టీడీపీ, జనసేన నాయకులు ఆధిపత్యం రుజువు చేసుకునేందుకు యత్నించడంతో విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని కొన్నివార్డుల్లో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. పింఛన్లను ఇంటింటికీ వెళ్లి అందించాల్సి ఉండగా కూటమి నాయకులు ఒకచోట కూర్చొని పంపిణీ చేపట్టారు. వైఎస్సార్ నగర్‌లోని కొన్ని వీధుల్లో జనసేన, మరి కొన్ని చోట్ల టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. ఇక్కడ జనసేన నాయకులు పంపిణీ చేస్తున్న పింఛన్లను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఏదైనా తమ ఆధ్వర్యంలోనే జరగాలని, తోక పార్టీ నాయకులు పంపిణీ చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వారిని ప్రశ్నించిన జనసేన మహిళా కార్యకర్తపై టీడీపీ నాయకులు దాడిచేశారు. ఈ ఘటనతో పింఛనుదారులు భయాందోళనలకు గురయ్యారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అమరులైన జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలి

- ప్రభుత్వానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విజ్ఞప్తి
- లద్దాఖ్ ప్రమాదంలో జవాన్ల ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి



సాక్షి, అమరావతి: లద్దాఖ్‌లో యుద్ధ ట్యాంకు కొట్టుకుపోయిన ప్రమాదంలో భారత జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు జవాన్లు మరణించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. దేశ రక్షణలో ఈ జవాన్ల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. కృష్ణా జిల్లా పెడన మండలం చేవెంద్రకు చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాల్వపల్లెకు చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా రేపల్లె మండలం ఇస్లాంపూర్‌కు చెందిన హవల్దార్ సుభాన్ ఖాన్ కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ జవాన్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అమర జవాన్ల అంత్యక్రియల్లో పాల్గొనాలని, వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని వైఎస్ జగన్ ఆదేశించారు.

కలిసి మాట్లాడుకుందాం

- రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై చర్చిద్దాం
- తెలంగాణ సీఎంకు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ
- ఈనెల 6న హైదరాబాద్‌లో ముఖాముఖికి ప్రతిపాదన

సాక్షి, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై కలిసి చర్చించుకుందామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా రెండు రాష్ట్రాల అభివృద్ధికి, సంక్షేమానికి పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరముందని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, రెండు రాష్ట్రాల లక్ష్యాలను సాధించడానికి సమన్వయంతో పనిచేయాల్సి వుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు పూర్తయ్యాయని చంద్రబాబు ఈ సందర్భంగా ఆ లేఖలో గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో.. పునర్వ్యవస్థీకరణ చట్టంవల్ల ఎదురవుతున్న సమస్యలపై ఇప్పటికే అనేక చర్చలు జరిగాయని, ఇవన్నీ సంక్షేమం, పురోగతిపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి సామరస్యంగా ముందుకెళ్లడం అత్యవసరమని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు. ఇందుకోసం ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్‌లో కలుద్దామని రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిపాదించారు. ముఖాముఖి సమావేశం నిర్వహించుకుని క్లిష్టమైన సమస్యలపై సమగ్రంగా చర్చలు జరుపుదామన్నారు. ఏపీ, తెలంగాణకు పరస్పర ప్రయోజనం కలిగే పరిష్కారాలను కనుగొని అందుకనుగుణంగా సమన్వయంతో పనిచేయడానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలి

- విభజన హామీలు అమలు చేయాలి
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాధరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాధ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక స్వావలంబన, సమ్మిళిత అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుసార్లు ప్రధాని, కేంద్ర మంత్రుల్ని కలిసి ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరారని గుర్తుచేశారు. ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం ఏపీ ప్రజల్ని మోసం చేయడం, వారికి అన్యాయం చేయడమేనని అన్నారు. టీడీపీ మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నందున హోదా కోసం టీడీపీ ఒత్తిడి తేవాలన్నారు. విశాఖలో రైల్వే జోన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కూటమి పార్టీల నేతలు చేస్తున్న దాడుల్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. దాడుల్ని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనందున కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

పీసీసీ అధ్యక్ష పదవిని బీసీకి కేటాయించండి

రాహుల్‌గాంధీకి దాసు సురేశ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: దేశంలో, తెలంగాణలో భవిష్యత్తు రాజకీయాలు బీసీల చుట్టే తిరగనున్నాయని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలంటే పీసీసీ అధ్యక్షుడిగా బీసీకే అవకాశమివ్వాలని సురేశ్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. త్వరలో చేపట్టబోయే తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో కూడా బీసీలకు పెద్దపీట వేయాలన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన రాహుల్ గాంధీ కార్యాలయానికి ప్రత్యేక లేఖ రాశారు. ఈ సందర్భంగా తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఓసీకి ముఖ్యమంత్రి పదవి, ఎస్సీకి ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టి సామాజిక న్యాయ దిశగా పయనిస్తున్న నేపథ్యంలో బీసీలకు పీసీసీ అధ్యక్ష పదవి అనివార్యమవుతున్నదన్నారు. ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్ష పదవికి అధిష్టానం పరిగణనలోకి తీసుకోవాలని దాసు సురేశ్ లేఖలో కోరారు.

బాండ్ల సొమ్ము ఎప్పుడిస్తారు?

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీకి మహాలక్ష్మి పథకం కోసం ప్రతినెలా రూ.350 కోట్లు చెల్లిస్తున్నామని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని, మరి నిధులున్నా 2013 వేతన సవరణ నాటి బాండ్ల సొమ్ము ఆర్టీసీ ఉద్యోగులకు ఎందుకు చెల్లించటం లేదని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 2017 వేతన సవరణ బకాయిలతోపాటు ఇతర బకాయిలు చెల్లించకుండా ఆర్టీసీ అధికారులు కాలయాపన చేస్తుండటం విడ్డూరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సహకార శాఖ డైరెక్టర్‌గా ఉదయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ, సహకార శాఖ సంయుక్త కార్యదర్శి పి.ఉదయ్‌కుమార్‌కు సహకార శాఖ డైరెక్టర్‌గా, సహకార సొసైటీల రిజిస్ట్రార్‌గా రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. టీజీ సీడ్స్ కార్పొరేషన్ ఎండీగా సైతం ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. విద్యా శాఖ సంయుక్త కార్యదర్శి ఎం.హరిత హోదాను ప్రత్యేక కార్యదర్శిగా మార్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెండోరోజూ పోలవరం ప్రాజెక్టు పరిశీలన


దయాఫ్రం వాల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నిపుణుల బృందం సభ్యులు

పోలవరం రూరల్ : పోలవరం ప్రాజెక్టులో అంతర్జాతీయ నిపుణుల బృందం రెండోరోజైన సోమవారం కూడా పనులను క్షుణ్ణంగా పరిశీలించింది. డేవిడ్ వి.పాల్, గియాస్ ఫ్రాంకో డి. సిస్కో, రిచర్డ్ డొన్నెల్లి, సీస్ హించ్ బెర్గర్‌లతో కూడిన బృందం సభ్యులు ఉ.10 గంటలకు రాజమహేంద్రవరం నుంచి పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న దయాఫ్రం వాల్ ప్రాంతాన్ని, క్షేత్రస్థాయిలో ప్రతి కట్టడం నిర్మాణాన్ని పరిశీలించారు. బృందం సభ్యులకు కేంద్ర జలసంఘం సీడబ్ల్యూసీ డైరెక్టర్ అశ్వినీకుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ పి. నారాయణరెడ్డి, సీఈ నరసింహమూర్తిలు ప్రాజెక్టు నిర్మాణ పనుల తీరును వివరించారు. దయాఫ్రం వాల్ నిర్మాణానికి ముందు చేసిన పనులు, తదుపరి చేసిన వివరాలను తెలుసుకుంటూ ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేశారు. దయాఫ్రం వాల్ ప్రాంతంలో వరద ఉధృతికి ఏర్పడ్డ అగాధాల పరిస్థితిపైనా ఆరా తీశారు. అగాధాలు పడిన ప్రాంతంలో శాండ్ ఫిల్లింగ్, జెట్ గ్రౌటింగ్ పనులను పరిశీలించి జల వనరుల శాఖాధికారుల నుంచి పనులు జరుగుతున్న తీరుతెన్నులను ప్రశ్నించారు. దయాఫ్రం వాల్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించి గతంలో పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి.. దీనిపై ఏవిధమైన నిర్ణయాలు తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. దయాఫ్రం వాల్ కట్టడం, పనితీరు తదితర అంశాలను ఇంజనీరింగ్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఎగువ కాఫర్ డ్యాం నుంచి సీపేజ్ (ఊట నీరు) వస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి, మట్టి నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. ఎగువ కాఫర్ డ్యాంపై జరుగుతున్న జియో టెక్నికల్ కోర్ ఇన్వెస్టిగేషన్ పనులు, అక్కడ సేకరించిన మట్టి నమూనాలను బృందం సభ్యులు పరిశీలించారు. అలాగే, ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతం, దయాఫ్రం వాల్ దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి, భూ భౌతిక పరిస్థితుల మార్పునకు చేస్తున్న ప్రయత్నాలు తదితర అంశాలపై నిపుణుల బృందం ఎక్కువ దృష్టిపెట్టింది.

నేడు, రేపు కూడా సమీక్ష..

ఇలా సుమారు మూడు గంటలపాటు దయాఫ్రం వాల్ మొత్తం పరిశీలించారు. పోలవరంలో ప్రధాన సమస్యలు ఇక్కడే ఉండటంతో, ప్రధాన డ్యాం నిర్మించాల్సిన మొదటి గ్యాప్ ప్రాంతాన్ని పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించారు. ఈ పరిశీలనలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముఖ్యులు, కేంద్ర జలసంఘం నిపుణులు, సీఎస్ఎంఆర్ఎస్ సంస్థ ప్రతినిధులు, వాప్కోస్, బావర్, కెల్లర్, మేఘా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. అంతర్జాతీయ డిజైన్ సంస్థ ఆఫ్రి ప్రతినిధులు కూడా ఉన్నారు. ముందుగా ప్రాజెక్టు వద్ద అధికారులు, ఏజెన్సీ ప్రతినిధుల భేటీ అనంతరం ప్రాజెక్టు వివరాలు తెలుసుకున్నారు. ఇక మంగళ, బుధవారాల్లో కూడా బృందం సభ్యులు, జలవనరుల శాఖాధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, ప్రాజెక్టు నిర్మాణం, పురోగతిపై తీసుకోవాల్సిన నిర్ణయాలు, జాగ్రత్తలు, చేయాల్సిన పనులపై సమీక్షిస్తారు.


సోమవారం రాజ్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మిజోరం గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

పలువురు వీసీల రాజీనామా

వర్సిటీల్లో కూటమి నేతల రాజకీయ విషక్రీడ

ఉన్నత విద్యకు పట్టుగొమ్మలుగా విలసిల్లుతున్న విశ్వవిద్యాలయాలను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వదిలిపెట్టడం లేదు. రాజకీయాలకు దూరంగా ఉంటున్న వర్సిటీలను తమ రాజకీయ విషక్రీడలకు బలిచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ (వీసీ), రిజిస్ట్రార్లను రాజీనామాలు చేసి వెళ్లిపోవాలంటూ కూటమి నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు అధికారుల ద్వారా వీసీలందరికీ ఫోన్‌లు చేయిస్తూ ఒత్తిడి తెస్తున్నారు. రాజీనామాలు చేసి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక మంది వీసీలు రాజీనామాలు చేసి తప్పుకున్నారు. ఈ క్రమంలో మరికొందరు కూటమి నేతలు, అధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక సోమవారం తమ పదవులకు రాజీనామాలు సమర్పించారు.


ఆంజనేయప్రసాద్


జీవీఆర్ ప్రసాదరాజు


డి.భారతి


సుధీర్ ప్రేమ్ కుమార్

వైదొలిగిన జేఎన్‌టీయూకే వీసీ

జేఎన్‌టీయూ–కాకినాడ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తన పదవికి రాజీనామా చేశారు. 2021 అక్టోబర్ 29న వీసీగా నియమితులైన ఆయన మరో నాలుగు నెలల పదవీ కాలం ఉండగానే రాజీనామా చేయాల్సి వచ్చింది.

ఏఎన్‌యూ వీసీ, ఉన్నతాధికారులు..

గుంటూరు జిల్లా నంబూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, పలువురు కో–ఆర్డినేటర్లు, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేశారు.

సాక్షి, అమరావతి/కర్నూలు కల్చరల్/ఏఎఫ్‌యూ/తిరుపతి సిటీ/ఏఎన్‌యూ/బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.బాబ్జీ రాజీనామా చేశారు. గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ అయిన అబ్దుల్ నజీర్‌కు మెయిల్ ద్వారా తన రాజీనామా లేఖను పంపారు. బాబ్జీ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ వైద్యుడు. గతంలో వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ)గా పనిచేసిన బాబ్జీ గతేడాది ఫిబ్రవరిలో వీసీగా నియమితులయ్యారు. 2026 ఫిబ్రవరి వరకూ ఆయన పదవీకాలం ఉన్నప్పటికీ వైద్య శాఖ ఉన్నతాధికారి ఒకరు ఫోన్ చేసి రాజీనామా చేయాలని ఆదేశించడంతో తన పదవి నుంచి వైదొలిగారు.

తప్పుకున్న రాయలసీమ వర్సిటీ వీసీ..

కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయనకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్, డిప్యూటీ సెక్రటరీ ఫోన్ చేసి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో సుధీర్ ప్రేమ్ కుమార్ తన రాజీనామా లేఖను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పంపారు. హైదరాబాద్ జేఎన్‌టీయూ మెకానికల్ విభాగం ప్రొఫెసర్ అయిన బి.సుధీర్ ప్రేమ్ కుమార్ ఈ ఏడాది జనవరి 17న వీసీగా బాధ్యతలు స్వీకరించారు.

పద్మావతి మహిళా వర్సిటీ వీసీ రాజీనామా

తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి పదవి నుంచి వైదొలిగారు. ఆమె గతేడాది జూన్ 15న వీసీగా బాధ్యతలు చేపట్టారు. ఆమె పదవీ కాలం మరో రెండేళ్లు ఉన్నప్పటికీ అధికారుల ఒత్తిడితో రాజీనామా చేశారు.

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ వీసీ కూడా..

కడపలో 2020లో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ తొలి వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ కూడా తన పదవీకాలం పూర్తవకుండానే ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో రాజీనామా సమర్పించారు. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా ఉన్న ఆయనను గతేడాది ఫిబ్రవరి 9న ఏఎఫ్‌యూ వీసీగా నియమించారు. కాగా ఇప్పటికే వైఎస్సార్ జిల్లాకు చెందిన యోగి వేమన వర్సిటీ (వైవీయూ) వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి రాజకీయ నేపథ్యం, వివాదం లేని గిరిజన ఆచార్యుడైన బానోతు ఆంజనేయప్రసాద్‌ను సైతం రాజీనామా సమర్పించాలని కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో వీసీ పదవి నుంచి వైదొలిగారు. 2026 ఫిబ్రవరి 8 వరకు పదవీకాలం ఉన్నా తప్పుకున్నారు.

కలెక్టరేట్‌లో ‘భోజనాల’ నిరసన


వికారాబాద్ కలెక్టరేట్ ఆవరణలో భోజనాలు చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

వికారాబాద్: ఈ ఫొటోను చూసి కుటుంబ సభ్యులంతా సరదాగా పిక్నిక్ వచ్చారనుకుంటే మీరు పొరపాటు పడ్డట్టే. ఎనిమిదేళ్లుగా తమ భూ సమస్యను పరిష్కరించడం లేదని నిరసిస్తూ రెండు కుటుంబాలకు చెందిన బాధితులు సోమవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో వినూత్న నిరసన తెలిపారు. తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన తొర్యానాయక్, హీర్యానాయక్ కుటుంబాలకు చెందిన సుమారు 70 మంది సద్దిమూటలు, పిల్లాపాపలతో తరలివచ్చారు. తమ సమస్యను పరిష్కరించే వరకు కదిలేది లేదని భీష్మిస్తూ అక్కడే భోజనాలు చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి వచ్చి సర్దిచెప్పారు. అనంతరం బాధితులు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చి వెళ్లారు. సదరు భూ సమస్య కోర్టు పరిధిలో ఉందని, ఇరువర్గాల వద్ద ఇంజక్షన్ ఆర్డర్ ఉండటంతో న్యాయస్థానం సూచనల మేరకు నడుచుకుంటామని అధికారులు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 2-7-2024



● బబ్రీన్ కాంధరీ

పర్యావరణ గీతం

– అడ్వకసీ టు యాక్షన్

‘ఏమీ చేయలేమా?’
అనే ప్రశ్న ముందుకు వచ్చినప్పుడు
వినిపించే జవాబులు రెండు...
‘మనం మాత్రం ఏం చేయగలం!’
‘కచ్చితంగా మనమే చేయగలం’
‘మనం మాత్రమే చేయగలం’ అని ఢిల్లీకి చెందిన బబ్రీన్ కాంధరీ అనుకోవడం వల్లే ‘వారియర్ మామ్స్’ పుట్టుక సాధ్యం అయింది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా పదమూడు రాష్ట్రాలలో క్షేత్రస్థాయిలో పర్యావరణ హిత ప్రచారాన్ని నిర్వహిస్తోంది బబ్రీన్.
కాపీరైటర్ నుంచి
ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా
ఆమె ప్రయాణం స్ఫూర్తిదాయకం...

ఏయిర్ ఫోర్స్ అధికారి కూతురు అయిన బబ్రీన్ దేశంలోని వివిధ ప్రాంతాలలో చదువుకుంది. అలా ఎన్నో సంస్కృతులు, కళలు, ప్రకృతి అందాలతో పరిచయం అయింది.

లండన్‌లోని వాయు కాలుష్యం గురించి వ్యాసం ఒకటి చదివింది బబ్రీన్. ‘ఢిల్లీలో కూడా ఇలాంటి పరిస్థితే కదా’ అని నిట్టూర్చింది. ‘ఇది లోకల్ ప్రాబ్లం కాదు. గ్లోబల్ ప్రాబ్లమ్’ అనుకుంది.

వర్తమానం సంగతి ఎలా ఉన్నా పొగచూరిన భవిష్యత్ మసక మసకగా కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాపీరైటర్ ఉద్యోగాన్ని వదులుకొని ‘వారియర్ మామ్స్’కు శ్రీకారం చుట్టింది బబ్రీన్. ‘ వాయుకాలుష్యం అనేది చర్మం, జుట్టు, ఊపిరితిత్తులు, గుండెపై ప్రభావం చూపుతుంది. ఆహార ఉత్పత్తులలోని పోషక విలువలను నాశనం చేస్తుంది. అన్నిరకాలుగా హాని కలిగిస్తుంది’ అంటున్న బబ్రీన్ ‘వారియర్ మామ్స్’ ద్వారా పల్లె నుంచి పట్టణం వరకు ఎన్నో ప్రాంతాలు తిరిగింది.

క్షేత్రస్థాయిలో వాయుకాలుష్యం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

తనలాగే ఆలోచించే మహిళలు తోడు కావడంతో ‘వారియర్ మామ్స్’కు బలం పెరిగింది.

మొదట్లో వాయుకాలుష్యం ప్రమాదాల గురించి ప్రచారం మొదలుపెట్టినప్పుడు ‘ఈ విషయాలు మాకు ఎందుకు’ అన్నట్లుగా ముఖం పెట్టేవారు. ప్రమాద తీవ్రత గురించి తెలుసుకున్న తరువాత మాత్రం వారిలో మార్పు రావడం మొదలైంది.

‘మీ పిల్లల భవిష్యత్ గురించి కూడా ఆలోచించండి’ అనే మాట వారిని కదిలించి కార్యక్షేత్రంలోకి తీసుకువచ్చింది. ప్రపంచం ఎలా మారాల్సి వచ్చిందో చెప్పడానికి కోవిడ్ మహమ్మారి పెద్ద ఉదాహరణ. ఈ నేపథ్యంలోనే... ‘మరొక మహమ్మారిని నివారించడానికి మనం ఎందుకు మారకూడదు?’ అని ప్రశ్నిస్తోంది.

‘అభివృద్ధి’ గురించి మాట్లాడినప్పుడు ‘పర్యావరణ హితం’ గురించి కూడా మాట్లాడాలి అంటుంది బబ్రీన్.

‘కొన్నిసార్లు దూకుడుగా ముందుకు వెళ్లాలి’ అనేది కొన్ని సందర్భాలలో బబ్రీన్ నోటి నుంచే వినిపించే మాట.

సమస్య గురించి అధికారుల దృష్టికి తెచ్చినప్పుడు, వారి స్పందనలో అలసత్వం కనిపించినప్పుడు, ‘నా కంపెనీకి మేలు జరిగితే చాలు పర్యావరణం ఏమైపోతే నాకెందుకు!’ అనుకునేవాళ్లను చూసినప్పుడు బబ్రీన్ దూకుడుగా ముందుకు వెళుతుంది.

తాను ఆశించిన ఫలితం వచ్చే వరకు మడమ తిప్పకుండా పోరాడుతుంది. ‘మార్పు మన ఇంటి నుంచే మొదలు కావాలి’ అంటున్న బబ్రీన్ మాటలు ఎంతోమందిలో మార్పు తీసుకువచ్చాయి.

‘పదిమందిలో ఏడుగురు వాతావరణ మార్పుల గురించి ఆందోళన చెందుతున్నారు. పదిమందిలో తొమ్మిదిమంది వాతావరణ మార్పులపై తగిన కార్యాచరణ అవసరం అంటున్నారు. కానీ పదిమందిలో నలుగురు మాత్రమే కార్యాచరణలో భాగం అవుతున్నారు’ అంటున్న బబ్రీన్ ఆశ మాత్రం కోల్పోలేదు. ‘వారియర్ మామ్స్’ ద్వారా అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉంది.

ఫ్యాషన్ స్టేట్‌మెంట్ కాదు



పర్యావరణవాదం అనేది ఫ్యాషన్ స్టేట్‌మెంట్ కాదు. మన భవిష్యత్ కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలి. దీనికోసం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగం కావాలి. మొక్కలు నాటండి. పర్యావరణ హిత ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వండి. వాట్సాప్ గ్రూప్‌లలోనో, ఫేస్‌బుక్ పేజీలలోనో పర్యావరణ సంక్షోభం గురించి ఆందోళన చెందితే ప్రయోజనం లేదు. కార్యాచరణ అనేది చాలా ముఖ్యం. నేటి కార్యరణే రేపటి భవిష్యత్.

– బబ్రీన్ కంధారి, ఫౌండర్, వారియర్ మామ్స్




నిశ్శబ్దానికి రక్షకులు కావాలి

ముంబైలో 46 లక్షల వాహనాలున్నాయి.
వాటిలో 70 శాతం
రోజుకు కనీసం ఏడుసార్లు హారన్ మోగిస్తే
ఎంత శబ్దకాలుష్యమో ఆలోచించారా
అని ప్రశ్నిస్తుంది సవితారావు.
ముంబైకి చెందిన ఈ సామాజిక కార్యకర్త
‘నిశ్శబ్దం తరపున పోట్లాడేవాళ్లు కావాలి’
అని ప్రచారం చేస్తోంది.
అంతేకాదు ‘నాయిస్ ఇన్ అవర్ నేషన్’
అనే పుస్తకం రాసి శ్రుతి మించిన ధ్వని వల్ల
వచ్చే శారీరక, మానసిక అనారోగ్యాలను
తెలియచేసింది.
‘చప్పళ్ల చెత్తను పారపోద్దాం రండి’
అంటున్న ఆమె పరిచయం.

మన హైదరాబాద్‌లో ట్రాఫిక్ పోలీసు వారు స్పీడ్ గన్స్ ఏర్పాటు చేశారు. మితి మీరిన వేగంతో ప్రయాణిస్తే అవి గుర్తించి చలాన్లు పంపుతాయి. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వం రాష్ట్రమంతటా 255 ‘నాయిస్ డిటెక్టర్లు’ బిగించారు. ఒక వాహనం అవసరానికి మించి హారన్ మోగించినా, నియమిత డెసిబెల్స్ మించి చప్పుడు చేసినా వెంటే ఈ నాయిస్ డిటెక్టర్ గుర్తించి వారికి జరిమానా విధిస్తుంది. ఇది 1000 రూపాయల వరకూ ఉంటుంది. ‘మెట్రో నగరాల్లో అర్థం పర్థం లేని హారన్ మోతలను నివారించాలంటే ఇలాంటి చర్యలు అవసరం. ముంబైలో ముఖ్యంగా అవసరం’ అంటోంది సవితా రావు.

నో హారన్ ప్లీజ్

రోడ్డు మీద వెళుతుంటే గతంలో చాలా వాహనాల వెనుక ‘ప్లీజ్ సౌండ్ హారన్’ అని ఉండేది. ఇప్పుడు సామాజిక కార్యకర్తలు, పర్యావరణ ప్రేమికులు ‘నో హారన్ ప్లీజ్’ అంటున్నారు. ముంబైకి చెందిన సవితా రావు ‘నాయిస్ ఇన్ అవర్ నేషన్’ పేరుతో ఈ అంశంపై చైతన్యం కోసం పుస్తకమే రాశారు. ‘ఇండియా పాజిటివ్ సిటిజెన్ ఇనిషియేటివ్’ పేరుతో సంస్థ ప్రారంభించిన సవితా రావు పౌరులుగా ఈ దేశం కోసం ప్రతి ఒక్కరూ ఏదో ఒక మంచి పని చేయవలసిన బాధ్యత ఉందని, అందుకే ‘వన్ యాక్షన్, వన్స్ ఏ వీక్, ఎవ్రీ వీక్’ అనే భావన వారిలో కలిగించాలని పని చేస్తోంది. అంటే రోజూ దేశం, సమాజం కోసం ఏదో ఒక మంచి పని చేయకపోయినా కనీసం వారంలో ఒకసారి చేస్తూ, ప్రతి వారం చేయగలిగితే చాలా మార్పు సాధించవచ్చని ఆమె అంటారు. ఉదాహరణకు రాంగ్ సైడ్ వాహనం నడపకపోవడం, ట్రాఫిక్ నియమాలను పూర్తిగా పాటించడం కూడా సమాజానికి పెద్ద మేలు అంటారామె. అయితే ఆ చిన్నపాటి దుర్గుణాన్ని కూడా సరి చేసుకోరు చాలామంది అని వాపోతారు.



నిశ్శబ్దం మన హక్కు

‘ఇవాళ నిశ్శబ్దం కలిగిన వాతావరణం అరుదైపోయింది. పెళ్లిళ్లకు వెళ్లినా, పార్కుకు వెళ్లినా, రెస్టరెంట్‌కు వెళ్లినా, జిమ్‌కు వెళ్లినా పెద్ద శబ్దంతో ఏవో ఒక పాటలు, సంగీతం చెవిన పడుతుంటాయి. ఆఖరుకు ఆస్పత్రులకు వెళ్లినా ఔట్ పేషంట్ల విభాగం దగ్గర అందరూ మాట్లాడుకుంటూ అరుచుకుంటూ చాలా చప్పుడు చేస్తుంటారు. నిశ్శబ్దం పాటించడం ఒక సంస్కారం అని మరిచిపోయాం. ఇక పండగలు వస్తే మైకుల ద్వారా జరుగుతున్న గోల చాలా తీవ్రమైనది. వీధి చివర కనపడే చెత్త మాత్రమే కొందరికి కనిపిస్తుంది. కాని ఇది కనపడని చెత్త. కనపడని కాలుష్యం. ఇది ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది’ అంటారు సవితా రావు.

అనారోగ్య మెట్రోలు

‘దేశ ఆర్థిక పురోగతికి 2030 నాటికి పట్టణ, నగరాలే ఆయువు పట్టు అవుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కాని ఈ మెట్రో నగరాల్లో ఉన్న పౌరుల ఆరోగ్యం సరిగ్గా లేకపోతే అవి ఎలా పురోగమిస్తాయి. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, ఆహార కాలుష్యంతో పాటు శబ్ద కాలుష్యం కూడా వారిని కాటేస్తోంది. హారన్ వాడకం చాలా తీవ్రంగా ఉంటోంది. ఇప్పటికే మన దేశ పట్టణాల్లో, నగరాల్లో డయాబెటిస్, బి.పి.లతో అత్యధిక జనం బాధపడుతున్నారు. శబ్ద కాలుష్యం వల్ల గుండె, చెవి, మెదడు ఆరోగ్యం దెబ్బ తింటుంది. అనవసర ఆందోళన మొదలవుతుంది’ అంటారు సవితా రావు.

చప్పళ్లు సృష్టించే అభివృద్ధి

‘ప్రభుత్వాలు విమానాశ్రయాలను వృద్ధి చేస్తున్నాయి. విమానయాన సంస్థలు వందల కొత్త విమానాలకు అర్డర్లు ఇస్తున్నాయి. రైలు మార్గాల విస్తరణ, ఇక లక్షలాది టూ వీలర్లు ఇవన్నీ ఏ స్థాయిలో శబ్ద కాలుష్యం సృష్టిస్తాయో ఆలోచిస్తున్నామా? శబ్ద కాలుష్యం వల్ల మరణాలు సంభవించకపోయినా ఆయుష్షు క్షీణిస్తోందని డబ్ల్యు.హెచ్.ఓ చెబుతోంది. ట్రాఫిక్ నియమాలు పాటించకుండా ముందు బండిని దాటేయాలన్న దుశ్చర్యతో అదేపనిగా హారన్ కొట్టి శబ్ద కాలుష్యం సృష్టించేవారిపై జరిమానా విధించాలా వద్దా?’ అని ప్రశ్నిస్తారు సవితా రావు.

ఆమె రాసిన పుస్తకం ‘నాయిస్ ఇన్ అవర్ నేషన్’ శబ్ద కాలుష్య దుష్ప్రభావాలు తెలపడమే కాదు ప్రభుత్వం, స్థానిక సంస్థలు, పోలీసు వ్యవస్థ, ట్రాఫిక్ వ్యవస్థ, పౌరులు కలిసి దీని నుంచి సమష్టి ప్రయత్నంతో ఎలా బయటపడాలో కూడా తెలియచేస్తోంది.

● చిరుధాన్యాల సాగుపై 34 గ్రామాల్లో 1,100 మంది రైతుల వర్షాధార సేద్య అనుభవాలపై ‘సెస్’ ఇంటింటి సర్వే

● డీడీఎస్ సంఘాల సంస్థాగత.. మార్కెటింగ్ మద్దతు వల్లే రైతులకు అధికాదాయం వస్తోందని వెల్లడి

● చిరుధాన్యాల సేంద్రియ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక మద్దతు అవశ్యమని సిఫారసు

సాగుబడి
ఆర్ద్ర కార్తె : జూలై 5 వరకు
పునర్వసు : జూలై 6 నుంచి

మిల్లెట్స్‌ను ప్రోత్సహిస్తే లాభాలు మెండు!

తెలంగాణ దక్కను పీఠభూమి ప్రాంతంలో వర్షాధారంగా వ్యవసాయం చేసే సన్న, చిన్నకారు రైతులు సంఘంగా ఏర్పడటం.. సేంద్రియ సేద్య పద్ధతిని అనుసరించటం.. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు తదితర పంటలను కలిపి సాగు చేయటం.. సంఘటితంగా మార్కెటింగ్ చేసుకోవటం నిస్సందేహంగా బహువిధాలా లాభదాయకమే! సంఘటితమైన చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు తాము పండిస్తున్న పౌష్టికాహారాన్ని తింటూ.. మిగతా దిగుబడులు విక్రయిస్తూ మంచి నికరాదాయం కూడా పొందగలుగుతున్నారని, పనిలో పనిగా భూసారాన్ని కూడా పెంపొందించుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వ సంస్థ ‘సెస్’ జరిపిన తాజా అధ్యయనం చెబుతోంది. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ప్రోత్సాహంతో మహిళా రైతుల స్వయం సహాయక సంఘాలు అనుసరిస్తున్న సేంద్రియ సేద్య నమూనా సాధిస్తున్న విజయాలపై ‘సెస్’ ఇటీవలే అధ్యయనం చేసింది. సహకార స్ఫూర్తిని చాటిచెబుతున్న ఈ అధ్యయన వివరాలు..

(జూలై 6న అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా...)



ఏయే రైతుల వ్యవసాయ ఖర్చులు ఎంతెంత? (ఎకరానికి/రూపాయల్లో)

వివరం	చిరుధాన్యేతర రైతులు	చిరుధాన్య రైతులు	డీడీఎస్ చిరుధాన్య రైతులు
విత్తనాలు	5,571 (43.38%)	1,433 (12.05)	1,012 (9.90%)
సేంద్రియ ఎరువులు	437 (3.79%)	534 (4.49%)	1,544 (15.11%)
రసాయనిక ఎరువులు/ సూక్ష్మపోషకాలు	1,285 (10.01%)	843 (7.09%)	183 (1.79%)
పురుగుమందులు/ కషాయాలు	471 (3.67%)	43 (0.36%)	18 (0.18%)
కూలీల ఖర్చు	5,028 (39.15%)	9,040 (75.99)	7,461 (73.00%)
మొత్తం ఖర్చు :	12,792	11,893	10,218

ఏయే రైతులకు ఆదాయం ఎంతెంత? (ఎకరానికి/రూపాయల్లో)

వివరం	చిరుధాన్యేతర రైతులు	చిరుధాన్య రైతులు	డీడీఎస్ చిరుధాన్య రైతులు
గడ్డి	198 (0.78)	623 (5.54%)	750 (4.57)
ఉప ఉత్పత్తి	92 (0.36%)	90 (0.80%)	218 (1.33%)
సాగు చేయని పంటలు	154 (0.60%)	181 (1.61%)	813 (4.95%)
ధాన్యం దిగుబడి	25,073 (98.26%)	10,354 (92.03)	14,627 (89.14%)
మొత్తం ఆదాయం	25,517	11,248	16,408
నికర లాభం	12,725	– 645	6,190

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంత గ్రామాల్లో డీడీఎస్ చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల మిశ్రమ సాగును చాలాకాలంగా ప్రోత్సహిస్తోంది. సాగులో అడుగడుగునా ఈ మహిళా రైతులకు తోడుగా ఉండటంతో పాటు మార్కెట్‌లో మద్దతు ధరకు తానే సేకరించి, ప్రాసెస్ చేసి ఏడాది పొడవునా హైదరాబాద్, జహీరాబాద్ ప్రాంతాల్లో ప్రజలకు విక్రయిస్తోంది డీడీఎస్. సంఘటిత శక్తి వల్ల ఈ రైతులు ఎకరానికి రూ. 6 వేలకుపైగా నికరాదాయం పొందుతున్నారు.

అయితే, కొందరు రైతులు డీడీఎస్‌తో సంబంధం లేకుండా చిరుధాన్యాలను పండించి వ్యక్తిగతంగా మార్కెట్‌లో అమ్ముకుంటూ నష్టాల పాలవుతున్నారని హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ (సెస్) ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది.

సెస్ సంచాలకురాలు ఇ. రేవతి, అసోసియేట్ ప్రొఫెసర్ బి.సురేశ్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్ది దయాకర్‌ల బృందం 2024 జనవరిలో జహీరాబాద్, ఝరాసంగం, కోహిర్, న్యాల్కల్, మొగడంపల్లె మండలాల్లోని 34 గ్రామాల్లో 1,100 మంది రైతుల వ్యవసాయ అనుభవాలపై ఇంటింటి సర్వే చేసింది. ఈ అధ్యయనంలో గుర్తించిన అంశాలతో ‘సెస్’ పరిశోధనా నివేదికను వెలువరించింది.

సర్వే జరిగిన గ్రామాల్లో ప్రధానంగా వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు చిరుధాన్యాలు తదితర పంటలను రసాయనిక పద్ధతిలో కాకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, ఊదలు వంటి చిరుధాన్యాలతో పాటు కందులు, పెసలు, మినుములు, ఉలవలు, సోయా, మిరప, మొక్కజొన్న, అల్లం, పత్తి, పసుపు వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో 80% మంది రైతులు తమ చిన్న చిన్న కమతాల్లో ఏదో ఒక పంటను కాకుండా కనీసం 8 రకాల పంటలు కలిపి పండిస్తున్నారు.

డీడీఎస్‌తో సంబంధం లేకుండా చిరుధాన్యాలను సాగు చేసే రైతులకు ఎకరానికి అయిన ఖర్చు రూ. 11,893. అయితే, డీడీఎస్ సహకార సంఘాల సభ్యులైన మహిళా రైతులకు చిరుధాన్యాలు తదితర కలిపి పంటల సాగుకు ఎకరానికి అయిన ఖర్చు రూ. 10,218 మాత్రమే. చిరుధాన్యాలు తదితర పంటలు కలిపి పండించిన రైతులకు మొత్తం ఖర్చులో 70% కూలీల ఖర్చే. చిరుధాన్యేతర పంటల రైతులకు అయిన కూలీల ఖర్చు 39% మాత్రమే.

చిరుధాన్యేతర పంటల సాగు ఖర్చులో 43% విత్తనానికి అవుతుంది. రసాయనిక ఎరువులు, పురుగుమందుల ఖర్చు అదనం. డీడీఎస్‌తో సంబంధం లేకుండా చిరుధాన్య పంటలు సాగు చేసే రైతులు విత్తనాలకు 12% ఖర్చు పెడుతున్నారు.

డీడీఎస్ సంఘాల్లో రైతులు విత్తనాలకు 10% ఖర్చు చేస్తున్నారు. వీరు సేంద్రియ ఎరువుల కోసం మొత్తం ఖర్చులో 15% వెచ్చిస్తున్నారు. బోరాన్, జింక్ వంటి సూక్ష్మ పోషకాలను భూమికి అందిస్తున్నారు. రసాయనిక వ్యవసాయంలో చిరుధాన్యాలు సాగు చేస్తున్న సంఘటితం కాని రైతులకు మార్కెట్‌లో సరైన ధర రాక ఆదాయం కన్నా ఖర్చే ఎక్కువ అవుతుండటం గమనార్హం.

అయితే, డీడీఎస్ సహకార సంఘాల్లో ఉన్న సేంద్రియ రైతులకు మాత్రం డీడీఎస్ సంస్థాగత తోడ్పాటు.. మార్కెటింగ్ మద్దతు, వాతావరణ మార్పులను తట్టుకునే శక్తి వల్లే రైతులకు అధికాదాయం వస్తోందని సెస్ నివేదిక తెలిపింది. ఇదిలా ఉండగా, ‘చిరుధాన్యేతర’ (పత్తి తదితర) పంటలను సాగు చేసే రైతులకు అన్నీ అనుకూలిస్తే రూ. 12 వేలకు పైగా నికారదాయం వస్తోంది. అనుకూలించకపోతే ఏకపంటలు సాగు చేసే ఈ రైతులకు పెట్టుబడి నష్టం ఎక్కువగా ఉంటుంది.

చిరుధాన్యాల రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి

వర్షాధారంగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలను పండించే చిన్న, పెద్ద రైతులు సమాజానికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. వాతావరణ మార్పుల్ని తట్టుకుంటూ భూసారాన్ని పెంపొందిస్తున్నారు. పర్యావరణానికీ మేలు చేస్తున్నారు. ఈ మెట్ట రైతుల విశేష కృషికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇచ్చే విధంగా బలమైన విధాన నిర్ణయాలు తీసుకోవాలి. ఈ రైతులకు ఎకరానికి కనీసం రూ. 2–3 వేలు ప్రత్యేక ప్రోత్సాహకంగా ఇవ్వాలి. అన్ని రకాల చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలకు కనీస మద్దతు ధరలు ప్రకటించాలి. మిల్లెట్ రైతుల ఎఫ్‌పిఓలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలకు ప్రత్యేక సదుపాయాలు ఇవ్వటం ద్వారా ప్రత్యేక మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి. నీటిపారుదల రైతులతో పోల్చితే వీరికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా గట్టి చట్టాలు తేవాలి. ఈ చర్యలతో చిరుధాన్యాల, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెరిగి, ప్రజలకు మరింత సరసమైన ధరలకు లభిస్తాయి.



– డా. బి.సురేశ్ రెడ్డి (95505 58158)
అసోసియేట్ ప్రొఫెసర్, సెస్, హైదరాబాద్

6,7 తేదీల్లో హుబ్లీలో పనస మేళా



● కెంపరాజు





కరువును తట్టుకొని చక్కని ఫలసాయాన్నిచ్చే పండ్ల చెట్టు పనస. ఈ నెల 6,7 తేదీల్లో కర్ణాటకలోని హుబ్లీ నగరంలో మూడు వేల మఠాల ఆవరణలో పనస మేళా జరగనుంది. సరికొత్త ‘శంకర ఎర్ర పనస’ రకం ఈ మేళాలో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అత్యంత రుచికరంగా ఉండటం, ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పాటు జిగట తక్కువగా ఉండటం దీని ప్రత్యేకతలు. హుబ్లీ మేళాలో ‘శంకర ఎర్ర పనస’తో పాటు సిద్ధు, వియత్నాం ఎర్లీ, లాల్‌బాగ్ మధుర, భైరచంద్ర, రుద్రాక్షి వంటి అనేక పనస రకాల పండ్లను ప్రదర్శించటంతో పాటు మొక్కలను కూడా మేళాలో విక్రయిస్తారు. ‘శంకర ఎర్ర పనస’ రకం ప్లాంట్ బ్రీడ్ కన్సర్వేషన్ అథారిటీలో కూడా రిజిస్టర్ అయ్యింది. దీన్ని అభివృద్ధి చేసి, మొక్కల్ని విక్రయిస్తున్న రైతు శాస్త్రవేత్త పేరు కెంపరాజు (76767 80559).

7,8 తేదీల్లో అనంతపురం జిల్లాలో డా. ఖాదర్ సభలు



స్వతంత్ర శాస్త్రవేత్త, ఆహార – ఆరోగ్య నిపుణులు డా. ఖాదర్ వలి ఈ నెల 7,8 తేదీల్లో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రాంతంలో జరిగే వివిధ సభల్లో ప్రసంగిస్తారు. సిరిధాన్యాల ఆహారం ద్వారా ఆరోగ్యం, సిరిధాన్యాల సాగు, గ్రామాల్లోనే ప్రాసెసింగ్ పద్ధతులు, తద్వారా మహిళల ఆదాయం పెంచుకోవటం.. వంటి అనేక అంశాలపై అవగాహన కల్పిస్తారు. 7 (ఆదివారం)న కళ్యాణదుర్గం సమీపంలోని గుడ్డిళ్లలోని రాధాసామి సత్సంగంలో ప్రసంగిస్తారు.

8 (సోమవారం)న ఉ. 9 గంటలకు కోట గుడ్డెమ్ గ్రామంలో, 10.30 గంటలకు చెన్నంపల్లిలో, మధ్యాహ్నం 12 గంటలకు పేరూరులో జరిగే సమావేశాల్లో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కుళ్లాయిస్వామి (92464 77103), రామప్ప (94411 65281) రైతులకు చిరుధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తారు. 8న మధ్యాహ్నం 3 గంటలకు కురుగుంటలోని పుడమిసిరి మిల్లెట్స్ హోటల్ ప్రాంగణంలో మా భూమి మహిళా రైతు సమాఖ్య చిరుధాన్య ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభోత్సవంలో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. నిర్వాహకులు భానూజ (94400 17188) ఆధ్వర్యంలో విత్తన వితరణ జరుగుతుంది. అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అతిథిగా పాల్గొంటారు.

‘సిరిధాన్యాలతో జీవన సిరి’పై 3 రోజుల శిబిరం

గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ రైతు శిక్షణా కేంద్రంలో ఈ నెల 12,13,14 తేదీల్లో చిరు (సిరి)ధాన్యాలతో జీవన సిరి అనే అంశంపై డా. ఖాదర్ వలి, డా. సరళా ఖాదర్ ద్వారా ప్రత్యేక ఆరోగ్య అవగాహన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆధునిక రోగాల నుంచి విముక్తి పొందే మార్గాల గురించి, రోగరహితంగా జీవనాన్ని కొనసాగించే సిరి జీవన శైలిపై పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 97053 83666, 95538 25532.

స్పోర్ట్స్



ఆర్‌సీబీ బ్యాటింగ్‌ కోచ్‌గా దినేశ్‌ కార్తీక్‌

ఇటీవల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత మాజీ వికెట్‌ కీపర్‌ దినేశ్‌ కార్తీక్‌ రెండో ఇన్నింగ్స్‌ మొదలుపెట్టనున్నాడు. ఈ ఏడాది చివరిసారిగా ప్లేయర్‌ హోదాలో ఐపీఎల్‌లో రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున ఆడిన కార్తీక్‌ ఇప్పుడదే జట్టుతో మరో పాత్రలో కొనసాగనున్నాడు. కార్తీక్‌ను ఆర్‌సీబీ బ్యాటింగ్‌ కోచ్, మెంటార్‌గా ఫ్రాంచైజీ నియమించింది. 'మా కీపర్‌కు పునర్‌స్వాగతం. ఆర్‌సీబీ జట్టులో కొత్త పాత్ర పోషిస్తాడు. బెంగళూరు పురుషుల జట్టు బ్యాటింగ్‌ కోచ్, మెంటార్‌గా అతన్ని నియమించాం' అని ఫ్రాంచైజీ తెలిపింది.

విశ్వనాథన్‌ ఆనంద్‌ పదోసారి...



భారత చెస్‌ దిగ్గజం, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌ విశ్వనాథన్‌ ఆనంద్‌ తనకెంతో కలిసొచ్చిన టోర్నీలో మెరిపించాడు. స్పెయిన్‌లో జరిగిన లియోన్‌ మాస్టర్స్‌ టోర్నీలో 54 ఏళ్ల ఆనంద్‌ పదోసారి చాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్లో ఆనంద్‌ 3–1తో జైమి సాంతోస్‌ లటాసా (స్పెయిన్‌)పై గెలిచాడు. సెమీఫైనల్స్‌లో ఆనంద్‌ 2.5–1.5తో తొపలోవ్‌ (బల్గేరియా)పై, లటాసా 2.5–1.5తో అర్జున్‌ (భారత్‌)పై నెగ్గారు. గతంలో ఆనంద్‌ 1996, 1999, 2000, 2001, 2005, 2006, 2007, 2011, 2016లలో ఈ టోర్నీలో విజేతగా నిలిచాడు.

భారత నంబర్‌వన్‌గా...
ప్రపంచ నాలుగో ర్యాంకర్‌గా...

తెలంగాణ గ్రాండ్‌మాస్టర్‌ అర్జున్‌ ఘనత



సాక్షి, హైదరాబాద్‌: కొన్నేళ్లుగా అంతర్జాతీయ టోర్నీలలో నిలకడగా రాణిస్తున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్‌ ఇరిగేశి అర్జున్‌ క్లాసికల్‌ చెస్‌ ఫార్మాట్‌లో అధికారికంగా భారత నంబర్‌వన్‌ ప్లేయర్‌గా అవతరించాడు. అంతర్జాతీయ చెస్‌ సమాఖ్య (ఫిడే) సోమవారం విడుదల చేసిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20 ఏళ్ల అర్జున్‌ నాలుగు స్థానాలు ఎగబాకాడు. గత నెలలో ఎనిమిదో స్థానంలో ఉన్న అర్జున్‌ ప్రస్తుతం 2778 రేటింగ్‌ పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకున్నాడు. గత నెలలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంతో భారత నంబర్‌వన్‌గా ఉన్న దొమ్మరాజు గుకేశ్‌ ఒక స్థానం పడిపోయి 2763 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో నిలిచాడు. 2757 పాయింట్లతో ప్రజ్ఞానంద ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నాడు. దిగ్గజం విశ్వనాథన్‌ ఆనంద్‌ 2751 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచాడు. 2832 రేటింగ్‌తో మాగ్నస్‌ కార్ల్‌సన్‌ (నార్వే) టాప్‌ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి 7వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక 11వ ర్యాంక్‌లో, వైశాలి 14వ ర్యాంక్‌లో ఉన్నారు.

చాంపియన్‌ సహజ



లాస్‌ ఏంజెలిస్‌: అంతర్జాతీయ టెన్నిస్‌ సమాఖ్య (ఐటీఎఫ్‌) మహిళల డబ్ల్యూ15 టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి విజేతగా అవతరించింది. సింగిల్స్‌ ఫైనల్లో టాప్‌ సీడ్‌ సహజ 6–4, 7–6 (7/4)తో జు అమీ (అమెరికా)పై విజయం సాధించింది. విజేతగా నిలిచిన క్రమంలో సహజ టోర్నీ మొత్తంలో ఒక్క సెట్‌ కూడా కోల్పోకపోవడం విశేషం. ఈ గెలుపుతో అమెరికాలో ప్రొ టైటిల్‌ నెగ్గిన మూడో భారతీయ క్రీడాకారిణిగా సహజ గుర్తింపు పొందింది. గతంలో సానియా మీర్జా (2004లో డబ్ల్యూ15 –బోకా రాటన్‌), కర్మన్‌కౌర్‌ (2023లో డబ్ల్యూ60–ఈవాన్స్‌విల్లె) ఈ ఘనత సాధించారు. తాజా విజయంతో సహజ మహిళల టెన్నిస్‌ సంఘం (డబ్ల్యూటీఏ) ర్యాంకింగ్స్‌లో 15 స్థానాలు పురోగతి సాధించి కెరీర్‌ బెస్ట్‌ 305వ ర్యాంక్‌కు చేరుకుంది.



భారత మహిళల భారీ విజయం

ఏకైక టెస్టులో దక్షిణాఫ్రికాపై 10 వికెట్లతో గెలుపు

చెన్నై: ఇన్నింగ్స్‌ ఓటమి నుంచి గట్టెక్కినా దక్షిణాఫ్రికా మహిళల జట్టు పరాజయాన్ని మాత్రం తప్పించుకోలేకపోయింది. భారత బౌలర్లు మరోసారి సమయోచితంగా రాణించడంతో దక్షిణాఫ్రికాతో జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దక్షిణాఫ్రికా కెప్టెన్‌ లౌరా వాల్‌వార్ట్‌ (314 బంతుల్లో 122; 16 ఫోర్లు) పట్టుదలతో పోరాడి తమ జట్టును ఇన్నింగ్స్‌ ఓటమి నుంచి తప్పించింది. మ్యాచ్‌ చివరిరోజు సోమవారం ఓవర్‌నైట్‌ స్కోరు 232/2తో రెండో ఇన్నింగ్స్‌ కొనసాగించిన దక్షిణాఫ్రికా 154.4 ఓవర్లలో 373 పరుగులకు ఆలౌటై భారత్‌కు 37 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్లు శుభ సతీశ్‌ (13 నాటౌట్‌; 1 ఫోర్‌), షఫాలీ వర్మ (24 నాటౌట్‌; 3 ఫోర్లు, 1 సిక్స్‌) ఇబ్బంది పడకుండా 9.2 ఓవర్లలో 37 పరుగులు సాధించి భారత్‌కు 10 వికెట్లతో విజయాన్ని అందించారు. అంతకుముందు ఓవర్‌నైట్‌ వ్యక్తిగత స్కోరు 93తో ఆట కొనసాగించిన లౌరా సెంచరీని పూర్తి చేసుకుంది. అనంతరం లౌరాను రాజేశ్వరి గైక్వాడ్‌ అవుట్‌ చేశాక దక్షిణాఫ్రికా క్రమం తప్పకుండా వికెట్లను చేజార్చుకుంది. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించిన నదినె డి క్లెర్క్‌ (185 బంతుల్లో 61; 8 ఫోర్లు, 1 సిక్స్‌) చివరి వికెట్‌గా వెనుదిరగడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ ముగిసింది. మ్యాచ్‌ మొత్తంలో 10 వికెట్లు తీసిన భారత ఆఫ్‌ స్పిన్నర్‌ స్నేహ్‌ రాణాకు 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' అవార్డు లభించింది. భారత టెస్టు చరిత్రలో 10 వికెట్లతో విజయం ఇది రెండోది మాత్రమే. 2002లో దక్షిణాఫ్రికాపైనే భారత జట్టు 10 వికెట్ల తేడాతో గెలిచింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్‌ తొలి ఇన్నింగ్స్‌: 603/6 డిక్లేర్డ్‌; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌: 266 ఆలౌట్‌; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌: 373 ఆలౌట్‌; భారత్‌ రెండో ఇన్నింగ్స్‌: 37/0 (9.2 ఓవర్లలో).

సింగపూర్‌లో ప్రపంచ చెస్‌ చాంపియన్‌షిప్‌ మ్యాచ్‌

నవంబర్‌లో డిఫెండింగ్‌ చాంపియన్‌ డింగ్‌ లిరెన్‌తో భారత గ్రాండ్‌మాస్టర్‌ గుకేశ్‌ టైటిల్‌ పోరు





న్యూఢిల్లీ: భారత టీనేజ్‌ గ్రాండ్‌మాస్టర్, క్యాండిడేట్స్‌ టోర్నీ విజేత దొమ్మరాజు గుకేశ్‌కు స్వదేశంలో ప్రపంచ చెస్‌ చాంపియన్‌షిప్‌ ఆడే అవకాశం లభించలేదు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్‌ డింగ్‌ లిరెన్‌ (చైనా), చాలెంజర్‌ గుకేశ్‌ మధ్య ప్రపంచ చాంపియన్‌షిప్‌ మ్యాచ్‌ ఆతిథ్య హక్కులు సింగపూర్‌కు లభించాయి. ఈ మెగా ఈవెంట్‌ ఆతిథ్య హక్కుల కోసం అఖిల భారత చెస్‌ సమాఖ్య (ఏఐసీఎఫ్‌), తమిళనాడు ప్రభుత్వం, సింగపూర్‌ పోటీపడ్డాయి. బిడ్‌లను పరిశీలించాక ఈ మెగా ఈవెంట్‌ ఆతిథ్య హక్కులు సింగపూర్‌కు కేటాయిస్తున్నట్లు అంతర్జాతీయ చెస్‌ సమాఖ్య (ఫిడే) ప్రకటించింది. ఈ ఏడాది నవంబర్‌ 20 నుంచి డిసెంబర్‌ 15 వరకు గుకేశ్, డింగ్‌ లిరెన్‌ మధ్య 25 లక్షల డాలర్ల (రూ. 20 కోట్ల 85 లక్షలు) ప్రైజ్‌మనీతో ప్రపంచ చాంపియన్‌షిప్‌ మ్యాచ్‌ జరుగుతుంది. ఇద్దరి మధ్య 14 రౌండ్‌లు నిర్వహిస్తారు. తొలుత 7.5 పాయింట్లు సంపాదించిన ప్లేయర్‌ను విశ్వవిజేతగా ప్రకటిస్తారు. 14 రౌండ్ల తర్వాత ఇద్దరూ సమంగా నిలిస్తే టైబ్రేక్‌ ఆధారంగా విజేతను నిర్ణయిస్తారు. ఇప్పటి వరకు క్లాసికల్‌ ఫార్మాట్‌లో భారత్‌ నుంచి విశ్వనాథన్‌ ఆనంద్‌ మాత్రమే ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. ఆనంద్‌ ఐదుసార్లు (2000, 2007, 2008, 2010, 2012) విశ్వవిజేతగా నిలిచాడు.

క్వార్టర్‌ ఫైనల్లో స్పెయిన్‌



కొలోన్‌ (జర్మనీ): యూరో కప్‌ ఫుట్‌బాల్‌ టోర్నీలో మాజీ చాంపియన్‌ స్పెయిన్‌ క్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ టోర్నీలో తొలిసారి బరిలోకి దిగిన జార్జియా జట్టుతో జరిగిన ప్రిక్వార్టర్‌ ఫైనల్లో స్పెయిన్‌ 4–1 గోల్స్‌తో గెలిచింది. స్పెయిన్‌ తరఫున రోడ్రి (39వ ని.లో), రూయిజ్‌ (51వ ని.లో), విలియమ్స్‌ (75వ ని.లో), ఓల్మో (83వ ని.లో) ఒక్కో గోల్‌ చేశారు. స్పెయిన్‌కే చెందిన లె నోర్మాండ్‌ (18వ ని.లో) చేసిన సెల్ఫ్‌ గోల్‌తో జార్జియా ఖాతా తెరిచింది. మరో ప్రిక్వార్టర్‌ ఫైనల్లో ఫ్రాన్స్‌ 1–0తో బెల్జియంపై గెలిచింది. ఆట 85వ నిమిషంలో బెల్జియం ప్లేయర్‌ వెర్టోంగెన్‌ సెల్ఫ్‌ గోల్‌తో ఫ్రాన్స్‌ విజయం సాధించింది.

'సీనియర్లు కొనసాగుతారు'

చాంపియన్స్‌ ట్రోఫీపై జై షా స్పష్టీకరణ ● డబ్ల్యూటీసీ ఫైనల్‌ కూడా గెలుస్తామని ధీమా



బ్రిడ్జ్‌టౌన్‌: అంతర్జాతీయ టి20లకు రిటైర్మెంట్‌ ప్రకటించినా... ఐసీసీ వన్డే టోర్నీ చాంపియన్స్‌ ట్రోఫీ, వరల్డ్‌ టెస్టు చాంపియన్‌షిప్‌ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు సీనియర్లు రోహిత్‌ శర్మ, విరాట్‌ కోహ్లి అందుబాటులో ఉంటారని బీసీసీఐ కార్యదర్శి జై షా స్పష్టం చేశారు. టి20 ఫార్మాట్‌కు సంబంధించి భారత జట్టులో మార్పు మొదలైందన్న ఆయన... పాండ్యాను కెప్టెన్‌గా నియమించే విషయం సెలక్టర్లు చూసుకుంటారని వ్యాఖ్యానించారు. 2025లో చాంపియన్స్‌ ట్రోఫీ, డబ్ల్యూటీసీ ఫైనల్‌ జరగనున్నాయి. 'ముగ్గురు కీలక ఆటగాళ్ల రిటైర్మెంట్‌ తర్వాత టి20 జట్టులో ఇప్పటికే మార్పులు మొదలయ్యాయి. అయితే ప్రస్తుతం సీనియర్లతో కూడిన మన జట్టు ప్రదర్శన చూస్తే మా తర్వాతి లక్ష్యం చాంపియన్స్‌ ట్రోఫీ, డబ్ల్యూటీసీ ఫైనల్‌ కూడా గెలవడమే. దాదాపు ఇదే జట్టు అక్కడా ఆడుతుంది. సీనియర్లంతా అందుబాటులో ఉంటారు. భారత జట్టు అన్ని ఐసీసీ టైటిల్స్‌ గెలవాలనే నేనూ కోరుకుంటా. మన దగ్గర ప్రతిభావంతులైన రిజర్వ్‌ ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అవసరమైతే ఒకేసారి మనం 3 జట్లను బరిలోకి దించగలం' అని జై షా అభిప్రాయపడ్డారు. తాజా వరల్డ్‌ కప్‌లో కీలక ప్రదర్శన చేసిన పాండ్యాపై షా ప్రశంసలు కురిపించారు. 'పాండ్యా ఫామ్‌ గురించి గతంలో ఎన్నో రకాల సందేహాలు వ్యక్తం చేశారు. కానీ సెలక్టర్లు అతనిపై నమ్మకం ఉంచి ఎంపిక చేస్తే దానిని పాండ్యా నిలబెట్టుకున్నాడు. అయితే టి20 టీమ్‌కు పూర్తి స్థాయి కెప్టెన్‌గా నియమించే అధికారం సెలక్టర్ల చేతుల్లోనే ఉంది' అని షా చెప్పారు.

టీమిండియా మరింత ఆలస్యంగా...

బ్రిడ్జ్‌టౌన్‌ (బార్బడోస్‌): వరల్డ్‌ కప్‌ విజేతగా నిలిచిన భారత టి20 జట్టు స్వదేశానికి రావడం మరింత ఆలస్యం కానుంది. బార్బడోస్‌ దేశాన్ని తాకిన పెను తుఫాన్‌తో ఆటగాళ్లు ఎక్కడికీ వెళ్లే పరిస్థితి లేదు. తీవ్రత ఎక్కువగా ఉండే కేటగిరీ 4 హరికేన్‌ వల్ల రెండు రోజులుగా దేశం మొత్తం లాక్‌డౌన్‌లో ఉంది. ముఖ్యంగా స్థానిక ఎయిర్‌పోర్ట్‌ను పూర్తిగా మూసేశారు. దాంతో భారత జట్టు ప్రత్యేక విమానం ద్వారా అక్కడి నుంచి బయల్దేరే అవకాశాలు కూడా లేకుండా పోయాయి. విద్యుత్, నీటి సరఫరా కూడా అస్తవ్యస్తంగా మారింది. ఎలాగైనా ఇక్కడి నుంచి ఆటగాళ్లను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తూ చార్టర్డ్‌ ఫ్లయిట్‌ కంపెనీలతో మాట్లాడే ప్రయత్నం చేశామని... అయితే ఎయిర్‌పోర్ట్‌లో విమానాల రాకపోకలు సాధ్యం కావడం లేదని బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించారు. ప్రస్తుతం పరిస్థితులు చక్కబడే వరకు వేచి ఉండటం మినహా మరో మార్గం లేదన్ని జై షా... భారత్‌కు చేరుకున్న తర్వాతే ఆటగాళ్ల సన్మానం తదితర విషయాల గురించి ఆలోచిస్తామని అన్నారు.


అల్‌కరాజ్‌ శుభారంభం



లండన్‌: వింబుల్డన్‌ గ్రాండ్‌స్లామ్‌ టెన్నిస్‌ టోర్నీలో డిఫెండింగ్‌ చాంపియన్‌ కార్లోస్‌ అల్‌కరాజ్‌ శుభారంభం చేశాడు. సోమవారం మొదలైన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్‌ తొలి రౌండ్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్‌ అల్‌కరాజ్‌ 7–6 (7/3), 7–5, 6–2తో క్వాలిఫయర్‌ మార్క్‌ లజాల్‌ (ఎస్తోనియా)పై గెలిచాడు. 2 గంటల 23 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్‌ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు 44 విన్నర్స్‌ కొట్టాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్‌ చేయడంతోపాటు నెట్‌ వద్దకు 33 సార్లు దూసుకొచ్చి 26 సార్లు పాయింట్లు సాధించాడు. ఇతర తొలి రౌండ్‌ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్‌ మెద్వెదెవ్‌ (రష్యా) 6–3, 6–4, 6–2తో కొవాసెవిచ్‌ (అమెరికా)పై, ఎనిమిదో సీడ్‌ కాస్పర్‌ రూడ్‌ (నార్వే) 7–6 (7/2), 6–4, 6–4తో అలెక్స్‌ బోల్ట్‌ (ఆస్ట్రేలియా)పై, పదో సీడ్‌ దిమిత్రోవ్‌ (బల్గేరియా) 6–3, 6–4, 7–5తో లజోవిచ్‌ (సెర్బియా)పై నెగ్గారు. మహిళల సింగిల్స్‌ తొలి రౌండ్‌లో ఎనిమిదో సీడ్‌ కిన్‌వెన్‌ జెంగ్‌ (చైనా) 6–4, 2–6, 4–6తో లులు సన్‌ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయింది.

సినిమా

మేడ్‌ ఇన్‌ ఓల్డ్‌ సిటీ



● రామ్‌

'**ఉ**స్తాద్‌ ఇస్మార్ట్‌ శంకర్‌ అలియాస్‌ డబుల్‌ ఇస్మార్ట్‌... మేడ్‌ ఇన్‌ ఓల్డ్‌ సిటీ' అంటూ మొదలయ్యే 'స్టెప్పా మార్‌' పాట 'డబుల్‌ ఇస్మార్ట్‌' సినిమాలోనిది. హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్‌ కాంబినేషన్‌లో రూపొందిన హిట్‌ ఫిల్మ్‌ 'ఇస్మార్ట్‌ శంకర్‌' (2019). ఈ సినిమాకు సీక్వెల్‌గా రామ్, పూరి కాంబినేషన్‌లోనే 'డబుల్‌ ఇస్మార్ట్‌' చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో కావ్యా థాపర్‌ హీరోయిన్‌. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్‌ నిర్మిస్తున్న ఈ 'డబుల్‌ ఇస్మార్ట్‌' సినిమా ఆగస్టు 15న రిలీజ్‌ కానుంది. ఈ సినిమా నుంచి 'స్టెప్పా మార్‌..' అనే పాట లిరికల్‌ వీడియోను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సోమవారం విడుదల చేశారు. ''ఇస్మార్ట్‌ శంకరే.. ఏక్‌ దమ్‌ డేంజరే... ఔర్‌ ఏక్‌ బార్‌ ఆయారే.. బేజారే..' అంటూ సాగుతుంది 'స్టెప్పామార్‌' సాంగ్‌. తెలుగు వెర్షన్‌ పాటకు మణిశర్మ సంగీత సారథ్యంలో భాస్కరభట్ల సాహిత్యం అందించగా అనురాగ్‌ కులకర్ణి, సాహితి పాడారు. జానీ మాస్టర్‌ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాలో సంజయ్‌ దత్, అలీ, గెటప్‌ శీను కీలక పాత్రలు పోషిస్తున్నారు.



● నయనతార

విజయ్‌ సేతుపతి కెరీర్‌లోని 50వ సినిమా 'మహారాజ' ఇటీవల విడుదలై బాక్సాఫీస్‌ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు నితిలన్‌ సామినాథన్‌ దర్శకత్వం వహించారు. 'మహారాజ'కు బాక్సాఫీస్‌ పరంగా మంచి వసూళ్లు, సినీ విమర్శకుల పరంగా అభినందనలు రావడంతో నితిలన్‌కు అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఈ క్రమంలోనే నయనతారకు

మరో లేడీ ఓరియంటెడ్‌ మూవీలో...

నితిలన్‌ ఓ లేడీ ఓరియంటెడ్‌ స్టోరీ చెప్పారని, బేసిక్‌ ప్లాట్‌ నచ్చడంతో ఈ సినిమా చేసేందుకు ఆమె సానుకూలంగా ఉన్నారని టాక్‌. దీంతో స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారట నితిలన్‌. సో.. నయనతార మరో లేడీ ఓరియంటెడ్‌ మూవీలో కనిపిస్తారన్న మాట.

పట్టు వదలకుండా..!



● అజిత్‌

అజిత్, త్రిష జంటగా రూపొందుతున్న చిత్రం 'విడా ముయర్చి' (పట్టు వదలకుండా ప్రయత్నించడం). లైకా ప్రొడక్షన్స్‌పై మగిళ్‌ తిరుమేని దర్శకత్వంలో సుభాస్కరన్‌ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి అజిత్‌ ఫస్ట్‌ లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్‌ హెడ్‌ జీకేఎం తమిళ్‌ కుమరన్‌ మాట్లాడుతూ – ''మా బేనర్లో అజిత్‌తో సినిమా ప్రకటించినప్పట్నుంచి అభిమానులు, ప్రేక్షకులు ఈ మూవీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వారి అంచనాలను చేరుకునేలా మంచి కథా కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఆగస్టులో సినిమా చిత్రీకరణ పూర్తవుతుంది. విడుదల ఎప్పుడనేది త్వరలో చెబుతాం'' అన్నారు. ఇక ప్రచారంలో ఉన్న ప్రకారం ఈ చిత్రకథ ఏంటంటే... ఓ భార్యాభర్త విహార యాత్రకు వెళతారు. అకస్మాత్తుగా భార్య కనిపించకుండా పోతుంది. ఆమెను కనుగొనే క్రమంలో కనిపించని శత్రువులతో పట్టు వదలకుండా హీరో చేసే పోరాటం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని తెలిసింది. ఆరవ్, రెజీనా కసాండ్ర, నిఖిల్, అర్జున్‌ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: ఓం ప్రకాశ్‌.


చెడుకి మంచికి మధ్య యుద్ధం



● సుధీర్‌బాబు

సుధీర్‌బాబు హీరోగా పాన్‌ ఇండియా స్థాయిలో ఓ సూపర్‌ నేచురల్‌ మిస్టరీ థ్రిల్లర్‌ మూవీ తెరకెక్కనుంది. హిందీలో 'రుస్తుం, టాయ్‌లెట్‌: ఏక్‌ ప్రేమ్‌ కథ, ప్యాడ్‌ మ్యాన్, పరి' వంటి చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ చిత్రం రూపొందనుంది. వెంకట్‌ కల్యాణ్‌ దర్శకుడిగా పరిచయం కానున్న ఈ చిత్రాన్ని సోమవారం ప్రకటించారు. సుధీర్‌ బాబు మాట్లాడుతూ – ''స్క్రిప్ట్‌ నచ్చి ఏడాదిగా ఈ టీమ్‌తో ట్రావెల్‌ అవుతున్నాను. ఓ వినూత్న కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రంతో ఎప్పుడెప్పుడు ప్రేక్షకుల ముందుకు వద్దామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''చెడుకి, మంచికి మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో భారతీయ సినిమాల్లో ఓ మైల్‌ స్టోన్‌ మూవీలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నాం. పురాణాలతో అనుసంధానం చేయబడిన ఎన్నో రహస్యాలను ఈ కథ వెలికి తీస్తుంది. ఈ చిత్రంలో సుధీర్‌బాబు సరసన ఓ బాలీవుడ్‌ హీరోయిన్‌ నటించనున్నారు. ఆ హీరోయిన్, ఇతర విశేషాలను త్వరలో తెలియజేస్తాం. వచ్చే ఏడాది మార్చిలో ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని యూనిట్‌ పేర్కొంది. ప్రేరణ అరోరా, శివిన్‌ నారంగ్, నిఖిల్‌ నంద, ఉజ్వల్‌ ఆనంద్‌ నిర్మించనున్న ఈ సినిమా ఫస్ట్‌ లుక్‌ ఆగస్టు 15న రిలీజ్‌ కానుంది.

మిస్టరీ స్టార్ట్‌



● సాయి శ్రీనివాస్‌

ఓ మిస్టరీని ఛేదించే పని మీద బిజీగా ఉండనున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌. ఆ రహస్యం ఏంటి? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌ హీరోగా అనుపమా పరమేశ్వరన్‌ హీరోయిన్‌గా సోమవారం ఓ హారర్‌ మిస్టరీ మూవీ ఆరంభమైంది. కౌశిక్‌ పెగళ్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత 'దిల్‌' రాజు కెమెరా స్విచ్ఛాన్‌ చేయగా, మరో నిర్మాత నవీన్‌ యెర్నేని క్లాప్‌ కొట్టారు. సతీష్‌ కిలారు, అన్మోల్‌ శర్మ స్క్రిప్ట్‌ను అందజేశారు. ''ప్రేక్షకులు కుర్చీల్లోంచి కదలకుండా చూసేలా ఓ సరికొత్త పాయింట్‌తో ఈ హారర్‌ మిస్టరీ మూవీని రూపొందిస్తున్నాం. సాయి శ్రీనివాస్, అనుపమ ఇంతకుముందు చేయని పాత్రల్లో కనిపిస్తారు. ఈ నెల 11న రెగ్యులర్‌ షూటింగ్‌ మొదలుపెడతాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్‌ లోక్‌నాథ్, కెమెరా: చిన్మయ్‌ సలాస్కర్, సమర్పణ: అర్చన.

ప్రేమ... విప్లవం



● సయీ మంజ్రేకర్, నిఖిల్‌

నిఖిల్‌ హీరోగా నటిస్తున్న పీరియాడికల్‌ ఫిల్మ్‌ 'ది ఇండియా హౌస్‌'. ఈ చిత్రంలో సయీ మంజ్రేకర్‌ హీరోయిన్‌గా నటిస్తుండగా, అనుపమ్‌ ఖేర్‌ ఓ కీలక పాత్రలో కనిపిస్తారు. రామ్‌ వంశీ కృష్ణ దర్శకత్వంలో హీరో రామ్‌చరణ్‌ సమర్పణలో అభిషేక్‌ అగర్వాల్‌ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్‌ పతాకాలపై విక్రమ్‌ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హంపి (కిష్కింద)లోని విరూపాక్ష దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ''1905లో ప్రేమ, విప్లవం నేపథ్యంలో సాగే పీరియాడికల్‌ డ్రామా ఇది. మంగళవారం ఈ సినిమా రెగ్యులర్‌ చిత్రీకరణను ప్రారంభిస్తున్నాం'' అని చిత్రయూనిట్‌ పేర్కొంది. ఈ సినిమాకు సహ నిర్మాత: మయాంక్, కెమెరా: కామెరాన్‌ బ్రైసన్‌.

బర్త్‌డే బాయ్‌ వస్తున్నాడు



● రవికృష్ణన్‌

ఐదుగురు చిన్ననాటి స్నేహితులు విదేశాల్లో ఎంఎస్‌ చదవడానికి వెళ్లినప్పుడు ఏం జరిగింది? వారు ఎదుర్కొనే ఘటనలు వారి జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయి? అనే అంశాల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్‌'. రవికృష్ణన్, సమీర్‌ మళ్లా, రాజీవ్‌ కనకాల లీడ్‌ రోల్స్‌లో నటించిన ఈ సినిమాలో ప్రమోదిని, వాకా మని, రాజా అశోక్, వెంకటేశ్, సాయి అరుణ్, రాహుల్‌ కీలక పాత్రధారులు. బొమ్మా బొరుసా పతాకంపై విస్కి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు మెహర్‌ రమేశ్‌ విడుదల చేశారు. ''కామెడీ డ్రామా నేపథ్యంలో సాగే ఈ సినిమాలోని ప్రతి పాత్ర, సన్నివేశం ప్రేక్షకులను అలరిస్తాయి. బాలు, వెంకీ, సాయి, సత్తి, అర్జున్‌ అనే ఐదుగురు స్నేహితుల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు విస్కి.

క్రైమ్‌... థ్రిల్‌



● శ్రీరామ్, శ్రుతి

శ్రీరామ్‌ హీరోగా నటిస్తున్న క్రైమ్‌ థ్రిల్లర్‌ మూవీకి 'కోడి బుర్ర' టైటిల్‌ ఖరారైంది. ఈ చిత్రంలో శ్రుతీ మీనన్, ఆరుషి హీరోయిన్లు. చంద్రశేఖర్‌ కానూరి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, గట్టు విజయ్‌ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్‌ గౌడ్‌ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ఈ వేడుకలో అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తొలి సన్నివేశానికి కెమెరా స్విచ్ఛాన్‌ చేయగా, నిర్మాత బెక్కం వేణుగోపాల్‌ క్లాప్‌ ఇచ్చారు. దర్శకుడు భరత కమ్మ స్క్రిప్ట్‌ అందించారు. ''ప్రేక్షకులందరికీ నచ్చేలా ఆసక్తికరంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం'' అన్నారు శ్రీరామ్‌. ''ఈ సినిమాలో శ్రీరామ్‌గారు పోలీసాఫీసర్‌ పాత్రలో కనిపిస్తారు'' అన్నారు చంద్రశేఖర్‌. ''ఈ నెల 22న రెగ్యులర్‌ షూటింగ్‌ ప్రారంభిస్తాం'' అన్నారు నిర్మాతలు.

పాల పుంతల్లో తేలి...



● డెమీ–లీ టెబో

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్‌ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్‌' సినిమాకు సీక్వెల్‌గా వీరి కలయికలోనే 'ఇండియన్‌ 2' తెరకెక్కిన సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్, రెడ్‌ జెయింట్‌ మూవీస్‌ పతాకాలపై సుభాస్కరన్‌ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 12న రిలీజ్‌ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'క్యాలెండర్‌' సాంగ్‌ను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేశారు. ''పాల పుంతల్లో వాలి.. జంట మేఘాలై తేలి... భూమితో పని లేకుండా గడిపేద్దామా..'' అంటూ సాగే తెలుగు వెర్షన్‌ సాంగ్‌కు చంద్రబోస్‌ సాహిత్యం అందించగా, శ్రావణ భార్గవి పాడారు. ఈ పాటలో 2017 మిస్‌ యూనివర్స్, దక్షిణాఫ్రికా మోడల్‌ డెమి–లీ టెబో కనిపిస్తారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
2-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	443	79,476
నిఫ్టీ ▲	131	24,142

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,833	▲ 102
డోజోన్స్	39,166	▲ 47
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,167	▲ 3
డాక్స్	18,291	▲ 55
షాంఘై	2,995	▲ 1
నికాయ్	39,631	▲ 48

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,784
బంగారం (99.5 స్వచ్ఛత)	71,586
వెండి (కిలో)	87,802

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.99	84.01
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.42	106.97
€	యూరో	ఒకటి	88.62	90.97
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	51.29	52.41
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.71	56.67
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.25	63.94
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.83	23.61
¥	చైనా యువాన్	ఒకటి	10.37	12.44

సరికొత్త శిఖరాలపై సూచీలు



ముంబై: ఐటీ, బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు సోమవారం సరికొత్త శిఖరాలపై ముగిశాయి. ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. భారత తయారీ రంగ కార్యకలాపాలు జూన్‌లో భారీగా పుంజుకున్నట్లు గణాంకాలు వెలువడటం ఇన్వెస్టర్లకు మరింత విశ్వాసాన్నిచ్చింది. సెన్సెక్స్ 443 పాయింట్లు పెరిగి 79,476 వద్ద, నిఫ్టీ 131 పాయింట్లు బలపడి 24,142 వద్ద స్థిరపడ్డాయి. సూచీలు ఉదయం జూలై నెలను ఫ్లాటుగా ప్రారంభించాయి. ట్రేడింగ్‌లో ఐటీ, బ్యాంకులతో పాటు కమోడిటీ, టెలికం, ఇండస్ట్రియల్, మెటల్ షేర్లూ రాణించడంతో లాభాలార్జిస్తూ స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 528 పాయింట్లు పెరిగి 79,561 వద్ద, నిఫ్టీ 153 పాయింట్లు ఎగసి ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.58%, 1.11% చొప్పున పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

→ అమెరికా ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో సెప్టెంబర్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు మరోసారి తెరపైకి వచ్చాయి. దీంతో ఐటీ కంపెనీల షేర్లకు డిమాండ్ లభించింది. టెక్ మహీంద్రా, ఎల్‌టీటీఎస్ 3%, విప్రో 2.50%, టీసీఎస్, ఎంఫసీస్ 1.50%, ఇన్ఫోసిస్, ఎల్‌టీఐఎం, కోఫోర్జ్ ఒకశాతం, హెచ్‌సీఎల్ టెక్ అర శాతం చొప్పున లాభపడ్డాయి.

ఇన్వెస్టర్ల సంపద.. రూ.443 లక్షల కోట్లు

సూచీల రికార్డుల బాటతో రూ. 3,44,798 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.443 లక్షల కోట్ల వద్ద ముగిసింది.

పతంజలి చేతికి 'ఆయుర్వేద్'

డీల్ విలువ రూ. 1,100 కోట్లు



న్యూఢిల్లీ: వంట నూనెల దిగ్గజం పతంజలి ఫుడ్స్ తాజాగా పతంజలి ఆయుర్వేద్‌కు చెందిన గృహ, వ్యక్తిగత సంరక్షణ బిజినెస్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు పతంజలి ఫుడ్స్ పేర్కొంది. ఇందుకు రూ. 1,100 కోట్లు వెచ్చించనుంది. తద్వారా ఎఫ్‌ఎంసీజీ రంగంలో దిగ్గజ కంపెనీగా అవతరించనుంది. పతంజలి ఫుడ్స్ ప్రమోటర్లలో ఒకటైన పతంజలి ఆయుర్వేద లిమిటెడ్(పీఏఎల్).. బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. రెండు కంపెనీలకూ తగిన విలువలో పూర్తి ఆహారేతర బిజినెస్ కొనుగోలుకి బోర్డు అనుమతించినట్లు పతంజలి ఫుడ్స్ వెల్లడించింది. ఈ కొనుగోలులో పీఏఎల్ నిర్వహిస్తున్న కేశ సంరక్షణసహా.. చర్మ, పంటి, గృహ సంరక్షణ విభాగాలు భాగంకానున్నాయి.

పతంజలి ఫుడ్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 7.5 శాతం జంప్‌చేసి రూ. 1,710 వద్ద ముగిసింది.

వాహన అమ్మకాలు అంతంతే



న్యూఢిల్లీ: దేశంలో పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రత కారణంగా జూన్‌లో ఆటో అమ్మకాలు అంతంత మాత్రంగా జరిగాయి. అయితే బేస్ ఎఫెక్ట్ కారణంగా విక్రయాల్లో స్వల్ప వృద్ధి నమోదైంది. మొత్తంగా ఈ జూన్‌లో 3,40,784 వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన 3,28,710 యూనిట్లతో ఇవి కేవలం 3.67 శాతం అధికం. మారుతీ సుజుకీ, మహీంద్రాఅండ్‌మహీంద్రా, టయోటా కిర్లోస్కర్, కియా మోటార్స్ కంపెనీలు అమ్మకాల్లో వృద్ధిని కనబరిచాయి. టయోటా కిర్లోస్కర్ నెలవారీగా కంపెనీ చరిత్రలో అత్యధికంగా 27,474 వాహనాలకు విక్రయించింది. టాటా మోటార్స్, హోండా కార్స్, హ్యుందాయ్ మోటార్స్ అమ్మకాలు తగ్గాయి.

→ ఈ ఏడాది ప్రథమార్థంలో మొత్తం 21,68,512 వాహనాలు అమ్ముడయ్యాయి. 2023 తొలి ఆరు నెలల్లో అమ్ముడైన 20,15,033 యూనిట్లతో పోలిస్తే ఇవి 7.6 శాతం అధికం.

జూన్ విక్రయాలు ఇలా...

కంపెనీ	జూన్ 2024	జూన్ 2023	వృద్ధి/క్షీణత(%ల్లో)
మారుతీ	1,79,228	1,59,418	(+)12
హ్యుందాయ్	64,803	65,601	(-)1
టాటా మోటార్స్	74,147	80,383	(-)8
ఎండ్‌అండ్‌ఎం	69,397	62,429	(+)11
హోండా కార్స్	4,804	5,080	(-)5
ఎంజీ మోటార్స్	4,644	5,125	(-)9
టయోటా కిర్లోస్కర్	27,474	19,608	(+)40
కియా మోటార్స్	21,300	19,391	(+)10
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,58,477	3,40,981	(+)5
టీవీఎస్ మోటార్	2,55,734	2,35,833	(+)8

"ఏప్రిల్ పండుగ సీజన్ డిమాండ్ తర్వాత మే, జూన్‌లో వాహన పరిశ్రమ ప్యాసింజర్ వాహన విక్రయాల్లో క్షీణత చూసింది. సార్వత్రిక ఎన్నికలు, అధిక ఉష్ణోగ్రతలు ఇందుకు కారణాలు. గత రెండు నెలల్లో అమ్మకాలు తక్కువగా ఉన్నప్పటికీ, ఎంక్వైరీలు బలంగా ఉన్నాయి. రానున్న రోజుల్లో విక్రయాలు ఊపందుకునే వీలుంది."

– పార్థో బెనర్జీ, మారుతీ సుజుకీ ఇండియా మార్కెటింగ్ హెడ్


జీఎస్‌టీ వసూళ్లు రూ. 1.74 లక్షల కోట్లు

జూన్‌లో 8 శాతం అప్..



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు జూన్‌లో 8 శాతం పెరిగి రూ. 1.74 లక్షల కోట్లుగా నమోదైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు (ఏప్రిల్–జూన్) జీఎస్‌టీ స్థూల వసూళ్ల మొత్తం రూ. 5.57 లక్షల కోట్లకు చేరినట్లు వివరించాయి. మే నెలలో ఇవి రూ. 1.73 లక్షల కోట్లుగా ఉండగా, గతేడాది జూన్‌లో రూ. 1.61 లక్షల కోట్లుగా ఉన్నట్లు పేర్కొన్నాయి. ఈ ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు ఆల్‌టైమ్ గరిష్టమైన రూ. 2.10 లక్షల కోట్ల స్థాయిని తాకాయి. ప్రభుత్వం నెలవారీ వసూళ్ల డేటాను అధికారికంగా ప్రకటించే ఆనవాయితీని నిలిపివేసినట్లు వివరించాయి. మరోవైపు, భారీ వసూళ్లనేవి ఎకానమీ పటిష్టతను, వ్యాపార వర్గాలు ప్రశంసనీయమైన రీతిలో నిబంధనలను పాటించడాన్ని సూచిస్తున్నాయని ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ తెలిపారు.

బంపర్ 'ఆఫర్'!



న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్ల జోరుతో ప్రైమరీ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వెరసి ఈ ఏడాది ఐపీవో మార్కెట్ కొత్త రికార్డులవైపు చూస్తోంది. ఈ బాటలో తాజాగా మరికొన్ని కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి సిద్ధపడుతున్నాయి. జాబితాలో నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్‌తోపాటు.. యూనికామర్స్, స్నాప్‌డీల్, గలా ప్రెసిషన్ తదితరాలు చేరాయి. వివరాలు చూద్దాం..

పబ్లిక్ ఇష్యూ బాటలో..

- బ్రెయిన్‌బీస్ సొల్యూషన్
- ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్
- నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్
- యూనికామర్స్, గాలా ప్రెసిషన్..

రూ. 3,000 కోట్లకు రెడీ

గతంలో మ్యాక్స్ బూపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీగా సేవలందించిన నివా బూపా లిస్టింగ్‌పై కన్నేసింది. ఇందుకు సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ప్రాస్పెక్టస్ ప్రకారం రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,200 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్, ప్రస్తుత ఇన్వెస్టర్ సంస్థలు ఆఫర్ చేయనున్నాయి. ఇన్వెస్టర్ ఫెటిల్ టోన్ ఎల్‌ఎల్‌పీ రూ. 1,880 కోట్లు, ప్రమోటర్ బూపా సింగపూర్ హోల్డింగ్స్ పీటీఈ లిమిటెడ్ రూ. 320 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నాయి. వెరసి ఐపీవో ద్వారా కంపెనీ మొత్తం రూ. 3,000 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. యూకే దిగ్గజం బూపా నియంత్రణలో నివా బూపా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం బూపా 62.27 శాతం, ఫెటిల్ టోన్ వాటా 27.86 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నాయి.

మురుగు నీటి శుద్ధి సంస్థ

మురుగునీటి శుద్ధి(సీవేజ్ ట్రీట్‌మెంట్) ప్లాంట్లు, మురుగునీటి వ్యవస్థ సంబంధిత టర్న్‌కీ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్ పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో కంపెనీ 4.42 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. మరో 52.68 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లకు 93% వాటా ఉంది.

శివాలిక్ ఇంజినీరింగ్

ప్రెసిషన్ ఇంజినీరింగ్ కంపెనీ శివాలిక్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ నిధుల సమీకరణకు సన్నాహాలు ప్రారంభించింది. సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. కంపెనీ రూ. 335 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. మరో 41.3 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు.

లిస్టింగ్‌కు ఫస్ట్‌క్రై రెడీ

ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృ సంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ ద్వారా భారీ స్థాయిలో నిధుల సమీకరణకు అడుగులు వేస్తోంది. ఇందుకు తాజాగా సెబీ నుంచి అనుమతి పొందింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 1,816 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 5.44 కోట్ల షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు.

మరో మూడు కూడా...

సెబీ అనుమతి పొందిన కంపెనీల జాబితాలో సాస్ ప్లాట్‌ఫామ్.. యూనికామర్స్ ఈ–సొల్యూషన్స్ (స్నాప్‌డీల్ మాతృసంస్థ), గాలా ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఇంటర్ ఆర్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ సైతం చేరాయి. ఈ కంపెనీలు 2024 జనవరి–మే మధ్యలో సెబీకి దరఖాస్తు చేశాయి.

హెల్త్‌కేర్‌లో..

ఆరోగ్య పరిరక్షణ సర్వీసుల విభాగంలో టెక్నాలజీ ఆధారిత సేవలందించే శాగిలిటీ ఇండియా ఐపీవో బాట పట్టింది. ఇందుకు వీలుగా సెబీకి ప్రాథమిక పత్రాలతో దరఖాస్తు చేసింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 98.44 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్ శాగిలిటీ బీవీ విక్రయానికి ఉంచనుంది.

తయారీకి 'ఆర్డర్ల' జోష్..

జూన్‌లో 58.3 శాతానికి పీఎంఐ



న్యూఢిల్లీ: సానుకూల డిమాండ్, కొత్త ఆర్డర్ల దన్నుతో జూన్‌లో తయారీ రంగ ఉత్పత్తి పెరిగింది. దీంతో ఉద్యోగాల కల్పన కూడా గణనీయంగా మెరుగుపడింది. వ్యాపార పరిస్థితులు మెరుగుపడుతున్నాయనడానికి సూచనగా గత నెలకు సంబంధించి హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జూన్‌లో 58.3కి పెరిగింది. మే నెలలో ఇది 57.5గా నమోదైంది. పీఎంఐ 50కి ఎగువన ఉంటే వృద్ధిని, దానికి దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. కొత్త ఆర్డర్ల రాకతో కంపెనీలు రిక్రూట్‌మెంట్‌ను కూడా పెంచుకుంటున్నట్లు హెచ్‌ఎస్‌బీసీ గ్లోబల్ ఎకానమిస్ట్ మైత్రేయి దాస్ తెలిపారు. 2005 మార్చిలో దీనికి సంబంధించిన డేటాను సేకరించడం మొదలుపెట్టిన తర్వాత గత 19 ఏళ్లలో ఉద్యోగాల కల్పన రేటు ఇంత వేగవంతంగా ఉండటం ఇదే తొలిసారని వివరించారు. జూన్‌లో సిబ్బంది వ్యయాలతో పాటు ముడి వస్తువులు, రవాణాపై ఖర్చులు పెరగడంతో నిర్వహణ వ్యయాలు పెరిగినట్లు దాస్ చెప్పారు.

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో అగ్నివీర్ (ఎంఆర్ మ్యుజిషియన్) పోస్టులు

ఇండియన్ నేవీలో అగ్నివీర్(ఎంఆర్ మ్యూజిషియన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2024 (నవంబర్ 24) బ్యాచ్ పేరున శిక్షణ ఉంటుంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** పదో తరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులవ్వాలి. మ్యూజికల్ ఎబిలిటీ, మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్ ఉండాలి.
» **వయసు:** అభ్యర్థి 01.11.2003 నుంచి 30.04.2007 మధ్య జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలి.
» **కనిష్ట ఎత్తు ప్రమాణాలు:** పురుషులు, మహిళల ఎత్తు 157 సెం.మీ.ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్ మార్కులు, స్టేజ్–1(ప్రిలిమినరీ స్క్రీనింగ్), స్టేజ్ 2 (ఫైనల్ స్క్రీనింగ్), మ్యూజిక్ స్క్రీనింగ్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **శిక్షణ:** అగ్నివీర్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబర్ నెలలో కోర్సు శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
» **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000 వేతనం ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.07.2024.
» **శిక్షణ ప్రారంభం:** 2025 నవంబర్.
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఇండియన్ నేవీలో సెయిలర్ (స్పోర్ట్స్ కోటా ఎంట్రీ) పోస్టులు

ఇండియన్ నేవీ.. సెయిలర్(స్పోర్ట్స్ కోటా ఎంట్రీ 02/2024 బ్యాచ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **పోస్టుల వివరాలు:** డైరెక్ట్ ఎంట్రీ పెట్టీ ఆఫీసర్(స్పోర్ట్స్ ఎంట్రీ),చీఫ్ పెట్టీ ఆఫీసర్(స్పోర్ట్స్ ఎంట్రీ).
» **క్రీడలు:** అథ్లెటిక్స్, ఆక్వాటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, క్రికెట్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, హ్యాండ్ బాల్, హాకీ, కబడ్డీ, వాలీబాల్, రెజ్లింగ్, గోల్ఫ్, టెన్నిస్, సెయిలింగ్ తదితరాలు.
» **అర్హత:** 10+2 ఉత్తీర్ణతతో పాటు ఇంటర్నేషనల్/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులై ఉండాలి.
» **వయసు:** 17 1/2 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. అభ్యర్థి 01.11.1999 నుంచి 30.04.2007 మధ్య జన్మించి ఉండాలి.
» **కనీస ఎత్తు ప్రమాణాలు:** పురుషులు 157 సెం.మీ., మహిళలు 152 సెం.మీ. ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **శిక్షణ:** ఐఎన్ఎస్ చిల్కా, ఒడిశా.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సెక్రటరీ, ఇండియన్ నేవీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్, ఏడో అంతస్తు, చాణక్య భవన్, నౌకాదళ ప్రధాన కార్యాలయం, రక్షణ మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.07.2024.
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 16 సూపర్‌వైజర్ పోస్టులు

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి దర ఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, స్కాఫ్ ఫోల్డింగ్, హెచ్ఆర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్), డిగ్రీ(ఆర్ట్స్/కెమిస్ట్రీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 12.07.2024 నాటికి 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ప్రాక్టికల్ టెస్ట్, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.07.2024
» **వెబ్‌సైట్:** https://udupicsl.com

మెయిన్స్‌లో మెరిసేదెలా!

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా.. మొత్తం 21 కేంద్ర సర్వీసులకు ఎంపిక ప్రక్రియలో తొలిదశ పరీక్ష! దేశ వ్యాప్తంగా ఈ నెల 16న ప్రిలిమినరీ పరీక్ష ముగిసింది! దాదాపు 11 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 51 శాతం మేరకు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 42,560 మంది పరీక్ష రాసినట్లు సమాచారం. సోమవారం ప్రిలిమ్స్ ఫలితాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. సివిల్స్ ప్రిలిమ్స్-2024 విశ్లేషణ, మెయిన్ పరీక్ష విధానం,మెయిన్‌లో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

- **1,056:** సివిల్స్–2024 నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టుల సంఖ్య.
- **ఆరు లక్షలు:** ప్రిలిమ్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య అంచనా.
- **12 వేల నుంచి 13 వేలు:** మెయిన్స్‌కు ఎంపికయ్యే అభ్యర్థుల సంఖ్య.

» విడుదలైన సివిల్స్ ప్రిలిమ్స్ ఫలితాలు
» అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్స్
» సెప్టెంబర్ 20 నుంచి మెయిన్స్ పరీక్షలు



- ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా 1:12 లేదా 1:13 నిష్పత్తిలో మెరిట్ జాబితా రూపొందించి మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు.

ప్రిలిమ్స్ సులభంగానే

సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షను జూన్ 16న నిర్వహించారు. ఒక్కో పేపరు 200 మార్కుల చొప్పున రెండు పేపర్లు 400 మార్కులకు పరీక్ష జరిగింది. సివిల్స్ ప్రిలిమ్స్–2024 పరీక్ష గతంతో పోలిస్తే కొంత సులభంగానే ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది.

అన్ని సబ్జెక్ట్‌లకు సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రశ్నల రూపకల్పనలో సమతుల్యత పాటించారని పేర్కొంటున్నారు. సబ్జెక్ట్‌ల వారీగా చూస్తే.. జాగ్రఫీ నుంచి 16–18 ప్రశ్నలు, పర్యావరణం 12–14 ప్రశ్నలు, ఎస్ అండ్ టీ 10–12 ప్రశ్నలు, హిస్టరీ 14–16 ప్రశ్నలు, ఎకనామిక్స్ 15–20 ప్రశ్నలు, పాలిటీ 14–16 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్ నుంచి 6–8 చొప్పున ప్రశ్నలు అడిగారు. పాలిటీలో ఈసారి ప్రశ్నలు నేరుగా అడగడం అభ్యర్థులకు ఉపశమనం కలిగించే విషయం. జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీలో అధిక శాతం ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ అనుసంధానంగా ఉన్నాయి. కరెంట్ అఫైర్స్ నుంచి డైరెక్ట్ కొశ్చన్స్ అడిగారు.

రెండో పేపర్ (సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్)లో రీడింగ్ కాంప్రహెన్షన్ 22–24 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 23–25 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 35–40 ప్రశ్నలు అడిగారు. ఈసారి నాన్ మ్యాథ్స్ అభ్యర్థులు సైతం సమాధానాలను గుర్తించగలిగేలా ప్రశ్నలు ఉన్నాయి.

కాన్సెప్ట్స్, అప్లికేషన్ అప్రోచ్

ఆయా సబ్జెక్ట్‌ల కాన్సెప్ట్‌లపై క్లారిటీతోపాటు అప్లికేషన్ అప్రోచ్‌ను పరీక్షించేలా ప్రిలిమ్స్‌లో ప్రశ్నలు ఎదురయ్యాయి. దీంతో ప్రామాణిక పుస్తకాల అధ్యయనం, సమకాలీన పరిణామాలపై పట్టు, అన్వయం దృక్పథం కలిగిన అభ్యర్థులు సరైన సమాధానాలు గుర్తించడంలో ముందంజలో ఉంటారని నిపుణులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను క్షుణ్నంగా అధ్యయనం చేసిన అభ్యర్థులు స్కోర్ చేసేందుకు ఎక్కువ అవకాశం ఉందని చెబుతున్నారు.

మెయిన్‌లో రాణించేందుకు

ప్రిలిమ్స్‌లో ఎంపికైన అభ్యర్థులు.. తక్షణమే రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌పై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. మెయిన్ ఎగ్జామ్‌ను సెప్టెంబర్ 20 నుంచి అయిదు రోజుల పాటు నిర్వహించనున్నారు. మెయిన్ పరీక్ష మొత్తం ఏడు పేపర్లలో 1750 మార్కులకు జరుగుతుంది. ఒక్కో పేపర్‌కు 250 మార్కులు.

వీటికి అదనంగా అర్హత పేపర్లుగా ఇంగ్లిష్, రీజనల్ లాంగ్వేజ్ పేపర్లు ఉంటాయి. మెయిన్స్‌లో ప్రతిభ ఆధారంగా అంతిమంగా 275 మార్కులకు పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

పేపర్ 1 (జనరల్ ఎస్సే)

తొలుత జనరల్ ఎస్సే విభాగంలో అడిగేందుకు అవకాశమున్న అంశాలను గుర్తించాలి. సమకాలీన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ పరిణామాలు,కరోనా విపత్తు ప్రభావాలు,వ్యాక్సినేషన్ విధానాలు, పర్యావరణ అంశాలు,జాతీయ స్థాయిలో ఇటీవల చర్చనీయాంశంగా మారిన అంశాలను అభ్యసించాలి. వీటికి విశ్లేషణాత్మక సమాధానాలు రాసే విధంగా ప్రాక్టీస్ చేయడం ఎంతో ముఖ్యం.

పేపర్-2 (జీఎస్-1)

హిస్టరీకి సంబంధించి సంగీతం, సాహిత్యం, నాట్యం, వాస్తు–శిల్పకళ, మత ఉద్యమాలు, తత్వాలు తదితర అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ఈ అంశాలను ప్రాచీన, మధ్య, ఆధునిక భారత దేశ చరిత్రలకు అనుసంధానిస్తూ చదవాలి. 18వ శతాబ్దం మధ్య కాలం నుంచి ఇప్పటి వరకు చోటుచేసుకున్న ప్రధాన సంఘటనల్ని పరిశీలించాలి. స్వాతంత్ర్యోద్యమం గురించి ప్రత్యేకంగా చదవాలి. అదే విధంగా రాజ్యాంగం, పంచవర్ష ప్రణాళికలు, భూ సంస్కరణలు, నెహ్రూ విదేశాంగ విధానం, అలీనోద్యమం, హరిత విప్లవం తదితరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ప్రపంచ చరిత్రకు సంబంధించి పారిశ్రామిక విప్లవం, ప్రపంచ యుద్ధాలు, ఐరోపాలో నూతన రాజ్యాల ఆవిర్భావం, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో వలసవాదం వంటి వాటిని ప్రధానంగా చదవాలి. జాగ్రఫీకి సంబంధించి భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వతాలు, తుపానులు తదితరాల గురించి శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలి. ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడే సహజ వనరుల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

పేపర్-3(జీఎస్-2)

ముందుగా సిలబస్‌ను క్షుణ్నంగా పరిశీలించాలి. ఈ పేపర్ సిలబస్ ప్రజా పరిపాలన, రాజకీయ వ్యవస్థ, అంతర్జాతీయ సంబంధాల సమ్మేళనంగా ఉంది. భారత రాజ్యాంగం గురించి చదివే క్రమంలో.. 1858 భారత ప్రభుత్వ చట్టం దగ్గరి నుంచి 1947 స్వాతంత్ర్య చట్టం వరకు చదవాలి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలపై దృష్టి సారించాలి. రాజ్యాంగం మూల నిర్మాణాన్ని అర్థం చేసుకునేందుకు కేశవానంద భారతి కేసు–1973, మినర్వా మిల్స్ కేసులను పరిశీలించాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన, కార్యనిర్వాహక, ఆర్థిక అధికారాల విభజన, భారత రాజకీయ వ్యవస్థలోని అర్థ సమాఖ్య స్వభావంపై దృష్టిపెట్టాలి. 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాల ప్రభావాన్ని పరిశీలించాలి. ప్రభుత్వ పథకాల పనితీరు, ఉద్దేశం, లక్ష్యం, ఫలితాలను అధ్యయనం చేయాలి.

పేపర్ 4 (జీఎస్-3)

ఈ పేపర్‌లో టెక్నాలజీ, ఆర్థికాభివృద్ధి, బయో డైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లను అధ్యయనం చేయాలి. ప్రణాళికా పెట్టుబడుల్లో భాగంగా ప్రభుత్వ రంగ వనరుల సమీకరణకు ఆధారాలు, వాటి ధోరణులు, వివిధ రంగాల మధ్య వనరుల పంపిణీ తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి. భారత్‌లో సమ్మిళిత వృద్ధి పాత్ర, ఆహార భద్రత, బడ్జెటింగ్ తీరుతెన్నులతో పాటు స్వాతంత్ర్యం తర్వాత వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులను చదవాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధితో పాటు దైనందిన జీవితంలో దాని అనువర్తనాలపై దృష్టిపెట్టాలి.

పేపర్ 5 (జీఎస్-4)

ఈ పేపర్‌లో సిలబస్‌లోని ఎక్కువ అంశాలు ప్రభుత్వ పాలన (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)కు సంబంధించినవి. కాగా మరికొన్ని ఫిలాసఫీ, సైకాలజీకి చెందినవి. అభ్యర్థులు పరిపాలనలో నైతిక విలువల ఆవశ్యకతకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించాలి. వ్యక్తిగత, సామాజిక సంబంధాల్లో విలువలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయో తెలుసుకోవాలి. నైతిక శాస్త్రంలో ప్రధానంగా అప్లయిడ్ ఎథిక్స్ (అనువర్తిత నైతిక శాస్త్రం)పై దృష్టి పెట్టాలి. ప్రధానంగా అభ్యర్థులు 'పబ్లిక్ సర్వీస్ ఎథిక్స్'కు సంబంధించిన అంశాలను చదవాలి. ప్రభుత్వ విధానాల అమలు, నిధుల ఖర్చు, విధుల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతలో నైతికత ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి. మతం–నైతికత,వర్ణ వ్యవస్థ–నైతికత, కుటుంబం–నైతికత..ఇలా వివిధ సామాజిక అంశాలను,సమకాలీన అంశాలతో అనుసంధానిస్తూ చదవాలి. నైతిక విలువలు పెంపొందించడంలో కుటుంబం, సమాజం, విద్యా సంస్థల పాత్ర ఏమిటో తెలుసుకోవాలి. లక్ష్య సాధనలో, విధి నిర్వహణలో ఎంతో కీలకంగా నిలిచే వైఖరి గురించి ప్రత్యేక శ్రద్ధతో అధ్యయనం చేయాలి.

పేపర్ 6, 7.. ఆప్షనల్ సబ్జెక్ట్‌కు ఇలా

మెయిన్స్‌లో అభ్యర్థులు ఒక ఆప్షనల్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ, ఫిలాసఫీ, సైకాలజీ తదితర ఆప్షనల్స్ జనరల్ స్టడీస్‌కు కలిసొచ్చే విధంగా ఉన్నాయి. ఆప్షనల్ ఏదైనా సరే.. సిలబస్‌ను ఆమూలాగ్రం అధ్యయనం చేయాలి. ప్రశ్నలు అడిగే ఆస్కారం ఉన్న అంశాలను గుర్తించి.. వాటిపై మరింత లోతుగా అధ్యయనం చేయాలి. గత కొన్నేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించి, ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

900 మార్కులు లక్ష్యంగా

మెయిన్స్‌లో మొత్తం 1,750 మార్కులకు గాను 900 మార్కులు సాధించేలా కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ టెస్ట్‌లకు హాజరవుతూ వాటిలో కనీసం వేయి మార్కులు సాధించేలా యత్నించాలని పేర్కొంటున్నారు. ఫలితంగా పరీక్ష సమయంలో కొద్దిపాటి పొరపాట్లు జరిగినా.. 900 మార్కులను సాధించే సామర్థ్యం లభిస్తుందని సూచిస్తున్నారు.



బొగత.. చూడతరమా..

ఎగువన గుట్టలపై ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతం సోమవారం పరవళ్లు తొక్కింది. పాల నురగలా రాళ్లపైనుంచి దుముకుతున్న జలపాతాన్ని తిలకించేందుకు పర్యాటకులు తరలి వచ్చారు.

– వాజేడు

ఒకే ఈతలో 7 మేక పిల్లలు




మరిపెడ రూరల్: సాధారణంగా మేకలు ఒకే ఈతలో ఒకటి, రెండు లేదా మూడు వరకు జన్మించడం అరుదు. కానీ ఒకే ఈతలో ఓ మేక ఏకంగా 7 మేక పిల్లలకు జన్మనిచ్చింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన రేఖ వెంకన్న మేకల్లోని ఒక మేక 7 పిల్లలకు జన్మనిచ్చింది. అన్ని పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉన్నాయని వెంకన్న పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఇందులో నాలుగు పోతు పిల్లలు కాగా, మూడు కొదమ పిల్లలున్నాయని తెలిపాడు. మేక పిల్లలను గ్రామస్తులంతా ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. దీనిపై మండల పశువైద్యాధికారి రమేష్‌ను వివరణ కోరగా జన్యుపరమైన లక్షణాలతో ఇలాంటివి అరుదుగా జరుగుతాయని స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

ఆలయాలు ఆదాయ మార్గాలు కాదు

వ్యాపార కేంద్రాలుగా వాటిని చూడొద్దని హైకోర్టు స్పష్టం



సాక్షి, హైదరాబాద్: ఆలయాలు ఆదాయ మార్గాలు కావని, వాటిని వ్యాపార కోణంలో చూడొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో కోవిడ్ కారణంగా వ్యాపారులు కోల్పోయిన లైసెన్స్ కాలాన్ని 5 నెలలు పొడిగించాలని ఉత్తర్వులు జారీచేసింది. లైసెన్స్ కాలాన్ని పొడిగించాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను పాటించకుండా కొబ్బరి చిప్పలు, చీరెలు, జాకెట్ ముక్కల సేకరణ కోసం గతేడాది మార్చిలో కార్యనిర్వహణాధికారి టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ నవీన్‌కుమార్‌తో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. లైసెన్స్‌ను ఎంత కాలం పొడిగించాలనే లెక్కలపై భిన్న వాదనలున్నాయని, వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 5 నెలలపాటు పిటిషనర్ల లైసెన్స్‌ను పొడిగించాలని ఈవోను ఆదేశించారు.

8 మంది ఐపీఎస్‌ల బదిలీ

సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎనిమిది మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 2020, 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారులున్నారు. ప్రస్తుతం భద్రచలం ఏఎస్పీగా పనిచేస్తున్న పరితోష్ పంకజ్‌ను కొత్తగూడెం ఓఎస్డీగా బదిలీ చేశారు. గవర్నర్ ఏడీసీగా ఉన్న సిరిశెట్టి సంకీర్త్‌ను అడిషనల్ ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ అదే స్థానంలో కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏటూరునాగారం ఏఎస్పీగా ఉన్న గిటే మహేశ్ బాబాసాహెబ్‌ను ములుగు ఓఎస్డీగా.. భైంసా ఏఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను హైదరాబాద్ సిటీ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. జనగాం ఏఎస్పీ అంకిత్ కుమార్ శంకన్వార్‌ను భద్రాచలం ఏఎస్పీగా.. గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్ అవినాశ్‌కుమార్‌ను భైంసా ఏఎస్పీగా.. గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్ శేషాద్రిరెడ్డిని వేములవాడ ఏఎస్పీగా.. గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్ శివం ఉపాధ్యాయను ఏటూరు నాగారం ఏఎస్పీగా బదిలీ చేశారు.

231 మంది ఖైదీల విడుదలకు మోక్షం!

విడుదల ఫైల్‌పై గవర్నర్ సంతకం

సాక్షి, హైదరాబాద్: విడుదల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఖైదీలకు స్వేచ్ఛా జీవితం త్వరలోనే రాబోతుంది. క్షణికావేశంలో చేసిన తప్పులతో జీవితఖైదు అనుభవిస్తున్న వారిలో సత్ప్రవర్తన కలిగి, విడుదలకు అర్హులైన 231 మంది ఖైదీల విడుదల ఫైల్‌పై గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సోమవారం సంతకం చేశారు. దీంతో వారి విడుదలకు మార్గం సుగమమైంది. రెండు, మూడ్రోజుల్లో ఖైదీల విడుదలకు సంబంధించి హోంశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ప్రభుత్వం విడుదల చేయడం ఆనవాయితీ. వాస్తవానికి 231 మంది సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల ఫైల్‌ను ప్రభుత్వం తమిళిసై సౌందరరాజన్ గవర్నర్‌గా ఉన్న సమయంలో పంపింది. అయితే పలు కారణాలతో ఆ ఫైల్ ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉంది. సోమవారం ఈ ఫైల్‌పై గవర్నర్ సంతకం చేశారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే మందులివ్వాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానాల్లో ప్రైవేటు మందుల దుకాణాలను మూయించి.. రోగులకు అవసరమైన అన్ని మందులను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. గాంధీ, ఉస్మానియా వంటి దవాఖానాలకు వెళ్లినప్పుడు అక్కడి వైద్యులు ఉచితంగా రోగిని పరీక్షించి మందుల చీటీ రాసి ఇస్తున్నారని తెలిపారు. కానీ ఆసుపత్రిలో ప్రభుత్వ మందులు దొరక్క రోగులు బయటి మందుల దుకాణాలకు వెళ్తున్నారని పేర్కొన్నారు.

'నీట్' ర్యాంకులు మారాయి

రెండోసారి పరీక్షతో సవరించిన ఫలితాల్లో అనేకమందికి మెరుగుపడిన ర్యాంకులు

- ఎస్టీ ఆలిండియా టాపర్ నృపేష్‌కు అప్పుడు 167... ఇప్పుడు 159వ ర్యాంకు
- దీంతో చాలామంది విద్యార్థులకు మేలు జరుగుతుందంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: కొందరికి మళ్లీ 'నీట్'పరీక్ష నిర్వహించడం..సవరించిన ఫలితాలు ఇవ్వడం వల్ల ఇప్పటికే ఇచ్చిన విద్యార్థుల ర్యాంకులు మారాయి. రెండోసారి రాసిన వారి ఫలితాలు వెల్లడి కావడంతో అన్ని ర్యాంకుల్లోనూ మార్పు వచ్చినట్టు చెబుతున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ సహా ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)– యూజీ 2024లో అక్రమాలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తడం తెలిసిందే. కొందరికి గ్రేస్ మార్కులు కలపడం విమర్శలకు తావిచ్చింది. దీంతో నీట్ ఫలితాల్లో 1563 మంది విద్యార్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులు తొలగిస్తామని జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సుప్రీంకోర్టుకు తెలియజేయడమూ విదితమే. వారికి గత నెల 23వ తేదీన మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించారు. దాదాపు సగం మందికి పైగా పరీక్ష రాశారు. వాటి ఫలితాలు రావడం..అందరి ర్యాంకులనూ సవరించడంతో దాదాపు అందరి ర్యాంకులు మారినట్టు చెబుతున్నారు. దీనివల్ల గతంలో సాధించిన విద్యార్థుల ర్యాంకుల్లో తేడా వచ్చింది. దీంతో ఇప్పటికే ర్యాంకులు పొందినవారివి కూడా మారాయి. ఒక్క మార్కు తేడాతో ర్యాంకులు మారాయి. గ్రేస్ మార్కులు పొంది తర్వాత పరీక్ష రాసినవారికి రెండోసారి పరీక్షలో అంత భారీగా మార్కులు రాకపోవడంతో గతంలో వచ్చిన వారి ర్యాంకులు తగ్గాయి. ఒక అంచనా ప్రకారం గతంలో టాప్‌స్థాయిలో ఉన్న విద్యార్థుల ర్యాంకులు 10 నుంచి 15 వరకు, భారీ ర్యాంకులు సాధించిన వారివి ఇప్పుడు 50 వరకు తగ్గినట్టు చెబుతున్నారు. దీనివల్ల ఒకట్రెండు ర్యాంకుల తేడాతో సీటు



రానివారికి ఇప్పుడు మంచి అవకాశమే ఉంటుందని చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఒక విద్యార్థికి మొదటిసారి ర్యాంకులు వెలువరించినప్పుడు 755వ ర్యాంకు రాగా, ఇప్పుడు సవరించిన ఫలితాల్లో 741వ ర్యాంకు లభించింది.

వారం రోజుల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు

మొదటిసారి నీట్ ప్రవేశ పరీక్ష మే నెల ఐదో తేదీన జరిగిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా అప్పుడు 23.33 లక్షల మంది హాజరయ్యారు. 13.16 లక్షల మంది అర్హత సాధించారు. తెలంగాణ నుంచి ఈసారి 77,849 మంది హాజరు కాగా, 47,371 మంది అర్హత సాధించారు. గత నెల నాలుగో తేదీన ఫలితాలు ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఇంతమంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని నిర్ణయించారు. వారికి గత నెల 23న పరీక్ష నిర్వహించి, ఈ నెల 30వ తేదీన సవరించిన ఫలితాలు ప్రకటించారు. వాస్తవంగా ఫలితాలు ప్రకటించిన వారం పది రోజుల్లోగా రాష్ట్రస్థాయి ర్యాంకులను ఎన్‌టీఏ విడుదల చేస్తుంది. ఆ ప్రకారం ర్యాంకులు వస్తాయని అంటున్నారు. మరోవైపు ఈ నెల 8వ తేదీన నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు తీర్పు ఉన్నందున అప్పటివరకు ఏం జరుగుతుందోనన్న ఆందోళన అందరినీ వేధిస్తోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం ఆలిండియా ర్యాంక్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. అభ్యర్థులు తమ రాష్ట్రానికి దరఖాస్తు చేసినప్పుడు, వారిని రాష్ట్ర కేటగిరీ జాబితా ప్రకారం విభజిస్తారు. రాష్ట్ర కౌన్సెలింగ్ అధికారులు తదనుగుణంగా మెరిట్ జాబితాను తయారు చేస్తారు. దీంతో తెలంగాణలో ఎందరికి రాష్ట్రస్థాయి ర్యాంకులు వస్తాయనేది తెలుస్తుంది.

ఆలిండియా ఎస్టీ టాపర్ ర్యాంకు మారింది..

మొదటిసారి నీట్ ఫలితాల సందర్భంగా ఎస్టీ కేటగిరీలో ఆలిండియా టాప్ ర్యాంకర్‌గా తెలంగాణకు చెందిన గుగులోత్ వెంకట నృపేష్ నిలిచాడు. జాతీయస్థాయిలో అతను మొదటిసారి ఫలితాల్లో జనరల్ కేటగిరీలో 167వ ర్యాంకు సాధించాడు. తాజాగా సవరించిన ర్యాంకుల్లో ఇప్పుడు ఆయనకు 159వ ర్యాంకు వచ్చింది. అంటే అతని ర్యాంకు 8 వరకు తగ్గింది. కాగా, అతనికి నీట్ పరీక్షలో 720 మార్కులకుగాను 715 వచ్చిన సంగతి తెలిసిందే.

కరెంటు బిల్లుల చెల్లింపులకు మళ్లీ పాత పద్ధతే!



- ఫోన్‌పే, జీపే, పేటీఎం చెల్లింపు సేవలపై ఆర్బీఐ ఆంక్షలు
- టీజీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్, ఈఆర్ఓ కేంద్రాల ద్వారా స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: పేమెంట్ యాప్‌లలో కరెంట్ బిల్లుల చెల్లింపులను నిషేధిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. థర్డ్‌పార్టీ ఏజెన్సీ (ఫోన్‌పే, జీపే, పేటీఎం) ద్వారా విద్యుత్ బిల్లులు స్వీకరించకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)కు లేఖ రాసింది. ఇకపై డిస్కమ్ వెబ్‌సైట్/మొబైల్ యాప్/ఈఆర్ఓ కేంద్రాల ద్వారా మాత్రమే బిల్లుల చెల్లింపులను అనుమతించాలని సూచించింది. ఈ నేపథ్యంలో www. tgsouthernpower.org / TGSPDCL Mobile Appలో బిల్లులు చెల్లించాలని వినియోగదారులను కోరింది. ఇప్పటివరకు పేటీఎం, గూగుల్ పే, ఫోన్‌పే తదితర పేమెంట్ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు కట్టుకునే అవకాశముండేది. తద్వారా బిల్లుల చెల్లింపులను సంస్థ సులభతరం చేసింది. ఒకవేళ బిల్లు చెల్లింపు అంశాన్ని మరిచిపోయినా.. ఆయా సర్వీసు ప్రొవైడర్లు మెసేజ్‌ల రూపంలో అలర్ట్ చేసేవి. వినియోగదారులు కూడా అప్రమత్తమై సకాలంలో బిల్లులు చెల్లించే వారు. తాజాగా ఈ విధానానికి స్వస్తి చెప్పడం ద్వారా తిరిగి పాత పద్ధతికి మారాల్సిన పరిస్థితి అనివార్యం కానుంది. ఇదిలా ఉంటే గ్రేటర్ జిల్లాల పరిధిలో 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటి ద్వారా ప్రతి నెలా రూ.850 నుంచి రూ.900 కోట్లు బిల్లుల రూపంలో వస్తుంది. వీటిలో మెజార్టీ బిల్లులు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారానే వస్తాయి. మెజార్టీ వినియోగదారులకు మొబైల్ యాప్‌పై అవగాహన కూడా లేదు. ఫలితంగా రెవెన్యూ వసూళ్లపై కొంత ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

సార్లూ.. మమ్మల్ని వదిలి వెళ్లొద్దు

ఉపాధ్యాయుల బదిలీపై విద్యార్థుల కన్నీరు



చేర్యాల(సిద్దిపేట): విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుంటే విద్యార్థులు కంట తడి పెట్టారు. దీనికి సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు ప్రాథమిక పాఠశాల వేదికైంది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా సోమవారం వారికి వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారిలో అయిదుగురు ఉపాధ్యాయులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్న క్రమంలో.. విద్యార్థులు ఒక్కసారిగా ఉద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. 'సార్లూ.. మీరు ఎక్కడికీ పోవద్దు.. మాతోనే ఉండాలి.. మీరే మాకు పాఠాలు చెప్పాలి.. మీరు లేని ఈ బడికి రాబోము'.. అంటూ ఉపాధ్యాయుల్ని పట్టుకుని కన్నీరు పెట్టుకున్నారు. దీంతో వారు సైతం కంట తడి పెట్టారు.

14 అంతస్తులతో టిమ్స్ ఆస్పత్రులు

24 ఫ్లోర్లతో నిర్మాణం నిబంధనలకు విరుద్ధం: మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను 14 అంతస్తులకు పరిమితం చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను 24 అంతస్తులతో నిర్మించాలని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిబంధనలకు విరుద్ధమన్నారు. రాష్ట్రంలో కొత్తగా మరో 8 మెడికల్ కాలేజీలు ఈ ఏడాది అందుబాటులోకి వస్తాయన్నారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రాథమిక కేంద్రాల నుండి రిఫరల్ ఆసుపత్రుల వరకు అనుసంధానం చేసే వ్యవస్థను తీసుకొస్తామని వివరించారు. మానవ వనరుల కొరత లేకుండా వైద్యుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అన్ని రకాల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నీట్‌పై చర్చ జరగాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు పనిచేయాల్సిందేనని పేర్కొన్నారు. నీలోఫర్, ఎంజీఎంలకు ఉన్న ప్రత్యేకత.. మిగతా ఆస్పత్రులకు కూడా ఉండేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. హెచ్‌వోడీల ప్రక్షాళన జరుగుతోందని తెలిపారు. వారితో సరిగ్గా పని చేయించుకుంటామని, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిని పరిశీలించేందుకు సెక్రటరీని పంపామన్నారు. ఉస్మానియాకు వసతిగృహం లేదన్నారు. పది రోజుల్లోనే ఉస్మానియా, గాంధీ, కాకతీయ ఆస్పత్రుల వసతి గృహాలకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. రెండేళ్లలో వసతి గృహాల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఫుడ్, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలును వేగవంతం చేస్తున్నామన్నారు. రోగి ఎన్ని నిమిషాలలో ఆస్పత్రికి వెళ్తున్నాడు.. తీవ్రత ఎక్కువగా ఉంటే.. ఇతర ఆస్పత్రులకు ఎంత సమయంలో చేరుకుంటాడనే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అనంతరం తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కత్తి జనార్దన్ మాట్లాడుతూ, అతి తక్కువ కాలంలోనే ప్రజారోగ్య వైద్యుల భర్తీకి 435 పోస్టులను మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుల నియామకాల్లో వయసుకు ప్రాధాన్యమిస్తూ సీనియారిటీ పాయింట్లు కలపాలని విజ్ఞప్తి చేశారు. మిగతా శాఖల్లోని వైద్యుల పోస్టులను కలిపి వాటి సంఖ్యను పెంచాలని విన్నవించారు. పబ్లిక్ హెల్త్ డాక్టర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

చలో రాజ్‌భవన్ ఉద్రిక్తం



పోలీసుల అదుపులో బల్మూరి వెంకట్

పంజగుట్ట(హైదరాబాద్): నీట్ పరీక్ష రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వివిధ విద్యార్థి సంఘాలు చేపట్టిన చలోరాజ్‌భవన్ ఉద్రిక్తంగా మారింది. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసేందుకు విద్యార్థి సంఘాలు అనుమతి కోరగా, నిరాకరించారు. దీంతో నెక్లెస్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో సహా ఎస్‌ఎఫ్ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, వీజేఎస్, ఏఐపీఎస్‌యూ, పీవైసీ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వైజేఎస్ నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. విద్యార్థి సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో నెక్లెస్‌రోడ్డు కూడలికి చేరుకొని రాజ్‌భవన్ వైపు వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు, పోలీసులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అదే సమయంలో రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రి గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు విద్యార్థులను బలవంతంగా వాహనాల్లో ఎక్కించి గోషామహల్ పోలీస్‌స్టేషన్ తరలించారు. ఓ విద్యార్థి సంఘం నేత పోలీస్ వాహనంపైకి ఎక్కి నినాదాలు చేస్తుండగా, ఒక్కసారిగా వాహనం పైనుంచి జారి కారు అద్దంపై పడగా, అది ధ్వంసమైంది. నీట్‌పై ప్రభుత్వం స్పందించకపోతే ధర్నాచౌక్ వద్ద మహాదీక్ష చేస్తామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరించారు.

నగర శివారులో మళ్లీ హౌసింగ్‌బోర్డు కాలనీలు

- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం
- ఔటర్–రీజినల్ రింగ్‌రోడ్డు మధ్య అనువైన ప్రాంతాలు గుర్తించాలని సూచన



సాక్షి, హైదరాబాద్: మధ్యతరగతి ప్రజల కోసం హౌసింగ్‌బోర్డు కాలనీల తరహాలో మళ్లీ ఇళ్ల నిర్మాణం చేపట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కేపీహెచ్‌బీ, మౌలాలి, ఈసీఐఎల్, ఎస్సార్‌నగర్, బర్కత్‌పురా లాంటి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో హౌసింగ్ కాలనీలను నిర్మించిన విషయం తెలిసిందే. 12 ఏళ్ల క్రితం ఆ తరహా నిర్మాణాలకు స్వస్తి పలికారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గృహనిర్మాణ మండలి స్తబ్దుగా మారిపోయింది. ఇప్పుడు దాన్ని మళ్లీ పునరుద్ధరించనున్నారు. సోమవారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ మేరకు అధికారులకు చేసిన సూచనలు దీనిని స్పష్టం చేస్తున్నాయి. సోమవారం గృహనిర్మాణం, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖల అధికారులతో ఆయన మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఇందులో భట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. నిరుపేదలకు నీడ కల్పించటంతోపాటు మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేయాల్సిన బాధ్యత గృహనిర్మాణ శాఖపై ఉందని పేర్కొన్నారు. గతంలో హౌసింగ్‌బోర్డు కాలనీల నిర్మాణంతో ఎంతోమందికి లబ్ది కలిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ వేగంగా విస్తరిస్తుండటంతో మధ్యతరగతి ప్రజలకు కాలనీల నిర్మాణ అవసరముందన్నారు. కొత్తగా నిర్మించబోయే రీజినల్ రింగురోడ్డు, ఔటర్ రింగు రోడ్డు మధ్య ఈ కాలనీల నిర్మాణానికి భూమిని సేకరించాలని ఆదేశించారు. కాలనీల నిర్మాణం, కావాల్సిన భూమి తదితర వివరాలతో రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థ

పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున ఇందిరమ్మ ఇళ్లకు సౌర విద్యుత్ ఏర్పాటు తప్పనిసరి చేయాలని భావిస్తున్నట్టు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో చేపట్టబోయే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సమయంలో సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్ల నిర్మాణం, వాటి నమూనాలు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాల్లో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాల్లో అధ్యయనం చేసేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేస్తామని అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై ఆరా తీశారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టగా 69 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, 65 వేల ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశామని చెప్పారు. ధరణి పెండింగ్ దరఖాస్తులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ సర్వేకు నిధులు కేటాయించాలని అధికారులు ఆయన్ను కోరారు. ఆదాయ కల్పనకు అధికారులు ప్రత్యామ్నాయ వనరులు రూపొందించుకోవటంపై దృష్టి సారించాల్సి ఉందని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. అంతకుముందు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గృహనిర్మాణ శాఖ అధికారులతో విడిగా సమావేశమై ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై చర్చించారు. సమావేశాల్లో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శులు నవీన్‌మిత్తల్, సందీప్ కుమార్ సుల్తానియా, జ్యోతి బుద్ధ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోగా మైక్రోసాఫ్ట్ డేటాసెంటర్ల కార్యకలాపాలు

మేకగూడలో భూసమస్యల పరిష్కారానికి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సంస్థ ఏర్పాటు చేస్తున్న డేటాసెంటర్ల విస్తరణ పనులు వచ్చే ఏడాదినాటికి పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. డేటాసెంటర్లకు సంబంధించిన భూసమస్యల పరిష్కారం, మౌలిక వసతులపై సచివాలయంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో మంత్రి సోమవారం సమీక్షించారు. డేటాసెంటర్ల పనులు పూర్తయితే అత్యాధునిక డేటా సెక్యూరిటీ, క్లౌడ్ సొల్యూషన్స్ రంగాల్లో హైదరాబాద్ అగ్రస్థానానికి చేరుకుంటుందన్నారు. డేటాసెంటర్ కోసం మేకగూడలో సేకరించిన 22 ఎకరాలకు సంబంధించి స్థానికంగా నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంకను శ్రీధర్‌బాబు ఆదేశించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు, వరదనీటి కాలువల నిర్మాణం లాంటి పనులు గడువులోగా పూర్తి చేస్తామన్నారు. సంస్థ సేకరించిన భూముల వినియోగ మార్పిడి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మైక్రోసాఫ్ట్ సంస్థ రంగారెడ్డి జిల్లా మేకగూడలో 22 ఎకరాలు, షాద్‌నగర్‌లో 41 ఎకరాలు, చందన్‌వెల్లిలో 52 ఎకరాలు కొనుగోలు చేసింది. డేటా సెంటర్ల పనులు 70 శాతం పూర్తయినట్టు సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. పెండింగ్ పనుల పర్యవేక్షణకు ప్రభుత్వ పక్షాన ప్రత్యేక అధికారిని నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మైక్రోసాఫ్ట్ వ్యవహారాల అధిపతి ఇయాన్‌కాలస్, భూ అభివృద్ధి విభాగం హెడ్ ఉత్తమ్‌గుప్తా, ఇండియా కమ్యూనిటీ హెడ్ శ్రీచందన తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు

సాంకేతిక బ్యాంకింగ్ సేవలు మరింత విస్తృతం

69వ ఎస్‌బీఐ దినోత్సవంలో చీఫ్ జీఎం రాజేశ్

సాక్షి, హైదరాబాద్: ఖాతాదారులకు సాంకేతిక బ్యాంకింగ్ సేవలను మరింత విస్తృతం చేస్తున్నామని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ చెప్పారు. సోమవారం 69వ ఎస్‌బీఐ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 1,321 శాఖలతో ఎస్‌బీఐ లీడ్ బ్యాంకుగా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో 2 కోట్లకు పైబడి ఖాతాలున్నాయని తెలిపారు. సైబర్ నేరాలను తగ్గించేందుకు భద్రతలో రాజీ లేకుండా ఎస్‌బీఐ నిరంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధునీకరిస్తోందని వివరించారు. ఆర్థిక సేవల్లో అగ్రగామిగా ఎస్‌బీఐని నిలబెట్టేందుకు ఉద్యోగులు కృషి చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలను మరింత వేగవంతంగా అందించేలా చూడాలని రాజేశ్ పిలుపునిచ్చారు. స్టేట్ బ్యాంక్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.



రూ.50 లక్షల విలువైన ఐదు వాహనాలను సహృదయ వృద్ధాశ్రమం, హెవెన్స్ హోమ్ సొసైటీ, వివేకానంద సేవా సంఘం, సత్య హరిశ్చంద్ర ఫౌండేషన్, చెరిష్ ఫౌండేషన్లకు అందించారు. బ్యాంక్ సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా పునరుత్పాదక సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం వివేకానంద సేవా సంఘం 20కేవీ సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్‌ను విరాళంగా ఇచ్చారు. నాదర్‌గుల్‌లోని సీనియర్ సిటిజన్స్ హోమ్‌కు, సత్య హరిశ్చంద్ర ఫౌండేషన్‌కు బ్యాంక్ ఫోలర్ కాట్‌లు, పరుపులను విరాళంగా ఇచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.